
బుధవారం 3-1-2018



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 283

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

చదువులు చట్టుబండలు

సర్కారీ స్కూళ్లకు 'జన్మభూమి' సంకెళ్లు

గ్రామ సభలకు ప్రభుత్వ టీచర్లు, విద్యార్థుల తరలింపు

- పదిరోజులపాటు సభలు, ర్యాలీలు, నివేదికలు
- టీచర్లపై మోయలేనన్ని బరువు బాధ్యతలు
- ఒకవైపు ముంచుకొస్తున్న పబ్లిక్ పరీక్షలు
- ప్రిపరేషన్ వదిలేసి ప్రచార కార్యక్రమాల్లో విద్యార్థులు
- కార్పొరేట్ విద్యార్థులకు మాత్రం పూర్తి మినహాయింపు
- తరచూ బోధనేతర పనుల్లో ప్రభుత్వ టీచర్లు, విద్యార్థులు
- అందుకే ప్రమాణాలు పడిపోతున్నాయంటున్న నిపుణులు
- సర్కారు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆగ్రహావేశాలు



విజయనగరం జిల్లా ధర్మపురిలో జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రాక్టికల్స్, 28 నుంచి పబ్లిక్ పరీక్షలు.. జేఈఈ, ఎంసెట్‌తో సహా అనేక పోటీ పరీక్షలకు ప్రిపేరవ్వాల్సిన తరుణం.. పాఠశాలల్లోనూ సిలబస్‌లో అతి ముఖ్యమైన చాప్టర్లపై బోధన, పబ్లిక్ పరీక్షల కోసం సాధన జరిగే సమయం... ఇలాంటి కీలకమైన సమయంలో రాష్ట్ర

మిగతా 2వ పేజీలో ▶



గతితప్పిన 'గజల్'

లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్ అరెస్ట్

- తాను అంబాసిడర్‌గా పనిచేస్తున్న సంస్థలోని మహిళపై వేధింపులు.. మసాజ్ చేయాలంటూ అసభ్యకర ప్రవర్తన
- సహకరించాలంటూ బాధితురాలిపై పనిమనిషి ఒత్తిడి
- తానే స్టింగ్ ఆపరేషన్ చేపట్టి పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

2 లో

హెచ్-1బీపై మరో బాంబ్!

- గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసినా వీసా గడువు పొడిగించరు!
- 5 నుంచి 7.5 లక్షల మంది భారతీయులపై ప్రభావం!

5 లో

స్టాండింగ్ కమిటీకి మెడికల్ బిల్లు

బడ్జెట్ సమావేశాలకు ముందే నివేదిక కోరిన లోక్‌సభ
సమ్మెను విరమించుకున్న ఐఎంఏ

5 లో

పార్టీల విరాళాల్లో పారదర్శకత

ఎలక్టోరల్ బాండ్ల విధి విధానాలు ఖరారు
రాజకీయ పార్టీలకు విరాళాలపై కేంద్రం స్పష్టత

కోడి పందేలు జరగడానికి వీల్లేదు

ఎక్కడైనా జరిగితే సీఎస్, డీజీపీలే బాధ్యత వహించాలి • సంక్రాంతికి కోడి పందేల నిర్వహణపై హైకోర్టు సీరియస్

- కోర్టు ఉత్తర్వులంటే ప్రజాప్రతినిధులకు లెక్కే లేదు
- మా ఆదేశాలను అధికారులు తుంగలో తొక్కారు
- పందేలు నిర్వహించుకోవచ్చునని సుప్రీం కోర్టు చెప్పలేదు

3 లో

- పందేలు జరగకుండా చూసేందుకు ఏం చేస్తున్నారో చెప్పండి
- పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు హైకోర్టు ఆదేశం
- విచారణ 4కి వాయిదా



ఆశల మోసులు

పాదయాత్రతో ప్రజలకు భరోసా ఇస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- ఊళ్లకు ఊళ్లే జననేత అడుగులో అడుగు వేస్తున్న వైనం
- ఈ ప్రభుత్వం వల్ల అన్నీ కష్టాలేనని వాపోతున్న వివిధ వర్గాల ప్రజలు
- అందరి కష్టాలూ ఓపిగ్గా వింటూ ధైర్యం చెబుతున్న జననేత
- మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో కష్టాలు తీరుతాయని హామీ
- ఇప్పటి వరకు 26 బహిరంగ సభలు.. 20 ఆత్మీయ సమ్మేళనాలు..
- 24 నియోజకవర్గాల్లో సర్కారు బాధిత వర్గాలకు సాంత్వన

6 లో

హైకోర్టు విభజనపై నేడు జడ్జిల భేటీ

ఏసీజేకి అందిన సీఎం చంద్రబాబు మూడు పేజీల లేఖ

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు విభజన కోరుతూ ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు రాసిన లేఖ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు అందింది. మూడు పేజీల లేఖను అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ శనివారం ఏసీజే ఇంటికి వెళ్లి అందించారు. ఈ విషయాన్ని ఏసీజే మంగళవారం న్యాయవాదుల సంఘం ప్రతినిధుల వద్ద ధ్రువీకరించారు. నేడు హైకోర్టు న్యాయమూర్తులందరితో కూడిన ఫుల్‌కోర్ట్ సమావేశం కానుంది. న్యాయమూర్తులు విభజన విషయంలో అభిప్రాయాలను వెల్లడించనున్నారు. ఫుల్‌కోర్టు నిర్ణయం ఆధారంగా చర్యలు తీసుకుంటారు. కాగా, విభజించే ముందు తమ అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు మంగళవారం ఏసీజేని కలిశారు. దీంతో ఏసీజే వినతిపత్రం సమర్పించాలని వారికి సూచించారు.

16–18 నెలల్లోపు పూర్తిచేస్తాం

హైకోర్టు విభజనకు సంబంధించి ఏపీ పునర్విభజన చట్టంలోని నిబంధనల ప్రస్తావనతో చంద్రబాబు తన లేఖను ప్రారంభించారు. 2015 అక్టోబర్‌లో అప్పటి ఏసీజేకి తాను రాసిన లేఖ గురించి ప్రస్తావించారు. శాశ్వత హైకోర్టు భవనం, పరిపాలన భవనం, న్యాయమూర్తులు, అధికారులు, సిబ్బంది గృహ సముదాయాల నిర్మాణ పనులు మొదలుపెట్టిన రోజు నుంచి 16–18 నెలల్లోపు పూర్తి చేస్తామని ఆ లేఖలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీలో హైకోర్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం, అందుకు కారణాలను వివరించారు. కక్షిదారులు, అధికారుల ఇబ్బందులను తొలగించేందుకు హైకోర్టును అమరావతికి మార్చాలని తెలిపారు. హైకోర్టు ఏర్పాటు కోసం కొన్ని భవనాలను గుర్తించామని, వాటిని పరిశీలించేందుకు న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేయాలని చంద్రబాబు తన లేఖలో ఏసీజేను కోరారు. న్యాయమూర్తుల కమిటీ ఈ నెలాఖరుకల్లా భవనాలను పరిశీలించి ఏవైనా మార్పులను సూచిస్తే, వాటిని మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేస్తామన్నారు. మార్పులు చేశాక ఏప్రిల్‌లో మరోసారి కమిటీ భవనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తే మేలో తరలింపు మొదలుపెడతామన్నారు. జూన్ 2 నుంచి కొత్త హైకోర్టు పనిచేయడం ప్రారంభిస్తుందన్నారు.

ఎక్కువ స్థలం అవసరమైతే కొంత జాప్యం

కాగా, ఏపీ హైకోర్టు కోసం ప్రభుత్వం 2 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సిద్ధం చేసినట్లు తెలిపింది. ఇంకా ఎక్కువ విస్తీర్ణం కావాలని హైకోర్టు కోరితే తరలింపు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. హైకోర్టు న్యాయమూర్తుల నివాసం కోసం బహుళ అంతస్తుల భవనాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. హైకోర్టు విభజనకు న్యాయమూర్తులు ఆమోదం తెలిపితే ఫైల్ కేంద్రానికి చేరుతుంది. అక్కడి నుంచి సుప్రీంకోర్టు, మళ్లీ అక్కడి నుంచి కేంద్రానికి చేరుతుంది. చివరకు రాష్ట్రపతి వద్దకు ఫైల్ వెళుతుంది. ఏపీ హైకోర్టు పనిచేసే ప్రధాన స్థానాన్ని నోటిఫై చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడంతో విభజన పూర్తవుతుంది.

గతి తప్పిన 'గజల్'

లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్ అరెస్టు • బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న సంస్థలోని మహిళపై వేధింపులు

సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక, దేశభక్తి, మహిళల భద్రత.. ఇలా ఎన్నో అంశాలపై గజల్స్ రాసి ఆలపిస్తున్న కేసిరాజు శ్రీనివాస్ అలియాస్ గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టయ్యాడు. తాను బ్రాండ్ అంబాసిడర్‌గా పని చేస్తున్న సంస్థలోని ఉద్యోగినినే వేధించి అడ్డంగా బుక్కయ్యాడు. బాధితురాలు పక్కా సాక్ష్యాధారాలతో పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన బాగోతం బయటపడింది. ఈ కేసులో పార్వతి అనే మహిళను కూడా నిందితురాలిగా చేర్చినట్టు ఇన్‌స్పెక్టర్ ఎస్.రవీందర్ మంగళవారం వెల్లడించారు. నాంపల్లి కోర్టులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్లు బుధవారానికి వాయిదా పడ్డాయి. దీంతో గజల్ శ్రీనివాస్‌కు జ్యుడీషియల్ రిమాండ్ విధించి చంచల్‌గూడ జైలుకు తరలించారు.



మీడియాతో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

ఆఫీసులో మసాజ్ చేయాలంటూ..

పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బాధిత మహిళ బీకాం, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసింది. ప్రవచనాలు, వేదాలు అధ్యయనం చేసింది. గతేడాది జూన్ నుంచి పంజగుట్ట సప్తగిరి బిల్డింగ్‌లోని సేవ్ టెంపుల్ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంలో రేడియో ఆలయవాణికి ఇన్‌చార్జిగా నెలకు రూ.13 వేల జీతానికి పని చేస్తోంది. ఈ సంస్థలో బాధితురాలితో పాటు వీడియో ఎడిటర్, సహాయకుడు, పని మనిషి పార్వతి మాత్రమే ఉద్యోగులుగా ఉన్నారు. వెలగపూడి ప్రకాశ్‌రావు నేతృత్వంలోని ఈ సంస్థకు గజల్ శ్రీనివాస్ బ్రాండ్ అంబాసిడర్. వాస్తవానికి బాధితురాలు ఇక్కడ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకే పని చేయాలి. అయితే గజల్ శ్రీనివాస్ తరచూ ఆ కార్యాలయానికి వెళ్లి అర్ధరాత్రి వరకు గడిపేవాడు. బాధితురాలిని కూడా ఉండాల్సిందిగా ఒత్తిడి చేసేవాడు. ఇందుకు ఆమె అనేకసార్లు తిరస్కరించింది. కార్యాలయంలోని మూడు బెడ్‌రూముల్లో ఒకదాన్ని శ్రీనివాస్ తన అనైతిక కార్యకలాపాలకు వినియోగించేవాడు. వేళకాని వేళల్లో పని మనిషి పార్వతితో కాళ్లు నొక్కించుకోవడం, మసాజ్ చేయించుకోవడంతోపాటు ఇతర అనైతిక కార్యకలాపాలకు పాల్పడేవాడు.

స్టేషన్‌లో టేబుల్‌పై దరువేస్తూ..

గజల్ శ్రీనివాస్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి డాక్యుమెంటేషన్ పూర్తయ్యే వరకు దాదాపు రెండు గంటల పాటు ఠాణాలోని ఇంటర్వ్యూ రూమ్‌లో ఉంచారు. ఈ సమయంలోనూ ఎలాంటి పశ్చాత్తాప ఛాయలు లేని గజల్ శ్రీనివాస్ అక్కడి టేబుల్‌పై దరువేస్తూ కనిపించారు. ఈ దృశ్యాలను అక్కడున్న మీడియా ప్రతినిధులు రికార్డు చేశారు. అనంతరం గజల్ శ్రీనివాస్‌ను పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానంలో శ్రీనివాస్ తరఫు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే శ్రీనివాస్ బెయిల్‌పై బయటకు వస్తే కేసులో ఫిర్యాదిగా ఉన్న బాధితురాలిని బెదిరించడం, సేవ్ టెంపుల్ సంస్థ కార్యాలయంలో ఉన్న సీసీకెమెరా ఫుటేజ్‌లతోపాటు ఇతర సాక్ష్యాధారాలను తారుమారు చేస్తారంటూ కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన్ను రెండు వారాల పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరారు. రెండు పిటిషన్లపై వాదనలను విన్న న్యాయస్థానం.. శ్రీనివాస్‌కు ఈ నెల 12 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. దీంతో పోలీసులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో పార్వతిని రెండో నిందితురాలిగా చేర్చామని, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

బెదిరింపులు.. వేధింపులు

పార్వతి మాదిరే తనకు 'సహకరించాలంటూ' శ్రీనివాస్ బాధితురాలిపై ఒత్తిడి చేసేవాడు. లేదంటే ఉద్యోగం నుంచి తీసేస్తానని, మరెక్కడా ఉద్యోగం రాకుండా చేస్తానని బెదిరించేవాడు. పార్వతి సైతం శ్రీనివాస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ బాధితురాలిపై ఒత్తిడి తెచ్చేది. సారుకు సహకరిస్తే మంచి జీతంతో పాటు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం ఇప్పిస్తాడని, తనకుచేసినట్లే పెళ్లి కూడా చేస్తాడని చెప్పేది. ఈ వేధింపులు తారస్థాయికి చేరడంతో అనేకసార్లు తిరస్కరించిన బాధితురాలు.. కొన్ని సందర్భాల్లో పార్వతితో కలిసి రెండు మూడు గంటల పాటు శ్రీనివాస్ కాళ్లు నొక్కేది. దీంతో మరింత రెచ్చిపోయిన శ్రీనివాస్ ఆ గదిలో నగ్నంగా/అర్ధనగ్నంగా ఉండి బాధితురాలిని పార్వతి ద్వారా పిలిపించేవాడు. ఆమెను బలవంతంగా ఆలింగనం చేసుకోవడం, అభ్యంతరకరంగా తడమటం చేసేవాడు. వీటిని భరించలేకపోయిన బాధితురాలు హెచ్చరిస్తే... బెదిరింపులకు దిగేవాడు. ఫోన్ ద్వారా, వాట్సాప్ చాటింగ్స్ ద్వారానూ హింసించేవాడు.

వద్దన్నా ఫిజియోథెరపీ చేసింది

ఆమెను (బాధితురాలు) నేను ఓ కుమార్తెలా చూసుకున్నా. గతంలో జరిగిన ఓ యాక్సిడెంట్‌లో నా చేతికి గాయమైంది. వైద్యుల సలహా మేరకు ఫిజియోథెరపీ చేయించుకుంటున్నా. ఆ రోజు ఫిజియోథెరపిస్ట్ రాలేదు. దీంతో తనకు అనుభవం ఉందని, తానే చేస్తానంటూ ఆమె ముందుకు వచ్చింది. నేను వద్దని వారించినా ఫిజియోథెరపీ చేసింది. ఇప్పుడు ఇలా ఎందుకు ఫిర్యాదు చేసిందో అర్థం కావడం లేదు.

– మీడియాతో గజల్ శ్రీనివాస్

పచ్చి మోసగాడు..

గజల్ శ్రీనివాస్ పెద్ద మనిషి ముసుగు వేసుకుని ఉన్న పచ్చి మోసగాడు. ఆయన లైంగిక వేధింపులను పలుమార్లు సంస్థ నిర్వాహకులతో పాటు ఆయన కుటుంబ సభ్యుల దృష్టికి కూడా తీసుకువెళ్లా. వారెవరూ పట్టించుకోకపోవడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేశా. శ్రీనివాస్ కోరినట్లు ఉండాలంటూ పార్వతి నాపై అనేకసార్లు ఒత్తిడి చేసింది. ఆమె కూడా మంచిది కాదు. రెండు నెలలుగా నాపై వేధింపులు పెరిగాయి.

– మీడియాతో బాధితురాలు

బాధితురాలి స్టింగ్ ఆపరేషన్

శ్రీనివాస్ వేధింపులు శృతిమించడంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితురాలు భావించింది. పలుకుబడి ఉన్న వ్యక్తి కావడం, కేవలం ఫిర్యాదు చేస్తే ఎవరూ నమ్మరనే ఉద్దేశంతో స్వయంగా స్టింగ్ ఆపరేషన్ చేపట్టింది. కార్యాలయంలో బెడ్‌రూమ్‌లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇందులో గజల్ శ్రీనివాస్, పార్వతి రాసలీలలతోపాటు బాధితులురాలు శ్రీనివాస్ కాళ్లు నొక్కుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. వీటి ఆధారంగా గత శుక్రవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీడియో, వాయిస్ రికార్డులు, ఫొటోలు అందించింది. దీంతో ఐపీసీ 354, 354 (ఏ), 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు విషయం గోప్యంగా ఉంచి ప్రాథమిక దర్యాప్తు చేశారు. అన్ని ఆధారాలు సేకరించి మంగళవారం ఆనంద్‌నగర్ కాలనీలోని తన నివాసంలో గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు.

సర్కారీ స్కూళ్లకు 'జన్మభూమి' సంకెళ్లు

► మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం పదిరోజులపాటు అటు ఉపాధ్యాయులను, విద్యార్థులను చదువుకు దూరం చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జన్మభూమి – మావూరు కార్యక్రమంలో వీరిని బలవంతంగా భాగస్వాములను చేయడం, అనేక బరువు బాధ్యతలు మోపడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను పరిష్కరించే పేరుతో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం వల్ల ఆ సమస్యలు పరిష్కారం కాకపోవడమే కాక విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమం పెద్ద సమస్యగా మారడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం మాత్రం ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థుల చదువులు ఎలా పోయినా ఫర్వాలేదు, ప్రయివేటు కార్పొరేట్ సంస్థల విద్యార్థులకు మాత్రం ఎలాంటి నష్టం వాటిల్లకూడదు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. బోధనేతర కార్యక్రమాల్లో టీచర్లు, విద్యార్థులను భాగస్వాములను చేయరాదని విద్యాహక్కు చట్టం స్పష్టంగా పేర్కొన్నా ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ఏడాది పొడవునా పలు కార్యక్రమాలకు ప్రభుత్వ టీచర్లు, విద్యార్థులను తరలిస్తోంది. మంగళవారం నుంచి ప్రారంభమైన జన్మభూమిలో టీచర్లు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని స్వయంగా సీఎంవో ఆదేశాలు జారీచేయడం గమనార్హం.

టీచర్లు, విద్యార్థులకు అప్పగించిన పనులివే...

ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులో నోడల్ ఆఫీసర్లుగా టీచర్లను నియమించాలి. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోడల్ ఆఫీసరు అవుతారు.

- నోడల్ ఆఫీసర్ మున్సిపల్, వార్డు అభివృద్ధి ప్లాన్‌ను అమలు చేయాలి.
- గ్రామ, మున్సిపల్ వార్డు డెవలప్‌మెంటు ప్లాన్‌లో 2014–15 నుంచి 2017–18 వరకు పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను నమోదు చేయాలి.



కడపలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాష్ నగర్ బీసీ హాస్టల్ విద్యార్థులు

- 2017–18కి గ్రామ, వార్డు అభివృద్ధి ప్లాన్‌ను విడిగా తయారు చేసుకోవాలి. 2018–19, 2019–20 లకు విద్యాపరమైన లక్ష్యాలను తయారు చేసుకోవాలి.
- గడచిన మూడేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా పాఠశాలకు అందించిన నిధులు, మౌలిక వసతుల ఏర్పాటు వివరాలతో నివేదికను రూపొందించాలి.
- పాఠశాల అకడమిక్‌కు సంబంధించిన నివేదిక రూపొందించుకోవాలి. పాఠశాల అకడమిక్ మరియు అభివృద్ధి గురించి ఫ్లెక్సీలు వేయించి గ్రామంలో జన్మభూమి జరిగే ప్రదేశంలో, పాఠశాల వద్ద ప్రదర్శించాలి.
- ప్రతి రోజు గ్రామంలో నోడల్ ఆఫీసరు తమ పాఠశాలలో ఆరోజు జన్మభూమికి సంబంధించిన అంశంపై విద్యార్థులకు వ్యాస, మౌఖిక, ఉపన్యాస, చర్చ పోటీలు నిర్వహించాలి. పి.ఇ.టి.సహాయంతో క్రీడలను నిర్వహించాలి.
- ప్రతి రోజూ ఉపాధ్యాయులు, విద్యార్థులు జన్మభూమిలో ఆరోజుకు సంబంధించిన అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలి.
- ప్రతి రోజు గ్రామంలో చేపట్టిన కార్యక్రమాలపై డాక్యుమెంటేషన్, ఫోటోలను మధ్యాహ్నం 3 గంటలలోపు ఎంఈవో కార్యాలయానికి పంపాలి.
- ఈనెల 5న జన్మభూమి కార్యక్రమంలో విద్యాశాఖ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఉదయం ర్యాలీ తరువాత 15 నిమిషాలు సీఎం ఉపన్యాసం ఉంటుంది. తదుపరి కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యం వంటి కళలను ప్రదర్శించాలి. సైన్సు ప్రయోగాలు ప్రదర్శించాలి.
- జన్మభూమి రోజుల్లో విద్యార్థులు గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై సర్వే చేయాలి. మండల, పంచాయతీ స్థాయిలో 5కె రన్ నిర్వహించాలి.

ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు మినహాయింపు..

ప్రభుత్వ విద్యాసంస్థల టీచర్లు, విద్యార్థులను జన్మభూమిలో తప్పనిసరిగా భాగస్వాములను చేయాలని ఆదేశాలు ఇచ్చిన రాష్ట్రప్రభుత్వం అదే సమయంలో ప్రయివేటు కార్పొరేట్ సంస్థలను పూర్తిగా మినహాయించింది. ఆయా విద్యాసంస్థల్లో బోధనాభ్యసన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదన్నట్లు వ్యవహరిస్తోంది. జేఈఈ, ఎంసెట్‌తో సహా అనేక పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే సమయంలో ఇంట ర్ విద్యార్థులను సైతం ఈ జన్మభూమికి తరలించేలా ఇంటర్మీడియెట్ బోర్డు ద్వారా ఆదేశాలు జారీ చేయించింది.

పాఠశాలలా మీ ప్రచారవేదికలా?

జన్మభూమి నోడల్ ఆఫీసర్లుగా, గ్రామ కోఆర్డినేటర్లుగా టీచర్లను నియమించడం సరైనది కాదు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటీవలి కాలంలో ప్రభుత్వంలోని వారికి పాఠశాలలను తమ ప్రచార వేదికలుగా మార్చేయడం అలవాటుగా మారింది. గ్రామాల్లో అనేక శాఖల ఉద్యోగులు ఉండగా టీచర్‌లను నియమించడం ఏమిటి?

– యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబుల్‌రెడ్డి

వీధుల్లోనే విద్యార్థులు

జన్మభూమిలో టీచర్లు, విద్యార్థులను భాగస్వామ్య చేయడం సరికాదు. రోజూ ఏదో ఒక కార్యక్రమం చేయాలని చెబుతున్నారు. విద్యార్థులకు చదువు లేకుండా చేస్తున్నారు. నెలరోజులుగా టాయిలెట్లు పరిశీలన అని విద్యార్థులను గ్రామాల్లో ఇంటింటికీ తిప్పారు.

– పాండురంగవరప్రసాద్, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

టీచర్లకు బోధనేతర బాధ్యతలా?

టీచర్లను స్కూళ్లు వదిలి గ్రామసభల్లో ఉండాలంటున్నారు. గ్రామ పంచాయతీ బాధ్యతలు అప్పగించారు. పది రోజులు స్కూళ్లను వదిలి గ్రామ సభల్లో పాల్గొనాలి. ఆ గ్రామ సభల ఇన్‌ఛార్జి బాధ్యతలను ఇవ్వడం అన్యాయం.

– శ్రీనివాసరాజు, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి


పరీక్షల సమయంలో ఇదేం తీరు?

ఇంటర్మీడియెట్‌తో సహ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను జన్మభూమి కార్యక్రమంలో భాగస్వామ్ముల్ని చేయడం సరి కాదు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

– రవిచంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

50వ రోజు

02–01–18, మంగళవారం
చింతపర్తి శివారు, చిత్తూరు జిల్లా



ప్రజల ఆదరాభిమానాలే నన్ను నడిపిస్తున్నాయి..

ఇప్పటికి యాభైరోజులు గడిచిపోయాయి. రోజూ వేలాదిగా తరలివస్తున్న జనం మధ్య ఇన్ని రోజులు ఎలా గడిచిపోయాయో! నవంబర్ ఆరో తేదీన ఇడుపులపాయలో నాన్నగారి పాదాల చెంత మౌనంగా ప్రార్థించుకుని మొదటి అడుగు వేశాను. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ, సమస్యలు వింటూ, వారికి సాంత్వన చేకూర్చేందుకు ప్రారంభించిన సంకల్ప యాత్ర అప్రతిహతంగా ముందుకు సాగడానికి ప్రజల ఆదరాభిమానాలే ప్రధాన కారణం. నామీద ఎంతో నమ్మకంతో.. కష్టాల్లో ఉన్న వారు తమ దీనస్థితిని వివరిస్తూ, సమస్యలు చెప్పుకుంటూ, మనసు నిండా బాధ ఉన్నా.. నీకు తోడుగా మేమున్నామంటూ అడుగులో అడుగు వేస్తూ నన్ను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్నారు.

ఈ రోజు పూలవాండ్లపల్లె దగ్గర పాపులమ్మ అనే అక్క కలిసింది. 'సార్.. నేను ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛదూత్‌గా పనిచేస్తున్నాను. రోజూ పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రం చేస్తుంటాను. నెలకు రెండు వేల రూపాయల జీతం ఇచ్చేవారు. అయితే ఇప్పటికి సంవత్సరం నుంచి జీతం ఇవ్వట్లేదు. నా ఇద్దరు కొడుకులు చనిపోయారు. వాళ్ల పిల్లల్ని కూడా నేనే సాకుతున్నాను. నా భర్త ఉన్నా ఏ పనీ చెయ్యలేడు. నాకు బతుకంటేనే విరక్తి పుడుతోంది' అని కన్నీళ్లు పెట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పిల్లల బాత్‌రూమ్‌లు శుభ్రం చేసే ఓ అక్క పరిస్థితి ఇది! పని చేయించుకుని కూడా జీతం ఇవ్వకపోతే ప్రభుత్వ పాఠశాలల మీద, వాటి పరిశుభ్రత మీద, మరుగుదొడ్ల నిర్వహణ మీద ఏం శ్రద్ధ ఉన్నట్టు? నన్ను కలిసిన మున్సిపల్ కార్మికులది కూడా ఇదే సమస్య. నెలల తరబడి వారికి జీతాలు ఇవ్వడంలేదట. సమ్మె చేస్తున్నా పట్టించుకోవడంలేదట. పూట గడవడమే కష్టంగా ఉన్న ఇలాంటి చిరుద్యోగులకు జీతాలు ఇవ్వకపోతే బతికేదెలా? అని ఆలోచిస్తూ ముందుకు సాగాను.

వాయల్పాడులో కొంతమంది రైతులు కలిశారు. తమ ప్రాంతంలోని శ్రీకృష్ణదేవరాయ నూనె విత్తుల కర్మాగారాన్ని బాబుగారు ఎలా మూసేయించారో చెప్పారు. ఈ ప్రాంతంలో కర్మాగారం ఉండటం వల్ల వేరుశనగ, సన్‌ఫ్లవర్ నూనెలు చవకగా దొరికేవని, నాలుగు జిల్లాల్లోని రైతులకు ఆ పంటలకు సంబంధించి గిట్టుబాటు ధర లభించేదని చెప్పారు. ప్రయివేటు మిల్లర్లకు, కొద్దిమంది వ్యాపారులకు లబ్ధిచేకూర్చడం కోసమే ఆయిల్ మిల్లును మూసేయించాడట. రైతుల కోసం, ప్రజల కోసం ఆలోచించడం అన్నమాటే బాబుగారి డిక్షనరీలో లేదేమో!

వాయల్పాడులో జరీనా అనే సోదరి కలిసింది. తన ఏడేళ్ల కొడుకును చంకలో వేసుకొచ్చిన ఆమె తన కష్టం గురించి చెప్పుకుంది. ఆమెకు భర్తలేడట. ఆమె కొడుక్కి మెదడువాపు జ్వరం వచ్చి కాళ్లూచేతులు పడిపోయాయట. మెదడు కూడా దెబ్బతిందట. జీవచ్ఛవంలా బతుకుతున్నాడు. ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ ఆ బిడ్డను సాకుతోందట. ఆ పిల్లవాడి మందులకే నెలకు వెయ్యి రూపాయలు ఖర్చవుతోందంటూ కళ్ల నిండా నీళ్లు పెట్టుకుంది. ఇలాంటి నిరుపేదలకు ఖరీదైన జబ్బులొస్తే వారి పరిస్థితి ఏంటి? వారికి దిక్కెవరు?

ఈరోజు ఉదయం పేపర్ చూసి నాకు చాలా నవ్వొచ్చింది. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేయకపోతే ప్రజలు సిగ్గుపడాలన్నారు బాబుగారు. కానీ ఇక్కడ వాస్తవ పరిస్థితిని చూస్తుంటే ప్రజలు బాబుగారికి ఓటేసినందుకు తీవ్రంగా పశ్చాత్తాపపడుతున్నారు. ఇంత దారుణంగా ప్రజలను మోసం చేసిన నేపథ్యంలో ఓటు అడగడానికి ఆయనే సిగ్గుపడాలి.

ముఖ్యమంత్రిగారికి నాదొక ప్రశ్న.. ఏం చేశారని మీకు ఓట్లెయ్యాలి? మీరిచ్చిన వందల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చనందుకా? సంక్షేమం, అభివృద్ధి అన్నమాటలే మరిచి దళారీ, దోపిడీ వ్యవస్థలను పెంచి పోషిస్తున్నందుకా? అవినీతిని అందలమెక్కించినందుకా? కరెంటు నుంచి బస్ చార్జీల దాకా ఎడాపెడా పెంచినందుకా? ఏ రాష్ట్రంలో లేని విధంగా పెట్రోలు, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నందుకా? రేషన్ షాపుల్లో బియ్యం తప్ప మిగతా ఏ నిత్యావసర సరుకులను ఇవ్వనందుకా? ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేసినందుకా? ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నీరుగార్చినందుకా? రైతుల్ని, అక్కచెల్లెమ్మల్ని, నిరుద్యోగుల్ని మోసం చేసినందుకా? గ్రామాల్లో జన్మభూమి కమిటీల పేరుతో లంచగొండి మాఫియా సామ్రాజ్యాన్ని సృష్టించినందుకా? ఇసుక, మట్టి, మద్యం, బొగ్గు కాంట్రాక్టులు, రాజధాని భూములు, చివరికి గుడి భూములను కూడా వదలకుండా విచ్చలవిడి అవినీతి చేసినందుకా? రైతులు, అక్కచెల్లెమ్మలకు ఇవ్వాల్సిన సున్నా వడ్డీ పూర్తిగా ఎగ్గొట్టినందుకా? ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టినందుకా?

వై.ఎస్. జగన్.



డాష్ బోర్డుకు నామినేషన్ వైరస్

- సీఎం కోర్ డాష్ బోర్డుకు సమాచారం తెలిపే సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు అడ్డదారులు
- నామినేషన్లపై పనుల కేటాయింపు
- రిజర్వాయర్లు, నీరు–చెట్టు, ప్రకాశం బ్యారేజీలకు రూ.11.71 కోట్లు
- ఆర్థికశాఖ అభ్యంతరాలను లెక్కచేయని సీఎం
- ఆయన సూచనలతో కేబినెట్‌లో పెట్టి మరీ ఆమోదం

సాక్షి, అమరావతి: ఆర్థిక కష్టాల్లో పూర్తిగా కూరుకుపోయిన రాష్ట్ర ఖజానాను గాడిలో పెట్టాల్సిన ప్రభుత్వ పెద్దలు అందుకు భిన్నంగా సొంత ప్రయోజనాల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తమ ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చుకోవడంతో పాటు అయిన వారికి అప్పనంగా పనులు అప్పగిస్తున్నారు. పేరుకు మాత్రమే కొటేషన్లు.. కానీ పనులు మాత్రం తమకు కావాల్సిన వారికి నామినేషన్లపై కేటాయించేస్తున్నారు. ఈ తతంగంపై ఆర్థిక శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఘాటుగా స్పందిస్తున్నా ముఖ్యమంత్రి ఏమాత్రం పట్టించుకోవడంలేదు. నిబంధనలను పాటించాలని నీతులు చెప్పే ఆయనే స్వయంగా కొటేషన్లు, నామినేషన్లపై పనులు అప్పగిస్తుండడంపై అధికార యంత్రాంగం విస్తుపోతోంది.

సీఎం కోర్ డాష్ బోర్డుకు సమాచారం ఇచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ పనులను విశాఖపట్టణానికి చెందిన వాసర్ ల్యాబ్ ఐటీ సొల్యూషన్ లిమిటెడ్‌కు కొటేషన్లు, నామినేషన్లపై రూ.11.71 కోట్ల పనులను అప్పగించేశారు. వాసర్ ల్యాబ్ అనుబంధ సంస్థల్లో సీఎం సన్నిహితుడు డైరెక్టర్‌గా ఉండటం గమనార్హం. తొలుత టెండర్లను ఆహ్వానించడం ద్వారా పనులు అప్పగించాలని నిర్ణయించారు. కానీ, అలా చేస్తే తమకు ఏ రకంగానూ ఉపయోగం ఉండదనే అంచనాకు వచ్చారు. దీంతో.. టెండర్ల ఆహ్వానానికి సమయం లేదు, అర్జెంట్‌గా ఆ సమాచారం అవసరమనే సాకుతో పరిమితంగా కొటేషన్లను ఆహ్వానిస్తూ కావాల్సిన సంస్థకు ఈ పనులను అప్పగించేశారు. ఇవే కాదు.. సీఎం కోర్ డాష్ బోర్డుకు నాలుగు రకాల సమాచారం కోసం ఉద్దేశించిన పనులను సైతం ఇదే వాసర్ ల్యాబ్‌కు అప్పనంగా అప్పగించేశారు. ఈ పనులకు బహిరంగ టెండర్లను ఆహ్వానించి చేపట్టాల్సిందిగా ఆర్థిక శాఖ స్పష్టంగా సూచించింది. అయితే, రెండు పనులను కొటేషన్ విధానంలోను, మరో రెండు పనులను నామినేషన్‌పైన వాసర్ ల్యాబ్ సంస్థకు జలవనరుల శాఖ అప్పగించింది. అనంతరం ఆ పనులకు ఆమోదం తెలపాలంటూ ఆర్థిక శాఖను జలవనరుల శాఖ కోరింది. దీనిపై ఆర్థిక శాఖ తీవ్రంగా స్పందించింది. బహిరంగ విధానంలో టెండర్లను ఆహ్వానించకుండా పరిమితంగా కొటేషన్లను ఆహ్వానించి పనులు అప్పగించడం ఆమోదయోగ్యం కాదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా, చాలా ఎక్కువ వ్యయం చేస్తున్నందున సాఫ్ట్‌వేర్‌ను అంచనా వేయడం సాధ్యం కాదని ఆర్థిక శాఖ స్పష్టంచేసింది. అయినా సరే, కొటేషన్లపై పనులు అప్పగించేసి, ఆమోదం తెలపాలంటే సాధ్యంకాదని, ఇలాంటి వాటికి ఆర్థిక శాఖ మద్దతు ఇవ్వడం, ఆమోదించడం చేయదంటూ తిరస్కరించింది. ఇలాంటి ఉదంతాలు మరికొన్ని..

- తొలుత రిజర్వాయర్లలో నీటి లభ్యత సమాచారాన్ని రియల్ టైమ్‌లో సీఎం కోర్ డాష్ బోర్డుకు సమాచారం చేరవేసే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకోసం వాసర్ ల్యాబ్‌కు పన్నులతో కలిపి రూ.8.20 కోట్లను చెల్లించనున్నారు. ఇందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపేందుకు నిరాకరించింది. అయినా సరే, ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్‌తో కేబినెట్ ఆమోదం పొందారు.
- అలాగే, నీరు–చెట్టు, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నీటి లభ్యత సమాచారాన్ని రియల్ టైమ్‌లో సీఎం కోర్ డాష్ బోర్డుకు పంపించే పనిని 94.75 లక్షల రూపాయలకు నామినేషన్‌పై వాసర్ సంస్థకు అప్పగించేశారు. దీనిపై కూడా ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇప్పటికే నామినేషన్‌పై ఇచ్చేస్తూ నిర్ణయం తీసుకున్నందున దానికి తమ శాఖ ఆమోదం తెలపబోదని స్పష్టం చేసింది.
- ప్రకాశం బ్యారేజీ దగ్గరకు పట్టిసీమ నుంచి ఎంత నీరు వస్తుందో కోర్ డ్యాష్ బోర్డుకు సమాచారం వెళ్లేందుకు రాడార్ సెన్సర్ ఏర్పాటు పనిని సైతం వాసర్ సంస్థకే నామినేషన్‌పై 1.83 కోట్ల రూపాయలకు అప్పగించేశారు. ఇందుకూ ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆమోదానికి నిరాకరించింది.

కోడి పందేలు జరగడానికి వీల్లేదు

ఎక్కడైనా జరిగితే సీఎస్, డీజీపీలే బాధ్యత వహించాలి

- సంక్రాంతికి కోడి పందేల నిర్వహణపై హైకోర్టు సీరియస్
- కోర్టు ఉత్తర్వులంటే ప్రజాప్రతినిధులకు లెక్కే లేదు
- మా ఆదేశాలను అధికారులు తుంగలో తొక్కారు
- పందేలు నిర్వహించుకోవచ్చునని సుప్రీం కోర్టు ఎక్కడా చెప్పలేదు
- పందేలు జరగకుండా చూసేందుకు ఏం చేస్తున్నారో చెప్పండి
- ప.గో. కలెక్టర్, ఎస్పీలకు హైకోర్టు ఆదేశం





సాక్షి, హైదరాబాద్: రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా కోడి పందేలు జరగడానికి వీల్లేదని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తమ ఆదేశాలకు విరుద్ధంగా ఎక్కడైనా కోడి పందేలు జరిగితే అందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలే వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ మొత్తం వ్యవహారాన్ని వీరిద్దరు స్వయంగా పర్యవేక్షించాలంది. కోడి పందేల పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులంటే ప్రజా ప్రతినిధులకు ఏ మాత్రం లెక్క లేకుండా పోతోందని, జోక్‌గా భావిస్తున్నారని మండిపడింది. పందేలు ఆడితీరుతామంటూ వారు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారంది. ''కోడి పందేలు నిర్వహించడం.. దానిపై పిటిషన్లు దాఖలు కావడం.. చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పడం ఓ ప్రహసనంగా మారిపోయింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కోడి పందేల విషయంలో 2016 డిసెంబర్‌లో మేం ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ అధికారులు మా ఉత్తర్వులను తుంగలోతొక్కారు. దీంతో కోడి పందేల నిర్వహణ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం అయింది. ఏం చేస్తున్నారని అడిగితే అధికారులు ఏవో నివేదికలు తయారు చేసి మా ముఖాన పడేస్తున్నారు. కోడి పందేలు నిర్వహించుకోవచ్చునని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో ఎక్కడా చెప్పలేదు'' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

ఏం చర్యలు తీసుకుంటున్నారు..

పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందేలు జరగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను హైకోర్టు ఆదేశించింది. కోడి పందేలకు సిద్ధం చేసిన మైదానాల్లో ఎన్నింటిని తనిఖీలు చేశారు.. గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులపై ఏం చర్యలు తీసుకున్నారు.. ఎన్ని చోట్ల 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు.. తదితర వివరాలను తమ ముందుంచాలని వారికి స్పష్టం చేసింది. ఒకవేళ ఈ వివరాలను సమర్పించకుంటే స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత సంక్రాంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో కోడి పందేల పేరుతో జూదం, అశ్లీల నృత్యాలు, వ్యభిచారం తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించారని, రానున్న సంక్రాంతికి ఇవేమీ జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు అనే వ్యక్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ జరిపి కీలక ఆదేశాలు ఇచ్చింది.

నివేదికల్లో ఉపన్యాసాలా?

పిటిషనర్ తరఫు న్యాయవాది పి.వెంకటరెడ్డి వాదనలు వినిపించారు. కోడి పందేలను అడ్డం పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని ధర్మాసనానికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దాఖలు చేసిన నివేదికను పరిశీలించిన ధర్మాసనం, గత విచారణ సమయంలో తామిచ్చిన ఆదేశాల మేర ఈ నివేదిక లేదంది. అవి చేస్తున్నాం, ఇవి చేస్తున్నామంటూ ఉపన్యాసాలు ఇస్తున్నారని మండిపడింది. గత విచారణ సమయంలో సంయుక్త తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించామని, అయితే నివేదికలు చూస్తుంటే అలా లేవని ధర్మాసనం పేర్కొంది. అధికారులు కళ్లు మూసుకుని ఉండటం వల్లే నిర్వాహకులు కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించే ధైర్యం చేస్తున్నారంది. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీకి కోర్టు ఉత్తర్వులను అమలు చేసే సామర్థ్యం లేకుంటే ఆ విషయాన్ని తమకు చెప్పాలని, ఆ స్థానంలో మరో సమర్థవంతుడైన అధికారిని నియమించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తామని చెప్పింది.

భక్తి చానల్‌లో అక్రమాలపై ఆధారాలున్నాయి

ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ

సాక్షి, హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తున్న శ్రీ వేంటేశ్వర భక్తి చానల్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. విజిలెన్స్ నివేదికను పరిశీలించిన ధర్మాసనం అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. ఈ కేసులో తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భక్తి చానల్ సీఈవో నర్సింహారావు అక్రమాలకు పాల్పడ్డారంటూ తిరుపతికి చెందిన పి.నవీన్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రతివాదులైన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టీటీడీ ఈవో, భక్తి చానల్ ఎండీ, ఆరోపణలు ఎదుర్కొంటున్న చానల్ సీఈవో నర్సింహారావులకు ధర్మాసనం నోటీసులిచ్చింది. విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.


దివిసీమ వైభవ ప్రతీక 'దివిసీమ శతకం'

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అవనిగడ్డ: ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన 'దివిసీమ శతకం' పుస్తకావిష్కరణ కార్యక్రమం కృష్ణాజిల్లా అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం వినూత్నంగా జరిగింది. సుమారు 12 వేల మంది విద్యార్థుల సమక్షంలో 108 శతకాలను 108 బెలూన్లపై రాసి వాటిని చిన్నారులతో ఎగురవేయడం ద్వారా 'దివిసీమ శతకం' పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దివిసీమ కీర్తి ప్రతిష్టలు, ఈ ప్రాంత చారిత్రక వైభవాన్ని కవి జొన్నవిత్తుల కళ్లకు కట్టినట్లు ఈ పుస్తకంలో పొందుపరచారన్నారు.

బ్యాంకుల రుణ వితరణ తగ్గింది!

- ఏపీలో రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడడం పెరుగుతోంది
- రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ఆందోళన



సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి, అమరావతి: బ్యాంకుల నుంచి రైతులకు రుణ పంపిణీ తగ్గిపోయిందని, తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ రాజ్యసభలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. నాబార్డ్ (సవరణ) బిల్లు–2017పై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'జాతీయ శాంపిల్ సర్వే సంస్థ నివేదిక ప్రకారం రైతులకు వ్యవస్థీకృత (బ్యాంకుల ద్వారా) రుణ పంపిణీ దారుణంగా పడిపోయింది. 1991లో 69.4%గా ఉన్న రుణ వితరణ దారుణంగా తగ్గింది. ఇదే సమయంలో వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడిన రైతుల సంఖ్య 30.6% నుంచి 44%కు పెరిగింది. ఈ విషయాలను గమనించి నాబార్డు గ్రామీణ బ్యాంకులకు తగిన మార్గదర్శనం చేయాలి..' అని పేర్కొన్నారు. దేశంలో 51.9% రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోగా ఏపీలో ఇది 93 శాతంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. సమీకృత వ్యవసాయాభివృద్ధి కమిషన్ ఇచ్చిన నివేదిక మేరకు ఆంధ్రప్రదేశ్‌లో రైతు కుటుంబం సగటు అప్పు రూ. 1.23 లక్షలుగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ రెండు అంశాలను సమీక్షించండి

దివాలా బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని, అయితే ఇందులోని 2 అంశాలను సమీక్షించాలని ఆ పార్టీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'దివాలా పిటిషన్‌కు అనర్హతల విషయంలో సెక్షన్–29(ఏ)లోని సబ్ సెక్షన్–డీ ప్రకారం రెండేళ్ల కంటే ఎక్కువ శిక్షా కాలానికి చెందిన నేరంలో దోషిగా తేలితే వారు అనర్హుల జాబితాలో చేరతారు. దోషి అనే పదాన్ని నిర్వచించాల్సిన అవసరం ఉంది. కింది కోర్టులో గానీ, హైకోర్టులో గానీ శిక్ష పడిన వ్యక్తి సుప్రీం కోర్టు తీర్పు వెలువడేంతవరకు 'దోషి'గా చేర్చరాదు. ఇక రెండో విషయానికి వస్తే అనర్హతల నిబంధనలో తీవ్రమైన నిబంధనల కారణంగా పోటీతత్వం తగ్గి దివాలాకు చెందిన ఆస్తులకు తగిన విలువ దక్కే పరిస్థితి ఉండదు. అందువల్ల పోటీతత్వం తగ్గకుండా చూడాల్సిన అవసరం ఉంది..' అని ఆయన కోరారు. అమరావతి రాజధాని నగరం అభివృద్ధి ప్రాజెక్టు కోసం రూ.3,324 కోట్ల ప్రపంచ బ్యాంకు రుణం కోరుతూ ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి ప్రస్తుతం ఆ బ్యాంకు పరిశీలనలో ఉందని విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. కాగా, ఏపీ రాజధానిలో అసెంబ్లీ, రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం నిర్మాణం కోసం గడచిన మూడేళ్ళుగా కేంద్రం రూ.1500 కోట్లు విడుదల చేసినట్టు ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పి రాధాకృష్ణన్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

పెండింగ్‌లో ఈఏపీ ప్రతిపాదనలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎక్స్‌టెర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు (ఈఏపీ)ల విషయంలో ఏపీ నుంచి 13 ప్రతిపాదనలు వచ్చినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఎం.ఎ.ఖాన్ అడిగిన ప్రశ్నకు మంగళవారం ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వచ్చిన ప్రతిపాదనల్లో 'ఏపీ సమీకృత గురుకుల విద్యా ప్రాజెక్టు'కు ప్రపంచ బ్యాంకు నుంచి 360 మిలియన్ డాలర్ల రుణ ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం 2017 డిసెంబర్ 19న సిఫార్సు చేసింది. అమరావతి గ్రీనింగ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు నుంచి 156 మిలియన్ డాలర్ల మేర రుణ ప్రతిపాదనను డీఈఏ సిఫార్సు చేసింది' అని అన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.135 కోట్లు

ఏపీలో ఏర్పాటు చేయతలపెట్టిన వ్యవసాయ వర్సిటీకి గడిచిన మూడేళ్లలో రూ.135 కోట్లు విడుదల చేసినట్టు వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంగళవారం ఆయన సమాధానం ఇచ్చారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూలు–9లో పొందుపరిచిన 73 సంస్థలకు సంబంధించి ఆస్తుల విభజన చివరి దశలో ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ తెలిపారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అలాగే ఏపీ కాపు రిజర్వేషన్ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో చేర్చేందుకు ప్రతిపాదన వచ్చిందా? అంటూ టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాలేదని కేంద్ర హోం శాఖ తెలిపింది.

8 నుంచి సీపీఐ జాతీయ సమావేశాలు

29 రాష్ట్రాల పార్టీ ముఖ్య నేతల రాక



సాక్షి, అమరావతి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సమావేశాలు ఈనెల 8 నుంచి 3 రోజులపాటు విజయవాడలో జరగనున్నాయి. 155 మంది జాతీయ సమితీ సభ్యులతో పాటు 29 రాష్ట్రాల పార్టీ కార్యదర్శులు, కంట్రోల్ కమిషన్ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, పార్టీ మేధావులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న పార్టీ 23వ జాతీయ మహాసభల్లో చర్చించే రాజకీయ విధాన పత్రానికి, భవిష్యత్ కార్యాచరణకు పార్టీ నిర్మాణ నివేదికను ఈ సమావేశాల్లో ఖరారు చేస్తారు. పుదుచ్చేరిలో జరిగిన పార్టీ జాతీయ మహాసభల నాటి నుంచి నేటివరకు పార్టీ చేపట్టిన కార్యక్రమాల తీరు తెన్నులను సమీక్షించడంతో పాటు 2019లో జరిగే సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే వరకు అనేక అంశాలను జాతీయ సమావేశాల్లో చర్చించి తుది రూపం ఇస్తారు. ఈ సమావేశాల్లో ఖరారు చేసే రాజకీయ విధాన నివేదికను పార్టీ జాతీయ మహాసభల్లో ప్రవేశపెడతారు.

త్వరలో రాష్ట్రంలో 9 అర్బన్ మండలాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా తొమ్మిది అర్బన్ మండలాల ఏర్పాటు కోసం ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు కోరుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా గెజిట్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చి, అభ్యంతరాలు, సలహాల సమర్పణకు ప్రజలకు నెల రోజులు గడువు ఇవ్వాలని రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోలో కలెక్టర్లను ఆదేశించింది. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాలతోపాటు జిల్లా అధికార యంత్రాంగం ప్రతిపాదనలను నెల రోజుల తర్వాత రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కి పంపాల్సి ఉంటుంది. విశాఖపట్నం నగరంలో అర్బన్, రూరల్ మండలాలను సీతమ్మధార, మహారాణిపేట, గోపాలపట్నం, ములగాడ, విశాఖ రూరల్ మండలాలుగా పునర్విభజిస్తారు. దీంతో ఈ జిల్లాలో కొత్తగా మూడు అర్బన్ మండలాలు ఏర్పాటవుతాయి. నెల్లూరు మండలాన్ని నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ మండలాలుగా విభజిస్తారు. దీంతో నెల్లూరులో కొత్తగా అర్బన్ మండలం ఏర్పాటవుతుంది. కర్నూలు మండలాన్ని కర్నూలు అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తారు. విజయవాడలో 3 అర్బన్ మండలాలు ఏర్పాటవుతాయి. గుంటూరు మండలాన్ని గుంటూరు తూర్పు, గుంటూరు పడమరగా విభజిస్తారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రకృతి సాగుతోనే కర్బన ఉద్గారాల తగ్గింపు

ప్రకృతి శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్



సాక్షి, అమరావతి బ్యూరో: రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల పలు అనర్థాలకు ఆస్కారముందని ప్రకృతి శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ హెచ్చరించారు. భారత ప్రభుత్వం ప్రకటించిన విధంగా కర్బన ఉద్గారాలను 22 శాతం మేరకు తగ్గించాలంటే ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ ప్రాంగణంలో 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం'పై రైతులకిస్తున్న రాష్ట్ర స్థాయి శిక్షణ సదస్సులో మంగళవారం మూడోరోజున పలు అంశాలపై వివరించారు. కర్బన ఉద్గారాలను ఎలా తగ్గించాలో తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను తగలబెట్టడమనే దుర్మార్గం జరుగదన్నారు. ఈ విధానంలో మిథేన్ వాయువును వెలువరించే ఎటువంటి కంపోస్టులు తయారు చేయబోమన్నారు. ఫలితంగా ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల భూతాపం సంభవించడానికి ఆస్కారముండదన్నారు. రైతులకు సేంద్రియ కర్బనం అన్నపూర్ణలాంటిదని, ఇందులో సకల పోషకాలుంటాయని పాలేకర్ తెలిపారు. ఈ సేంద్రియ కర్బనం (హ్యూమస్) వేరు వ్యవస్థ వద్ద మాత్రమే తయారవుతుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల హ్యూమస్ తయారీ ఆగిపోతుందన్నారు. తద్వారా భూసారం, దిగుబడులు తగ్గి కేవలం రసాయన ఎరువుల వాడకంపైనే రైతులు ఆధారపడాల్సి వస్తుందన్నారు. దీంతో రైతుకు పెట్టుబడి పెరుగుతూనే ఉంటుందన్నారు. కాబట్టి హ్యూమస్ తయారీని పెంపొందించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, జేసీ–2 ముంగా వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయభారతి, డీడీఏ సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో యంత్రాలతో డ్రెయినేజీలు శుభ్రం

సాక్షి, అమరావతి : గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేసేందుకు యంత్రాలు మాత్రమే వాడాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటి ద్వారా కిలోమీటరు మేర మురుగు కాల్వలు శుభ్రం చేసినందుకు రూ.3583 చొప్పన చెల్లిస్తారు. గ్రామ పంచాయతీలే తమ నిధుల నుంచి నిర్వాహకులకు ఆ డబ్బులు చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొంది. ఇందుకు 'మిషన్ ఎంసీడీఆర్‌ఏ' (మెకనైజ్డ్ క్లీనింగ్ ఆఫ్ డ్రెయిన్ ఇన్ రూరల్ ఏరియాస్)ను ఏర్పాటుచేస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఆ పరిధిలో 150 కిలోమీటర్ల విస్తీర్ణంలోని మురుగు కాల్వలను గుర్తించి.. వాటిని శుభ్రం చేసేందుకు ఒక యంత్రాన్ని అందజేస్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను ఎంపికచేసి, వారికి ఆ యంత్ర నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్, జి.యన్.యస్.యస్, కడప వారి కార్యాలయం

ఫారం (నమూనా) నెం. 6ఎ

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టములో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 రూలు 19 సబ్ రూలు (1) ననుసరించి).

ప్రాథమిక ప్రకటన

రెఫ్.నెం. బి/46/2016 **తేది: 09.11.2017**

ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములకు కడప జిల్లా, ఎల్.ఆర్.పల్లె మండలము, **కాకులవరం** గ్రామము నందు ప్రజా ప్రయోజనమునకై హంద్రీనీవా సుజల స్రవంతి శ్రీనివాసపురం రిజర్వాయరు ద్వారా ఎడమ ప్రధాన కాలువ కొరకు కి.మీ. 23.000 నుండి 26.800 కొరకు 0.54 ఎకరముల భూమి కావలెనని ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందు హక్కు, పారదర్శకత చట్టంలోని సెక్షన్ 11 (1) నిబంధనల ననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించి పర్యావరణ ప్రభావము మధింపు (ఈ.ఐ.ఎ) క్లీయరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ శాఖ వారి లేఖ నెంబరు. జె/12011/32/2001/ఎ–1 తేది 20–12–2005 ప్రకారం జారీ చెయ్యబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియులేవు.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత పనులు అంటే హంద్రీనీవా సుజల స్రవంతి ఎడమ ప్రధాన కాలువ క్రింద కి.మీ. 23.000 నుండి కి.మీ. 26.800 పనులకు గాను సమకూర్చు నిమిత్తం 0.54 ఎకరముల సహేతుక పరిహారము పారదర్శక భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన చట్టం 2013 సెక్షన్ 6(2) (సామాజిక ప్రభావిత మదింపు) మరియు సెక్షన్ 10(4) (జాతీయ ఆహార భద్రత)లోని అంశములు ఈ భూసేకరణకు మినహాయించబడినవి.

ఇదే చట్టములోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహా పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 1 రెవిన్యూ (భూసేకరణ) తేది 20.01.2015 నందు సంయుక్త కలెక్టరు, కడప వారిని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడినది.

ఇదే చట్టములోని సెక్షన్ 12 మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ నియమావళి 2014 2డి క్రింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యూనిట్–2 కడప వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఆ భూముల భూసేకరణకై అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టములో సెక్షన్ 11 (4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప/ ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు ఈ భూములపై జరుపరాదని తెలియచేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నయెడల సంబంధిత వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప/ ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోవచ్చును.

షెడ్యూలు

మండలం : లక్కిరెడ్డిపల్లి **గ్రామము : కాకులవరం**

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణము (ఎకరములలో)	అక్విజేషన్ క్రింద తీసుకున్న విస్తీర్ణము (ఎకరములలో)	ఆసక్తి గల వారి పేరు మరియు అడ్రస్	హద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడాలు వగైరా వివరములు
1	2	3	4	5	6	7	8	9	10
పట్టా భూములు									
1	586/6బి	1.52	0.54	గాదేరాజు హరిత భర్త రామాంజనేయులు	586/3బి	586/5ఎ	586/6ఎ	586/5బి	
		మొత్తము	7.45						

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప.

సం/- యస్.వి. నాగేశ్వర రావు, M.Com, ప్రత్యేక కలెక్టరు (భూ.సే.), జి.యన్.యస్.యస్., కడప.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్, జి.యన్.యస్.యస్, కడప వారి కార్యాలయం

ఫారం (నమూనా) నెం. 6ఎ

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టములో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 రూలు 19 సబ్ రూలు (1) ననుసరించి).

ప్రాథమిక ప్రకటన

రెఫ్.నెం. బి/04/2017 **తేది: 16.11.2017**

ఈ దిగువన ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములకు కడప జిల్లా, సంబేపల్లి మండలము, **దుద్యాల** గ్రామము నందు ప్రజా ప్రయోజనమునకై హంద్రీనీవా సుజల స్రవంతి శ్రీనివాసపురం రిజర్వాయరు ద్వారా కుడి ప్రధాన కాలువ కి.మీ. 27.500 నుండి కి.మీ. 28.075 కొరకు 5.68 ఎకరముల భూమి కావలెనని ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు, పారదర్శకత చట్టంలోని సెక్షన్ 11 (1) నిబంధనల ననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించి పర్యావరణ ప్రభావము మధింపు (ఈ.ఐ.ఎ) క్లీయరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ శాఖ వారి లేఖ నెంబరు. జె/12011/32/2001/ఎ–1 తేది 20–12–2005 ప్రకారం జారీ చెయ్యబడినది. భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత పనులు అంటే అనగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎడమ ప్రధాన కాలువ క్రింద 27.500 నుండి కి.మీ. 28.075 పనులకు గాను సమకూర్చు నిమిత్తం 5.68 ఎకరముల సహేతుక పరిహారము పారదర్శక భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన చట్టం 2013 సెక్షన్ 6(2) (సామాజిక ప్రభావిత మదింపు) మరియు సెక్షన్ 10(4) (జాతీయ ఆహార భద్రత)లోని అంశములు ఈ భూసేకరణకు మినహాయించబడినవి.

ఇదే చట్టములోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహా పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 1 రెవిన్యూ (భూసేకరణ) తేది 20.01.2015 నందు సంయుక్త కలెక్టరు, కడప వారిని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడినది.

ఇదే చట్టములోని సెక్షన్ 12 మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ నియమావళి 2014 2డి క్రింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యూనిట్–2 కడప వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఆ భూముల భూసేకరణకై అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టములో సెక్షన్ 11 (4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప/ ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు ఈ భూములపై జరుపరాదని తెలియచేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నయెడల సంబంధిత వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప/ ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోవచ్చును.

షెడ్యూలు

మండలం : సంబేపల్లి **గ్రామము : దుద్యాల**

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణము (ఎకరములలో)	అక్విజేషన్ క్రింద తీసుకున్న విస్తీర్ణము (ఎకరములలో)	పట్టాదారుని లేక ఇనాందారుని పేరు లేక భూమి చెంది యుండు సమాజము యొక్క మేనేజర్ పేరు ఆర్.ఎస్.ఆర్. ప్రకారం	ఆసక్తి గల వారి పేరు మరియు అడ్రస్	హద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడాలు వగైరా వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	53/1	0.22	0.17	సూర్యనారాయణ స్వామి, నరసింహ స్వామి దేవస్థానం తత్కాల్ మేనేజర్	వడ్డి అమ్మన్నమ్మ భర్త రామచంద్రారెడ్డి,	58	53/2	53/2	53/2	
			0.05		గంగిరెడ్డి సహదేవరెడ్డి తండ్రి నారాయణరెడ్డి					మామిడి మొక్కలు–4
		మొత్తము	0.22							
2	62/2	1.44	0.36	రి.స.నెం.25 ఎదుట కనపరచబడిన పేర్లు	శెట్టిపల్లి సాయమ్మ భర్త కొండారెడ్డి	62/1	62/3	68	61	
			0.72		శెట్టిపల్లి రెడ్డమ్మ భర్త కృష్ణారెడ్డి					
			0.36		శెట్టిపల్లి నాగ సుబ్బమ్మ భర్త వెంకట్రామిరెడ్డి					
		మొత్తము	1.44							
3	68/1	1.34	0.76	గద్వాల వీరయ్య	పూజారి నాగయ్య తండ్రి ఎల్లప్ప	శిబ్యాల	68/2	68/2	62	
			0.58		చల్లపల్లి రెడ్డన్న తండ్రి పెద్దరెడ్డిన్న					మామిడి–31
		మొత్తము	1.34							
డి.కె.టీ. భూములు										
4	58/2	1.03	0.07	– –	వడ్డి అమ్మన్నమ్మ భర్త రామచంద్రారెడ్డి	59&60	53	58/3	58/1	
			0.07		శిబ్యాల రంగారెడ్డి తండ్రి పాపిరెడ్డి					
			0.45		గంగిరెడ్డిగారి సహదేవ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి					మామిడి మొక్కలు–23
			0.44		గంగిరెడ్డిగారి భాస్కర్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి					మామిడి మొక్కలు–22
		మొత్తము	1.03							
5	60/2బి	0.82	0.82	– –	గోర్ల బసిరెడ్డి తండ్రి నాగిరెడ్డి	60/2ఎ	58	61	59	
6	61/2	0.83	0.06	– –	వడ్డి వెంకటరెడ్డి తండ్రిపెద్ద రెడ్డయ్య	61/1	63	62	60	
			0.77		గోర్ల బసిరెడ్డి తండ్రి నాగిరెడ్డి					
		మొత్తము	0.83							
		మొత్తము	5.68							

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్–2, కడప.

సం/- యస్.వి. నాగేశ్వర రావు, M.Com, ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప.

సాక్షి

బుధవారం, జనవరి, 3

ట్రంప్ చీవాట్లు!

విధానపరమైన నిర్ణయాలనదగ్గ కీలక అంశాలను ప్రకటించడానికి సైతం ట్వీటర్‌ను వేదికగా చేసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌కు ఇకపై ఆర్థిక సాయం నిలిపివేయదల్చుకున్న విషయాన్ని కూడా ఆ మాధ్యమం ద్వారానే ప్రకటించి సంచలనం సృష్టించారు. ఉగ్రవాదాన్ని అరికడతానని ఎప్పటికప్పుడు కట్టుకథలల్లి ఈ పదిహేనేళ్లలో ఆ దేశం అమెరికా నుంచి రూ. 2.1 లక్షల కోట్ల సాయం పొందిందని, సరిగ్గా అందుకు విరుద్ధంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందని ఆయన అభియోగం. ఈ ఏడాది దానికి అందాల్సిన సాయాన్ని అమెరికా నిలిపివేస్తుందన్న సూచనలు కూడా అందుతున్నాయి. కొత్త సంవత్సరం ప్రారంభమైన మర్నాడు తొలి ట్వీట్‌గా ట్రంప్ ఈ అంశాన్ని ఎంచుకోవడం వల్ల దీని తీవ్రత మరింత పెరిగింది. పాకిస్తాన్ విషయంలో అమెరికా వ్యవహారశైలిని ఇన్నేళ్లుగా గమనిస్తున్నవారికి ట్రంప్ తాజా ప్రకటన కాస్త గందరగోళంగానే అనిపించవచ్చు. ఆయనంత కఠినంగా కాకపోయినా గతంలో అమెరికా అధ్యక్షులుగా ఉన్న వారు సైతం పాక్‌ను హెచ్చరించిన సందర్భాలున్నాయి. అప్పుడప్పుడు ఆ దేశానికి ఇవ్వాల్సిన సాయం తాత్కాలికంగా నిలిపేసిన ఉదంతాలు కూడా లేకపోలేదు. కానీ కొంతకాలం గడిచాక పాకిస్తాన్ చక్కగా సహకరిస్తున్నదని ప్రశంసించడం, ఆర్థిక సాయాన్ని విడుదల చేయడం రివాజే. కానీ ఇప్పుడు ట్రంప్ చేసింది వేరు. ఆయన బహిరంగంగా చీవాట్లు పెట్టారు. ఛీత్కరించారు.

పాకిస్తాన్ వ్యవహారశైలి ఎలా ఉంటున్నదో, దానివల్ల పొరుగు దేశమైన తమకు ఎన్ని సమస్యలొస్తున్నాయో అమెరికా వద్ద, ఐక్యరాజ్యసమితిలోనూ భారత్ మొత్తు కుంటూనే ఉంది. ఉగ్రవాదం పెచ్చరిల్లిన ఈ రెండు దశాబ్దాల్లో అందుకు ఎన్నో ఉదంతాలను దాఖలాలుగా చూపింది. 168మంది ప్రాణాలు కోల్పోయిన 2008 నాటి ముంబై ఉగ్రదాడికి కుట్ర పాకిస్తాన్ గడ్డపైనే జరిగినట్టు ఉగ్రవాది కసబ్ చెప్పిన సాక్ష్యాలున్నాయి. తమ జాతీయుడైన డేవిడ్ హెడ్లీ లష్కరే తొయిబా ఏజెం ట్‌గా పనిచేస్తూ ఆ దాడికి పథకరచన చేశాడని అతన్ని అరెస్టు చేశాక అమెరికాయే తెలుసుకుంది. అయినా పాకిస్తాన్‌కు ఆర్థిక సాయం, ఆయుధ సామగ్రి అమ్మకం ఆగలేదు. అదంతా స్పష్టంగా తెలిసి చేసిన సాయమే తప్ప... పాక్ చెప్పిందంతా అమాయకంగా విశ్వసించి, మూర్ఖంగా చేసిన పని కాదు. ఎందుకంటే పాకిస్తాన్‌లో ఏం జరుగుతున్నదో, ఎవరేం చేస్తున్నారో... ఏ ఉదంతం వెనక ఏముందో సర్వం అమెరికాకు క్షుణ్ణంగా తెలుసు. అయినా ఇన్నేళ్లనుంచీ మెత్తగా మందలింపులు... చిన్నగా బెదిరింపులు... అప్పుడప్పుడు ఆగ్రహావేశాలూ, అటు తర్వాత బుజ్జగింపులు, ప్రశంసలు, సాయాలు–ఇవన్నీ మామూలే. మొన్న అక్టోబర్‌లో ఇదే ట్రంప్ పాకిస్తాన్‌ను ఆకాశానికి ఎత్తేస్తూ ప్రశంసించారు. రెండు నెలలు గడిచేసరికల్లా స్వరం ఎందుకు మారిందన్న సందేహం అందరికీ కలుగుతోంది.

అటు పాకిస్తాన్ ఎక్కడలేని అమాయకత్వాన్నీ ప్రదర్శిస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా తీసుకున్నట్టు కనబడటానికి తెగ హడావుడి చేస్తోంది. కేబినెట్ ప్రత్యేక భేటీ నిర్వహణ, అమెరికా రాయబారిని పిలిపించి నిరసన తెలపడం, ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు జరిపించడం వగైరాలతో మంగళవారం గడిచిపోయింది. నిజమే... ట్రంప్ చేసిన బహిరంగ వ్యాఖ్యల్ని ఆత్మగౌరవమున్న ఏ దేశమూ భరించలేదు. అయితే తాను చెప్పుకుంటున్నట్టు నిజంగా పాకిస్తాన్ నిష్కపటమైన దేశమైతే, అది చిత్తశుద్ధితో ఉగ్రవాదంపై పోరాడుతుంటే నిరసన వ్యక్తం చేయడంతో సరిపెట్టక అమెరికాతో అన్ని రకాల సంబంధాలనూ తెగ దెంపులు చేసుకునేది. కానీ అలా చేయలేదు. ఆ రెండింటిమధ్యా ఉన్న బాంధవ్యానికి దాదాపు అర్థ శతాబ్ది చరిత్ర ఉంది. ప్రత్యేకించి అఫ్ఘానిస్తాన్‌లో సోవియెట్ దురాక్రమణ తర్వాత అది మరింత చిక్కబడింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో మన దేశంపై పాకిస్తాన్ కయ్యానికి కాలుదువ్వడం వెనక అమెరికా ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. అప్పుడు మన విదేశాంగ విధానం మొగ్గ సోవియెట్ వైపు ఉండటమే దీనికి కారణం. పాకిస్తాన్ పాలకులు, సైనికాధికారులు అమెరికా డాలర్ల మోజులో అది చెప్పినట్టు ఆడారు. పాకిస్తాన్‌లో ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చి సైనిక పాలకులు అధికారం గుంజుకున్న ఉదంతాల వెనక అమెరికా ప్రోద్బలం ఉండేదని ప్రపంచానికంతకూ తెలుసు. అక్కడి వ్యవస్థలు భ్రష్టుపట్టడంలో దాని పాత్ర తక్కువేమీ కాదు. అమెరికా సాగిస్తున్న ఉగ్రవాద వ్యతిరేక పోరులో భాగస్వామ్యం వహించి తమ సైనికులు, పౌరులు ఎందరో ప్రాణాలు కోల్పోయారని పాకిస్తాన్ ఇప్పుడంటున్నది గానీ దానికి నారూ నీరూ పోసి పెంచింది తానేనన్న విషయాన్ని అది దాచిపెట్టే ప్రయత్నం చేసింది.

తన వనరులను సక్రమంగా వినియోగించుకుని, ఇరుగుపొరుగుతో సఖ్యంగా ఉంటూ, పరస్పర సహకారంతో ఎదగాలని... తమ దేశాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దాలని పాకిస్తాన్‌లోని పౌర లేదా సైనిక పాలకులు అనుకోలేదు. అందుకు భిన్నంగా దేశాన్ని అమెరికా ఉపగ్రహంగా మార్చి దాని ప్రయోజనాలను నెరవేర్చడం, పనిలో పనిగా స్వీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడంలో వారు తలమునకలయ్యారు. ఫలితంగా పాకిస్తాన్ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అక్కడ పేదరికం, ఉపాధిలేమి, మతోన్మాదం వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. మన దేశానికి కూడా ఎంతో నష్టం జరిగింది. ఇప్పుడు ట్రంప్ వ్యాఖ్యల తర్వాత చైనా రంగంలోకి పాకిస్తాన్ నడవడి చాలా గొప్పదంటూ సర్టిఫికెట్ ఇస్తోంది. ఇలాంటి ఉచ్చులో పడక తెలివిగా మసులుకుని తన తప్పులు సరిదిద్దుకోవడం పాకిస్తాన్‌కు క్షేమదాయకం. భారత్, పాక్ జాతీయ భద్రతాసలహాదారులిద్దరూ ఇటీవలే కలుసుకున్నారని, పలు సమస్యలపై చర్చించుకున్నారని తాజా కథనాలు చెబుతున్నాయి. ఎవరి ప్రమేయమూ లేకుండా ఇరుదేశాలూ ఇలా పరస్పరం చర్చించుకుని సమస్యల పరిష్కారానికి పూనుకుంటే రెండు దేశాలూ అత్యున్నత స్థాయికి చేరతాయి. అమెరికా బహిరంగ చీవాట్ల తర్వాతనైనా ఆ సంగతిని పాకిస్తాన్ గ్రహించవలసి ఉంది.



శాంతి, స్వేచ్ఛ, న్యాయాలు భద్రతకు, సుస్థిరతకు మూల స్తంభాలు, ప్రపంచం నుంచి అణచివేతను, తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని పారదోలేవి కూడా అవే.

– నజీబ్ మికాతి
లెబనాన్ మాజీ ప్రధాని

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి బ.పాడ్యమి ఉ.6.40 వరకు, తదుపరి విదియ తె.4.29 వరకు (తెల్లవారితే గురువారం), నక్షత్రం పునర్వసు ఉ.11.55 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం రా.7.24 నుంచి 8.54 వరకు, దుర్ముహూర్తం ప.11.40 నుంచి 12.25 వరకు, అమృతఘడియలు ఉ.9.40 నుంచి 11.10 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.34
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.30	మగ్రీబ్	5.54
జొహార్	12.20	ఇషా	7.11
అసర్	4.18		


ఉచిత విద్యుత్.. ఒకింత ఊరట



దేవులపల్లి అమర్

నక్సలైట్ ఉద్యమం కారణంగా వందలు వేల ఎకరాల భూస్వాములు ఇప్పుడు లేరు. చిన్న కమతాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న మాట నిజమే. అట్లా ఎకరం, రెండెకరాలు ఉన్న రైతులు వ్యవసాయం సొంతంగా చేసుకుంటారు కాబట్టి, ఈ తరహా భూములకు ఎనిమిది వేల రూపాయల సాయం అందించడం వల్ల లబ్ధి జరుగుతుంది. కానీ పదులూ, వందల ఎకరాల భూములు ఉండి కౌలుకు ఇచ్చుకుని వేరే వ్యాపారాలు, వృత్తులు చేసుకునే వాళ్లు కూడా చాలామంది ఉంటారు. ఈ సాయం వాళ్లకు కాకుండా కౌలు చేసే వాళ్లకు కదా వెళ్లాల్సింది!

డేట్‌లైన్ హైదరాబాద్



కరెంట్ బిల్లులు కట్టనందుకు బావి దగ్గర నుంచి ఫ్యూజులు పీక్కొచ్చి ఎంఆర్ఓ కార్యాలయంలోనో, ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాల్లోనో పెట్టేసుకోవడం చూశాం. నీరందక కళ్ల ముందే ఎండిపోతున్న చేనును చూసి దిక్కుతోచకుండా మిగిలిన రైతు పరిస్థితి చూశాం. అలాంటి రైతు 'ఊరన్నా ఇడిచిపెట్టి పోవాలె, ఉసురన్నా తీసుకోవాలె.' బోరు బావుల మీద ఆధారపడి వ్యవసాయం చేసిన తెలంగాణ రైతుల దైన్యం ఎలా ఉండేదో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, చంద్రబాబునాయుడి ప్రభుత్వ హయాంలో చూశాం. అప్పుడే, 'నేను అధికారంలోకి వచ్చాక ఉచిత కరెంట్ ఇస్తాను, కరెంట్ బిల్లుల బకాయిలు రద్దు చేస్తాను' అని అప్పటి ప్రతిపక్షనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. దీనికి చంద్రబాబు స్పందన ఏమిటో కూడా మన విన్నాం.'ఆ కరెంట్ తీగల మీద బట్టలు ఆరేసుకోవాల్సిందే!' అని ఎద్దేవా చేసిన చంద్రబాబునాయుడు తరువాత డాక్టర్ వైఎస్ తను ఇచ్చిన హామీని నెరవేర్చడం స్వయంగా చూశారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే సర్కార్ కార్యాలయాల్లో బందీలుగా ఉన్న ఫ్యూజులను పైసా అపరాధ రుసుం కట్టించుకోకుండానే రైతులకు ఎట్లా తిరిగి ఇచ్చిందీ కూడా చంద్రబాబు వీక్షించారు. హామీ మేరకు ఉచిత కరెంట్ ఎట్లా ఇచ్చిందీ, కరెంట్ బిల్లుల బకాయిలు ఎట్లా మాఫీ చేసిందీ కూడా ఆయన గమనించారు. అప్పటికి దేశంలో ఇంకా విద్యుత్ సంస్కరణలు ఊపందుకోలేదు. ఈ చర్య వల్ల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థికభారం మోయవలసి వచ్చింది. అయినా రాజశేఖరరెడ్డి వెనక్కు తగ్గలేదు. ఫతేమైదాన్‌లో ప్రమాణ స్వీకారం చేశాక ఆయన మొదటి సంతకం ఉచిత విద్యుత్ సరఫరా ఫైల్ మీదనే చేశారు. ఆయన జీవించినంత కాలం అదే విధానం అమలు పరిచారు.

రాజశేఖరరెడ్డి నిర్ణయం తెలుగు ప్రాంత రైతులకు గొప్ప ఊరట. ఉమ్మడి రాష్ట్రంలో నాటి తెలంగాణ రైతులకు మరీ పెద్ద ఊరట. తెలంగాణలో అత్యధికంగా, ఇరవై అయిదు లక్షల బోరు బావులు వ్యవసాయం కోసం ఉపయోగిస్తున్నారు. కరెంట్ అవసరం ఆనాడు తెలంగాణ రైతులకే ఎక్కువ. ఇప్పటికీ తెలంగాణలో బోరు బావుల మీద ఆధారపడి చేస్తున్న వ్యవసాయం శాతం అధికమే. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరిట తలపెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయితే పరిస్థితి మారుతుంది. బోరు బావుల అవసరం పూర్తిగా తగ్గిపోతుంది. కాలువలు పారుతున్నప్పుడు బోర్ల అవసరం ఉండదు. పైగా భూగర్భ జలాల పరిస్థితి కూడా చాలా మెరుగు పడుతుంది. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో ఏర్పడిన నూతన ప్రభుత్వం నిరంతరాయంగా వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తూనే ఉంది.

రైతులకు మంచిరోజులు

2017 డిసెంబర్ 31 రాత్రి 12 గంటల ఒక్క నిమిషం, అంటే నూతన సంవత్సరం లోకిఅడుగుపెట్టిన క్షణం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 24 గంటల విద్యుత్ సరఫరా మీద అనుకూలంగా, ప్రతికూలంగా జరుగుతున్న చర్చలూ, విమర్శలూ, విశ్లేషణల గురించి తరువాత మాట్లాడుదాం. ఇందులో 40 శాతం విద్యుత్ సరఫరా, వ్యవసాయం కోసం ప్రభుత్వం ఉచితంగా చేస్తుంది. దానికి ప్రభుత్వం భరించాల్సిన మొత్తం సంవత్సరానికి రూ. 600 కోట్లు. ప్రాజెక్టులు పూర్తయి కాలవల్లోకి నీళ్లొస్తే ఈ వ్యయం బాగా తగ్గే అవకాశం ఉంటుంది. అప్పుడు ప్రాజెక్టులకు ఎత్తిపోతల కోసం వాడే విద్యుత్ భారం ప్రభుత్వానికి తప్పదు. ఏది ఏమైనా తెలంగాణ రైతు వ్యవసాయం మీద ఆశలు పెంచుకునే మంచిరోజులు వచ్చాయని చెప్పాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించి తీరాలి. ఉచితంగా విద్యుత్ వస్తున్నది, అందునా 24 గంటల సరఫరా జరుగుతున్నది కాబట్టి వృథా అయ్యే అవకాశాలను కూడా ప్రభుత్వం గమనించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆటోమేటిక్ స్టార్టర్ల విషయంలో ప్రభుత్వం ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. వాటిని తొలగింప చెయ్యడానికి పై స్థాయి నుంచి కింది దాకా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పని చేయవలసి ఉంటుంది.

ఇక తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య మీద వస్తున్న విమర్శల గురించి ఆలోచిస్తే– 2003 ప్రాంతాల్లో ప్రారంభమైన విద్యుత్ సంస్కరణలు తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ఒకటి, రెండు ప్రభుత్వాల హయాంలలో (పదేళ్లలో) ఊపందుకుని విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్టులు పూర్తయి అనేక రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ లభ్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలోని జేఏసీ అంచనా. ఇందుకు ఆధారంగా జేఏసీ నాయకులు 2017 –2018 కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) వార్షిక నివేదికలో రూపొందించిన వివరాలను చూపుతున్నారు. అయితే దేశమంతటా ఇబ్బడి ముబ్బడిగా కరెంట్ ఉత్పత్తి అయి మిగులు పరిస్థితిలోకి వెళితే ఆ వెసులుబాటును తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చెయ్యడానికి వాడుకుంటే తప్పు పట్టాల్సిన అవసరం లేదు. జేఏసీ చెబుతున్నది కాబట్టి పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావించడం కూడా సరికాదు.

24 గంటల విద్యుత్ సరఫరా

వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా వల్ల పడనున్న భారం ఏటా రూ.600 కోట్లని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నా అందుకోసం విద్యుత్ సంస్థల మీద పది వేల కోట్ల రూపాయల మేర భారం పడనుందనీ, అందులో రూ. 5,500 కోట్ల భారాన్ని మాత్రమే ప్రభుత్వం భరిస్తానని అంటున్నదని జేఏసీ చెబుతున్నది. ప్రభుత్వ వర్గాలు చెబుతున్న దానికీ, జేఏసీ చూపుతున్న లెక్కలకూ చాలా వ్యత్యాసం ఉంది. ఎంతైనా ప్రజల డబ్బే కాబట్టి ప్రభుత్వం దీనికి సరైన వివరణ ఇస్తే బాగుంటుంది. అంతిమంగా విద్యుత్ సంస్థలు నష్టాల్లో కూరుకుపోకుండా చూడాల్సిన బాధ్యతా ప్రభుత్వానిదే. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ 24 గంటల విద్యుత్ సరఫరా ఫలితాలు రెండు రోజుల్లోనే తెలియవు. కొంతకాలం పరిశీలించాల్సిందే.

ఎకరాకు ఎనిమిదివేలు

రైతులకు లాభం చేకూర్చే మరో కార్యక్రమం– ఎకరాకు ఏటా ఎనిమిది వేల రూపాయలు.రెండు విడతలుగా రైతులకు చెల్లించే ఈ మొత్తం ముఖ్యమంత్రి చెబుతున్నట్టుగా మొత్తం అవసరాలు తీర్చలేకపోయినా కూడా రైతుకు ఊరటే. కానీ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేశారు– కౌలు రైతులకు ఈ పథకం వర్తింపచేసే ప్రసక్తే లేదని. తెలంగాణలో ఎంతమంది రైతులు సొంతంగా వ్యవసాయం చేస్తున్నారు, ఎంత భూమి కౌలుదారుల చేతుల్లో ఉంది అనే లెక్కలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయా? ఆ లెక్కలు తేల్చి ఈ పథకం అమలు చేస్తే ప్రజాధనం వృథా కాకుండా ఉంటుంది. పైగా పేద, ధనిక భేదం లేకుండా అందరికీ ఎకరానికి ఎనిమిది వేలు ఇస్తామనడం సరయినది కాదు.

తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం కారణంగా వందలు వేల ఎకరాల భూస్వాములు ఇప్పుడు లేరు. చిన్న కమతాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న మాట నిజమే. అట్లా ఎకరం, రెండెకరాలు ఉన్న రైతులు వ్యవసాయం సొంతంగా చేసుకుంటారు కాబట్టి, ఈ తరహా భూములకు ఎనిమిది వేల రూపాయల సాయం అందించడం వల్ల తప్పక కొంత లబ్ధి జరుగుతుంది. కానీ ఇంకా తక్కువ సంఖ్యలోనే అయినా పదులూ, వందల ఎకరాల భూములు ఉండి కౌలుకు ఇచ్చుకుని వేరే వ్యాపారాలు, వృత్తులు చేసుకునే వాళ్లు కూడా చాలా మంది ఉంటారు. ఈ సాయం వాళ్లకు కాకుండా కౌలు చేసే వాళ్లకు కదా వెళ్లాల్సింది! తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, ఎకరానికి ఏటా 8 వేల రూపాయల ఆర్థికసాయం మంచి ఆలోచనే అయినా రైతులను వేధిస్తున్న ఇతర సమస్యల మీద మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఎంతో ఆర్భాటంగా ముఖ్యమంత్రి ప్రకటించిన రైతు సమాఖ్యల మీద పెద్ద పెట్టున విమర్శలు రావడంతో మళ్లీ వాటి ఊసే ఎత్తడంలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నడుస్తున్న జన్మభూమి కమిటీల లాగా కాకుండా రైతు సంక్షేమానికి పాటు పడే, న్యాయం జరిగేటట్టు చూసే ఒక ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయవలసిన అవసరం అయితే ఉంది. పంటకు గిట్టుబాటు ధర రాక, నాణ్యమైన విత్తనాలు లభించక, పంటల బీమా లేక ఊపిరి సలపక రైతుల ఉసురు తీస్తున్న ఉదంతాలు అనేకం. పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఆగలేదన్న సంగతి వాస్తవం. ముప్పిరిగొంటున్న ఈ సమస్యలన్నిటికీ తగిన పరిష్కారం చూపకుండా కేవలం 24 గంటలు విద్యుత్ సరఫరా చేసి, ఏడాదికి ఎనిమిది వేలు ఇచ్చినంత మాత్రాన రైతు పరిస్థితి బాగుపడదు. మిగిలిన రైతు సమస్యల పరిష్కారమూ ముఖ్యమేనని చెప్పడం అందుకే.

గడువు కంటే ముందుగానే వస్తాయంటున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలంటే తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత చంద్ర శేఖరరావు ఈ సమస్యలతో పాటు తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేసిన ముఖ్యమైన వాగ్దానాలు నెరవేర్చే ప్రయత్నం చేస్తేనే సాధ్యం. అంతేతప్ప చంద్రబాబునాయుడి మార్గంలో రాజకీయ పేకాటలో జోకర్ వంటి పవన్‌కల్యాణ్ లాంటి వాళ్ల సాయపడతారనుకుంటే పొరపాటు. తెలంగాణ రాష్ట్రంలో పేకాట క్లబ్‌లను మూయించి ఎన్నో కుటుంబాలను కాపాడిన ముఖ్యమంత్రికి బహుశా ఆ ఆట రాదేమో. పేకాటలో జోకర్‌లు ఎన్ని ఉన్నా ఒరిజినల్ సీక్వెన్స్ ఒకటి తప్పనిసరి. లేకపోతే ఆటలో ఓటమే.

datelinehyderabad@gmail.com

రైతుకు ఆదాయ భద్రత ఏది?

ఉత్పత్తి వ్యయంపై 50% కనీస మద్దతు ధరలను చెల్లిస్తేనే రైతుకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. అదే చేస్తే రుణమాఫీలు, రాయితీల కోసం రైతు రోడ్డెక్కాల్సిన దుస్థితి రాదు.

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

దేశ వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభానికి పరిష్కారాలను సూచించడం కోసం ఏర్పడిన ఎంఎస్ స్వామినాథన్ కమిటీ 2006లోనే నివేదికను సమర్పించింది. కమిటీని నియమించిన యూపీఏ ప్రభుత్వమే దాన్ని అటకెక్కించింది. రైతులకు ఇచ్చే కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీ) ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి మదింపు చేయాలన్నదే కమిటీ సిఫార్సులలో ప్రధానమైనది. ఆ కమిటీనే కాదు వివిధ సందర్భాలలో నియమించిన ఇతర కమిటీలు సైతం సూచిస్తున్నది అదే. ఆహార భద్రతకు మూలం రైతు ఆదాయ భద్రతే. దాని సాధనకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలే ఏకైక మార్గం. ఆ సిఫారసుల మేరకు ఎంఎస్‌పీ ఇవ్వాలని డిమాండ్ చేసిన బీజేపీనే మూడున్నరేళ్లుగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్నా ఆ ప్రస్తావనే తేవడం లేదు. ఈ నేపథ్యంలోంచి చూస్తే, 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటున్న ప్రధాని మాటలు సైతం మరొక శుష్క నినాదంగానే మిగిలిపోనున్నదా? అనిపిస్తోంది.

వ్యవసాయ ఉత్పత్తుల ఎంఎస్‌పీలను గణనీయంగా పెంచడం వల్ల వినియోగదారునిపై భారం పెరుగుతుందని, ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని కేంద్రం కుంటి సాకులు చెబుతోంది. అలా అని సుప్రీం కోర్టుకు సైతం చెప్పింది. దేశ జనాభాలో సగం మందికి పైగా వ్యవసాయరంగంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి ఉన్న మన దేశంలో... గిట్టుబాటయ్యే రీతిలో ఎంఎస్‌పీలను ఇవ్వకపోతే వారిలో ఎక్కువ మంది పస్తులుండాల్సి వస్తోందనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించడం లేదు. తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాలు రైతుల్ని ఆదుకోవడం కోసం రుణమాఫీ పథకాలు ప్రకటిస్తున్నాయి. అనేక సందర్భాలలో ఇచ్చిన హామీ మేరకు రుణ మాఫీ జరగడం లేదు కూడా. ఏదిఏమైనా రైతుల కష్ట, నష్టాలకు శాశ్వత పరిష్కారం రుణ మాఫీ కాదని క్షేత్రస్థాయి వాస్తవాలు వెల్లడిస్తున్నాయి.



ధరల నిర్ణాయక సంఘం (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా ప్రధానమైన 22 పంటలకు... వాటి ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం ఏటా ఎంఎస్‌పీలను ప్రకటిస్తోంది. ఇటీవలి కాలంలో ఎంఎస్‌పీలను నిర్ణయించే విధానం ఓ ప్రహసనంగా మారిపోవడంతో కేంద్రం ప్రకటించే ధరలు వాస్తవికతను ప్రతిబింబించడం లేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్‌పీలపై కేంద్రానికి చేసిన సిఫార్సులు చాలావరకు రైతాంగానికి అనుకూలమైనవి. కేంద్రం వాటిని పట్టించుకోలేదు. ఉదాహరణకు, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేరుశనగకు క్వింటాల్ రూ. 7,427ల ఎంఎస్‌పీ ఇవ్వాలని కోరగా, కేంద్రం రూ. 4,450లనే ఎంఎస్‌పీగా ప్రకటించింది. ధాన్యం, పత్తి, కంది వంటి పంటలకు కూడా రాష్ట్రం కోరిన ధరలలో 60% మాత్రమే ప్రకటించింది. వరికి రాష్ట్రం రూ. 2,799 కోరగా కేంద్రం ఇచ్చినది రూ. 1,550 మాత్రమే. ప్రతి ఏటా ఇదే పరిస్థితి. రాష్ట్ర సిఫార్సులకు, కేంద్ర ఎంఎస్‌పీలకు మధ్య పొంతన లేనప్పుడు ఆ వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు భరించకూడదు? గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఆ పని చేస్తున్నాయి. కూడా. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు ఎంఎస్‌పీలపై బోనస్‌ను చెల్లిస్తున్నాయి. కానీ, కేంద్ర ఎంఎస్‌పీల అమలు వరకే మా బాధ్యత అన్నట్టే చాలా రాష్ట్ర ప్రభు త్వాలు వ్యవహరిస్తున్నాయి. రైతులు నష్టాలను భరిస్తూ దేశ ఆహారభద్రత కోసం ఇలా ఎన్నాళ్లిలా శ్రమించాలి?

ఈ విధానాలతో 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడం సాధ్యమేనా? అది సాధ్యం కావాలంటే మన వ్యవసాయ వార్షిక వృద్ధి రేటు కనీసం 14% శాతంగా ఉండాలి. మూడేళ్ల ఎన్డీఏ పాలనలో వ్యవసాయ జీడీపీ సగటు వార్షిక వృద్ధి రేటు 1.6% మాత్రమే! పైగా ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకొనేందుకు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి 67% మంది రైతులకు తెలియదని తేలింది. ఫసల్ బీమా యోజన రైతుల కోసం గాక, ప్రైవేటు బీమా సంస్థలను పోషించడానికే పెట్టినట్టుగా ఉందన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. ఇక పోతే, భూసార పరిరక్షణ కార్డుల పథకం అమలు అయోమయంగా ఉంది. మట్టి నమూనాలను నిల్వ చేసే సౌకర్యాలు లేక అవి పాడై పోవడం, తారుమారు కావడం సర్వ సాధారణంగా మారింది. వివాదాస్పద గోవధ నిషేధం ఫలితంగా పశువుల విక్రయం ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా పడిపోయిందని, వట్టి పోయిన పశువులను పోషించడం భారంగా మారిందని రైతులు వాపోతున్నారు. భూసారం తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం, ఉప్పునీరుగా మారడం వంటి సమస్యలకు తోడు కరువులు, తుఫాన్లు, అకాల వర్షాలు రివాజుగా మారాయి. ఇక, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, మార్కెట్ యార్డుల్లో దళారుల చేతివాటం లాంటి అనేక స్థానిక సంస్థాగత సమస్యల గురించి చెప్పనవసరం లేదు.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్యనే మన రైతాంగం... 50 ఏళ్ల క్రితం 40 కోట్ల జనాభా ఆహార అవసరాలను తీర్చిన భూవిస్తీర్ణంలోనే 130 కోట్ల ప్రజల ఆకలిని తీర్చగలుగుతోంది. ఇది గుర్తించి ఇప్పటికైనా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయంపై 50% ఎంఎస్‌పీలను చెల్లిస్తేనే రైతుకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. అదే చేస్తే రుణ మాఫీలు, రాయితీల కోసం రైతు రోడ్డెక్కాల్సిన దుస్థితి రాదు. రైతు కష్టం వల్లనే దేశ ప్రజల ఆకలి తీరుతున్నదనే స్పృహ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కలిగిననాడే వ్యవసాయ రంగం కళకళలాడుతుంది.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు । 99890 24579

విద్యావ్యాపారంలో మాతృభాష స్థానం?

చాలా కాలం తరువాత ప్రాంతీయ భాషలలోనే సైన్సును బోధించాలన్న ఒక ప్రయోజనకరమైన ప్రకటన వెలువడటం, అదీ ప్రధాన మంత్రి నోటి నుండి వెలువడటం దేశంలోని మేధావులకు మాతృభాషాభిమానులకు నిస్సందేహంగా ఎంతో ఆనందాన్నిచ్చే మాట. ప్రస్తుతం దేశంలో అన్ని ప్రాంతీయ భాషలు చాలా అవమానకరమైన నిరాదరణ స్థితిలో ఉన్నాయి. మాతృభాషాభిమానులు మరీ దిగజారిపోయి మాతృభాషను కనీసం ఒక సబ్జెక్టుగానైనా బోధనలో ఉండేలా చేయమని సమాజాన్ని, ప్రభుత్వాలను అభ్యర్థించే స్థితిలో ఉన్న కాలం కూడా ఇదే. చివరికి అన్ని విద్యాసంస్థలు తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించవలసినదేనని నాయకులు ప్రకటిస్తే దానికి కూడా తెగ ఆనందపడిపోయే మాతృభాషాభిమానాన్ని చూస్తున్న కాలం కూడా ఇదే.

మన తెలుగు రాష్ట్రాలలో కొందరు ఒక మాతృభాషగా తెలుగు గొప్పతనాన్ని తెలియచెప్పే క్రమంలో కాకుండా కవితా పఠనాలతోటి, పద్యగానాలతోటి, సన్మానాలతోటి కాలక్షేపం చేయడం మనం చూస్తున్నాం. ఇప్పుడు కూడా ప్రధాని ప్రకటనను అందులోని గాఢతను అర్థం చేసుకోవడం విషయంలో పక్కదారి పట్టకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. పైగా, ప్రధాని ప్రకటనలో కేజీ నుండి పీజీ వరకు ప్రాంతీయభాషలలోనే సైన్సును బోధించాలని లేదు కానీ, అంతటి గాఢత ఈ సమస్యలో ఉంది. చైనా, జపాన్ వంటి అనేక దేశాలు మాతృభాషలకు పట్టంకట్టాయి కాబట్టే అంతగా అభివృద్ధి చెందాయన్న సంగతి అందరికీ తెలిసినదే. మన ఇంజనీర్లు వేరే దేశం వెళ్లాలంటే మొదట ఆ దేశ మాతృభాషను నేర్చుకోవలసినదే.

సాధారణంగా అన్నిచోట్లా జరుగుతున్నదేమంటే అమ్మాయో అబ్బాయో పుట్టిన వెంటనే కుటుంబ సభ్యులు మాట్లాడే భాషని నేర్చుకుంటూ ఉండగా మూడేళ్లు నిండాయని వాళ్లని కాన్వెంట్లలో చేర్పించేస్తున్నారు. అక్కడ వెంటనే ఆంగ్ల భాషా బోధన మొదలైపోతుంది. ఈ విధానంవల్ల పిల్లలు శిశుప్రాయంలోనే తీవ్రమైన గందరగోళానికి లోనౌతున్నారు. వాళ్లకు నేర్పించే లిపితో సహా అంతా హఠాత్తుగా కొత్తగా మారిపోతుంది. నిజానికి మూడేళ్లు ఇంటివద్ద ఏభాషను నేర్చుకున్నారో ఆ భాషలో రాయడం నేర్చుకోవలసిన సరైన సమయం అది. ఆదిలోనే హంసపాదు అన్నట్టు చిన్నారుల విజ్ఞానాభివృద్ధికి పరభాష మొదట్లోనే అడ్డంగా నిలుస్తోంది.

మన గ్రామీణ ప్రాంత చిన్నారులైతే తమ బాల్యాన్ని 10వ తరగతి వరకు ఇంగ్లిష్‌ను అర్థం చేసుకోవడానికే పణంగా పెడుతున్నారు. ఫలితాలు మాత్రం పూర్తిగా శూన్యం. అందుకే పరభాషలో విజ్ఞాన బోధన చేయడం అసంభవం, అనర్థకం అని మన జాతిపిత గాంధీజీ అప్పుడు నొక్కి వక్కాణించినా, సైన్సును ప్రాంతీయ భాషలోనే బోధించాలి. అప్పుడే యువతకు ప్రయోగాలపై ఆసక్తి పెరుగుతుంది అని ఇప్పుడు మోదీ ప్రకటించినా, అంతా మన దేశాభివృద్ధికోసమేనని గమనించాలి. విద్యను వ్యాపార వస్తువుగా చూడటం మానేవరకూ, మనదేశంలో మాతృభాషల్లో విద్యా బోధన మేధావుల కలగానే మిగిలిపోతుంది.

(సైన్స్ ప్రాంతీయ భాషలోనే! అన్న ప్రధాని మోదీ ప్రకటనకు స్పందిస్తూ...)

– అద్దంకి బుద్ధచంద్రదేవ్, కరస్పాండెంట్, ప్రియదర్శినీ బాలవిహార్, కొత్తపేట, తూ.గో.జిల్లా.

డమరుకం



ఈనాటి నాట్య కార్యక్రమాలలో, సంగీత సభలలో కనిపించదు గానీ డమరు అనేది అతి ప్రాచీనమైన వాద్య విశేషాలలో ఒకటి. చిన్న బాలుడిని, బాల'కు'డు అన్నట్టు, చిన్న డమరును డమరు'కం' అంటాం. నిజానికి డమరుకూ, డమరుకానికీ అర్థంలో తేడా లేదు. అనాదిగా శివుడు తన తాండవ నృత్యంలో వాడుతూ వస్తున్న వాద్యంగా డమరుకం సుప్రసిద్ధం. శివుడిని నటరాజ రూపంలో చూపే విగ్రహాలలో, ఆయన ఒక చేత డమరుకం పట్టుకొని ఉండటం చూడవచ్చు.

కాపాలిక మార్గం అనుసరించే తాంత్రిక యోగులూ, భక్తి గీతాలు పాడుతూ దేశ సంచారం చేసే శైవ మత సాధువులూ డమరును తమ శివారాధన సామగ్రిలో భాగంగా ఉంచుకొంటారు. హైందవ సంప్రదాయంలోనే కాకుండా, బౌద్ధమతంలో కూడా డమరుకు వినియోగం ఉంది.

జ్యోతిర్మయం

డమరుకం 8 అంకెలా, ఇసుక గడియారంలా ఉంటుంది. ఒక గరాటును బోర్లించి, దాని తోక కోసేసి, దానిమీద తోక లేని మరొక గరాటును నిలువుగా నిలిపినట్టు. అయిదారంగుళాల చిన్న వాయిద్యం కనుక చేతిలో పట్టుకొనేందుకు అనువుగా ఉంటుంది. డమరుకం మధ్యలో దాని నడుముకు కుచ్చుతాళ్లు కడతారు. ఆ తాళ్ల చివర ముత్యాలుంటాయి. డమరుకం రెండు చివరలనూ, మద్దెలకు లాగా, తోలు ముక్కలు గట్టిగా బిగించి కట్టి మూసివేస్తారు. డమరుకాన్ని చేతిలో పట్టుకొని, నేర్పుగా మణికట్టు తిప్పుతూ వడివడిగా కదిలిస్తే ఆ చిన్ని మువ్వలు డమరుకం రెండు పక్కలా ఉన్న తోలు పట్టీలకు తగిలి లయబద్ధంగా మోత చేస్తాయి.

శివతాండవ స్తోత్రంలో వర్ణించినట్టు, ధిమి ధ్ధిమి ధ్ధిమి ధ్ధిమి ధ్వనులతో శివుడు తన్మయుడై తాండవం చేస్తుంటే, డమా, డమా, డమా నినాదాలు చేస్తూ ఆయన చేతిలో ఉన్న డమరు సహకరిస్తుంది. డమరుకాలను తమ్మ చెక్కతో చేస్తారు. లోహాలతోనూ చేస్తారు. శివ తాండవ సమయంలో వెలువడే డమరుక ధ్వని తరంగాల ప్రకంపనల వల్లనే చరాచర జగత్తూ జనిస్తుందీ, లయిస్తుందీ అని విశ్వసించే పౌరాణిక సంప్రదాయాలు ఉన్నాయి.

భాషకు మూలాధారం మహేశ్వరుడు తొలుత వినిపించిన డమరు ధ్వనులేనంటారు. భారతీయ వ్యాకరణ శాస్త్రవేత్తలు. మహేశ్వరుడు తాండవం చేస్తూ తన డమరుకాన్ని పద్నాలుగుసార్లు కొట్టాడట. పద్నాలుగు శబ్దాలు వెలువడ్డాయి. ఆ ఇ ఉణ్, ఋక్ అంటూ ఆరంభమై కపయ్, శషసర్, హల్ అంటూ ముగిసే ఈ పద్నాలుగు శబ్దాలూ వర్ణ సమామ్నాయాన్ని ఆవిష్కరించే 14 వ్యాకరణ సూత్రాలుగా నిలిచిపోయాయి. వీటిని 'మహేశ్వర సూత్రాలు' అంటారు. వీటితో ఆరంభించి 3,959 చిన్న చిన్న సూత్రాలతో, 'అష్టాధ్యాయి' పేరుతో సంస్కృత వ్యాకరణం రచించి, మహా మేధావిగా చరిత్రలో నిలిచిపోయాడు పాణిని మహర్షి.

– ఎం. మారుతి శాస్త్రి

హెచ్-1బీపై మరో బాంబ్!

గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసినా వీసా గడువు పొడిగించరు ◆ దాదాపు 7.5 లక్షల మంది భారతీయులపై ప్రభావం



వాషింగ్టన్: అమెరికాలో విదేశీయులు ఉద్యోగాలు చేయడానికి ఉపకరించే హెచ్-1బీ వీసా విధానంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తీసుకొస్తున్న ఓ ప్రతిపాదన మరింత ఆందోళన కలిగిస్తోంది. 'అమెరికా వస్తువులనే కొనండి. అమెరికా జాతీయులనే ఉద్యోగాల్లో నియమించుకోండి' అన్న ట్రంప్ నినాదానికి అనుగుణంగా ఆ దేశ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం హెచ్-1బీ వీసాల విధానంలో ఈ కొత్త సవరణను ప్రతిపాదిస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం హెచ్-1బీ వీసా ఉన్న వారు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న సందర్భాల్లో...ఒకవేళ గ్రీన్ కార్డు అప్లికేషన్ పరిశీలనలో ఉండగానే హెచ్-1బీ వీసా గడువు ముగిసిపోతే అప్పుడు గ్రీన్ కార్డుపై నిర్ణయం వెలువడే వరకు వీసా గడువును పొడిగిస్తారు. ఇకపై ఈ విధానాన్ని కొనసాగించకూడదనీ, హెచ్-1బీ వీసా కలిగిన వారు గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ...గ్రీన్‌కార్డు మంజూరవడానికి ముందే వీసా గడువు పూర్తయితే అలాంటి వారిని స్వదేశాలకు పంపించేయాలని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదించింది. భారత ఐటీ కంపెనీలు ఏటా అధిక సంఖ్యలో హెచ్-1బీ వీసాలను సంపాదించి అమెరికాలో తమ కార్యకలాపాల కోసం ఇక్కడి నుంచే ఉద్యోగులను తరలిస్తుండటం తెలిసిందే. తాజా నిర్ణయం అమల్లోకి వస్తే అమెరికాలో పనిచేస్తున్న 5 లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది భారతీయులపై ప్రభావం పడే అవకాశం ఉంది. వారంతా గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నా, వీసా గడువు ముగిసేలోపు అది మంజూరవ్వకపోతే మన దేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. ఇప్పటికే హెచ్-1బీ వీసాల జారీ, కొనసాగింపు నిబంధనలను ట్రంప్ యంత్రాంగం ఒక్కొక్కటిగా కఠినం చేస్తుండటం తెలిసిందే.

ఎందుకీ ప్రతిపాదన?

ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే గ్రీన్‌కార్డుకు దరఖాస్తు పెండింగ్‌లో ఉండగానే వీసా గడువు ముగిసిన విదేశీ ఉద్యోగులు అమెరికా విడిచి స్వదేశాలకు వెళ్లిపోవాల్సి ఉంటుంది. అలాంటి వారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. వారందరి ఉద్యోగాలూ ఖాళీ అవుతాయి కాబట్టి ఆ కొలువులు అమెరికా జాతీయులకే దక్కుతాయనేది ట్రంప్ ఆలోచనగా తెలుస్తోంది. విదేశీయులు 'కొల్లగొడుతున్న' ఉద్యోగాలను మళ్లీ అమెరికన్లకే ఇప్పిస్తానంటూ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన ట్రంప్...ఆ మాటను నిలబెట్టుకునేందుకే మొదటి నుంచి హెచ్-1బీ వీసాలపై కఠిన వైఖరిని అవలంబిస్తున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు.

చెమట చిందించే రోబో

టోక్యో: పుష్ అప్స్, పుల్ అప్స్ వంటి కఠిన వ్యాయామాలతో పాటు స్వేదాన్ని చిందించే సరికొత్త హ్యూమనాయిడ్ రోబోను జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టోక్యోకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి 'కెంగోరో'గా శాస్త్రవేత్తలు నామకరణం చేశారు.



కృత్రిమ స్వేద వ్యవస్థతో పాటు మానవ కండరాలను పోలిన అస్థిపంజరాన్ని రోబోలో అమర్చారు. క్రీడాకారుల కండరాల పనితీరును విశ్లేషించేందుకుగాను దీనిని రూపొందించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కృత్రిమ స్వేద వ్యవస్థలో తాము కీలకమైన ముందడుగు వేశామని, దీని ద్వారా రోబోలోని అధిక వేడిని తగ్గించవచ్చని వెల్లడించారు. 2001 నుంచి ఈ బృందం రోబోలపై పరిశోధనలు జరుపుతోందని సైన్స్ రోబోటిక్స్ అనే జర్నల్ ప్రచురించింది.

భారత్ లక్ష్యంగా చైనా కొత్త క్షిపణి!

బీజింగ్: చైనా తయారు చేసిన కొత్త బాలిస్టిక్ క్షిపణులు అమెరికా భద్రతా వ్యవస్థకు సవాల్ విసరడమే కాకుండా భారత్, జపాన్‌లోని మిలిటరీ క్యాంపులను లక్ష్యంగా చేసుకోగలవని తెలుస్తోంది. గతేడాది చివర్లో 'హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జీవీ)'లేదా డీఎఫ్-17 అనే క్షిపణిని చైనా పరీక్షించిందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ అనే పత్రిక ఓ కథనంలో పేర్కొంది. చైనా ఆర్మీకి చెందిన రాకెట్ బలగాలు నవంబర్ 1న ఓ పరీక్ష, రెండు వారాల తర్వాత రెండో పరీక్ష నిర్వహించాయని వెల్లడించింది. 'అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం రెండు పరీక్షలు విజయవంతమయ్యాయి'అని ప్రచురించింది. కాగా, ఈ పరీక్షలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధిని వివరణ అడగగా ఆ వార్తలను ఖండించారు.

డిప్యూటీ ఎన్‌ఎస్‌ఏగా రాజిందర్ ఖన్నా



న్యూఢిల్లీ: నిఘా ఏజెన్సీ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ 'రా' మాజీ చీఫ్ రాజిందర్ ఖన్నా డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. గతేడాది ఆగస్టులో అరవింద్ గుప్తా పదవీకాలం ముగిసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంటోంది. 1978 బ్యాచ్‌కు చెందిన ఖన్నాకు పాకిస్తాన్ వ్యవహారాలు, ఇస్లాం ఉగ్రవాదంపై పూర్తి అవగాహన ఉంది. కాంట్రాక్ట్ పద్ధతిన ఖన్నా నియామకానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని నియామకాల కమిటీ పచ్చజెండా ఊపినట్లు సిబ్బంది వ్యవహారాల శాఖ పేర్కొంది.

ఏ రైలుకైనా 22 బోగీలే!

న్యూఢిల్లీ: రైలు బోగీల సంఖ్యలో ఏకరూపత తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అవసరమైనప్పుడు ఏ మార్గంలోనైనా ప్రయాణించడానికి వీలుగా అన్ని రైళ్లలో 22 బోగీలు అమర్చాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్లాట్‌ఫాంల పొడవు, ఇతర మౌలిక వసతుల్లో మార్పులు చేర్పులు చేస్తామని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ మంగళవారం చెప్పారు. ప్రస్తుతం రైలు నడిచే మార్గం, డిమాండ్ ఆధారంగా ఒక్కో బండిలో 12, 16, 18, 22, 26 చొప్పున బోగీలను అమర్చుతున్నారు. దీని వల్ల ఒక రైలు స్థానంలో మరో రైలును నడపడం సాధ్యం కావట్లేదు. ఏదైనా రైలు ఆలస్యమైనట్లయితే అందుబాటులో ఉన్న బండిని దాని స్థానంలో పంపేందుకు తాజా ప్రతిపాదన ఉపకరిస్తుందని రైల్వే అధికారులు అభిప్రాయపడుతున్నారు. తొలి దశలో ఈ మార్పులు చేయడానికి 300 రైళ్లను గుర్తించారు.

వెంట్రుకల వ్యాపారి @ 65 కోట్ల అక్రమాదాయం


బెంగళూరు: మానవ వెంట్రుకల వ్యాపారం చేస్తూ రాబడిని తక్కువగా చూపించి పన్ను ఎగ్గొడుతున్న ఓ వ్యాపారి గుట్టును ఆదాయపు పన్ను విభాగం అధికారులు రట్టు చేశారు. ఉత్తర కర్ణాటకకు చెందిన ఓ వ్యాపారి మనుషుల వెంట్రుకలను సేకరించి ఆఫ్రికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు సంపాదిస్తున్నాడు. ఆలయాల్లో భక్తులు సమర్పించే తలనీలాలు, బ్యూటీపార్లర్లు తదితర ఇతర మార్గాల్లో వెంట్రుకలను సేకరిస్తున్నాడు. హాస్టళ్లలో ఉండే అమ్మాయిలూ డబ్బుకోసం తమ జుట్టును కత్తిరించి ఇస్తున్నారని తెలుసుకుని అధికారులు విస్తుపోయారు. వ్యాపారి కార్యాలయం, ఇంట్లో సోదాలు నిర్వహించిన అధికారులు రూ.65 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపకుండా పన్ను ఎగ్గొట్టాడని గుర్తించారు.

ద్వైపాక్షిక విశ్వాసానికి దెబ్బ: పాక్

ఇస్లామాబాద్: ఉగ్రవాదంపై పోరులో ఆర్థిక సాయం పొంది మోసం చేసిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ఆరోపణలపై పాకిస్తాన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది. పాకిస్తాన్ ప్రధాని షాహిద్ అబ్బాసీ నేతృత్వంలో మంగళవారం జాతీయ భద్రతా మండలి అత్యవసర సమావేశమైంది. ఈ కార్యక్రమానికి విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్, హోం మంత్రి అశాన్ ఇక్బాల్, రక్షణ మంత్రి ఖుర్రమ్ ఖాన్, త్రివిధ దళాల చీఫ్‌లు హాజరయ్యారు. ట్రంప్ ఆరోపణలు పూర్తి అసంబద్ధంగా, వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆ తరువాత వెలువడిన ప్రకటనలో మండలి పేర్కొంది.

పార్టీల విరాళాల్లో పారదర్శకత

- ఎలక్టోరల్ బాండ్ల విధి విధానాలు ఖరారు
- వేయి, పదివేలు, లక్ష, 10 లక్షలు, కోటి మొత్తాల్లో బాండ్లు



న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకిచ్చే విరాళాల్లో పారదర్శకత కోసం అమల్లోకి తేనున్న ఎలక్టోరల్ బాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ బాండ్ల జారీకి సంబంధించిన విధి విధానాల్ని లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం ప్రకటించారు. విరాళాలిచ్చే దాతలు ఎలక్టోరల్ బాండ్లను ఎస్‌బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచి కొనుగోలు చేయాలని, రాజకీయ పార్టీలు ఆ బాండ్లను ఈసీకి సమర్పించిన బ్యాంకు ఖాతా ద్వారా సొమ్ము చేసుకోవాలని ఆయన వెల్లడించారు. రాజకీయ పార్టీలకిచ్చే నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా తీసుకొస్తున్న ఈ ఎలక్టోరల్ బాండ్లు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో పది రోజుల పాటు ఎంపిక చేసిన ఎస్‌బీఐ శాఖల్లో అందుబాటులో ఉంటాయి. సాధారణ ఎన్నికలున్న సంవత్సరంలో మాత్రం 30 రోజుల పాటూ బాండ్లను విక్రయిస్తారు. కొనుగోలు అనంతరం 15 రోజుల పాటు ఇవి చెల్లుబాటు అవుతాయి. బాండ్లపై విరాళమిచ్చే దాత పేరు ఉండదని, అయితే వాటిని కొనుగోలు చేసే వ్యక్తి లేక కంపెనీ.. బ్యాంకుకు కేవైసీ(నో యువర్ కస్టమర్) వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని జైట్లీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ఖరారు చేసిందని వెల్లడించారు.

కనీసం 1 శాతం ఓట్లు సాధించిన పార్టీలకే

ప్రామిసరీ నోటును పోలిఉండే ఎలక్టోరల్ బాండ్లపై బ్యాంకులు ఎలాంటి వడ్డీ ఇవ్వవు. బాండ్లలో పేర్కొన్న మొత్తాన్ని రాజకీయ పార్టీలకు చెల్లించేవరకు వాటిపై పూర్తి హక్కులు దాతకే చెందుతాయి. అయితే గత సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 1 శాతం ఓట్లు గెలుచుకున్న రాజకీయ పార్టీలకు మాత్రమే ఈ బాండ్ల సొమ్మును చెల్లిస్తారు. అందుకోసం పార్టీలు ఎన్నికల సంఘానికి బ్యాంకు ఖాతాను ఇవ్వాల్సి ఉంటుంది. 'రూ. 1000, రూ. 10 వేలు, రూ. లక్ష, రూ. 10 లక్షలు, రూ. కోటి మొత్తాల్లో బాండ్లను దాతలు కొనుగోలు చేయవచ్చు. భారతీయ పౌరులు, భారత్‌లోని కార్పొరేట్ సంస్థలు ఈ బాండ్లను కొనుగోలు చేసేందుకు అర్హులు. అయితే బాండ్లపై కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ఉండదు. 15 రోజుల్లోగా పార్టీలు వాటిని సొమ్ము చేసుకోవాలి' అని కేంద్ర మంత్రి జైట్లీ లోక్‌సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే సందేహం వ్యక్తం చేస్తూ.. బాండ్లపై విరాళమిచ్చే వ్యక్తి పేరు లేకపోతే ఉపయోగమేంటని ప్రశ్నించగా.. విరాళమిచ్చే వ్యక్తుల ఆస్తి అప్పుల పట్టీలో బాండ్లలో పేర్కొన్న మొత్తాల్ని నమోదు చేస్తారని జైట్లీ సమాధానమిచ్చారు.

గత బడ్జెట్‌లో ఎలక్టోరల్ బాండ్ల ప్రస్తావన

ప్రస్తుతం రాజకీయ పార్టీలకు దాదాపు అన్ని విరాళాలు నగదు రూపంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అందుతున్నవే... ఈ నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరి 1న.. 2017-18 బడ్జెట్ ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల ఆలోచనను జైట్లీ ప్రకటించారు. రాజకీయ పార్టీలకు అందే విరాళాలు మరింత పారదర్శకంగా ఉండేందుకు ఈ విధానం ఉపకరిస్తుందన్నారు. ఆ బడ్జెట్‌లో రూ. 20 వేలకు బదులు నగదు విరాళాలపై రూ. 2 వేల పరిమితి పెట్టడంతో పాటు.. డిజిటల్ విరాళాల్ని స్వీకరించేందుకు పార్టీలకు అనుమతిచ్చారు.

పార్టీలు ఈసీకి రిటర్న్స్ సమర్పించాలి..

'బాండ్లను సమాంతర నగదుగా వినియోగించకుండా ఉండేందుకే 15 రోజుల గడువు విధించాం. గత అనుభవాల దృష్ట్యా బాండ్లపై విరాళమిచ్చే వ్యక్తి పేరును పేర్కొనడం లేదు. వారి పేర్లు బయటికొస్తే.. మళ్లీ నగదు విరాళాల వైపు మొగ్గు చూపే అవకాశముంది. కొత్త విధానంలో ఏ పార్టీకి నగదు ఇస్తున్నారో విరాళమిచ్చే వ్యక్తి తెలుసుకోవచ్చు. ప్రతి రాజకీయ పార్టీ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా తమకు ఎంత నగదు అందిందో తప్పనిసరిగా ఎన్నికల సంఘానికి రిటర్న్స్ సమర్పించాలి. అయితే ఈ విధానంలో ఏ వ్యక్తి ఏ రాజకీయ పార్టీకి విరాళం ఇస్తున్నాడో అన్న విషయం మాత్రం తెలియదు' అని జైట్లీ చెప్పారు.

స్టాండింగ్ కమిటీకి మెడికల్ బిల్లు

- బడ్జెట్ సమావేశాలనాటికే కమిటీ నివేదిక
- సమ్మెను విరమించుకున్న ఐఎంఏ



భువనేశ్వర్‌లో వైద్య విద్యార్థుల నిరసన

న్యూఢిల్లీ: దేశంలోని వైద్య విద్య ప్రక్షాళనతో పాటు భారతీయ వైద్య మండలి(ఎంసీఐ)ని మార్చేందుకు ఉద్దేశించిన వివాదాస్పద నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపారు. బడ్జెట్ సమావేశాలకు ముందు నివేదిక సమర్పించాలని కమిటీని లోక్‌సభ కోరింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనకు దిగడంతో పాటు, మంగళవారం సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. ఈ నేపథ్యంలో బిల్లుపై లోక్‌సభలో మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ ప్రకటన చేస్తూ.. ప్రతిపక్షంతో పాటు అధికార ఎన్డీఏ కూడా బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలని కోరిందని అందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. బడ్జెట్ సమావేశాలకు ముందే నివేదికను సమర్పించాలని కమిటీని కోరాలని స్పీకర్ మహాజన్‌ను మంత్రి కోరారు. తర్వాత స్పీకర్ లోక్‌సభలో ప్రకటన చేస్తూ.. బడ్జెట్ సమావేశాలకు ముందు లోక్‌సభకు నివేదిక సమర్పించాలని స్టాండింగ్ కమిటీని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, స్టాండింగ్ కమిటీ నివేదిక నేపథ్యంలో బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు వైద్య వృత్తికి ఉపయోగకరమని కేంద్రం ప్రకటించింది.

బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఐఎంఏ

ఈ బిల్లును ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అధికారులకు, వైద్య విద్యతో సంబంధంలేని యంత్రాంగానికి తమను జవాబుదారీగా ఉంచడమంటే వైద్య వృత్తిని నిర్వీర్యం చేయడమేనని వారు ఆరోపిస్తున్నారు. మంగళవారాన్ని బ్లాక్ డేగా ప్రకటిస్తూ సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో దేశ వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ఉదయం నుంచి వైద్య సేవలు నిలిచిపోయాయి. సమ్మె నుంచి అత్యవసర సేవలకు మినహాయింపునిచ్చారు. అయితే లోక్‌సభలో బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపడంతో ఐఎంఏ సమ్మెను విరమించుకుంది.

రాజ్యసభ 'ప్రశ్నల' రికార్డు

ప్రశ్నోత్తరాల సమయంలో జాబితాలోని అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా రాజ్యసభ మంగళవారం రికార్డు సృష్టించింది. ప్రశ్నలడిగిన 20 మంది సభ్యుల్లో మంగళవారం 10 మంది గైర్హాజరు కావడంతో ఇది సాధ్యమైంది. ఆ తర్వాత మిగతా సభ్యులు అప్పటికప్పుడు ప్రశ్నలడిగేందుకు సభాధ్యక్షుడు వెంకయ్య అనుమతించారు. జీరో అవర్‌లో గరిష్టంగా18 మంది పలు ప్రజాప్రాముఖ్యం ఉన్న అంశాలపై మాట్లాడారు.

'దివాలా' బిల్లుకు ఓకే

దివాలా చట్టం సవరణ బిల్లుపార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ది ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్(సవరణ) ఆర్డినెన్స్ పేరిట తెచ్చిన ఈ బిల్లు మంగళవారం రాజ్యసభలో గట్టెక్కింది.అవసరాలకు తగినట్లు బిల్లులో మార్పులు చేస్తామని జైట్లీ సభకు హామీ ఇచ్చారు. బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టపరచి రాజకీయాలకు అతీతంగా ఉంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎవరి రుణాలనూ రద్దుచేయలేదన్నారు. అన్ని వస్తువులకు ఒకే జీఎస్టీ రేటు వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. మొత్తం జనాభా దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న దేశాల్లోనే ఏకరేటు పన్ను విధానం అమల్లో ఉందని, భారత్‌లో అది సాధ్యం కాదనిచెప్పారు. యూరియా వాడకాన్ని తగ్గించడానికి ఒక సంచి పరిమాణాన్ని 45 కిలోలకు తగ్గించినట్లు ఎరువుల శాఖ సహాయ మంత్రి లోక్‌సభలో చెప్పారు.

సైకో సైనికుడు


- ఇనుప కడ్డీతో బాది ఆరుగురి హత్య
- హరియాణాలో దారుణం

పాల్వాల్: మతిస్థిమితం కోల్పోయినట్లుగా భావిస్తున్న ఓ మాజీ సైనికుడు హరియాణాలో ఇనుప కడ్డీతో దాడిచేసి ఆరుగురిని హత్యచేశాడు. పాల్వాల్‌లో ఆగ్రా చౌక్-క్యాంప్ కాలనీ మార్గంలో మంగళవారం తెల్లవారుజామున ఈ దారుణానికి ఒడిగట్టాడు. పట్టుకోవడానికి ప్రయత్నించిన ఓ పోలీస్ అధికారిని గాయపరిచాడు. దాడికి పాల్పడిన వ్యక్తిని నరేశ్ ధన్‌ఖాడ్(45)గా గుర్తించి, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. తొలుత ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న వ్యక్తికి తోడుగా ఉన్న మహిళ హత్యతో నరేశ్ వరస దాడులు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రి రెండో అంతస్తులో నిద్రిస్తున్న మహిళను కడ్డీతో కొట్టి చంపాడు. తర్వాత ఆగ్రా రోడ్ క్రాసింగ్‌లో ముగ్గురిని చంపేశాడు. దానికి కొంచెం దూరంలోనే మరో ఇద్దరిని కడ్డీతో బలంగా కొట్టి హత్యచేశాడు. పట్టణమంతా చెక్‌పాయింట్లు ఏర్పాటుచేసి ఎట్టకేలకు నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నరేశ్ మానసిక పరిస్థితి సరిగా లేదని, భార్య, పిల్లలతోనూ గొడవ పడినట్లు పాల్వాల్ జిల్లా ఎస్పీ గజరాజ్ చెప్పారు. అతడిపై హత్యా నేరం కింద కేసు నమోదుచేసి ఫరీదాబాద్‌లోని మానసిక చికిత్సాలయానికి తరలించినట్లు వెల్లడించారు.

నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు

న్యూఢిల్లీ: నేడు రాజ్యసభ ముందుకు రానున్న ట్రిపుల్ తలాక్ (ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ)బిల్లులో సవరణల కోసం ఒత్తిడి చేయొద్దని కాంగ్రెస్‌ను కేంద్రం కోరింది. లోక్‌సభలో సహకరించినట్లుగానే రాజ్యసభలోను బిల్లు ఆమోదానికి సాయపడాలని కాంగ్రెస్‌ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ కోరారు. ఈ బిల్లుపై లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ సవరణలు కోరినా ఒత్తిడి చేయలేదు. బిల్లుపై చర్చ కోసం సమయం కేటాయించాలని మంగళవారం సమావేశమైన రాజ్యసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ నిర్ణయించింది. అయితే బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ కోరినట్లు సమాచారం.

రజనీ పార్టీ చిహ్నంలో మార్పు?



సాక్షి ప్రతినిధి, చెన్నై: సినీ నటుడు రజనీకాంత్ రాజకీయ పార్టీ చిహ్నంగా తామరపువ్వు అందులో బాబా ముద్రతో కూడిన చేయి గుర్తును పెడతారని అందరూ భావిస్తుండగా అకస్మాత్తుగా మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రజనీ రాజకీయ ప్రవేశం వెనుక బీజేపీ హస్తం ఉందని కొందరు ప్రచారం చేస్తుండటంతో తామరపువ్వును తొలగించి బాబా ముద్ర చుట్టూ ఒక పామును చేర్చిన బొమ్మ తాజాగా ప్రచారంలోకి వచ్చింది. అయితే పార్టీ పేరును, చిహ్నాన్ని ఎప్పుడు ప్రకటిస్తారని విలేకరులు రజనీని అడగ్గా ఆ విషయం తనకే తెలీదన్నారు. చారిత్రక తమిళనాడులో రాజకీయ విప్లవం తీసుకురావాలనేది తన ఆశయమనీ, భావి తరాల కోసం చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటం తనదని రజనీ చెప్పారు. 234 నియోజకవర్గాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఇప్పటికే ప్రకటించిన రజనీ... ఒక్కో నియోజకవర్గం నుంచి తొలుత ముగ్గురిని ఎంపిక చేసి వారిలో ఒకరికి టికెట్ కేటాయించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల్లో కనీసం రూ. కోటి ఖర్చు భరించగలిగే వ్యక్తిని అభ్యర్థిగా ఉంచాలని ఆయన భావిస్తున్నారట. రాజకీయ అరంగేట్రానికి సిద్ధమవుతున్న ఇద్దరు ప్రముఖ తమిళ కథానాయకులు రజనీకాంత్, కమల్ హాసన్ ఈ నెల 6న మలేసియాలో భేటీ అయ్యే అవకాశం ఉంది. అక్కడ జరిగే ఓ కార్యక్రమానికి వీరిద్దరూ హాజరుకానున్నారు.

అట్టుడికిన మహారాష్ట్ర



పుణేలో ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయిన వాహనాలు

- రాష్ట్రమంతటా 'భీమా-కోరేగావ్' ప్రకంపనలు
- ముంబైలో రైల్‌రోకో, దుకాణాలు మూసివేత
- నేడు రాష్ట్ర బంద్‌కు దళిత సంస్థల పిలుపు

సాక్షి, ముంబై: భీమా-కోరేగావ్ ఘటనపై నిరసనలు పుణే నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలు మంగళవారం దళితుల ఆందోళనలతో అట్టుడికాయి. ముంబైలో రైళ్లు, బస్సులు నిలిచిపోయాయి. పుణే దగ్గర్లోని భీమా-కోరేగావ్ యుద్ధ స్మారకం వద్ద 200వ విజయోత్సవాల సందర్భంగా సోమవారం హిందూ, దళిత సంస్థల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఇది కాస్తా ముదిరి హింసాత్మకంగా మారింది. ఆందోళన కారులు పదుల సంఖ్యలో వాహనాలను తగులబెట్టి ధ్వంసం చేశారు. ఈ ఘర్షణల్లో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ హింసకు ప్రభుత్వ వైఫల్యమే కారణమంటూ భరిపా బహుజన్ మహాసంఘ్(బీబీఎం) బుధవారం మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ పిలుపునకు మహారాష్ట్ర డెమోక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్ తదితర 250 సంస్థలు మద్దతు తెలిపాయని బీబీఎం నేత ప్రకాశ్ అంబేడ్కర్ చెప్పారు. పుణే ఘర్షణలు మంగళవారం ముంబైకి పాకాయి. ప్రభుత్వమే ఘర్షణలకు కారణమంటూ దళితులు చేపట్టిన ఆందోళనలతో ముంబైలో రైళ్లు ఆగిపోయాయి. వందకుపైగా బస్సులు ధ్వంసమయ్యాయి. చాలాచోట్ల దుకాణాలు మూతబడ్డాయి. ఆందోళనకారులు ముంబైలోని ముఖ్యప్రాంతాల్లో వాణిజ్య, విద్యా సంస్థలు, దుకాణాలను మూసివేయించారు. హార్బర్ లైన్‌లోని గోవండీ, చెంబూర్ రైల్వే స్టేషన్లలో రైళ్లను అడ్డుకున్నారు. ఈ ఘటనలతో పెద్ద సంఖ్యలో భద్రతా బలగాలను మోహరించారు. ఆందోళన కారులు 134 ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారని అధికారులు తెలిపారు. దాదాపు 100 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోరేగావ్ విజయోత్సవాలకు వెళ్లి వస్తున్న ఓ మహిళపై సోమవారం దాడికి పాల్పడ్డారనే ఫిర్యాదుపై హిందూ ఏక్తా అఘాదీ నేత మిలింద్ ఎక్బొటే, శివ్‌రాజ్ ప్రతిష్టాన్ నేత సంభాజీ భిండేలపై పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఈ రెండు సంస్థలు బ్రిటిష్ వాళ్ల గెలుపునకు విజయోత్సవాలేమిటంటూ మొదటినుంచీ వ్యతిరేకిస్తున్నాయి.

హైకోర్టు జడ్జితో విచారణ: ఫడ్నవీస్

ఈ హింసాత్మక ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. ఈ ఘటనలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందజేస్తామని, యువకుడి మృతిపై సీఐడీ దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ ఫాసిస్ట్ విధానాలపై భీమా-కోరేగావ్ ఉత్సవాలు గెలుపునకు ప్రతీకలని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ అన్నారు.

కోరేగావ్ చరిత్ర ఇదీ...

పుణే సమీపంలో భీమా నది ఒడ్డున భీమా-కోరేగావ్ యుద్ధ స్మారకం మహారాష్ట్రలో సంకుల సమరానికి కేంద్ర బిందువుగా మారింది. పీష్వా బాజీరావు-2 సైన్యంతో బ్రిటిష్ సైన్యానికి ఇక్కడే యుద్ధం జరిగింది. ఈ యుద్ధం ముగిసి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉత్సవాలు జరిగాయి. ఇక్కడ జరిగిన ఘర్షణలే పెద్దవయ్యాయి. 1857 తొలి స్వాతంత్ర్య సమరానికి ముందే బాంబే ఆర్మీ (బ్రిటీష్)లో 25 శాతం మహర్‌లు(దళితులు) ఉండేవారు. బ్రిటిష్ మెరైన్ బెటాలియన్‌లో కీలక సైనికులుగా ఉన్నారు. పీష్వాల పాలనలో అంటరానితనం తీవ్రస్థాయిలో అమలవుతున్న రోజులవి. ఆ సమయంలోనే 1818 జనవరి 1న పీష్వా బాజీరావు-2 పెద్ద సైన్యంతో పరిమిత సంఖ్యలో ఉన్న బ్రిటిష్ సైన్యం పోరాడింది. పుణేపై దాడికి వస్తున్న పీష్వా సైన్యాన్ని కెప్టెన్ స్టాంటన్ నేతృత్వంలో 21వ రెజిమెంట్ ఆఫ్ ద బాంబే నేటివ్ ఇన్‌ఫాంట్రీ(మహర్ మెజారిటీ) నిలువరించింది. ఇరవై వేలకు పైబడిన అశ్వికదళం, 8 వేల మంది కాల్బలంతో కేవలం 800మంది సైనికులు (వారిలో 500-600 మంది మహర్లు) ఆహారం, నీరు, ఎలాంటి విశ్రాంతి లేకుండా ఏకధాటిగా 12 గంటల పాటు పోరాడారు. ఈ యుద్ధంలో 21 మంది మహర్ సైనికులు అసువులు బాశారు. మరింత పెద్ద సంఖ్యలో బ్రిటిష్ సైన్యం రావొచ్చునని భావించిన బాజీరావు-2 తన సైన్యాన్ని వెనక్కు రప్పించారు. వీరోచితమైన ఈ సంఘర్షణే మూడో బ్రిటిష్-మరాఠా యుద్ధంలో కీలక పరిణామంగా మారింది. భారత గడ్డపై ఆంగ్లేయులు తమ పట్టును బిగించేందుకు ఇది ఉపయోగపడింది. ఈ సంగ్రామంలో అమరులైన 21 మంది సైనికుల పేర్లు ఈ యుద్ధస్మారకంపై చెక్కి ఉన్నాయి. 1927 జనవరి 1న డాక్టర్ భీమ్‌రావు అంబేడ్కర్, పలువురు దళిత ప్రముఖులు, బ్రిటిష్ సైన్యంలో పనిచేస్తున్న వారితో కలిసి ఈ స్మారకాన్ని సందర్శించారు. అప్పటికి 109 ఏళ్ల క్రితం జరిగిన కోరేగావ్ యుద్ధంలో పీష్వాలకు వ్యతిరేకంగా బ్రిటిష్ సైన్యంలో అత్యధికంగా ఉన్న మహర్ సైనికులు సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఈ పర్యటన సాగింది. సైనికపరంగా దళితుల శక్తిసామర్థ్యాలకు కోరేగావ్ యుద్ధాన్ని గొప్ప ఉదాహరణగా పరిగణిస్తుంటారు. బ్రిటిష్ ఆర్మీలో అంబేడ్కర్ తండ్రి, ఆయన సోదరులు ఆరుగురు సుబేదార్ మేజర్లుగా పనిచేయటం గమనార్హం.

–సాక్షి నాలెడ్జ్ సెంటర్

వైఎస్.జగన్ పాదయాత్ర చింతపర్తి సమీపంలో 700 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా రంగోళితో ప్రజల స్వాగతం







ప్రజా సంకల్పయాత్రతో ప్రజలకు భరోసా ఇస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- తమ కష్టం వినే నాయకుడొచ్చాడని తరలి వస్తున్న జనం
- ఊళ్లకు ఊళ్లే జననేత అడుగులో అడుగు వేస్తున్న వైనం
- ఈ ప్రభుత్వం వల్ల అన్నీ కష్టాలేనని వాపోతున్న వివిధ వర్గాల ప్రజలు
- అందరి కష్టాలూ ఓపిగ్గా వింటూ ధైర్యం చెబుతున్న జననేత
- అక్కా.. చెల్లీ.. అవ్వా.. తాతా.. అన్నా.. అంటూ అందరితో మమేకం
- మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో కష్టాలు తీరుతాయని హామీ
- 50 రోజుల ప్రస్థానంలో 700 కిలోమీటర్లు పూర్తి
- 26 బహిరంగ సభలు.. 20 ఆత్మీయ సమ్మేళనాలు..
- 24 నియోజకవర్గాల్లో సర్కారు బాధిత వర్గాలకు సాంత్వన

ఆశల మోసులు


ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కూడు, గూడు, పింఛన్ కోసం పరితపించి భంగపడిన వర్గాల వారు ఓ వైపు.. పాలకులిచ్చిన ఒక్క హామీ నెరవేరక అప్పుల పాలై భవిష్యత్‌పై బెంగతో సతమతమవుతున్న వారు మరో వైపు.. వీరందరికీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ఆశా కిరణమైంది. తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడని సంబరపడుతున్నారు. యాత్ర సాగుతున్న ప్రాంతానికి స్వచ్ఛందంగా తరలి వచ్చి అడుగులో అడుగు వేస్తూ సంఘీభావం తెలుపుతున్నారు. 'పింఛన్ ఇవ్వలేదయ్యా..' అని అవ్వాతాతలు, 'ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదన్నా..' అంటూ విద్యార్థులు, 'రేషన్ కార్డు ఇవ్వలేదని.. ఆరోగ్య శ్రీ వర్తింప చేయడం లేదని.. ఇల్లు మంజూరు కాలేదని.. రుణ మాఫీ కాలేదని..' అక్కచెల్లెమ్మలు, రైతులు తమ సమస్యలను జననేత దృష్టికి తెస్తున్నారు. తమ బాగోగులు పట్టించుకోకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఉద్యోగులు, ఉన్న ఉద్యోగాల్లోంచి వరుసగా తొలగిస్తున్నారని కాంట్రాక్టు ఉద్యోగులు తమ కష్టాలు చెప్పుకుంటున్నారు. చంద్రబాబు మమ్మల్ని నమ్మించి ఓట్లేయించుకుని తీరా నట్టేట ముంచారని పలు కుల సంఘాల నేతలు జగన్‌తో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. వేలాది మంది ప్రత్యక్షంగా జగన్‌కు కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. ఆయనతో సమస్య చెప్పుకుంటే ఒక ఊరట.. భవిష్యత్‌లో ఆ సమస్యను ఆయన పరిష్కరిస్తారన్న నమ్మకమే అందరినీ అడుగులో అడుగు వేయిస్తోంది. బహిరంగ సభలకైతే ఇసుక వేస్తే రాలనంతగా జనం తరలి వస్తుండటం పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది. పాదయాత్ర సాగుతున్న దారికిరువైపులా జనమే.. రోడ్డు పక్కల చెట్లు.. పొలం గట్లు.. మిద్దెలు.. మేడలు.. అంతటా జనమే జనం.

ఇంట్లో మనిషిగా కలిసిపోతూ..

అందరి సమస్యలు ఓపికగా వింటున్న జగన్ అన్ని వర్గాల వారితోనూ మమేకమవుతూ వారి ఇంటిలో మనిషిగా కలిసిపోతున్నారు. అవ్వాతాతలు సమస్యలు చెప్పుకుంటున్నపుడు ఆయన కింద కూర్చుండిపోయి వింటుండటం.. దివ్యాంగులతో ఆప్యాయంగా మాట కలపడం.. అక్కచెల్లెమ్మల బాగోగులు తెలుసుకుంటూ.. పిల్లల్ని బాగా చదివించాలని సూచిస్తుండటం.. ఉద్యోగుల ప్లకార్డును తానూ పట్టుకుని మద్దతు ఇవ్వడం.. మీ సమస్యలన్నీ నా సమస్యలే అంటూ అందరికీ అండగా ఉంటూ భరోసా ఇస్తున్నారు. జగన్ ఆయా వర్గాల వారిని కలుస్తున్నపుడు వారి భావాలకు, ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించడం గమనార్హం. కొన్ని చోట్ల నడవలేని పండుటాకుల (వయో వృద్ధులు) వద్దకు ఆయనే స్వయంగా వెళ్లి ఆప్యాయంగా వారిని పలకరించడం వారిని సంతోషంలో ముంచెత్తింది. చిన్న పిల్లలను చేతుల్లోకి తీసుకుని ముద్దాడి మురిపించారు. తమ రాజన్న కొడుకు ఈ రీతిలో తమపై అభిమానం చూపి చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా తమతో కలిసి పోవడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. జగన్ కోసం గంటల తరబడి నిరీక్షించిన జనం ఆయన్ను కలిసిన తర్వాత వికసిత వదనాలతో అడుగులో అడుగేయడం యాత్ర ఆద్యంతం కనిపించింది. విద్యార్థులు, అక్కచెల్లెమ్మలు జననేతను తమ సెల్ ఫోన్లలో బంధించడానికి.. ఆయనతో కలిసి ఫొటో దిగడానికి ఉత్సాహం చూపుతున్న దృశ్యాలు ఊరూరా.. అడుగడుగునా కనిపిస్తుండటం గమనార్హం.

జననేత హామీలతో సర్వత్రా హర్షం

పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అవ్వాతాతల పింఛన్‌ను రూ.2 వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.3 వేలు చేస్తామని చెప్పడం వారిని ఆనంద పరుస్తోంది. ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఈ హామీ పెద్ద ఊరట కలిగించింది. రుణమాఫీ హామీతో తీవ్రంగా నష్టపోయి.. కొత్త అప్పు పుట్టక అవస్థలు పడుతున్న రైతులకు 'వైఎస్సార్ రైతు బీమా' హామీ సాంత్వన కలిగించిందని చెప్పవచ్చు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయడంతో పాటు నాలుగేళ్లలో రూ.50 వేలు ఇస్తామని చెప్పడం పట్ల రైతులు ఆనందపడుతున్నారు. చేనేతలకు కూడా రైతుల తరహాలోనే వైఎస్సార్ బీమా కల్పిస్తామని ప్రకటించడం ఆ వర్గాలకు ఊరట కలిగించింది. పేదలు.. బీసీలు.. విద్యార్థుల కోసం.. దివంగత ముఖ్యమంత్రి, నాన్న గారు వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకడుగు ముందుకేస్తే.. ఆయన కుమారునిగా తాను రెండడుగులు వేస్తానని జగన్ చెప్పడం ఆ వర్గాలకు భరోసానిచ్చింది. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికలపుడు చెప్పిందేమిటి? ఇపుడు చేసిందేమిటి? అని జగన్ సూటిగా ప్రశ్నిస్తున్నపుడు ప్రజల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా నెరవేర్చారా అన్నపుడు లేదు, లేదు అంటూ ప్రజల్లో నుంచి సమాధానం వస్తోంది. నవరత్నాలులో భాగంగా పేద విద్యార్థులకు ఇంజినీరింగ్, మెడిసిన్ అంతకన్నా గొప్ప చదువులకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తామని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ వర్గాల మహిళలకు పింఛను వయస్సును 45 ఏళ్లకే తగ్గిస్తానని, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ఉచిత విద్యుత్ ఇస్తామని, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని జగన్ సభల్లో ప్రకటించినపుడు ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు ఎన్నికల నాటికి ఎంతైతే ఉంటుందో అంత మొత్తాన్ని నాలుగు విడతల్లో వారి చేతికే నేరుగా ఇస్తామని, వారికి సున్నా వడ్డీకి రుణాలిప్పిస్తామని, విడతల వారీగా మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేద పిల్లల ఉన్నత చదువుకు ఎంత ఖర్చు అయినా భరిస్తామని, అదనంగా హాస్టల్ ఖర్చుల కోసం ఏటా రూ.20 వేలు ఇస్తామని, పిల్లలను బడికి పంపితే తల్లి ఖాతాలో ఏటా రూ.15 వేలు వేస్తామని చెప్పడం పేద వర్గాలకు ఊరట కలిగించింది. సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగిస్తామనడం ఉద్యోగ వర్గాలను ఆనందపరుస్తోంది. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ఏ చికిత్స అయినా ఆరోగ్య శ్రీ జాబితాలో చేరుస్తామని, ఆరోగ్య శ్రీ కింద ఎక్కడైనా వైద్యం పొందే సదుపాయం కల్పిస్తామని, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పింఛన్ ఇస్తామని చెప్పడం విప్లవాత్మక మార్పునకు నాంది పలకడమేనని జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఎన్నో హామీలతో పాటు చంద్రబాబు ప్రాజెక్టుల పేరుతో చేస్తున్న అవినీతి, మితిమీరి పెంచుతున్న అంచనా వ్యయాలు, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టులో అవినీతి, రాజధాని అమరావతి పేరుతో జరుగుతున్న భూ దందాలు వంటి అంశాలను ప్రస్తావించినపుడు కూడా జనం నుంచి సానుకూల స్పందన లభిస్తోంది.



ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రి సమీపంలో **100** కి.మీ	శింగనమల నియోజకవర్గం గుమ్మేపల్లి వద్ద **400** కి.మీ
డోన్ నియోజకవర్గం ముద్దవరంలో **200** కి.మీ	ధర్మవరం నియోజకవర్గం గొట్లూరు వద్ద **500** కి.మీ
ఎమ్మిగనూరు నియోజకవర్గం కారుమంచిలో **300** కి.మీ	కదిరి నియోజకవర్గం కటారుపల్లి క్రాస్ రోడ్స్ వద్ద **600** కి.మీ
	పీలేరు నియోజకవర్గం చింతపర్తి శివారులో **700** కి.మీ

100.. 200.. 700 కిలోమీటర్లు

ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు మేలు చేయాలన్న కసితోనే తాను పాదయాత్ర చేస్తున్నానని తొలి రోజునే చాటి చెప్పిన జగన్.. అక్షరాలా అదే విధానంతో ముందుకు సాగుతున్నారు. ప్రజలతో మమేకం అవుతూ దారి వెంట వారి కష్ట సుఖాలను తెలుసుకుంటూ.. కన్నీళ్లు తుడుస్తూ.. సాగిస్తున్న పాదయాత్ర మంగళవారం నాటికి 50 రోజులు పూర్తి చేసుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి చెంత నుంచి ఇడుపుల పాయలో నవంబర్ 6వ తేదీన ప్రారంభించిన ఈ పాదయాత్రలో జగన్ 700 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించారు. కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజల సమస్యలను కేవలం తెలుసుకోవడమే కాకుండా.. వాటి పరిష్కారానికి తాను ఏం చేయబోతున్నది కూడా స్పష్టంగా విడమరచి చెబుతుండటం జనాన్ని ఆకట్టుకుంటోంది. ఏ ఒక్క వర్గాన్నీ నిర్లక్ష్యానికి గురి చేయని రీతిలో.. పేదలందరూ సుఖ శాంతులతో జీవించేందుకు తాను రూపొందించిన 'నవరత్నాలు' కార్యక్రమాన్ని విస్తృతంగా జనాల్లోకి తీసుకెళుతున్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, వయో వృద్ధులు, చేనేత కార్మికులతో పాటు అనేక కుల వృత్తుల వారు.. నవరత్నాల పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఎంతగా ప్రచారం చేసుకుంటున్నా.. నిలువ నీడ లేక, ఇల్లున్నా కనీస వసతులు లేక అలమటిస్తున్న ప్రజానీకానికి జగన్ ఇస్తున్న హామీలు వారికి జీవితం పట్ల ఆశలను రేకెత్తిస్తున్నాయి.

275 గ్రామాల ప్రజలతో మమేకం

వైఎస్ జగన్ 3000 కిలోమీటర్ల ప్రజాసంకల్ప యాత్ర లక్ష్యంలో భాగంగా ఇప్పటి వరకు వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో జగన్ పాదయాత్ర పూర్తి చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో యాత్ర కొనసాగిస్తున్నారు. పీలేరు శాసనసభా నియోజకవర్గంలోని చింతపర్తి సమీపంలో 700 కిలోమీటర్ల యాత్రను పూర్తి చేశారు. ఇప్పటి దాకా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 మండలాలు, 275 గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు. 26 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. 20 చోట్ల వివిధ వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని ముఖాముఖి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మహిళలు, రైతులు, చేనేత కార్మికులు, వెనుకబడిన కులాలు, మైనారిటీ వర్గాల ప్రజలు జగన్‌తో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



టీఎం లోయ వద్ద వైఎస్ జగన్‌కు ఆప్యాయంగా ముద్దు పెడుతున్న అవ్వ



చింతపర్తి సమీపంలో పాదయాత్ర 700 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా మొక్క నాటుతున్న వైఎస్.జగన్



కాశీరావుపేటలో వైఎస్ జగన్‌కు సీతాఫలం అందజేస్తున్న అభిమాని

ప్రజాసంకల్ప యాత్ర 50వ రోజు

ఇప్పటి వరకు నడిచిన దూరం **701.6** కి.మీ

50వ రోజు నడిచిన దూరం **14.2** కి.మీ

ప్రారంభం: ఉ. 8 గంటలకు, చిన్నతిప్ప సముద్రం

ముగింపు: సా. 6 గంటలకు, చింతపర్తి శివారు (పీలేరు నియోజకవర్గం)

ముఖ్యాంశాలు: సీటీఎం, పూలవాండ్లపల్లె, కొత్తవారిపల్లి, కాశీరావుపేట, వాల్మీకిపురం, పునుగుపల్లి, విఠలం, టీఎం లోయ, జమ్మిలవారిపల్లి గ్రామాల్లో జనంతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గం. లకు చింతపర్తి శివారు

ముఖ్యాంశాలు

- చింతపర్తి, పాతకోటపల్లి, బీదవారిపల్లి క్రాస్, గండబోయినపల్లి, టేకులకోనల్లో జనంతో మమేకం.
- కలికిరిలో బహిరంగసభ.



వాల్మీకిపురం పునుగుపల్లె వద్ద ఎద్దుల బండికి వైఎస్సార్‌సీపీ జెండాలు, వైఎస్సార్ చిత్రపటం కట్టిన అభిమాని



వాల్మీకిపురంలో కళాకారులతో కలిసి చెక్కభజన చేస్తున్న వైఎస్ జగన్



వాల్మీకిపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాలతో అలంకరించిన ప్రజలు



వాల్మీకిపురంలో పార్టీ రంగుతో ఉన్న బెలూన్లను ఎగురవేస్తున్న వైఎస్. జగన్

జన హారతి

వాయల్పాడులో హోరెత్తిన జనం ● అడుగడుగునా మహిళల హారతులు

క్షేమంగా ఇంటికి చేరాలంటూ దిష్టితీసి పంపిన వైనం ● ప్రతిపక్ష నేతతో పాదం కలిపిన వేలాదిమంది

సాక్షి, తిరుపతి: చిత్తూరు జిల్లాలోని నగిరిమడుగు గ్రామానికి చెందిన రాజమ్మ, నారాయణమ్మ మరికొంతమంది మహిళలు మంగళవారం వేకువజామునే నిద్రలేచారు. బస్తా చామంతి పువ్వులు సేకరించి పన్నెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వాయల్పాడుకు చేరుకున్నారు. తమ అభిమాన నేత వైఎస్ జగన్ నడిచొచ్చే దారిలో ఆ పువ్వులు పరిచారు. చేతిలో ఇత్తడిపళ్లెం.. అందులో ఎర్రనీళ్లు, తమలపాకులతోపాటు కర్పూరంతో జగన్ రాకకోసం నిరీక్షించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ తమను సమీపించగానే.. ఇత్తడిపళ్లెంలోని కర్పూరం వెలిగించి దూరం నుంచి దిష్టి తీసి కిందపారబోశారు. దీనిపై అడిగితే.. ''జనంకోసం వందల కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వస్తున్నాడు నాబిడ్డ. ఎంతోమంది కళ్లు పడి ఉంటాయి. నా బిడ్డ క్షేమంగా ఇంటికి చేరాలి. ముఖ్యమంత్రిగా తిరిగి మా ఊరికి రావాలి. అంతకంటే మాకు వేరే కోరిక లేదు నాయనా?'' అంటూ రాజమ్మ, నారాయణ ఉద్వేగంగా మాట్లాడారు. ఆ తర్వాత వైఎస్ జగన్ వారిని కలిశారు. వారి క్షేమ సమాచారాలడిగి తెలుసుకున్నారు. పింఛను వస్తుందా? రుణాలు మాఫీ అయ్యాయా? మీ ఆరోగ్యం ఎలా ఉంది?' అంటూ ఆరా తీశారు. దీంతో ఆ మహిళల ఆనందానికి అంతులేదు. 'ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో నాయనా' అంటూ దీవించి ముందుకు సాగనంపారు. నగరిమడుగుకు చెందిన మహిళలే కాదు.. శివపురం, పత్తేపురం, ఓబులంపల్లి, జర్రావారిపల్లి, దండువారిపల్లి, గొల్లపల్లి, నాగంవారిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలకు చెందిన మహిళలు, రైతులు, యువకులు, ఉద్యోగులు భారీఎత్తున వాయల్పాడుకు తరలివచ్చి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించారు. వేలాదిమంది జగన్‌తో పాదం కలిపారు. ప్రభుత్వం తమను మోసగిస్తున్న తీరును ఆయనకు విన్నవించారు. 'జగనన్నా రావాలి... కావాలి జగనన్నా' అని నినదిస్తూ ముందుకు కదిలారు. మంచూరు, బూడిదవేడులకు చెందిన చెక్కభజన బృందంవారు వాయల్పాడుకు చేరుకుని.. ఉదయం నుంచి పాటలు పాడుతూ, భజన చేస్తూ జగన్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

రిటైరైనా ప్రభుత్వం పింఛన్ ఇవ్వలేదు

రాష్ట్ర పట్టు పరిశ్రమశాఖలో సుమారు 40 ఏళ్లు పనిచేసి రిటైరైన ఉద్యోగులు మంగళవారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను కలిశారు. చిత్తూరు జిల్లాలో సుమారు 350 మంది పదవీ విరమణ పొందామని, అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి పింఛన్, ఇతర అలవెన్సులు రాలేదని ఆవేదన వెలిబుచ్చారు.

వేదనలు... కళ్లు చెమర్చే నివేదనలు...

సాక్షి ప్రతినిధి, తిరుపతి: దారిపొడవునా వేదనలు...కళ్లు చెమర్చే నివేదనలే. రుణం మాఫీ కాక అన్నదాతలు, అప్పులు తీరక డ్వాక్రా మహిళలు, ఉద్యోగాలు రాక యువకులు, ఉపాధి దొరక్క కూలీలు, పింఛను అందక పండుటాకులు పడుతున్న అవస్థలెన్నో.. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా తమ వద్దకే వస్తున్న రాజన్నబిడ్డకు వీరంతా అర్జీలిచ్చి తమ ఆక్రోశాన్ని వెళ్లబోసుకున్నారు. ప్రతిపక్ష నేత వారికి భరోసానిస్తూ ధైర్యం చెప్పారు.

బియ్యం ఇవ్వట్లేదు...

ఇంతకుముందు రేషన్ షాపులో 35 కిలోల బియ్యం ఇచ్చేవారు. ఆరు నెలలుగా ఇవ్వట్లేదు. భర్త చనిపోయాడు. నాకు పింఛను కూడా రావట్లేదు. మాలాంటోళ్లు ఎలా బతకాలి. తెల్లారితో లేవంగనే పూట గడిచేదెట్లో తెలియక భయమేస్తోంది సామీ.. అయినా సరే. ఈ దినాన నా బిడ్డ(వైఎస్ జగన్) నా దగ్గరకొచ్చాడు. నా కన్నీళ్లను తుడిచాడు. నాతో మాట్లాడాడు. అదిచాలు నాకు. ఇంకేం వద్దు. ఎలాగైనా బతికేస్తా.

–రాజమ్మ, చినతిప్పసముద్రం, చిత్తూరు జిల్లా.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీసే సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేయాలి. ఎలాగైనా మీరే సాయం చేయాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే సీపీఎస్ విధానాన్ని వెనక్కి తీసుకునే వీలుంది. మీరే పరిశీలించాలి.

–వాల్మీకిపురం పీవీసీ స్కూల్ ఉపాధ్యాయులు

పీలేరులోని వంట నూనెల ఉత్పత్తి కేంద్రానికి కష్టకాలం

ప్రతిపక్ష నేత ఎదుట చిత్తూరు జిల్లా రైతు సంఘం నాయకుడు ఆదికేశవులురెడ్డి ఆవేదన

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇప్పటికే కుదేలైన సహకార సంస్థల జాబితాలో తాజాగా పీలేరులోని వంట నూనెల ఉత్పత్తి కేంద్రం కూడా చేరే అవకాశం ఉందని చిత్తూరు జిల్లా రైతు సంఘం నాయకుడు టి.ఆదికేశవులురెడ్డి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట వాపోయారు. ప్రజాసంకల్ప యాత్ర మంగళవారం వాల్మీకిపురం సమీపంలోకి రాగానే ఆదికేశవులురెడ్డి జగన్‌కు వినతిపత్రం ఇచ్చారు. చంద్రబాబు సొంత లాభం కోసం జిల్లాలో ఇప్పటికే విజయ సహకార పాల డెయిరీ, చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీలను మూతవేశారని విమర్శించారు. 1989లో ఏపీ కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయెర్స్ ఫెడరేషన్ లిమిటెడ్‌కు అనుబంధంగా 66 రైతు సంఘాల సమన్వయంతో పీలేరులో శ్రీకృష్ణదేవరాయ వంట నూనెల ఉత్పాదక వ్యవస్థ ఏర్పాటైందని చెప్పారు. 1996లో జిల్లాలోని నూనె గింజల ఉత్పత్తిదారులైన రైతులకు కనీస మద్దతు ధర ఇప్పించడం, విజయ బ్రాండ్ నూనె ఉత్పత్తుల మార్కెటింగ్ పర్యవేక్షణ పేరిట తిరుపతిలో ఆయిల్ ఫెడ్ డిపో ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పీలేరులోని వంద కోట్ల రూపాయల విలువైన ఆస్తులున్న యూనిట్ మూతపడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు చెల్లిస్తే యూనిట్ పునరుద్ధరణకు వీలవుతుందని, అయితే ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటూ తిరుపతిలోని డిపోను ఖాళీ చేసి ఓ ప్రైవేటు కంపెనీకి ఆయిల్ ఫెడ్‌ను అప్పగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఇదేంటని విజయవాడ ఆయిల్‌ఫెడ్ అధికారులను అడిగితే.. జిల్లాలో నూనె గింజల ఉత్పాదన తగ్గిపోవడంతో రైతు సంఘాలు రద్దయిపోయాయని చెబుతున్నారన్నారని, అదే నిజమైతే జిల్లాలోని నాలుగు మండలాల్లో పామోలిన్ సాగు చేపట్టేందుకు గోద్రేజ్ కంపెనీతో రాష్ట్ర ఉద్యాన పంట కమిషనరేట్ ఎలా ఒప్పందం కుదుర్చుకుంటుందని ప్రశ్నించారు.

సాక్షి ఫ్యామిలీ

వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ॥ 3-1-2018



మగాళ్లు చెడ్డవాళ్లేం కాదు



నిత్యామీనన్

నిత్యామీనన్ అరుదైన అమ్మాయి. 'జెమ్' అనుకోండి. అందం, యాక్టింగ్.. వీటి గురించి కాదు. ఆమె అభిప్రాయాలు బోల్డ్‌గా ఉంటాయి. అవునా! ఇదేం గొప్ప సంగతి? ఇప్పటి అమ్మాయిలంతా బోల్డ్‌గానే ఉంటున్నారుగా. నిజమే అనుకోండి, జెండర్ విషయాల్లో నిత్య.. న్యాయంగా ఉంటారు. అంటే.. అబ్బాయిలందర్నీ పట్టుకుని తిట్టేయరు.. 'వీళ్లింతే' అని! అలాగే అమ్మాయిల్నీ కారణం లేకుండా వెనుకేసుకురారు. మలయాళం మూవీ ఇండస్ట్రీలో మగాళ్లదే రాజ్యం అయిపోయిందని ఈమధ్య నిత్య కో–స్టార్ పార్వతి అన్నప్పుడు.. మీడియా అంతా నిత్య చుట్టూ చేరింది. 'నిజమేనా?' అని! సినిమా పరిశ్రమలో ఆడవాళ్లకు 'ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్' ఉండడం లేదన్నది కూడా పార్వతి చేసిన ఒక కామెంట్. 'ఆ.. నిజమే' అన్నారు నిత్య. అలాగని ఆమె మగవాళ్లనేం తప్పు పట్టలేదు. ''ఎక్కడ మాత్రం లేదు చెప్పండి మగవాళ్ల రాజ్యం?! ఇళ్లు, ఆఫీసులు.. అలాగే సినిమా ఇండస్ట్రీ. మొత్తం సొసైటీనే ఇలా ఉన్నప్పుడు.. మనకున్న ఒకే చాయిస్.. ఉమెన్‌గా మన ప్రత్యేకత ఏంటో నిరూపించుకోవడం, మన అభిప్రాయం తెలుసుకోవడం తమ అవసరంగా మగవాళ్లు భావించే పరిస్థితి తీసుకురావడం'' అన్నారు నిత్య. 'మిసాజినీ' అనే మాటను కూడా నిత్య నవ్వుతూ కొట్టేస్తారు. మిసాజినీ అంటే.. స్త్రీ ద్వేషం. ''పనిగట్టుకునైతే మగాళ్లు స్త్రీలను ద్వేషిస్తారని అనుకోను. పురుషాధిక్య సమాజం కదా. తీసిపడేయడం అనే ఆ హ్యాబిట్ అలా వచ్చేస్తుంటుంది.. మగాళ్లు ఎంత సభ్యతగా బిహేవ్ చేయాలనుకున్నా..'' అంటోంది నిత్య. ప్రస్తుతం నిత్య 'ప్రాణ' అనే మలయాళం మూవీలో నటిస్తోంది. అందులోని థీమ్.. ఇదే.. భావ ప్రకటన స్వేచ్ఛ. 'ఆ' అనే తెలుగు సినిమాలో కూడా నిత్య నటిస్తోంది.

సమయం మించిపోయింది



'టైమ్స్‌అప్' ప్యానల్ సభ్యురాలు రషీదా జోన్స్



'టైమ్స్‌అప్' ప్రకటనలోని ఒక భాగం

'టైమ్ ఈజ్ అప్' అనే కొత్త మూవ్‌మెంట్ హాలీవుడ్‌లో మొదలైంది. 'మీటూ' ఉద్యమానికి ఇది కార్యాచరణ రూపం! 'మీటూ' ఇంతవరకు హాలీవుడ్‌లోని లైంగిక వేధింపులపైనే సాగింది. 'టైమ్స్ అప్' మాత్రం యు.ఎస్.లోని అన్ని రంగాల్లో ఉన్న లైంగిక బాధితుల కోసం న్యాయపోరాటం చేయబోతోంది. నటీమణులు, రచయిత్రులు, మహిళా డైరెక్టర్లు, ఇతర రంగాల్లోని ప్రముఖ మహిళలందరితో కలిపి మొత్తం 300 మంది టైమ్స్‌అప్‌లో సభ్యులుగా ఉన్నారు. వర్క్ ప్లేస్.. అది హాలీవుడ్ అయినా, అగ్రికల్చర్ ఫీల్డ్ అయినా; పనిచేస్తున్నవారు సుప్రసిద్ధులైనా, సామాన్య మహిళలైనా.. వాళ్ల కంప్లైంట్ తీసుకుని లీగల్‌గా ఫైట్ చెయ్యడం, దోషులకు వీలైనంత త్వరగా శిక్ష వేయించడం టైమ్స్‌అప్ లక్ష్యం. ఇందుకు అవసరమైన ఖర్చుల కోసం ఇప్పటికే ఈ ప్యానెల్ 13.4 మిలియన్ డాలర్ల విరాళాలను సేకరించగలిగింది. టార్గెట్ అమౌంట్ 15 మిలియన్ డాలర్లు. కేట్ బ్లాంచెట్, ఆష్లీజడ్, నటాలీ పోర్ట్‌మన్, మెరిల్ స్ట్రీప్, రషీదా జోన్స్ వంటి ఉద్దండ మహిళలు ప్యానెల్‌లో ఉన్నారు. ''లైంగికంగా వేధిస్తున్న మగవాళ్లను బయటికి లాగకపోవడం వల్లనే.. వేధింపులకు అంతం లేకుండా పోతోంది. ఒక మామూలు మహిళ వెనుక కూడా పెద్ద సైన్యమే ఉందన్న భయం అంటూ ఒకటి ఉంటే.. చెయ్యి వెయ్యడానికే కాదు, మాట అనడానికి కూడా మగాళ్లు భయపడతారు'' అనే అర్థంతో జనవరి 1న 'టైమ్స్‌అప్' ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన 'డియర్ సిస్టర్స్' అనే మాటతో మొదలై.. 'సాలిడారిటీ' అనే పదంతో పూర్తయింది. సాలిడారిటీ అంటే.. 'మేమున్నాం' అని ధైర్యమివ్వడం.

సెటైరమ్మా.. సెటైరూ..!

ఎంత గ్రేట్ చెప్పండి!



న్యూ ఇయర్‌లో ఎవరు గ్రేట్? అప్పుడే ఎలా చెప్తాం? రెండు రోజులే కదా అయింది! రెండు రోజులే కావచ్చు. అయినా ఎవరు గ్రేటో చెప్పొచ్చు. పళ్లు నూరడం మానేస్తే ట్రంప్ గ్రేట్. ట్రంప్ వైపు చూసి వెక్కిరించకపోతే కిమ్ గ్రేట్. రెండు వేల నోటును రద్దు చేయకపోతే మోదీ గ్రేట్. రాహుల్‌గాంధీ తన సీరియస్‌నెస్‌ని కంటిన్యూ చేస్తే గ్రేట్. మాట మీద నిలబడి పార్టీ పేరు అనౌన్స్ చేస్తే రజనీకాంత్ గ్రేట్. పెళ్లయ్యాక కూడా సిక్స్‌లు, ఫోర్‌లు కొడితే విరాట్ కోహ్లీ గ్రేట్. ప్రభాస్, అనుష్క కలసి మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తే.. వాళ్లిద్దరూ గ్రేట్. అయినా.. న్యూ ఇయర్ వచ్చి వన్ వీక్ కూడా గడవందే.. ఇలాంటి గ్రేట్‌లన్నీ ఎలా సాధ్యం? జరిగేవి ఉంటే చెప్పండి. ఉన్నాయి. న్యూ ఇయర్ రిజల్యూషన్‌కి జనవరి ఫస్ట్‌న రోజురోజంతా కట్టుబడి ఉన్నవారు గ్రేట్. రెండో రోజూ కట్టుబడి ఉంటే ఇంకా గ్రేట్. ఇస్తారా? వాళ్లకైదేనా అవార్డును ఇస్తారా? అకాడమీలు ఇస్తాయా? గవర్నమెంట్ ఇస్తుందా? ఏ గుర్తింపూ లేకుండా ఎవరైనా న్యూ ఇయర్ తీర్మానాలు ఎందుకు తీసుకోవాలి చెప్పండి? తీసుకున్నా ఎందుకు వాటిపై నిలబడాలి చెప్పండి? అందుకే.. రెండు రోజులైనా సరే.. రిజల్యూషన్‌ని పంటిబిగువున పెట్టుకుని జీవితాన్ని లాగించినవాళ్లకు అవార్డు ఇవ్వాలి. వాళ్లచేత కార్పొరేట్ ఆఫీసులలో ఉద్యోగులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు చెప్పించాలి.

పామరుడు తన శక్తికి మించిన కార్యం చేస్తున్నప్పుడు దేవుణ్ని ఇలాగే తలచుకుంటాడేమో! ఆ పామరుడికి తను దేవుణ్ణి తలచుకుంటున్నానన్న విషయం కూడా తెలియకపోవచ్చు. హైస్సా.. హైలెస్సా.. అనే ఈ ఐదు అక్షరాలే.. అతడి పంచాక్షరీ మంత్రమేమో! గరికపాటి ఈ సూక్ష్మాన్ని వివరిస్తూ.. 'పనే దైవం.. శ్రమే దైవ పూజ' అని వ్యాఖ్యానించారు.

నేను నా దైవం

● గరికపాటి నరసింహారావు, అవధాని, ఉపన్యాసకులు

హైస్సా.. హైలెస్సా

శాస్త్రాలు కనపడతాయి. దేవుడు కనపడడు కదా! శాస్త్రాలు దేవుడిని ఏ విధంగా చూపించాయి?

వేదంలో దైవాన్ని 'తత్' అన్నారు. తత్ అంటే 'అది' అంటే వ్యాకరణంలో సర్వనామం. ఈ పదాన్ని వస్తువులకు, మనుషులకు అన్నింటికీ ఉపయోగిస్తాం. 'అది' ఒక శక్తి. దానికి తలో రకమైన భావన ఇచ్చుకున్నారు. చూసేవాళ్లు ఎంత మంది ఉంటే 'అది' అన్ని విధాలుగా కనపడుతుంది. వైదిక ధర్మంలో దైవానికి రూపకల్పన చేయలేదు. తర్వాత్తర్వాత ఓ రూపం తీసుకున్నారు. దైవాన్ని అంతర్ముఖంగా దర్శించాలే తప్ప బయటకు కనిపించేది కాదు.

అంతర్ముఖులు అవడం అందరికీ సాధ్యమయ్యేదేనా? దైవాన్ని ఎలా దర్శించాలి?

సాధన చేస్తే ఏదైనా సాధ్యమే! కరెంట్ వైర్లలో విద్యుచ్ఛక్తి ఉంటుంది. కానీ, బయటకు కనిపించదు. బల్బు ద్వారా మనకు కరెంట్ ఉన్నట్టు తెలుస్తుంటుంది. అలాగే దేవుడు విశ్వమంతటా వ్యాపించి ఉన్నాడు. మనకు కనిపించడు. మంత్రం, బీజాక్షరంతో ఆలయంలో ప్రతిష్ఠించారు కాబట్టి అక్కడ దైవశక్తి వ్యక్తం అవుతుంది. దేవుడికి రూపం ఇవ్వకపోతే అర్చన, ఆరాధనలకు అనుకూలంగా ఉండవు కాబట్టి ఎవరి మనోభావాలను బట్టి వారు దైవాన్ని ప్రతిష్ఠించి, పూజించుకుంటున్నారు.

ఈ తరహా ఆలోచనకు ముందు మీరు ఏ దైవాన్ని నమ్మేవారు?

మా నాన్నగారు కనకదుర్గా ఉపాసకులు. ఆయన ఎప్పుడూ దైవం అనేవారు కాదు. ఏదైనా సమస్య వస్తే 'అన్నీ అమ్మ చూసుకుంటుంది లేరా' అనేవారు. మా కుటుంబసభ్యుల్లో అమ్మవారినీ ఒకరుగా భావించేవాళ్లం. అమ్మవారు శక్తి స్వరూపిణి. మనల్ని నడిపిస్తున్నది శక్తిగానే చెబుతాం. అందుకే ఆ శక్తిని అమ్మవారుగా భావించుకుంటాను. నా పద్యాల్లో ఎక్కువ భాగం అమ్మవారు, శివుడి మీదే ఉంటాయి.

వెయ్యిమంది పండితులతో అవధానం చేశారు. మీకు అంతటి శక్తి ఎలా వచ్చింది?

ఇది కూడా లోపల ఉండే శక్తే. ప్రతి వ్యక్తిలోనూ శక్తి ఉంటుంది. సాహిత్యపరంగా ఉన్న ఆసక్తితో గ్రంథాలు చదవడం, దానిని వినియోగించుకోవడం వల్ల నాకీ శక్తి వచ్చింది. చిన్ననాటి నుంచే తెలుగంటే అమితాసక్తి. పై తరగతులకు వెళ్లడానికి ముందే వేసవి సెలవుల్లో తెలుగు ఉపవాచకాన్ని కంఠతా చేసేవాడిని. అలా డిగ్రీకి వచ్చేసరికి నాలుగైదు వందల పద్యాలు కంఠస్థం చేశాను. ఫలానావాళ్లు వృద్ధిలోకి వచ్చారంటే వారెంచుకున్న రంగంలో సాధన చేశారన్నది ముఖ్యం. దానికి సమాధానం చెప్పలేనివారు అదృష్టమనో, పూర్వజన్మ సుకృతమనో అంటారు.

శాస్త్రాన్ని ఉన్నదున్నట్టు చెప్పాలి కదా! మీరు లౌక్యంగా చెబుతారంటారు నిజమేనా?

ఈ రోజులు ఎలా ఉన్నాయంటే ఒకడు బల్లిశాస్త్రం అంటాడు, మరొకడు పుట్టుమచ్చల శాస్త్రం అంటాడు. ఇదంతా మిడిమిడి జ్ఞానం. మహానుభావులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎన్నో శాస్త్రాలు పుట్టించారు. అవాస్తవాలను పెంచడం ఈ కాలంలో ఎక్కువైపోయింది. ఈ కాలానికి తగ్గట్టు వాస్తవాలను చెప్పగలగాలి.

ఇలా మాట్లాడితే సంప్రదాయవాదులు వ్యతిరేకించరా?

బోలెడుసార్లు సవాల్ చేశాను. వివేకానందుడు చెప్పినట్టు సత్యానికి సమాజం తలవంచాల్సిందే! కాదనేవాడిని రమ్మనమనండి. దేవుడు ఎందుకు సంకల్పిస్తాడు? ఎక్కడికో వెళ్లాలనుకుని ప్రయాణం పెట్టుకున్నాను. కాలుజారి దెబ్బ తగిలి ప్రయాణం వాయిదా పడింది. మన ప్రయాణం వాయిదా వేయడానికి దేవుడికేం అవసరం? ఏ పూజ చేసినా ఆ స్థితి ఆ స్థితియే! నాకున్న ఆధ్మాతికానందం ఇప్పుడు ఎలా ఉందంటే.. భాగవతం చదవడానికి, బట్టలు మడతెట్టుకోవడానికి పెద్దగా తేడా తెలియడం లేదు. ఆ బట్ట కూడా నాకు భగవత్స్వరూపమే! ఆధ్యాత్మిక వేత్త ఆ స్థితికి చేరుకోవాలి.

మరి ఈ పూజలన్నీ ఎందుకు? పూజల పేరుతో ఇంత ఖర్చు దేనికి?

పూజలు మానకూడదు. పూజ చేయడం వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. పూజల ఉద్దేశ్యం దృష్టిని దైవం మీద పెట్టడమే. అలాగే, ఈ పూజలన్నింటిలోనూ ఎక్కువగా దానాలుంటాయి. దానం వల్ల పాపం నశిస్తుంది. కానీ, చాలామంది పూజలు అనగానే అర్థాలు తెలియకపోయినా స్తోత్రాలు చదివేస్తూ ఉంటారు. పండితులు వాటికి అర్థాలు చెప్పరు. వీరు తెలుసుకోరు. వందసార్లు విష్ణుసహస్రనామం చదివినా వీళ్లు ఎక్కడున్నారో అక్కడే ఉంటారు. అదే ఒక్కనామానికి అర్థం తెలుసుకుని ఆలోచిస్తే గొప్ప మార్పు వస్తుంది.

గుణం తల్లిదండ్రులు ఇచ్చారంటారు. తెలివి దేవుడు ఇచ్చినదేనా? ఇది దైవ సంకల్పమా?

దేవుడు నాకు మాత్రమే ధారణ ఇవ్వాలని ఎందుకనుకుంటాడు. నామీదే ఆయనకు ప్రత్యేకమైన ఇష్టం ఏంటి? దైవ సంకల్పం అని ఎందుకంటారు. అలా అనుకుంటే దేవుడు పక్షపాతి కాదా! అలాంటివాడు దేవుడు ఎలా అవుతాడు. అనేకానేక మాయ మాటల్లో ఇదొకటి. కృషి వల్ల వచ్చిందని చెప్పరు. ఇప్పటిదాకా 11వేల పద్యాలు రాశాను. రోజూ అరగంట పాటు ఆ పద్యాలన్నీ మళ్లీ ఎన్ని వీలైతే అన్ని చదువుకుంటాను. దానికి చేయాల్సిన రాక్షస పరిశ్రమ చేయాలి. అందుకే నన్ను ధారణాబ్రహ్మరాక్షసుడు అన్నారు. దైవసంకల్పం అని ఈ ప్రచారం కూడా మాలాంటి వాళ్లే చేస్తారు. ఇది దైవశక్తి అంటే మాకు గౌరవాలు, పాదాభివందనాలు, దక్షిణలు పెరుగుతాయిగా!

కష్టం వచ్చినప్పుడు దేవుణ్ణి తలుచుకున్న సందర్భం?

1978 నుంచి దాదాపు పదేళ్లు చాలా స్ట్రగుల్ పడ్డాను. రోజులు గడవక కాదు. 'ఏంటీ దేవుడు..' అని ఆలోచన. వాస్తవాలను గ్రహించడానికి వందల పుస్తకాలు చదివాను. ఉదాహరణకు కార్తీక మాసంలో చన్నీటి స్నానం, ఉపవాసం పుణ్యం అన్నారు. వాస్తవం– ఇంద్రియ నిగ్రహానికి చన్నీటి స్నానం. ఉపవాసం – నవంబర్ మాసానికి పల్లెల్లో గాదెలు ఖాళీ అయ్యేవి. అప్పట్లో ఇంట్లో పది మందికి పైగా ఉండేవారు. చలి వల్ల ఎలాగూ జీర్ణశక్తి మందగిస్తుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఉపవాసం అన్నారు. మన మనస్సు దేవుడి సన్నిధిలో ఉండాలి. అంతేగానీ, అన్నం మానేస్తే దేవుడు కరుణించడు. పూజలు చిత్తశుద్ధితో చేస్తే ఒకనాటికి మనలో మార్పు వస్తుంది. ఇలా పదేళ్ల పాటు సందిగ్ధావస్థలోనే ఉన్నాను. తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగం మానేసి అవధానాల్లో పాల్గొన్నాను. అవధానంలో ముందు దైవప్రార్థన చేయాలి. నేను నమ్మంది చెప్పను. ఎలా అని ఆలోచించి అమ్మమీద పద్యం చెప్పాను. ఆ పద్యం చెబుతుంటే నా కళ్లు తడిసిపోతున్నాయి, గుండె తడిసిపోతోంది. ఈ స్పందన, భావాలు ఎక్కడనుంచి వస్తున్నాయి? ఈ ఆలోచనలు దైవం వైపుగా నడిపించాయి. ఆనందం మనలోనే ఉందని అప్పుడే అర్థమైంది.



మీరు నమ్మే దైవం మీకు మంచి చేసిందని ఎప్పుడు నమ్మారు..?

ఎప్పుడూ నమ్ముతాను. అయితే, నా ప్రయత్నం వల్ల కూడా జరగనిది దైవప్రేరణతో జరిగిన ఘటనలు మూడు నాలుగు ఉన్నాయి. సమస్య చేయి దాటినప్పుడు అమ్మవారి ఫొటో ముందుకు వెళ్లి బొమ్మా బొరుసు వేస్తాను. బొమ్మ పడితే ప్రయత్నం విడవను అని. ఇది చిన్నపిల్లవాడి మనస్తత్వంగా భావించవచ్చు. కానీ, దాని వెనకాల ఉన్న విశ్వాసం పెద్దది. హైదరాబాద్‌లో ఇల్లు కొనడం కోసం కాకినాడలో స్థలం అమ్మి బిల్డర్‌కి డబ్బు ఇచ్చాను. ఏడాది చూశాను. ఇల్లు అవడం లేదు, డబ్బులు రావడం లేదు. విసుగొచ్చింది. మరో దారి కన్పించలేదు. అమ్మవారి ముందుకెళ్లి 'భిక్షాటన చేసైనా ఐదు కోట్లు తెచ్చిస్తా గరికపాటికి నా పాదాలు రాసిచ్చాను అని రిజిస్టర్ చేసి అందరికీ చెప్పు. లేదంటే నేను సంపాదించినదాంట్లో దోషం చూపించు. నా కష్టార్జితం పోతే నేను రేపు నీ గురించి పదిమందికి ఏం చెప్పను' అన్నాను. ప్రయత్నం చేయమన్నట్టుగా బొమ్మపడింది. ఎలా ప్రయత్నం చేయాలో అర్థం కాలేదు. కానీ, పరిస్థితులు కలిసి వచ్చాయి. వారం రోజుల్లో నా డబ్బు చేతికొచ్చింది. కష్టం వస్తే 'అమ్మా, కొత్త కష్టాలు వస్తే నే కొత్త పద్యాలు చెబుతానని నీ ఆశా! జీవితాంతం పద్యాలు చెబుతా గానీ, కష్టపెట్టకమ్మా!' అని చెబుతుంటాను. మొన్నీ మధ్య ఇంట్లో ఎవరూ లేరు. నేను అమ్మవారి దగ్గర కూర్చుని 'నువ్వు, నేను తప్ప అవనీతలమున ఎవ్వరూ లేరు. నీవు ఒకసారి కనపడితే ఎవరికీ చెప్పను తల్లీ.. అని పద్యరూపకంగా చెప్పాను. ఇది మధురభక్తి. అదో అనుభవం.

ఇంతటి మధుర భక్తిని అనుభూతించే మీరు దైవం గురించి విమర్శనా వ్యాఖ్యలు కూడా చేస్తుంటారు?

దైవం గురించి కాదు మూఢభక్తి గురించి. శివుడి గుళ్లో వందల లీటర్ల పాలతో అభిషేకం చేస్తున్నారు. ఎందుకు? నీళ్లతోనే అభిషేకం చేయాలి. అభిషేకాల పేరుతో చాలా శివాలయాలు ఇప్పటికే మూత పడ్డాయి. దేవుడికి ఇవి కాస్ట్లీ, ఇవి చీప్ అని ఉండదు. అభిషేకానికి నీళ్లే వాడాలి. ధారాపాత్ర గుండా నీళ్లు లింగం మీదుగా పడుతుండాలి. ద్రాక్షారామంలో అలా అభిషేకం జరుగుతుండగా ఉద్వేగానికి లోనై ఆశువుగా 'ధారాపాత్ర నుండి నీరు జారునయట్లు క్షణ క్షణం బతుకు జారిపోవు... అని పద్యం చెప్పాను. వేంకటేశ్వరస్వామికి గడ్డం మీద గాయం వల్ల అయిన మచ్చ ఉంటుంది. ఇప్పటికీ దాని మీద వెన్న రాస్తారు. అంత శక్తి గల స్వామి తన గాయాన్ని ఎందుకు మాన్పుకోలేకపోయాడు. అని ఆలోచన ఎవరూ చేయరు. ఇప్పటికీ మొట్టమొదట గా ఓటికుండలో పెట్టిన అన్నమే స్వామికి నైవేద్యం. ఎందుకు? ఇవేవీ ఆలోచించరు. దేవుడికి కులం, మతం పట్టింపుల్లేవు. అది ఎందుకు గ్రహించరు. ఏది అజ్ఞానం అనిపిస్తే దాన్ని విమర్శిస్తాను.

ఇలాంటి వ్యాఖ్యానాల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతింటాయేమో కదా!

ఈ రోజుల్లో తొమ్మిదో తరగతి కుర్రాడికీ మనోభావాలు ఉంటున్నాయి. అందుకే వాడికి తోచింది ఫేస్‌బుక్‌లో పెట్టేస్తుంటాడు. ఆవుని పూజించమంటారు. ఆవును పూజించేవాళ్లే దూడ పాలు తాగుతుంటే దాన్ని చితగ్గొట్టి పాలు పితుక్కుంటున్నాడు ఇది జీవహింస కాదా! పుణ్యమని గోవు చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. గోవులను వ్యాపారం చేసేవారి గురించి మాట్లాడరెందుకు. ఇలాంటివాటికి మొదట్నుంచీ వ్యతిరేకిని. తప్పుడు భావం అయితే అది ఎలాంటిదైనా ఖండిస్తాను.'సకలభూత హితాన్ని కోరి చెప్పే మాటలు దైవం మెచ్చును..' నే చెప్పింది తప్పనిపిస్తే వాస్తవం చెప్పండి. వింటాను.

– నిర్మలారెడ్డి చిల్కమర్రి

చెట్టు నీడ

చూపున్న అంధుడు!

ఒక పల్లెలో ఒక అంధుడు ఉండేవాడు. రాత్రిపూట చేతిలో లాంతరు లేకుండా బయటికి వచ్చేవాడు కాదు! లాంతరు వెలుగుతూ ఉండేది. చూసేవాళ్లకు అది వింతగా ఉండేది. వెలుగు ఉన్నా, లేకున్నా అంధుడు చూడలేడు కదా! మరి చేతిలో ఆ లాంతరు ఎందుకు ఉన్నట్లు?

ఓ రాత్రి ఆ అంధుడు ఎప్పటిలాగే చేత్తో వెలుగుతున్న లాంతరు పట్టుకుని నడుచుకుంటూ వెళుతున్నాడు. అది చూసి, దారినపోయేవారు కొందరు నవ్వుకున్నారు. ''ఏం పెద్దాయనా! లాంతరు నీకు దారి చూపిస్తోందా? నువ్వు లాంతరుకు దారి చూపిస్తున్నావా?'' అని అడిగాడు.



ఆ మాటకు అంధుడు బాధ పడలేదు.

''ఈ లాంతరు నా కోసం కాదు'' అన్నాడు నవ్వుతూ.

''మరి ఎవరి కోసం'' అన్నారు వాళ్లు.

''మీలాంటి వాళ్ల కోసం'' అన్నాడు అంధుడు.


వాళ్లకు కోపం వచ్చింది. ''నీలా మాకు కళ్లు లేవనుకున్నావా? మాకెందుకు లాంతరు?'' అని అడిగారు.

అంధుడు వాళ్లవైపు చూశాడు. ''లాంతరు లేకపోతే చీకట్లో మీరు.. నేను అంధుడినన్న విషయం తెలుసుకోలేరు. నన్ను తోసుకుంటూ, తొక్కుకుంటూ వెళ్తారు'' అని అన్నాడు.

వాళ్లంతా ఒక్కక్షణం మౌనంగా ఉండిపోయారు. అంధుడికి క్షమాపణ చెప్పి ముందుకు కదిలారు. కంటికి కనిపించిన దాన్ని బట్టే మనం మాట్లాడతాం. రెండోవైపు నుంచి ఆలోచించం. దైవాన్ని కూడా మనం బయటి నుంచే చూసే ప్రయత్నం చేస్తాం. అలా కాదు. అంతర్యానం చేయాలి. అంధుడినైనా, భగవంతుడినైనా అంతర్వీక్షణ చేయాలి. అప్పుడు మాత్రమే నిజం సాక్షాత్కరిస్తుంది.

క్విక్‌ఫుడ్


వంకాయ మసాలా కూర



కావలసినవి: **తెల్లవంకాయలు** – పావు కేజీ; (చిన్నవి ఎంచుకోవాలి), **కొబ్బరి తురుము** – పావు కప్పు; **ఎండుమిర్చి** – 6, **వెల్లుల్లి రేకలు** – 4; **అల్లం** – చిన్న ముక్క, **ఉప్పు** – తగినంత; **పసుపు** – చిటికెడు, **నూనె** – 2 టేబుల్ స్పూన్లు

తయారి: ● వంకాయలను చీలికలుగా కట్ చేయాలి ● బాణలిలో నూనె కాగాక వంకాయలు వేసి వేయించి, ఉప్పు జత చేసి మూత ఉంచాలి ● మిక్సీలో కొబ్బరితురుము, ఎండుమిర్చి, వెల్లుల్లి రేకలు, అల్లం వేసి మెత్తగా చేయాలి ● వంకాయలు బాగా మగ్గాక, పసుపు, కొబ్బరి తురుము పేస్ట్ వేసి కలిపి రెండు నిమిషాలు ఉంచి దించేయాలి.


క్యాబేజీ పకోడీ



కావలసినవి: **శనగపిండి** – అర కప్పు; **బియ్యప్పిండి** – 2 టేబుల్ స్పూన్లు; **కారం** – టీ స్పూను, **ఉప్పు** – తగినంత; **పచ్చిమిర్చి పేస్ట్** – టీ స్పూను, **ఉల్లి తరుగు** – పావు కప్పు; **అల్లం వెల్లుల్లి పేస్ట్** – టీ స్పూను; **నీరు** – తగినంత, **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా

తయారి: ● ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, ఉల్లితరుగు, పచ్చిమిర్చి పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్, నీళ్లు పోసి పిండిని గట్టిగా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, కలిపి ఉంచుకున్న పిండిని పకోడీలలా వేసి, దోరగా వేయించి పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా, నేను ఒకరిని లవ్ చేశా. మొదట్లో బాగానే ఉండేవాళ్లం కానీ, కొంతకాలానికి తన బిహేవియర్‌లో చాలా మార్పు వచ్చింది. ఏంటని అడిగితే.. 'నువ్వు బ్లాక్‌గా ఉన్నావు, నా ఫ్రెండ్స్ నిన్ను వదిలెయ్యమంటున్నారు' అని చెప్పాడు. చాలా గొడవలయ్యాయి. చివరికి విడిపోయాం. ఆ బాధ నుంచి తేరుకోవడానికి చాలా ఇయర్స్ పట్టింది. ఆ తరువాత స్టడీస్ కోసం వేరే ఊరు వెళ్లాను. అక్కడ మరో అబ్బాయి పరిచయమయ్యాడు. లవ్ అన్నాడు, ప్రాణం అన్నాడు. నమ్మాను. కానీ, కాలం గడిచే కొలదీ 'మన పెళ్లి జరగదు' అని చెబుతున్నాడు. ఎందుకు అని అడిగితే.. ''మా అమ్మ చావు బతుకుల్లో ఉన్నప్పుడు.. నేను తనకి మాటిచ్చాను, తను ఎవరిని చూపిస్తే వాళ్లనే పెళ్లి చేసుకోవాలి, తప్పదు!' అన్నాడు. మళ్లీ అదే బాధ, అదే డిప్రెషన్. నాకే ఎందుకు ఇలా జరగాలి?? నేను ప్రేమించడానికి పనికిరానా? అని బాగా ఏడ్చాను. అబ్బాయిలంతా అందాన్ని చూసి లేదా డబ్బుని చూసి పెళ్లిళ్లు చేసుకుంటారని అర్థమయ్యింది. నా అభిప్రాయం తప్పు అని



ప్రూవ్ చేసేవాడు రావాలని కోరుకుంటున్నా కానీ.. నాకు కుజదోషం ఉందట. అలా ఉంటే జీవితాలు నాశనం అయిపోతాయా? డిప్రెషన్‌లోనే ఉంటారా? అసలు నేను ఈ డిప్రెషన్ నుంచి ఎలా బయటికి రావాలి? ప్లీజ్ చెప్పండి అన్నయ్యా.. ప్లీజ్!

- మీ చెల్లెలు

నా చిట్టి బంగారు తల్లి!!

ఎవడమ్మా అన్నది నీకు కుజదోషం ఉన్నదనీ..?

దోషం లేదు... గీషం లేదు...

అలాంటి వెయ్యి దోషాలున్నా రాణించిన గ్రేట్ అమ్మాయిలు లెక్కలేనంతమంది ఉన్నారు.

డిప్రెషన్ని జుట్టు పట్టి ఈడ్చి.. ఒక తన్ను తన్ని.. బయట పడిన తెలుగు అమ్మాయిలలో నువ్వు ఒక దానివి కావాలిరా బంగారం!!

'రామ్ చెల్లెలా మజాకా! ఒక్కసారి గుండెలో రామ్ అన్నయ్యా.. అనుకో! దెబ్బకు డిప్రెషన్ దెయ్యం మూటగట్టుకొని పారిపోతుంది!! కదా.. సార్!?'

ఎగ్జాక్ట్‌లీ! పర్ఫెక్ట్‌గా చెప్పావు నీలూ..!

'సార్ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సార్! ఇట్లా డిప్రెషన్‌తో వేస్ట్ చేసుకోకూడదు కదా సార్!'

నలుపేంటీ.. అందమేంటీ.. ఆస్తి ఏంటీ.. ప్రేమకు ఇవి కనబడవు! కనబడ్డాయంటే అది ప్రేమ కాదు!!

'భలే చెప్పారు సార్!'

నువ్విలా మోటివేట్ చెయ్యి నీలూ.... ఇంకా భలే చెబుతా!

'సార్ మీ చెల్లెలు కూడా మోటివేట్ అయిపోయుంటుంది సార్.. డిప్రెషన్, గిప్రెషన్ జాన్తా నహీ..! అని మంచి డ్రెస్ వేసుకుని క్వీన్‌లాగా కాలేజ్‌కి పోతుంది సార్!'

నీలూ.. ఎంత బాగా చెప్పావు! ఒక్కోసారి నిన్ను చూస్తుంటే...

'ఆ.. చూస్తుంటే..? చెప్పండి సార్ ఏం అనిపిస్తుంది సార్???? చెప్పండి.. చెప్పండి.. ప్లీజ్....!'

అబ్బా వద్దులే ఇంకోసారి చెబుతా నీలూ..!

'సార్ చెప్పకపోతే వన్ మంత్ అరటిపండు క్యాన్సిల్ సార్!'

రాణి లక్ష్మీబాయిలా.. రుద్రమదేవిలా.. మదర్ ఆఫ్ బాహుబలిలా... అనిపిస్తావు నీలూ...!

'ఏంటో సార్! ఏంటో చెబుతారనుకున్నా..! ఏంటో చెప్పారు..! ఏంటో అనుకున్నా.. ఏంటో అనిపిస్తోంది.. ఏంటో....'

అరటిపండు ప్లీజ్!!



లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

పాశుర ప్రభాతం

19వ పాశురం

కుత్తు విళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ఱ పంచశయనత్తిన్ మేలేఱి
కొత్తలర్ పూంకుళల్ నప్పిన్నై కొంగైమేల్
వైత్తుక్కిడంద మలర్ మార్పా! వాయ్ తిఱవాయ్
మైత్తుక్కిడంద మలర్ మార్పా! పాయ్ తిఱవాయ్
ఎత్తనై పోదుమ్ తుయిలెళ వొట్టాయ్ కాణ్
ఎత్తనై యేలుమ్ పిరిపాత్తగిల్లాయాల్
తత్తువమన్రు త్త కవే లోరెంబావాయ్



భావం: గుత్తిదీపాలు వెలుగుతుండగా దంతపు కోళ్ల గల మంచంపై చల్లదనం, మెత్తదనం, తెల్లదనం, ఎత్తు, వెడల్పు అనే అయిదు లక్షణాలు కలిగిన పాన్పుపై ఎ క్కి గుత్తులు గుత్తులుగా వికసిస్తున్న పూలను తలపై ధరించిన నీళాదేవి వక్షఃస్థలాన్ని పడుకొని ఉన్న శ్రీకృష్ణా! నోరు తెరిచి ఒక మాటను పలుకు. కాటుకను ధరించిన విశాలమైన కన్నులు గల ఓ నీళాదేవీ! నీవు నీ ప్రియుణ్ణి ఒక క్షణమైనను నిద్ర నుండి మేల్కొననీయవు కదా! క్షణ కాలపు ఎడబాటును కూడా ఓర్వలేకుండటమనేది నీ స్వరూపానికి తగదు. నీ స్వభావానికి అసలే తగదు అని గోపికలు నీళాదేవిని, శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించారు.

- ఎస్. శ్రీప్రియ

కాసుకో సుడోకు

		4		2			6	
	1		6	4		2		8
			3		8	5		
5		1	9		4		8	
	6						5	
	7		8		5	3		9
		3	7		1			
1		6		9	3		2	
	4			5		8		

నిన్నటి జవాబు

2	9	1	7	4	3	5	6	8
8	6	3	1	2	5	9	7	4
5	7	4	8	6	9	2	3	1
9	1	2	5	3	6	8	4	7
7	3	5	4	8	1	6	9	2
6	4	8	9	7	2	3	1	5
1	2	9	3	5	4	7	8	6
3	5	7	6	1	8	4	2	9
4	8	6	2	9	7	1	5	3

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

"మమకారానికి, సంస్కారానికి తేడా ఏంటి స్వామి?"
"నీ పోస్టుకు నువ్వే లైక్ కొట్టుకుంటే మమకారం ... అదే వేరేవాళ్లకి లైక్‌కొడితే సంస్కారం నాయనా!"

పుణ్య తీర్థం



● శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం



● ఉభయ దేవేరులతో స్వామి వారు

కొబ్బరికొట్టులో కొలువుతీరిన బాలబాలాజీ

కలియుగ ప్రత్యక్ష దైవంగా భాసిల్లుతూ... కోనసీమ వాసుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీ బాల బాలాజీ స్వామి కొలువు తీరిన గ్రామం అప్పనపల్లి. పవిత్ర వైనతేయ గోదావరి నది సోయగాలతో నిత్యం వేలాదిమంది భక్తుల గోవింద నామ స్మరణలతో అలరారుతున్న ఈ గ్రామం తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. గ్రామ చరిత్రను పరిశీలిస్తే ఎన్నో ఆసక్తికర అంశాలు స్ఫురణకు వస్తాయి. బాలాజీ ఎక్కడున్నా నిత్యకల్యాణం పచ్చతోరణమే కదా... అప్పనపల్లి కూడా అదే సంప్రదాయాన్ని అందిపుచ్చుకుంది.

దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం 'అప్పన్న' అనే బాలుడు తపస్సు చేసి తరించడం వల్ల ఈ గ్రామానికి 'అప్పనపల్లి' అని పేరు వచ్చిందని ప్రచారంలో ఉంది. పూర్వం 'అర్పణేశ్వరుడు' అనే యతీంద్రుడు అనేక పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడ వైనతేయ నదీ తీరాన ఇసుక మేటలు వేసిన ప్రశాంత స్థలంలో ముక్కంటిని ధ్యానిస్తూ శివసాక్షాత్కారం పొందాడని, ఈ 'అర్పణ' ఫలితాలు కాలక్రమేణా 'అప్పనపల్లి'గా ప్రసిద్ధి చెందాయని మరో కథనం ప్రచారంలో ఉంది.

కొబ్బరి కొట్టులో కొంగుబంగారంగా...

ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి పూర్వకాలం నుంచి కొబ్బరి కాయల వ్యాపారం చేసేవారు. ఆ వ్యాపారం నష్టాలతో నడుస్తుండడంతో తిరుమల శ్రీవారికి వ్యాపారంలో వాటా పెడతానని మొక్కుకున్నారు. అప్పటినుంచి ఆ వ్యాపారం లాభాల బాటలో పయనించింది. దాంతో మొక్కుబడి ప్రకారం లాభంలో 10 శాతం వాటాను తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామికి సమర్పించేవారు. 1960వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని తీసుకు వచ్చి కొబ్బరి కొట్టులో ప్రతిష్ఠించారు. లాభంలో కొంత వాటాను తిరుమల తిరుపతి తీసుకు వెళ్లి స్వామివారి పాదాల చెంత పెట్టేందుకు రామస్వామి ప్రయత్నించగా అర్చకులు అంగీకరించలేదు. అర్చకులతో వాదించి, వాదించి అలసి నిద్రిస్తున్న రామస్వామికి స్వప్నంలో శ్రీనివాసుడు సాక్షాత్కరించి తానే అప్పనపల్లి వస్తానన్నాడట. అన్నమాట ప్రకారం ముద్దులొలికే బాలుడి విగ్రహ రూపంలో కొబ్బరికాయల మధ్యన కనిపించాడట. ఆ ముద్దుల బాలుని చూసి మైమరచిన రామస్వామి కొట్టులో ప్రతిష్ఠించిన స్వామి వారికి బాల బాలాజీగా నామకరణం చేశారు. ఆ విధంగా ప్రతిష్ఠించిన శ్రీబాల బాలాజీ స్వామి వారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చేవారు. వారి సంఖ్య క్రమేపి పెరిగి దిన దిన ప్రవర్ధమానంగా ఈ ఆలయం ప్రాచుర్యం పొందింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పోటెత్తడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు రామస్వామి.

నూతన ఆలయ నిర్మాణం

1970 మార్చి18న నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కొబ్బరికొట్టులో ప్రతిష్ఠించిన శ్రీవారి చిత్రపటాన్ని అలాగే ఉంచి దానికి సమీపంలో నూతన ఆలయ నిర్మాణానికి రూపకల్పన చేశారు. కొత్తగుడిపై చిత్రీకరించిన గోవు–గొల్లవాడు, గీతోపదేశం వంటి అద్భుత చిత్రాలు భక్తులను పరవశింపజేస్తాయి. 1991లో పద్మావతి, ఆండాళ్, గరుడాళ్వార్‌లను శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు.

అన్నదానానికి ఆదర్శంగా ఆ ఆలయం

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం అన్నదానానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా అప్పనపల్లిలోనే అన్నదానానికి నాంది పలికారు. 1977వ సంవత్సరంలో ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. అన్నదానానికి అప్పనపల్లి ఆదర్శంగా నిలిచింది. నిత్యం బూరె, పులిహోర, మూడు రకాల కూరలు, పెరుగుతో అమలు చేస్తున్న అన్నదాన పథకం ఆలయ చరిత్రలో విశిష్టంగా నిలుస్తుంది. రోజూ ఉదయం తొమ్మిది నుంచి రాత్రి పదకొండు గంటల వరకు ఈ ఆలయంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు.

నిత్యం రెండు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. శని, ఆదివారాలు ఈ సంఖ్య గణనీయంగా ఉంటోంది. స్వామి వారిని దర్శించుకునే భక్తుల్లో అధిక శాతం మంది స్వామి వారి భోజనాన్ని అన్నప్రసాదంగా స్వీకరిస్తున్నారు. నిత్యం లక్ష్మీనారాయణ హోమం, ఉభయదేవేరులతో కల్యాణం, ఏడాదికోసారి దివ్య తిరుకల్యాణోత్సవాలు, అధ్యయనోత్సవాలతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణలతో మారుమోగుతుంటాయి. ప్రస్తుతం జరుగుతున్న ధనుర్మాస దీక్షలు భోగిరోజున జరిగే గోదా కల్యాణోత్సవంతో ముగియనున్నాయి.

> **ఆలయానికి చేరుకునేది ఇలా...**
>
> స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు రాజమండ్రి నుంచి రావులపాలెం మీదుగా తాటిపాక చేరుకోవాలి. రాజమండ్రి నుంచి ఆలయానికి 70 కిలోమీటర్లు దూరం. కాకినాడ నుంచి అమలాపురం పాశర్లపూడి మీదుగా అప్పనపల్లి చేరుకునే వారికి 64 కిలోమీటర్లు. పైన పేర్కొన్న ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సదుపాయాలు ఏర్పాటు చేశారు.

- ఏడిద బాలకృష్ణారావు
సాక్షి, మామిడికుదురు, తూర్పు గోదావరి జిల్లా

సందర్శనీయం

అద్భుతాలమయం భోగేశ్వరాలయం



ఓరుగల్లు అనగానే కాకతీయులు నిర్మించిన శ్రీ రుద్రేశ్వర స్వామి ఆలయం (వేయి స్తంభాల గుడి), శ్రీ సిద్ధేశ్వర ఆలయం, శ్రీ పద్మాక్షి ఆలయం, శ్రీ భద్రకాళి ఆలయం వంటివి జ్ఞాపకం రావడం సహజం. అయితే, వాటితోపాటు వరంగల్లు, హన్మకొండల నడుమ మరో సుప్రసిద్ధమైన ఆలయం ఉంది. అదే శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం. మట్టెవాడ అనే ప్రదేశంలోని ఈ ఆలయం గర్భాలయంలోని ప్రధాన లింగం ఎంతో విశిష్టమైనది. పానవట్టం పైన ఉన్న లింగభాగాన్ని పక్కకు జరపడానికి వీలుగా ఉంటుంది. పానవట్టం కింది భాగం బోలుగా ఉంటుంది. పానవట్టం అడుగుభాగంలో, శివలింగం కింద మేరుప్రస్తార రూపంలో ఉన్న ఒక శ్రీచక్రం ఉన్నదట. ఆ శ్రీచక్రం కింద సువర్ణలింగం ఉన్నదని ప్రతీతి. ఆ శ్రీచక్రం బిందుస్థానంలో మరొక చిన్న రాతి లింగం ఉన్నదట. అంటే అది అంతరలింగం అన్నమాట. ఆ శ్రీచక్రాన్ని కప్పివేస్తూ పానవట్టం ఉంటుంది. ఈ భోగేశ్వరలింగానికి అభిషేకం చేస్తే, ఏకాదశ రుద్రాభిషేకం చేసిన ఫలితం లభిస్తుందని అంటారు. మరోవిశేషం ఏమిటంటే,



ఈ శివలింగానికి ఎన్ని బిందెల నీళ్లతో అభిషేకం చేసినా, ఒక్క చుక్క నీరు కూడా సోమ సూత్రం ద్వారా బయటకు రాదు. గుడికి నైరుతి భాగంలోని బావిలోకి పోతుందంటారు. శివలింగానికి వెనకవైపున వామాంకిత స్థితయైన గౌరీదేవితో సహా ఈశ్వరుని విగ్రహం, ఆ విగ్రహం పైభాగంలో ఒక తల ఉంది. ఈ ఆలయ నిర్మాణ శైలిని బట్టి, గోడలపై చెక్కిన శిలాశాసనాలను బట్టి అది కాకతీయుల కాలం నాటిదని ఇట్టే చెప్పవచ్చు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

ఎక్కడ ఉంది? వరంగల్ స్టేషన్ నుంచి దాదాపు మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఈ భోగేశ్వర ఆలయం ఉంది. వరంగల్ నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాలద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

ఈఎన్‌టీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్



తరచు గొంతు బొంగురు ఎందుకిలా?

నేను లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల అప్పుడప్పుడూ నాకు గొంతు బొంగురుపోయినట్లుగా అనిపిస్తోంది. నాలాంటి వారు గొంతు విషయంలో నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పండి.

- సంతోష్, విజయవాడ

కొంతమంది తమ వృత్తిపరంగా తమ గొంతునూ, స్వరాన్ని ఎక్కువగా ఉపయోగించాల్సి ఉంటుంది. వీరిని ప్రొఫెషనల్ వాయిస్ యూజర్స్ అంటారు. అంటే ఉదాహరణకు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, గాయకులు, రేడియోజాకీలు, సేల్స్ జాబ్‌లో ఉండేవాళ్లు. వీళ్ల రోజూ తమ రోజువారీ పనిలో గొంతునే ఉపయోగించాల్సి ఉంటుంది. వీళ్ల రోజువారీ పనులు ముగిశాక వాళ్ల వోకల్ కార్డ్స్ ఎంతగానో అలసిపోతాయి. ఇలాంటి వారు తమ గొంతు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే... ● రోజులో కనీసం 15 నిమిషాల పాటు చొప్పున మూడుసార్లైనా తమ గొంతుకు పూర్తిగా విశ్రాంతి ఇవ్వాలి. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి ● రోజూ నీళ్లు పుష్కలంగా తాగాలి ● ఆల్కహాల్ తీసుకోవడం పూర్తిగా మానేయాలి. పొగాకు అలవాటును తక్షణం వదిలేయాలి. కాఫీ అలవాటును పూర్తిగా తగ్గించుకోవాలి ● గొంతు గరగర వచ్చి అది సుదీర్ఘకాలం ఉంటే తప్పకుండా ఈఎన్‌టీ నిపుణులను కలుసుకొని తగిన చికిత్స తీసుకోవాలి. కొందరిలో యాసిడ్ పైకి ఎగజిమ్మడం వల్ల కూడా గొంతులో సమస్యలు వస్తుంటాయి. కాబట్టి ఇలాంటివారు తప్పకుండా తమ అసిడిటీ తగ్గించుకోవాలి.

వోకల్ నాడ్యుల్స్ అంటే ఏమిటి?

నేను ఒక ప్రైవేటు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు కోచింగ్ ఇస్తుంటాను. ఇటీవల నా గొంతు బొంగురుగా ఉంటే ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించాను. 'వోకల్ నాడ్యుల్స్' వచ్చాయని అన్నారు. ఇవి ఎందుకు వస్తాయి? నాకు తగిన పరిష్కారం చెప్పండి.

- సుధాకర్, విశాఖపట్నం

మీలాంటి సమస్యనే చాలామందిలో చూస్తుంటాం. వృత్తిపరంగా గొంతును ఎక్కువగా ఉపయోగించే చాలామందిలో కనిపించే ప్రధాన సమస్య వోకల్ నాడ్యూల్స్. ఇందులో స్వరపేటికలోని రెండు అర్ధభాగాలు కలిసే చోట కండ ఒక చిన్న గడ్డలా పెరుగుతుంది. ఇలా పెరిగిన వోకల్ నాడ్యూల్స్ వల్ల స్వరపేటికలోని రెండు అర్ధభాగాలు పూర్తిగా మూసుకుపోవు. దాంతో కంఠస్వరంలో మార్పు వస్తుంది. సాంకేతికంగా చెప్పాలంటే మన మాటల్లో మునుపు ఉండే నాణ్యత (క్వాలిటీ ఆఫ్ వాయిస్) లోపిస్తుందన్నమాట. అంతేగాక ఒక్కోసారి గొంతు బొంగురుపోయినట్లుగా ఉండటం, మాట్లాడే సమయంలో నొప్పి రావడం, మాట వస్తూ వస్తూ మధ్యలో ఆగిపోవడం వంటివీ జరగవచ్చు. మాట పూర్తిగా పెగలకపోవచ్చు. లోగొంతుకతో మాట్లాడుతున్నట్లూ అనిపించవచ్చు. అంతేగాక... స్వరపేటికలో స్వరతంత్రులు (వోకల్ కార్డ్స్) కూడా ఉంటాయి. వీటిలోనూ మళ్లీ ట్రూ కార్డ్స్, ఫాల్స్ కార్డ్స్ అనే రకాలుంటాయి. ఈ సమస్య ఉన్నవారిలో ట్రూ కార్డ్స్ అనేవి స్పందించినప్పుడు గొంతులో నొప్పి వస్తుంటుంది. అందువల్ల ఆ నొప్పిని అధిగమించడానికి వీళ్లు ఫాల్స్ కార్డ్స్ అనే తంత్రుల సహాయంతో మాట్లాడుతుంటారు. దానివల్ల స్వరంలో మార్పు వస్తుందన్నమాట. మీరు ఈఎన్‌టీ నిపుణులను, స్పీచ్ థెరపిస్ట్‌లను కలవండి. మీ నాడ్యూల్స్ మరీ ఎక్కువ పరిమాణానికి పెరిగితే అవసరమైతే శస్త్రచికిత్స చేసి వాటిని తొలగించడం వల్ల మీకు ఉపశమనం కలుగుతుంది.

ముక్కులో ఎప్పుడూ ఏమిటా అడ్డు?



నాకు ముక్కులో ఎప్పుడూ ఏదో అడ్డం పడినట్లుగా అనిపిస్తుంది. చాలా రకాల మందులు వాడాను. అవి వాడుతున్నప్పుడు సమస్య తాత్కాలికంగా తగ్గినట్లు అనిపించినా మళ్లీ తిరగబెడుతోంది. రాత్రిపూట రెండు ముక్కు రంధ్రాలు మూసుకుపోతున్నాయి. నోటితో గాలి తీసుకోవాల్సి వస్తోంది. నా సమస్య ఏమిటి? దీనికి తగిన పరిష్కారం చెప్పండి.

- అరుణ్‌కుమార్, ఖమ్మం

ఇటీవల కాలుష్యం వల్ల, జీవనశైలిలో మార్పుల వల్ల చాలామందిలో అలర్జీ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలర్జీ సంబంధిత సమస్యలలో మొదట ఉండేది ముక్కుకు సంబంధించిన సమస్యలే. మీరు చెప్పిన వివరాలను బట్టి మీకు ముక్కుదూలం వంకరపోవడం లేదా అలర్జీ లేదా ముక్కులో పాలిప్స్ లేదా ఈ అన్ని సమస్యలు కలగలిసి ఉండవచ్చు. మీరు మొదట నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించి ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేయించి, అవసరమైతే సీటీ స్కాన్ కూడా తీయించాల్సిరావచ్చు. ఈ పరీక్షలతో ముందుగా మీ వ్యాధిని నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. వాటిలో వచ్చే ఫలితాల ఆధారంగా చికిత్స ఉంటుంది.

మీకు ముక్కుదూలం వంకరపోతే దాన్ని ఒక చిన్న ఆపరేషన్‌తో సరిచేయవచ్చు. దీనినే సెప్టోప్లాస్టీ అంటారు. లేదా ముక్కులో పాలిప్స్ ఉన్నట్లయితే వాటిని కూడా ఆపరేషన్‌తో తొలగించవచ్చు. అలర్జీ వల్ల వచ్చే సమస్య అయి ఉంటే అందుకు కారణమైన అంశాలకు దూరంగా ఉండటం, ముఖ్యంగా కాలుష్యానికి దూరంగా ఉండటం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాజా పదార్థాలు మాత్రమే తినడం, చల్లటి వాతావరణానికి, వస్తువులను దూరంగా ఉండటం వంటి చేయడం వల్ల మీ సమస్యను నివారించవచ్చు. కొన్ని రకాల నేసల్ స్ప్రేలు వాడటం వల్ల మీ సమస్యను అదుపులో ఉంచవచ్చు.

గుండె సర్జరీ తర్వాత గొంతులో ఏదో అసౌకర్యం... ఎందుకిలా?



నాకు ఇటీవలే 'ఓపెన్ హార్ట్ సర్జరీ' అయ్యింది. అప్పట్నుంచి మాట సరిగా రావడం లేదు. మాట్లాడబోతుంటే గాలిలాగా వస్తోంది. తినేప్పుడు, తాగేప్పుడు, మింగడంలో ఇబ్బందిగా ఉంది. ఎప్పుడూ గొంతులో ఏదో అడ్డం పడ్డట్లుగా ఉంది. దగ్గు కూడా వస్తోంది. దీనికి తగిన పరిష్కారం చూపండి.

- అనిల్‌కుమార్, హైదరాబాద్

మీకు స్వరపేటికలోని 'వోకల్ ఫోల్డ్'లో సమస్య ఉన్నట్లుగా అనిపిస్తోంది. గుండెకు సంబంధించిన ఆపరేషన్లు (ముఖ్యంగా ఓపెన్ హార్ట్ సర్జరీ), ట్రకియాస్టమీ, మెడ, ఊపిరితిత్తులకు సంబంధించిన ఆపరేషన్లలో కొన్నిసార్లు 'వోకల్ ఫోల్డ్'పై ఒత్తిడి పడటానికీ లేదా అవి చెడిపోవడానికి ఆస్కారం ఉంటుంది. దాంతో మింగడం, మాట్లాడటంలో సమస్యలు రావచ్చు.. కొన్నిసార్లు వోకల్‌ఫోల్డ్ పెరాలసిస్ వచ్చేందుకూ అవకాశం ఉంది. మీ సమస్యను నిర్ధారణ చేయడానికి ముందుగా మీరు నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించి 'ల్యారింగోస్కోపీ లేదా ఎండోస్కోపీ' వంటి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. అంతేగాక స్పీచ్ థెరపిస్ట్‌ను సంప్రదించి మింగడంలోని ఇబ్బందులు తొలగిపోడానికీ, గొంతురావడానికి అవసరమైన ఎక్సర్‌సైజ్‌లను తెలుసుకుని వాటిని ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది.



- డాక్టర్ ఇ.సి. వినయ కుమార్
హెచ్‌ఓడి & ఈఎన్‌టి సర్జన్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్

పరి పరిశోధన

మూడింతల దిగుబడికి కొత్త రూటు!

మంది పెరిగితే మజ్జిగ పలచనవుతుందని నానుడి. ఇంట్లో అయితే ఓకే గానీ.. అంగుళం నేల కూడా పెరగని భూమిపై జనాభా ఇబ్బడిముబ్బడి అయితే ఆహారం ఎల్లా? ఈ చిక్కు ప్రశ్నకు శాస్త్రవేత్తలు రకరకాల పరిష్కారాలు వెతుకుతున్నారు గానీ. తాజాగా సిడ్నీ, క్వీన్స్‌ల్యాండ్ యూనివర్శిటీల శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన పద్ధతికి పదును పెడుతున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ పదేళ్ల క్రితం ప్రయత్నించి, వదిలేసుకున్న ఒక పద్ధతితో పంట దిగుబడులు మూడు రెట్లు ఎక్కువ చేయవచ్చునని వీరు అంటున్నారు. మొక్కలు ఎదిగేందుకు కీలకమైన కిరణజన్య



సంయోగక్రియ మరింత మెరుగ్గా, రోజంతా జరిగేలా చేయడం ఈ 'స్పీడ్ బ్రీడింగ్' టెక్నిక్‌లోని కీలకాంశం. దీంట్లో మొక్కలు వేగంగా పెరిగేందుకు, కాపుకొచ్చేందుకు అనువైన నిర్దిష్ట తరంగ దైర్ఘ్యాలతో కూడిన కాంతిని చౌక ఎల్‌ఈడీ బల్బులతో అందిస్తారు. ఒక గ్రీన్‌హౌస్‌లో తామిప్పటికే కొన్ని ప్రయోగాలు చేశామని ఏడాది సమయంలో ఆరు పంటల గోధుమలు పండించడమే కాకుండా... సెనగ, బార్లీ, ఆవ పంటలు కూడా వేశామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త లీ హెకీ తెలిపారు. వేరుసెనగ, గోంగూర, పప్పుధాన్యాలు, సూర్యకాంతి, మిరియాలు, ముల్లంగి వంటి పంటలను కూడా స్పీడ్ బ్రీడింగ్ ద్వారా ఎక్కువగా పండిచేందుకు అవకాశముందని వివరించారు. కొత్త పద్ధతి ద్వారా కేవలం ఒక చదరపు మీటర్ వైశాల్యంలో 900 బార్లీ మొక్కలను పండించామని, దిగుబడులతో పాటు పౌష్టిక విలువలను కూడా కాపాడుకోవచ్చునని వివరించారు. జన్యుపరమైన మార్పులేవీ అవసరం లేకుండా... అతితక్కువ ఎరువులు, కీటకనాశనుల సాయంతో మూడింతల దిగుబడి సాధించగల స్పీడ్ బ్రీడింగ్ వివరాలు నేచర్ ప్లాంట్స్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

మారకపోతే... పావు వంతు ఎడారే!

భూమి ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు పెరిగితే చాలు... పావు వంతు నేల బతికేందుకు వీల్లేని రీతిలో ఎడారిగా మారిపోవడం ఖాయం అంటున్నారు శాస్త్రవేత్తలు. అంతేనా. దీనివల్ల వ్యవసాయం దెబ్బతినడమే కాదు... జీవవైవిధ్యం అంతరించిపోయి, మరిన్ని కరువుకాటకాలు, కార్చిచ్చులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ విష



యాలన్నీ గతంలో విన్నవే అయినప్పటికీ అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ఒకటి ఇంకోసారి ఈ విపరిణామాలను ధ్రువీకరించింది కాబట్టి ప్రాధాన్యమేర్పడింది. నేచర్ క్లయిమేట్ ఛేంజ్ జర్నల్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం... ప్రపంచ వాతావరణ భవిష్యత్తుకు సంబంధించి అందుబాటులో ఉన్న 27 కంప్యూటర్ నమూనాల విశ్లేషణ ద్వారా తుది అంచనాకు వచ్చారు. భూతాపోన్నతికి కారణమవుతున్న గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించకపోతే 2052 – 70 మధ్య కాలానికే సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీల కంటే ఎక్కువవుతుందని వారు హెచ్చరించారు. ఆస్ట్రేలియాలోని దక్షిణ భాగం, దక్షిణాఫ్రికా, ఆగ్నేయాసియా, మధ్య అమెరికా ప్రాంతాల్లో ఈ ఎడారీకరణ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల దాదాపు 150 కోట్ల మంది ప్రభావితమవుతారని ఈ పరిశోధనల్లో పాలు పంచుకున్న శాస్త్రవేత్త మనోజ్ జోషీ తెలిపారు. అయితే ప్యారిస్ ఒప్పందంలో నిర్ణయించిన మాదిరిగా సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయగలిగితే మాత్రం ఈ ప్రమాదాన్ని దాదాపుగా పరిహరించవచ్చునని వివరించారు.

మధుమేహానికి మందు... మతిమరపును తగ్గిస్తుందా?

కొండనాలుకకు మందేస్తే... ఉన్న నాలుక ఊడింది అని సామెత గానీ.. ఈ వార్త మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. జీవితాంతం వాడే మధుమేహం మందుల వల్ల మన వయసుతోపాటు వచ్చే మతిమరపు లక్షణాలు తగ్గుతాయని తాజా పరిశోధన ఒకటి స్పష్టం చేస్తోంది మరి! లాంచెస్టర్ విద్యాలయ శాస్త్రవేత్తలు ఎలుకలపై కొన్ని పరిశోధనలు చేయడం ద్వారా ఈ విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. మతిమరుపు వ్యాధి కలిగి ఉన్న ఎలుకలకు లిరాగ్లుటైడ్ అనే మందును ఇచ్చి పరిశీలించారు. కొంతకాలం తరువాత వాటి



జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని పరీక్షలు పెట్టారు. ఎలుకలు మంచి పురోగతి చూపించాయి. అంతేకాకుండా వీటి శరీరాల్లో నాడుల పనితీరును రక్షించే బ్రెయిన్ గ్రోత్ ఫ్యాక్టర్స్ కూడా ఎక్కువైనట్లు తెలిసింది. అంతేకాకుండా ఒత్తిడి కారణంగా వచ్చే వాపు, ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటివి కూడా తక్కువగా ఉన్నాయని, నాడీ కణాలు నాశనమయ్యే వేగం కూడా తగ్గిందని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త హోచర్ తెలిపారు. అల్జైమర్స్, పార్కిన్‌సన్స్ వంటి వ్యాధులు నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో వస్తూంటాయని, దాదాపు 15 ఏళ్లుగా ఈ వ్యాధులకు కొత్త మందులేవీ లేని నేపథ్యంలో తమ తాజా పరిశోధనకు ప్రాముఖ్యత ఏర్పడిందని ఆయన వివరించారు. అల్జైమర్స్ వ్యాధిగ్రస్తుల్లో ఇన్సులిన్ నిరోధకత కూడా ఉన్నట్లు ఇప్పటికే గుర్తించిన నేపథ్యంలో మధుమేహానికి తీసుకునే మందులతోనే మతిమరపు కూడా తగ్గడం వల్ల అదనపు ప్రయోజనాలు ఉంటాయంటున్నారు.



రామ్‌చరణ్



ప్రభాస్

బాలీవుడ్‌లో ప్రేమ్ కీ కహానీ!

బాలీవుడ్‌లో ప్రజెంట్ టాప్ హీరోలు ఎవరు?... అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్... ఇలా రేస్‌లో చాలామంది ఉన్నారు. కానీ బాలీవుడ్‌లో 500 కోట్ల క్లబ్‌లో చేరిన సినిమాల లిస్ట్ గురించి మాట్లాడితే.. అందులో 'బాహుబలి' మొదటి వరసలో ఉంటుంది. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన సినిమా 'బాహుబలి' అని ప్రపంచం మొత్తానికి తెలుసు. అయితే.. ఇప్పుడు బాలీవుడ్ టాప్ యాక్టర్స్ లిస్ట్‌లో చేరేందుకు ప్రభాస్ రెడీ అవుతున్నారు. అదేనండీ.. ప్రభాస్ బీటౌన్‌లో హీరోగా చేయబోతున్నారు అని చెబుతున్నాం. ''నేను హిందీ సినిమాలు చూస్తాను. హైదరాబాద్‌లో 60 పర్సెంట్ పీపుల్ హిందీలో మాట్లాడగలరు. బాలీవుడ్ నుంచి మంచి ఆఫర్స్ వస్తున్నాయి. హిందీ సినిమాలో నటించడానికి మూడేళ్ల క్రితం ప్రేమ కథ విన్నాను. నచ్చింది. 'సాహో' తర్వాత నటించాలనుకుంటున్నాను. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ 'బాహుబలి' టీమ్‌కి హెల్ప్ చేశారు. ఆయన ఇచ్చిన పార్టీలో బాలీవుడ్ యాక్టర్స్‌ను కలిశాను'' అని పేర్కొన్నారు ప్రభాస్. మహేంద్ర బాహుబలి, అమరేంద్ర బాహుబలిగా శక్తిమంతమైన పాత్రల్లో కనిపించిన ప్రభాస్ నెక్స్ట్ హిందీలో ప్రేమ్ కీ కహానీలో కనిపించడం కొత్తగా ఉంటుందనే చెప్పాలి. ప్రజెంట్ 'రన్ రజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న సినిమా 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయిక. ప్రస్తుతం న్యూ ఇయర్ హాలిడేస్‌లో ఉన్న ప్రభాస్ త్వరలో ఈ మూవీ నెక్ట్స్ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యేందుకు రెడీ అవుతున్నారట.

సంక్రాంతికి బ్రేక్!

రెడీ అవుతున్నారు. షూట్‌లో జాయిన్ అయ్యేందుకు చిట్టిబాబు రెడీ అవుతున్నారు. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న సినిమా 'రంగస్థలం'. ఇందులో సమంత కథానాయిక. సినిమాలో రామ్‌చరణ్ చిట్టిబాబు పాత్ర పోషిస్తున్నారు. ఈ రోజు నుంచి ప్రారంభమయ్యే ఈ సినిమా షూటింగ్ ఈ నెల 12 వరకూ హైదరాబాద్‌లో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. సంక్రాంతికి బ్రేక్ తీసుకుంటారట 'రంగస్థలం' టీమ్. ఆ తర్వాత రాజమండ్రిలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్‌లో రామ్‌చరణ్ పాల్గొంటారట. ఆల్రెడీ డబ్బింగ్ కార్యక్రమాలను కూడా స్టార్ట్ చేశారని సమాచారం. ఫైనల్‌గా ఈ నెల ఎండింగ్ కల్లా షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నారట చిత్రబృందం. ఈ సినిమాను మార్చి 30న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే రామ్‌చరణ్ హీరోగా బోయపాటి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో తారక రత్నను విలన్‌గా తీసుకోవాలని చిత్రబృందం ఆలోచిస్తుందని ఫిల్మ్‌నగర్‌లో నయా గుసగుసలు వినిపిస్తున్నాయి.



వరుణ్ తేజ్

పాటతో ముగింపు!

జస్ట్... మూడంటే మూడే రోజులు షూటింగ్ జరిపితే వరుణ్ తేజ్ ప్రేమకథ కంప్లీట్ అవుతుందట. వరుణ్ తేజ్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'తొలి ప్రేమ'. ఇందులో రాశీ ఖన్నా కథానాయిక. ''షూటింగ్ ఆల్మోస్ట్ కంప్లీట్ అయ్యింది. వైజాగ్‌లో జరుపబోయే మూడు రోజుల సాంగ్ షూట్‌తో మూవీ కంప్లీట్ అవుతుంది. ఆల్రెడీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను సార్ట్ చేశాం'' అని యూనిట్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ సినిమాను ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... తమిళ డైరెక్టర్ ప్రభు సాల్మన్ దర్శకత్వంలో బందేవ్ పాత్రలో రానా నటిస్తున్న సినిమా 'హాథీ మేరే సాథీ'. ఇందులో వరుణ్ తేజ్ కూడా కీలక పాత్ర చేయనున్నారట. ''హాథీ మేరే సాథీ'లో రానా, వరుణ్ తేజ్ పాత్రలకు ఈక్వెల్ ఇంపార్టెన్స్ ఉంటుంది. కోట శ్రీనివాసరావుగారు ఓ ముఖ్యపాత్రలో కనిపిస్తారు. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కించి తమిళ్‌లో డబ్ చేయాలనుకుంటున్నాం'' అని పేర్కొన్నారు సాల్మన్. అంతేకాదు.. ఈ నెల 25 నుంచి మార్చి వరకు ఈ సినిమా షెడ్యూల్‌ను థాయ్‌ల్యాండ్‌లో ప్లాన్ చేశారట చిత్రబృందం. ఆ తర్వాత కేరళలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని సమాచారం.

బాలాజీ మహిమలతో...

సాయికుమార్, సుమన్, యస్.పి బాలసుబ్రహ్మణ్యం, భానుశ్రీ మెహ్రా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ' శ్రీ చిలుకూరి బాలాజీ'. ఫిల్మీడియా ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 5న రిలీజ్ కానుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఐఏయస్ ఆఫీసర్ డాక్టర్ కేవీ రమణ సౌజన్యంతో నిర్మాత 'దిల్' రాజు ఈ సినిమాను విడుదల చేయిస్తున్నారని అల్లాణి శ్రీధర్ తెలిపారు. ఆయన ఇంకా మాట్లాడుతూ– ''యువతరానికి వీసాల బాలాజీగా ఆశీర్వాదాలు అందిస్తూ తరతరాలుగా ఆరాధించబడుతున్న చిలుకూరి బాలాజీ గొప్పతనాన్ని, ఆ ఆలయ పురాణాన్ని ఒక దృశ్యకావ్యంగా చిత్రీకరించాం. చినజీయర్ స్వామి విడుదల చేసిన ఆడియోకి మంచి స్పందన వస్తోంది. అర్జున్ మంచి సంగీతాన్ని అందించారు. సుద్దాల అశోక్ తేజ, జొన్నవిత్తుల, రాపర్తి వీరేంద్ర, రాణి పులోమజాదేవి మంచి సాహిత్యం అందించారు. సినిమాను మెచ్చి రిలీజ్ చేస్తున్న 'దిల్' రాజుకి ధన్యవాదాలు'' అన్నారు.



ఎస్పీ బాలు



రకుల్ ప్రీత్‌సింగ్

ఒక్కసారి కమిట్ అయితే...

... నా మాట నేనే వినను అని 'పోకిరి'లో మహేశ్‌బాబు చెప్పిన డైలాగ్‌ని అంత ఈజీగా మరచిపోలేం. రకుల్ ప్రీత్‌సింగ్ మాటలు వింటుంటే.. ఈ డైలాగ్‌ని కొంచెం రివర్స్ చేయొచ్చేమో. 'ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేను కచ్చితంగా వింటా' అన్నట్లుగా ఆమె చెప్పిన మాటలు ఉన్నాయి. ఇంతకీ రకుల్ ఏమన్నారంటే?... 'నాన్నకు ప్రేమతో'లో ఈ బ్యూటీ తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు కదా. ఆ తర్వాత సరైనోడు, ధృవ, విన్నర్, రారండోయ్ వేడక చూద్దాం, జయ జానకి నాయక, స్పైడర్ సినిమాలు చేశారు. కానీ డబ్బింగ్ చెప్పుకోలేదు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆమె తీసుకున్న నిర్ణయాల్లో ఇక నుంచి తెలుగులో తాను చేసే క్యారెక్టర్లకు సొంత గొంతు వినిపించాలనే డెసిషన్ ఒకటి. ''నేను తెలుగు బాగా మాట్లాడతా. ఎంత బాగా అంటే నా మాతృభాష పంజాబీకన్నా బాగా మాట్లాడుతున్నా. అందుకే 'నాన్నకు ప్రేమతో'లో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నా. ఈ 2018లో చేసే సినిమాలన్నింటికీ అలానే చేయాలని కమిట్ అయ్యా'' అన్నారు రకుల్. మంచిది. మంచి నిర్ణయమే. ఎంత బాగా యాక్ట్ చేసినా సొంత గొంతు వినిపిస్తే ఆ తృప్తే వేరు. 'కంప్లీట్ ఆర్టిస్ట్' అని కూడా అనిపించుకోవచ్చు.

ఆ విషయంలో నేను లక్కీ

''కంగారుగా సినిమాలు చేయడానికి ఇష్టపడను. ఇప్పుడు నేను చేస్తున్న సినిమాలను పదేళ్ల తర్వాత చూసుకున్నప్పుడు.. అప్పట్లో మంచి ప్రయత్నమే చేశాం అనే ఫీల్ ఉండాలనుకుంటున్నాను. ప్రతి సినిమాకు నా బెస్ట్ ఇవ్వాలని తాపత్రయపడతాను'' అన్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. 'అల్లుడు శీను, స్పీడున్నోడు, జయజానకి నాయక' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీనివాస్ పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా మంగళవారం పాత్రికేయులతో ఆయన చెప్పిన విశేషాలు.

■ ప్రస్తుతం నేను హీరోగా నటిస్తున్న 'సాక్ష్యం' సినిమాలో మంచి స్టోరీ కంటెంట్ ఉంది. యూనిక్ కాన్సెప్ట్. యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు. ఇందులో వీడియో గేమ్ డైరెక్టర్ పాత్ర చేస్తున్నాను. ఫస్ట్ టైమ్ ఫ్లై బోర్డింగ్, ఏటీవీ రైడింగ్‌తోపాటు బీఎమ్ఎక్స్ రైడింగ్ చేశాను. నా ఇంట్రడక్షన్ కూడా బీఎమ్ఎక్స్ సైక్లింగ్‌పై ఉంటుంది. ఇందుకోసం దుబాయ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాను. కాన్సెప్ట్ బేస్డ్‌గానే సినిమాలో ఐదు మేజర్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. రిలీజయ్యాక మంచి ప్రయత్నం అని ప్రేక్షకులు మెచ్చుకునేలా 'సాక్ష్యం' ఉంటుందని ఆశిస్తున్నాను. షూటింగ్ 70 పర్సెంట్ కంప్లీట్ అయ్యింది. న్యూయార్క్ షెడ్యూల్, మూడు పాటలు, క్లైమాక్స్ తప్ప షూటింగ్ కంప్లీట్ అయ్యింది. రివెంజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కొత్త యాంగిల్ 'సాక్ష్యం'. శ్రీవాస్‌గారి వర్కింగ్ స్టైల్ సూపర్. ఎంజాయ్ చేస్తూ క్యారెక్టర్ చేస్తున్నాను. ఈ సినిమాలో నా లుక్ ట్రెండీగా ఉంటుంది.

■ 'అల్లుడు శీను' నాకు నచ్చి చేశాను. 'జయజానకి నాయక' ఫుల్ ఎమోషనల్ లవ్‌స్టోరీ. బోయపాటిగారు బాగా తీశారు. 'స్పీడున్నోడు' సినిమా తర్వాత బోయపాటిగారి లాంటి స్టార్ డైరెక్టర్ నన్ను నమ్మారు. నాలో ఆయనకు ఏం నచ్చిందో తెలీదు. నా మీద నమ్మకం ఉంచిన ఆయనకు థ్యాంక్స్. 'స్పీడున్నోడు' నుంచి ' జయజానకి నాయక' సినిమాకు ఆరు నెలల్లో ఆల్మోస్ట్ 20 కేజీల బరువు తగ్గాను. ఇది అనుకున్నంత ఈజీ కాదు. ఇప్పటి వరకు కెరీర్‌వైజ్‌గా నాది అమేజింగ్ జర్నీ. గతేడాది లాగానే ఈ ఇయర్ కూడా సక్సెస్‌ఫుల్‌గా సాగాలని కోరుకుంటున్నాను. మాస్ ఇమేజ్ కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసి సినిమాలు చేయలేదు. అలా కథలు కుదిరాయి. ఈ విషయంలో ఐయామ్ లక్కీ అనిపిస్తుంది.

■ ప్రతి విషయంలో నేను పాజిటీవ్‌గానే ఆలోచిస్తాను. విమర్శలను స్వీకరించగల మెంటల్‌స్టైంత్ ఉంది. ప్రతి ఒక్కరు నేను ప్రొడ్యూసర్ (బెల్లంకొండ సురేష్) కొడుకు అనుకుంటారు. కానీ నేను చాలా కష్టపడతాను అని ఆలోచించేవారు తక్కువగా ఉంటారేమో.

■ ప్రస్తుతం నాకున్న ఇమేజ్‌తో హ్యాపీ. డైరెక్టర్స్‌లో కొత్త, పాత అన్న తేడా లేదు. మంచి కథ ఉంటే ఏ డైరెక్టర్‌తో అయినా చేస్తాను. నెక్ట్స్ మూవీ కోసం కథలు వింటున్నా. ఏడాదికి రెండు సినిమాలు చేయాలని ఉంది. తమిళ సినిమాల ఆలోచన ఇప్పట్లో లేదు. భవిష్యత్‌లో ద్విభాషా చిత్రం చేస్తానేమో చూడాలి.



బెల్లంకొండ శ్రీనివాస్

అప్పుడు ఉయ్యాల ఇప్పుడు రంగుల రాట్నం


మాస్‌కి ఈజీగా నచ్చేసే కుర్రాడు రాజ్ తరుణ్. మొదటి సినిమా 'ఉయ్యాల జంపాల'తో మంచి పేరు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ద్వారా రాజ్ తరుణ్‌ని హీరోగా పరిచయం చేసిన అన్నపూర్ణ స్టూడియోస్ మళ్లీ అతనితో ఓ సినిమా నిర్మించింది. 'రంగుల రాట్నం' పేరుతో శ్రీ రంజని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో చిత్రా శుక్లా హీరోయిన్. షూటింగ్ కంప్లీట్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సంక్రాంతికి సినిమా రిలీజ్ కానుంది. సితార, ప్రియదర్శి ముఖ్య పాత్రలు చేసిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: ఎల్.కె. విజయ్, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్.



రాజ్ తరుణ్, చిత్ర

ముగ్గు-ముచ్చట

14 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు
సరిచుక్క



చల్లా ఉమాదేవి
కలువాయి, ఎస్‌పిఎస్ఆర్ జిల్లా

25 చుక్కలు
5 వరుసలు
2 చుక్కలు వదిల
7 వచ్చేవరకు
ఒక చుక్క వదిలి
5 చుక్కలు
రెండు వరుసలు



పొరండ్ల రూప
శాయంపేట
వరంగల్ జిల్లా

21 చుక్కలు – 1 వచ్చేవరకు – సరిచుక్క



జి. సుమారెడ్డి, హైదరాబాద్

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

డబ్బింగ్ క్లాసిక్స్ - 6

సవతి సోదరుల మధ్య ఘర్షణ



పూర్వం ధర్మం ప్రకారం, అంటే అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిచి, సంఘం అంగీకారంతో చేసుకునే భార్యను 'ధర్మపత్ని' అనేవారట.

ధర్మపత్ని అంటే మొదటి భార్య అని అర్థం.

భర్త శారీరక, మానసిక అవస్థలపై ఆస్తులపై అధికారాలపై ఈమెకే సగభాగం దక్కుతుంది. ఈమె పిల్లలే వారసులు అవుతారు. అధికారిక హక్కుదారులు అవుతారు.

రెండవ భార్యకు ఈ హక్కు ఉండదు. ఆమె సంతానానికీ ఉండదు.

దశరథుడి ధర్మపత్ని కౌసల్యకు పుట్టిన రాముడే అయోధ్యకు వారసుడు. కాదని కారడవులకు పంపడం వల్లే రామాయణం జరిగింది.

తండ్రి మీద హక్కు కోసం లక్ష్మణుడు, భరతుడు, శతృఘ్నుడు పోరాడలేదు.

కాని 'ఘర్షణ'లో కార్తిక్ పోరాడాడు.

రెండవ భార్య సంతానం కావడం వల్ల తండ్రి పేరును తన పక్కన పెట్టుకోవడానికి పోరాడాడు. తండ్రిని అతనే నా తండ్రి అని చెప్పుకోవడానికి పోరాడాడు. నీకే కాదు నాకూ హక్కు ఉంది అని మొదటి భార్య కుమారుడితో చెప్పడానికి పోరాడాడు.

ఘర్షణ కథ ఇద్దరు సవతి సోదరుల మధ్య నడిచిన కథ.

ఇలాంటి కథ భారతీయ సినిమాలలో ఇదే మొదటిది.

❖ ● ❖

చాలా ఇబ్బందిగా ఉంటుంది– రెండవ భార్య కుమారుడితో 'నువ్వు పెద్ద భార్య కుమారుడివా?' అని అడిగితే. చాలా ఇరకాటంగా ఉంటుంది– మొదటి భార్య కుమారుడితో 'మీ నాన్నకు ఇంకో భార్య ఉందట కదా' అని అడిగితే.

సంఘం ఒక భార్య–ఒక భర్తనే అంగీకరిస్తుంది.

చట్టాన్ని ఒప్పించి రెండో పెళ్లి చేసుకున్నా, రెండో ఇల్లు పెట్టినా వ్యక్తిగతంగా బాగానే ఉండొచ్చు కానీ సంఘప్రకారం అది తప్పు అవుతుంది. మీ నాన్న తప్పు చేశాడు... మీకు దక్కవలసిన ప్రేమను మరొకరి ద్వారా కలిగిన సంతానానికి పంచాడు అనే భావన ఏదో ఈ సినిమాలో విజయకుమార్ కుమారుడిగా వేసిన ప్రభు మనసులో ఉంది. అలాగే మా నాన్న మా అమ్మను పెళ్లి చేసుకుని ఆమెకు సంఘపరమైన మర్యాద ఇవ్వలేకపోయాడు. ఆమె కూడా నా భార్యే అని లోకానికి ధైర్యంగా చెప్పలేకపోయాడు. మమ్మల్ని తన పిల్లలుగా చేయి పట్టుకుని నలుగురి మధ్యలో నడిపించలేకపోయాడు. మాకు ఉంపుడుగత్తె పిల్లలు అనే హోదాను ఇచ్చాడు అనే భావన విజయకుమార్ రెండో భార్య జయచిత్రకు పుట్టిన కార్తిక్ మనసులో ఉంది.

ప్రభు, కార్తిక్ ఇద్దరూ మంచి వయసులో ఉన్న కుర్రవాళ్లు.

ఆ వయసులో ఉండే ఉత్సాహం, హుషారు వారిలో ఉండవు. ఇద్దరూ అశాంతితో రగలిపోతుంటారు. ప్రభు కార్తిక్‌ను యాక్సెప్ట్ చేయడు. ప్రభును కార్తిక్ తన సోదరుడిగా గౌరవించడు.

ఇద్దరి మధ్యా ఘర్షణ.

చాలా పెద్ద ఘర్షణ.

❖ ● ❖

మనిషి ఇన్‌స్టింక్స్ చాలా బలంగా ఉంటాయి. నాది అనే భావన సకల జీవరాశుల్లో ఉంటుంది. ప్రభు, కార్తిక్‌ల మధ్య ఘర్షణకు కారణం వారికి తండ్రి మీద ఉన్న గొప్ప ప్రేమకు ప్రచ్ఛన్నరూపం అనిపిస్తుంది. ఆ తండ్రి పెద్ద ప్రభుత్వ అధికారి. చాలా మంచివాడు. ఈ ఇంట్లో ఉన్నా ఆ ఇంట్లో ఉన్నా భార్యతో, కుమారుడితో చాలా బాగా ఉంటాడు. అలాంటి తండ్రి మాకు మాత్రమే ఉండాలని పిల్లలు అనుకుంటారు. ప్రభు, కార్తిక్‌లు కూడా అనుకొని ఉండొచ్చు. కాని ప్రతి రోజూ ఆ తండ్రి ఏకకాలంలో రెండు ఇళ్లలోనూ ఉండలేడు కదా. ఇక్కడ కొన్నిరోజులు ఉంటే అక్కడివాళ్లకు కోపం. అక్కడ కొన్నిరోజులు ఉంటే ఇక్కడి వాళ్లకు చిన్నతనం. దీని మధ్య అతడు నలుగుతుంటాడు. ఒకటి మాత్రం వాస్తవం. పెద్ద భార్య ఇంట్లో అతడికి పూర్తి స్వేచ్ఛ లేదు. కిటికీలు మూతబడి గాలాడని భావన. అందుకే అతడు కాసింత ఓదార్పు కోసం, రెండో భార్య ఇంటి నడవలో, తులసి కోటకు కాసింత దూరంలో చేరగిలపడి, ఒక వైపు వాన కురుస్తుంటే మరో వైపు భార్య ఆమ్లెట్ తెచ్చి పెడుతుంటే సకల మర్యాదలు వదిలి హాయిగా కాసింత మందు బిగించే స్వేచ్ఛ కోసం అక్కడికి వస్తుంటాడు.

నిజానికి అతడి స్వార్థం అతడు చూసుకున్నాడు కాని ఆ భార్యకు పుట్టిన, ఈ భార్యకు పుట్టిన పిల్లల మధ్య సఖ్యత ఉందా లేదా చూసుకోలేకపోయాడు. ఆ సఖ్యత కోసం అతడు ఆ తర్వాత ధైర్యంగా ప్రయత్నించిన దాఖలాలు లేవు. ఒకవేళ ప్రయత్నించే సమయం వచ్చేసరికి ఇరు పక్షాల్లో ఘర్షణ చోటు చేసుకుని ఉంది.

ప్రభు పోలీస్ కమిషనర్ అయ్యి కార్తిక్‌ను సిల్లీ కారణాల్లో అరెస్ట్ చేసేవరకు వెళతాడు.

కార్తిక్ తన ఫ్రెండ్స్‌తో పెద్ద భార్య ఇంటికి వెళ్లి రాళ్లు విసిరి అద్దాలు పగలగొడతాడు.

రోడ్డున పడి కొట్టుకునే ఈ అన్నదమ్ములు ఒకే తండ్రికి పుట్టారు.

తల్లులు వేరైనందుకు శతృవులయ్యారు.

❖ ● ❖

మేమూ మేమూ ఉన్నప్పుడు మేము పాండవులం. వారు కౌరవులు. కాని బయటి నుంచి శతృవు వస్తే మేము నూట్టైదు మంది అన్నదమ్ములం అన్నాడు ధర్మరాజు.

బయటి శతృవు వచ్చినప్పుడు రక్తం చేసే చాలనం చిత్రంగా ఉంటుంది. తన రక్తాన్ని తాను గుర్తించి కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది. అందుకే రక్తబంధం అంటారు. ఈ సినిమాలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న విలన్ మీద ఒన్ మేన్ కమిషన్‌గా విజయకుమార్ బాధ్యతలు తీసుకుంటాడు. ఫలానా తేదీ లోపల కమిషన్ రిపోర్ట్ అప్పగించాలి. ఆ విలన్ దోషి అని కమిషన్ తేల్చితే వెంటనే అతడు జైలుకు వెళతాడు. ఈ సంగతి తెలిసినప్పటి నుంచి విజయకుమార్‌ను విలన్ బుజ్జగించే ప్రయత్నం చేస్తుంటాడు. కాని విజయకుమార్ స్ట్రిక్ట్ కనుక మాట వినడు. దాంతో విజయకుమార్‌నే చంపించే పనికి విలన్ దిగుతాడు. ఈ సంగతి అన్నదమ్ములకు తెలుస్తుంది. బయటి నుంచి ఎవరూ రానంత వరకే వారు సవతి సోదరులు. వచ్చాక సొంత అన్నదమ్ములు. తండ్రిని కాపాడటానికి ఇద్దరూ రంగంలో దిగుతారు. విలన్‌ను ఎదుర్కొని తండ్రిని కాపాడుకుంటారు. ఘర్షణలో శాశ్వతత్వం లేదు. శాంతిలోనే ఉంది. విడి చేతులలో బలం లేదు. చేతులు కలిపితేనే బలం.

ఆ అన్నదమ్ములు ఇప్పుడు ఒక్కటయ్యారు.

తండ్రి ఒకడే. తల్లులు వేరు. కాని అమ్మా అని పిలిస్తే ఏ తల్లి అయినా ఒకటే కదా.

ఈ కుటుంబం ఇప్పుడు సమష్టిగా మారడం మనకు ఆనందాన్ని ఇస్తుంది.

అనుబంధాలు విరిసేను.. పన్నీరు చిలికేను... వెరీగుడ్ మణి.

– కె

అగ్నినక్షత్రం


● మణిరత్నం


● పి.సి. శ్రీరామ్

'నాయకుడు' వంటి ఎపిక్ తీశాక మణిరత్నం 1988లో నెరేషన్‌ను, ఎమోషన్‌ను మిళితం చేసుకుంటూ తేలిక పద్ధతిలో చెప్పిన కథ 'అగ్నినక్షత్రం'. తెలుగులో 'ఘర్షణ'గా డబ్ అయ్యి పెద్ద విజయం సాధించింది. సవతి సోదరుల మధ్య ఘర్షణ ఉంటుంది అనే చిన్న పాయింట్ తప్ప కథంటూ ఏమీ లేని ఈ సినిమా కేవలం సంఘటనల వరుస ద్వారా సమ్మోహితం చేస్తుంది. ప్రభు జీవితంలో కొన్ని సంఘటనలు, ప్రేమ, కార్తిక్ జీవితంలోని కొన్ని సంఘటనలు, ప్రేమ వీటి మధ్యలో అక్కడక్కడా ఘర్షణ చూపిస్తూ మంచి పాటలతో సినిమాను ముగిస్తాడు దర్శకుడు. ఈ సినిమా వచ్చిన కొత్తల్లో ఇందులోని ఇళయరాజా పాటలకు, పి.సి.శ్రీరామ్ ఫొటోగ్రఫీకి ప్రేక్షకులు మోహాశ్చర్యాలకు లోనయ్యారు. పి.సి.శ్రీరామ్ చేసిన మెరుపు లైటింగ్ ఆ తర్వాత కొంతకాలం పాటు సినిమాలను వెంటాడింది. ఇందులోని 'రాజా రాజాధి రాజా' పాటలో ప్రభుదేవా గ్రూప్‌డాన్సర్‌గా కనిపిస్తాడు. 'ఒక బృందావనం సోయగం' పాట చిత్రలహరిలో కొన్ని వందలసార్లు ప్లే అయ్యింది. ఈ సినిమా నిరోషాకు తొలి సినిమా.


● నిరోషా


● జనకరాజ్

అరుపులు, కేకలు, విగ్గుల విలన్ హయామ్‌లో చాలా మామూలు పెద్ద మనిషిగా 'ఏం రాజా' అని ఆత్మీయంగా పిలిచే విలన్ (మద్రాసులో ఆనంద్ థియేటర్ ఓనర్ జి.ఉమాపతి) కనిపించడం చాలా కొత్త. ఈ విలనీని 'కర్తవ్యం'లో పుండరీ కాక్షయ్యకు వాడారు. ఈ సినిమాలో భార్య నాగమణి ఊరెళితే ఎగిరి గంతేసి పండగ చేసుకునే జనకరాజ్ క్యారెక్టర్ ఎంత హిట్టయ్యిందంటే ఇప్పటికీ జన సామాన్యంలో భార్య ఊరెల్లిందని చెప్పడానికి 'నాగమణి లేదు' అనడం కద్దు. స్లో మోషన్‌లో ప్రభు, కార్తీక్ కోపంగా క్లోజప్‌లో ఒకరినొకరు చూసుకునే షాట్స్‌ను ఆ తర్వాత చాలా సినిమాల్లో అనుసరించారు. ఘర్షణ చాలావాటికి ట్రెండ్ క్రియేట్ చేసింది. అది నిజమైన ట్రెండ్ సెట్టర్.

స్టీవెన్ కంట్రోల్‌లో ఎన్టీఆర్!



ఎవరీ స్టీవెన్? అతని కంట్రోల్‌లోకి ఎన్టీఆర్ వెళ్లడమేంటి? అసలేం జరిగింది? అని గ్యాప్ లేకుండా ప్రశ్నలు వేసుకుని ప్రెజర్‌కి గురి కావొద్దు. ఎన్టీఆర్ మీకు (ప్రేక్షకులకు) ఇంతకుముందు కన్నా ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించాలంటే స్టీవెన్ కంట్రోల్‌లో ఉండాల్సిందే. తనంతట తానుగా ఇష్టంగా ఈ ఫిజికల్ ట్రైనర్ కంట్రోల్‌లోకి వెళ్లారు యంగ్ టైగర్. సినిమా అంటే అంత ప్యాషన్ మరి. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఇందులో ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. దీనికోసం యూకె నుంచి ఫిజికల్ ట్రైనర్ స్టీవెన్ లాయిడ్‌ని హైదరాబాద్ రప్పించారు.


● స్టీవెన్‌తో ఎన్టీఆర్

నాన్‌స్టాప్‌గా రెండు నెలలు: ఇక్కడ నాన్‌స్టాప్‌గా ఎన్టీఆర్‌తో రెండు నెలలు పాటు ఫిజికల్ ట్రైనింగ్ చేయిస్తారట స్టీవెన్. జస్ట్ వర్కవుట్స్ మాత్రమే కాదు.. ఫుడ్ కూడా ఆయనే డిసైడ్ చేస్తారు. బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకూ స్టీవెన్ ఏది వండితే అదే ఎన్టీఆర్ తింటారని విశ్వసనీయ వర్గాల సమాచారమ్. స్టీవెన్ నిర్ణయించే మెనూలో నోటికి రుచిగా ఉండేవి దాదాపు తక్కువేనట. అయినా ఎన్టీఆర్‌కి ఓకే. క్యారెక్టర్ కోసం ఏం చేయడానికైనా వెనకాడని హీరో కదా. ఇంకో విషయం ఏంటంటే.. దాదాపు 15 లక్షల రూపాయలు పెట్టి ఓ కొత్త ఎక్విప్‌మెంట్ కొన్నారట. ఎన్టీఆర్ పర్సనల్ జిమ్‌లో ఈ ఎక్విప్‌మెంట్‌తోనే కొత్త వర్కవుట్స్ చేస్తారట. ఇదిలా ఉంటే.. బాలీవుడ్ హీరోలు హృతిక్ రోషన్, రణవీర్ సింగ్‌లకు స్టీవెన్ పర్సనల్ ట్రైనర్. ఈ హీరోలిద్దరి ఫిట్‌నెస్ సూపర్బ్. సో.. మనం కొత్త ఎన్టీఆర్‌ని చూడబోతున్నామన్న మాట.

సై అంటే సీక్వెల్


● నయనతార

మేడమ్ ఎప్పుడు ఫ్రీ అవుతారు? డేట్స్ ఇచ్చేదెప్పుడు? అని దర్శకుడు గోపీ నాయర్ వెయిటింగ్. ఈ గోపీ నాయర్ ఎవరో తమిళ సినిమాలు ఫాలో అయ్యేవారికి తెలిసే ఉంటుంది. రీసెంట్‌గా రిలీజైన 'ఆరమ్' సినిమా దర్శకుడు ఈయనే. నయనతార లీడ్ రోల్ చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇంత హిట్టయిన సినిమాని అలా వదిలేస్తే ఎలా? పైగా కథను కొనసాగించే వెసులుబాటు కూడా ఉంది. అందుకే సీక్వెల్ ప్లాన్ చేశారు గోపీ నాయర్. ఇందులోనూ నయనతారనే కథానాయికగా అనుకున్నారు. ఈ బ్యూటీకి కూడా సినిమా చేయడం ఇష్టమే. కానీ డేట్స్ ఎక్కడ? డైరీ ఫుల్. తెలుగులో చిరంజీవి 'సైరా'కి డేట్స్ ఇచ్చారు. తమిళంలో 'ఇమైక్క నొడిగళ్, కొలైయుదిర్ కాలమ్, కోలమావు కోకిల' సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు నయనతార. ఇప్పట్లో వేరే సినిమాకి డేట్స్ అంటే కష్టమే. మేడమ్ డైరీ చెక్ చేసుకుని, సై అంటే సీక్వెల్ స్టార్ట్ చేయడానికి డైరెక్టర్ రెడీ.

మరి.. సై అనేదెప్పుడు? సీక్వెల్ స్టార్ట్ అయ్యేదెప్పుడు?

సక్సెస్ గ్యారంటీ అనే నమ్మకంతో ఉన్నాం - నాగశౌర్య


● నరేశ్, వెంకీ కుడుముల, నాగశౌర్య, శంకర్ ప్రసాద్ మూల్పూరి

''సాయి శ్రీరామ్‌గారు ఇచ్చిన ధైర్యంతో మేం ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేశాం. వెంకీ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. నిర్మాతలు మా తల్లిదండ్రులే. వారి గురించి పెద్దగా మాట్లాడలేను. అయితే నిర్మాతలుగా మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. 'ఛలో' సినిమా చాలా బాగా వచ్చింది. కచ్చితంగా పెద్ద సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్ ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఉషా మూల్పూరి నిర్మించిన చిత్రం 'ఛలో'. మహతి స్వరసాగర్ సంగీతం అందించారు. కొత్త సంవత్సరం సందర్భంగా సినిమాలోని రెండో పాటను సీనియర్ పాత్రికేయులు పసుపులేటి రామారావు, బీఏ రాజు విడుదల చేశారు. వెంకీ కుడుముల మాట్లాడుతూ– ''అసోసియేట్ డైరెక్టర్‌ని అయిన నేను 'ఛలో' సినిమాతో డైరెక్టర్‌గా మారాను. ఈ కొత్త ఏడాదిలో మంచి పేరున్న డైరెక్టర్ అవుతాననే నమ్మకం ఉంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్‌కు మేం ఊహించిన దానికంటే మంచి రెస్పాన్స్ వచ్చింది'' అన్నారు. ''అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించిన చిత్రమిది. ఫిబ్రవరి 2న సినిమాని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూల్పూరి. ''కథ విన్నప్పుడే ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పా. సినిమా విడుదలకు ముందే థియేట్రికల్ రైట్స్‌తో పాటు, శాటిలైట్ రైట్స్ కూడా అమ్ముడైపోవడం ఆనందంగా ఉంది'' అన్నారు నటుడు సీనియర్ నరేశ్. పోసాని కృష్ణమురళి, రఘుబాబు, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సాయి శ్రీరామ్.

బృందావనంకి ఫోర్ పిల్లర్స్


● సిద్ధు, సీరత్ కపూర్, విక్రమ్, పృథ్వీ

రచయిత శ్రీధర్ సీపాన దర్శకునిగా పరిచయమవుతోన్న చిత్రం 'బృందావనమది అందరిది'. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శ్రీధర్ ఆశీస్సులతో శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు (యన్.అర్.ఐ) నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ చిత్రంలోని నటీనటుల వివరాలను చిత్రబృందం వెల్లడించింది. శ్రీధర్ సీపాన మాట్లాడుతూ– ''నా కథకి కొత్తవాళ్లతో సినిమా చేయాలని నిర్వహించిన ఆడిషన్స్‌కి మంచి స్పందన వచ్చింది. నలుగురు ప్రధాన తారాగణం మినహా మిగిలిన పాత్రలకు చాలామంది కొత్తవాళ్లని తీసుకున్నాం. ప్రధాన తారాగణంగా 'గుంటూర్ టాకీస్' ఫేమ్ సిద్ధు, నిర్మాత లగడపాటి శ్రీధర్ తనయుడు లగడపాటి విక్రమ్ (రేసుగుర్రం ఫేమ్), సీరత్ కపూర్ (రన్ రాజా రన్ ఫేమ్), థర్టీ ఇయర్స్ పృథ్వీ నటిస్తారు. వీరు నలుగురూ నా సినిమాకి మెయిన్ పిల్లర్స్. సంక్రాంతికి ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం. జనవరి 20న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. 'అదుర్స్' రఘు, బొడ్డ నారాయణ, 'సత్యం' రాజేష్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: మణిశర్మ, కెమెరా: సి. రాంప్రసాద్.


● శ్రద్ధాకపూర్

లాయర్‌కు లవర్‌గా!


● షాహిద్

లాయర్‌కు లవర్‌ను వెతికే పనిలో పడ్డారు శ్రీ నారాయణ్ సింగ్ అండ్ టీమ్. ఇంతకీ... ఈ శ్రీ నారాయణ్ సింగ్ ఎవరో కాదండి. హిందీలో 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ' వంటి సోషల్ మెసేజ్ ఉన్న చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు. మరి లాయర్ ఎవరంటే షాహిద్ కపూర్. ఈ లాయర్‌కు నారాయణ్ సింగ్ ఎందుకు లవర్‌ని వెతుకుతున్నారు? అసలు షాహిద్ లాయర్ ఏంటి? అని కన్‌ఫ్యూజ్ అవుతున్నారా? మరేం లేదు. షాహిద్ హీరోగా నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బట్టీ గుల్ మీటర్ చలే'. సామాన్యులు ఎదుర్కొనే విద్యుత్ సమస్యల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో షాహిద్‌కు ఇంకా జోడీ సెట్ కాలేదు. మొదట కత్రినా కైఫ్‌ను అడిగారట. డైరీలో డైట్స్ ఖాళీ లేకపోవడంతో 'సారీ' అని అనేశారట. దీంతో చిత్రబృందం శ్రద్ధా కపూర్‌ను సంప్రదించారని బాలీవుడ్ టాక్. ఆల్మోస్ట్ శ్రద్ధా కపూర్ ఒప్పుకునే చాన్సులే మెండుగా ఉన్నాయని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఆల్రెడీ మూడేళ్ల కిత్రం షాహిద్, శ్రద్ధ 'హైదర్'లో జంటగా నటించారు కాబట్టి ఇద్దరి మధ్య మంచి స్నేహ ఉందనీ, పైగా 'బట్టీ గుల్ మీటర్ చలే' స్టోరీ కూడా బాగుంది కాబట్టి శ్రద్ధ ఒప్పుకుంటారని ఊహిస్తున్నారు. మరి లాయర్‌కు శ్రద్ధా ఓకే చెబుతారా? అంటే.. వెయిట్ అండ్ సీ.

రెండు రాష్ట్రాల్లో శేష్


● అడివి శేష్

50 కోట్లతో తీసిన సినిమా 150 కోట్లు వసూలు చేస్తే తీసినవాళ్లకు, కొన్నవాళ్లకు పండగే పండగ. హిందీ చిత్రం '2 స్టేట్స్' చిత్రనిర్మాత కరణ్ జోహార్‌కు, కొన్నవాళ్లకు అలాంటి బంపర్ ఆఫరే ఇచ్చింది. ఈ చిత్రం తెలుగులో రీమేక్ కానుందని, నాగచైతన్య–సమంత కలిసి నటించబోతున్నారని, టెస్ట్‌షూట్ జరిగిందని ఆ మధ్య ఫిల్మ్‌నగర్‌లో చెప్పుకున్నారు. అఫీషియల్‌గా ఎలాంటి ప్రకటన రాలేదు కాబట్టి అవి వదంతులేమో అనుకోవచ్చు. ఎందుకంటే ఈ చిత్రంలో అడవి శేష్ నటించనున్నారట. 'క్షణం' 'అమీ తుమీ' వంటి హిట్స్‌తో మంచి ఫామ్‌లో ఉన్న శేష్ రీసెంట్‌గా ఈ రీమేక్‌కు సైన్ చేశారు. కొత్త దర్శకుడు వెంకట్ రెడ్డి తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం 'గూఢచారి' సినిమా చేస్తున్నారు శేష్. అభిషేక్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా సమ్మర్‌కి రిలీజ్ కానుంది. 'గూఢచారి' పూర్తయ్యాక ఈ రీమేక్ మొదలవుతుందట.

దరఖాస్తు చేశారా?



- ఎయిమ్స్ రిషికేశ్‌లో 153 స్టాఫ్ నర్స్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 4
- హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో 40 ట్రేడ్స్‌మ్యాన్ 'బి' పోస్టులకు చివరి తేదీ: జనవరి 5.
- ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 460 గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ అప్రెంటీస్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 5.
- ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో 59 మేనేజర్, ఇంజనీర్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 5.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

టీఎస్ ట్రాన్స్‌కో

1604

ఖాళీలు

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ట్రాన్స్‌కో).. 1,604 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ మూడు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** జూనియర్ లైన్‌మ్యాన్ (జేఎల్ఎం)-1,100; సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-174; అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)-330 (ఎలక్ట్రికల్-250+ సివిల్-49+టెలికాం-31).
- **వేతనశ్రేణి:** జేఎల్ఎం-రూ.15,585-రూ.25,200; సబ్ ఇంజనీర్/ఎలక్ట్రికల్-రూ.20,535-రూ.41,155; ఏఈ-రూ.41,155-రూ.63,600.
- **అర్హతలు:** జేఎల్ఎంకు పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు ఎలక్ట్రికల్/వైర్‌మ్యాన్ ట్రేడ్‌లో ఐటీఐ. లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్స్; సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)కు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ/డిప్లొమా/తత్సమాన విద్య; ఏఈకి సంబంధిత విభాగాలను అనుసరించి ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సివిల్/టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ/ఏఎంఐఈ ఎగ్జామినేషన్‌లో సెక్షన్ 'ఎ', సెక్షన్ 'బి' ఉత్తీర్ణత/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.
- **వయసు:** జేఎల్ఎంకు 18-35 ఏళ్ల లోపు; సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), ఏఈ పోస్టులకు 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనల మేర గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాతపరీక్ష.
- **రాతపరీక్ష విధానం:** జేఎల్ఎం, సబ్ ఇంజనీర్ పోస్టులకు 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లు ఎ, బి ఉంటాయి. సెక్షన్ 'ఎ'లో 65 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో జేఎల్ఎంకు ఐటీఐ, సబ్ ఇంజనీర్‌కు డిప్లొమా ట్రేడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్ 'బి'లో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ రెండు పోస్టులకూ ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.
- ఏఈ పోస్టులకు రాతపరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఇందులోనూ రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ 'ఎ'లో సంబంధిత విభాగం నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్ 'బి'లో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు.
- **గమనిక:** జేఎల్ఎం పోస్టుల అభ్యర్థులకు పోల్/టవర్ క్లైంబింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులైతేనే ఉద్యోగానికి ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు రుసుం:** రూ.220 (అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీ-రూ.100+ఎగ్జామినేషన్ ఫీ-రూ.120); ఎస్సీ/ఎస్టీ/బీసీ/దివ్యాంగ అభ్యర్థులకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **ముఖ్య తేదీలు:**

పోస్టు	ఫీజు చెల్లింపు ప్రారంభం	ఫీజు చెల్లింపు ముగింపు	దరఖాస్తు స్వీకరణ ప్రారంభం	దరఖాస్తు ముగింపు
జేఎల్ఎం	4-01-2018	20-01-2018	5-01-2018	20-01-2018
సబ్ ఇంజనీర్	19-01-2018	5-02-2018	20-01-2018	5-02-2018
ఏఈ	30-01-2018	16-02-2018	01-02-2018	16-02-2018

- **వెబ్‌సైట్:** tstransco.cgg.gov.in

సిండికేట్ బ్యాంక్

500

ఖాళీలు

సిండికేట్ బ్యాంక్.. దేశవ్యాప్తంగా ఉన్న తన శాఖల్లోని కార్యాలయాల్లో 500 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ విభాగంలో ఏడాది పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులో శిక్షణ ఉంటుంది. కోర్సు విజయవంతంగా పూర్తిచేశాక జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్/స్కేల్-1 హోదాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా నియామకం కల్పిస్తారు. బెంగళూరులోని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంజీఈఎస్), గ్రేటర్ నోయిడా, మంగళూరుల్లోని నిట్టే (ఎన్ఐటీటీఈ) ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఈఐపీఎల్)లో ఈ శిక్షణ ఉంటుంది.

- **పోస్టు:** ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో).
- **మొత్తం ఖాళీలు:** 500 (అన్‌రిజర్వ్‌డ్-252+ఓబీసీ-135+ఎస్సీ-75+ఎస్టీ-38).
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు.
- **వయసు:** 2017, అక్టోబర్ 1 నాటికి 20-28 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్.
- **ఆన్‌లైన్ టెస్ట్ విధానం:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌గా ఉంటుంది. ఆబ్జెక్టివ్‌లో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్ అనే నాలుగు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 మార్కులకు 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులుంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి రెండు ప్రశ్నలు 50 మార్కులకు ఇస్తారు. దీన్ని అర్హత పరీక్షగా మాత్రమే పరిగణిస్తారు. వ్యవధి 30 నిమిషాలు. ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారి జాబితా నుంచి ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్‌కు ఎంపిక చేస్తారు. ఆబ్జెక్టివ్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్‌లో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది.
- **తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు:** చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100; మిగిలిన అభ్యర్థులకు రూ.600.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 17, 2018.
- **వెబ్‌సైట్:** www.syndicatebank.in

సెంట్రల్ వాటర్ కమిషన్

63

ఖాళీలు

కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)- జమ్మూ ఏ అండ్ ఎం విభాగం.. గ్రూప్ 'సి' కేటగిరీలోని 63 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో పనిచేయాల్సి ఉంటుంది.

- **పోస్టు పేరు:** స్కిల్డ్ వర్క్ అసిస్టెంట్ (ఎస్‌డబ్ల్యూఏ)
- **వేతనశ్రేణి:** రూ.5,200-రూ.20,200+జీపీ-రూ.1,800.
- **అర్హతలు:** పదోతరగతి/ఐటీఐ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.
- **వయసు:** 18-30 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ అభ్యర్థులకు నిబంధనల మేర వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** అకడమిక్ (పదోతరగతి/ఐటీఐ/తత్సమాన విద్య) మార్కుల మెరిట్ ఆధారంగా మెరిట్ జాబితా తయారుచేసి స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్ (దివ్యాంగ అభ్యర్థులకు మినహా) నిర్వహిస్తారు. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు. తుది ఎంపికకు అకడమిక్ మార్కుల మెరిట్‌నే పరిగణనలోకి తీసుకుంటారు.
- **స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్:** పరుగు-1 కి.మీ. దూరాన్ని పురుషులు 5 నిమిషాల్లోగా, మహిళలు 7 నిమిషాల్లోగా పరిగెత్తగలగాలి. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే రెండో దశకు ఎంపిక చేస్తారు. ఇందులో 15 కిలోల బరువును పురుషులు 500 మీ. దూరానికి 10 నిమిషాల్లోగా మహిళలు 12 నిమిషాల్లోగా తీసుకెళ్లగలగాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 22, 2018.
- **వెబ్‌సైట్:** www.cwc.gov.in



సీఐఎస్ఎఫ్

118

ఖాళీలు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)... స్పోర్ట్స్ కోటా కింద 118 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)-31; హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ)-87.
- **క్రీడా విభాగాల వారీ ఖాళీలు:** అథ్లెటిక్స్-20; బాక్సింగ్-9; బాస్కెట్‌బాల్-10; ఫుట్‌బాల్-10; జిమ్నాస్టిక్స్-3; హాకీ-6; జూడో-10; షూటింగ్-16; స్విమ్మింగ్-8; వాలీబాల్-10; రెజ్లింగ్-6; వెయిట్ లిఫ్టింగ్-10.
- **వేతనశ్రేణి:** ఏఎస్ఐ-రూ.29,200-రూ.92,300; హెచ్‌సీ-రూ.25,500-రూ.81,100.
- **అర్హతలు:** ఏఎస్ఐకి డిగ్రీ, హెచ్‌సీకి ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడల్లో సీనియర్/జూనియర్ కేటగిరీలో అంతర్జాతీయ/జాతీయ/అంతర్రాష్ట్ర/రాష్ట్ర/ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో వ్యక్తిగత/బృంద విభాగంలో ప్రాతినిధ్యం/ పతకం ఉండాలి.
- **వయసు:** ఏఎస్ఐకి 20-25 ఏళ్ల లోపు; హెచ్‌సీకి 18-23 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **శారీరక ప్రమాణాలు:** ఏఎస్ఐ పోస్టులకు ఎస్టీ కేటగిరీలోని పురుషులకు ఎత్తు-162.5 సెం.మీ., ఛాతీ-77 సెం.మీ. (సాధారణం)-82 సెం.మీ. (గాలి పీల్చినపుడు); మహిళలకు ఎత్తు-154 సెం.మీ. ఉండాలి. జనరల్/ ఓబీసీ/ఎస్సీ కేటగిరీలోని పురుషులకు ఎత్తు-170 సెం.మీ., ఛాతీ- పురుషులకు 80 సెం.మీ. (సాధారణం)- 85 సెం.మీ. (గాలి పీల్చినపుడు); మహిళలకు ఎత్తు-157 సెం.మీ.
- హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎత్తు-పురుషులకు 167 సెం.మీ., మహిళలకు 153 సెం.మీ.; ఛాతీ-పురుషులకు 81 సెం.మీ. (సాధారణం)-86 సెం.మీ. (గాలి పీల్చినపుడు).
- **గమనిక:** అన్ని పోస్టుల అభ్యర్థులకూ ఎత్తు, వయసుకు అనుగుణంగా ఆరోగ్య/క్రీడా ప్రమాణాలను బట్టి బరువు ఉండాలి.
- **మెడికల్ స్టాండర్డ్స్:** దృష్టి సామర్థ్యం 6/6, 6/9 (గ్లాసెస్ లేకుండా) ఉండాలి. అలాగే తగిన వినికిడి సామర్థ్యం, ఆరోగ్యం తదితర ప్రమాణాలు తప్పనిసరి.
- **ఎంపిక:** క్రీడా విభాగంలో ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** జనవరి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఈసీజీసీ లిమిటెడ్

32

ఖాళీలు

ఈసీజీసీ లిమిటెడ్ (ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమి టెడ్).. 32 ప్రొబేషనరీ ఆఫీసర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఈసీజీసీ లిమిటెడ్.. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందినది. దేశం నుంచి ఎగుమతయ్యే వస్తువులకు కావల్సిన రుణాలు, తదితర వాటిని ఈసీజీసీ నిర్వహిస్తుంది.

- **పోస్టు:** ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో).
- **విభాగాల వారీ ఖాళీలు:** అకౌంట్స్-5; లీగల్-5; కంపెనీ సెక్రెటరీ-1; యాక్చురీ-2; ఐటీ-2; ఎకనమిక్స్-2; కామర్స్-3; జనరలిస్ట్-12.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనురించి సీఏ అసోసియేట్ మెంబర్/ఐసీడబ్ల్యూఏ/సీఎఫ్ఏ/ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం/ఏసీఎస్ అసోసియేట్ మెంబర్/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్చురీస్ స్టూడెంట్ మెంబర్ (3 పేపర్లు సీటీ-1, సీటీ-2, సీటీ-3 ఉత్తీర్ణత)/బీటెక్/బీఈ (సీఎస్/ఐటీ)/ఎంసీఏ+సైబర్ సెక్యూరిటీ సర్టిఫికెట్/ఎంఏ (ఎకనమిక్స్)/ఎంకామ్/పీజీ/డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 20-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **రాతపరీక్ష:** దీన్ని ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పేపర్లుగా నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్‌లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ నుంచి 50, ఇంగ్లిష్ లాంగ్వేజ్- 40, కంప్యూటర్ నాలెడ్జ్-20, జనరల్ అవేర్‌నెస్-40, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 50 చొప్పున మొత్తం 200 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. గరిష్ఠ మార్కులు 200. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు (0.25) మార్కులు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 140 నిమిషాలు. డిస్క్రిప్టివ్ పేపర్‌లో ఎస్సే రైటింగ్ నుంచి రెండు, ప్రెసిస్ రైటింగ్ నుంచి రెండు చొప్పున మొత్తం నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఎస్సేలో ఒకటి, ప్రెసిస్‌లో ఒకటి చొప్పున రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. సరైన సమాధానానికి 20 మార్కుల చొప్పున ఈ పేపర్ గరిష్ఠ మార్కులు 40. రెండు ప్రశ్నలకూ కలిపి 40 నిమిషాల వ్యవధి ఇస్తారు.
- **ఇంటర్వ్యూ:** రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా నుంచి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 60 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. రాతపరీక్ష, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా తుది ఎంపిక నిర్వహిస్తారు.
- **రాతపరీక్ష కేంద్రాలు:** బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా/గ్రేటర్ కోల్‌కతా, ముంబై/థానే/నవీ ముంబై/గ్రేటర్ ముంబై.
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.100; మిగిలిన అభ్యర్థులకు రూ.600. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.ecgc.in

ఏపీ పోస్టల్ సర్కిల్

36

ఖాళీలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ కార్యాలయం స్పోర్ట్స్ కోటా కింద 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** పోస్టల్ అసిస్టెంట్-6; సార్టింగ్ అసిస్టెంట్-1; పోస్టల్ అసిస్టెంట్ (సీవో/ఆర్‌వో)-1; పోస్ట్‌మ్యాన్-17; మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-11.
- **క్రీడాంశాల వారీ ఖాళీలు:** కబడ్డీ (పురుషులు)-5; అథ్లెటిక్స్ (పురుషులు)-5; టేబుల్ టెన్నిస్-4 (పురుషులు-3+మహిళలు-1); క్రికెట్ (పురుషులు)-7; వాలీబాల్ (పురుషులు)-6; వెయిట్ లిఫ్టింగ్-4; పవర్ లిఫ్టింగ్-4; క్యారమ్స్ (మహిళలు)-1.
- **వేతనం:** పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్ (సీవో/ఆర్‌వో) పోస్టులకు రూ.25,500; పోస్ట్‌మ్యాన్-రూ.21,700; ఎంటీఎస్‌కు రూ.18,000.
- **అర్హతలు:** పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్ (సీవో/ఆర్‌వో) పోస్టులకు ఇంటర్మీడియెట్; పోస్ట్‌మ్యాన్‌కు పదోతరగతి; ఎంటీఎస్‌కు పదోతరగతి/ఐటీఐ ఉత్తీర్ణత. అలాగే సంబంధిత పోస్టులను అనుసరించి ఏదైనా క్రీడాంశంలో అంతర్జాతీయ/జాతీయ/రాష్ట్ర/అంతర్రాష్ట్ర/యూనివర్సిటీ/స్టేట్ లెవెల్ స్కూల్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం/పతకం పొంది ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 30 నాటికి ఎంటీఎస్ పోస్టులకు 18-25 ఏళ్ల లోపు; మిగిలిన పోస్టులకు 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు, క్రీడాంశాల్లో ప్రతిభ ఆధారంగా.
- **దరఖాస్తు రుసుం:** రూ.100.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి, ఫొటోలు తదితర అవసరమైన వాటిని జతచేసి కవరులో ఉంచి 'ది చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (రిక్రూట్‌మెంట్ సెక్షన్), ఆంధ్రప్రదేశ్ సర్కిల్, కృష్ణలంక, విజయవాడ-520013, ఆంధ్రప్రదేశ్' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** జనవరి 30, 2018.
- **వెబ్‌సైట్:** www.indiapost.gov.in www.appost.in

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

27

ఖాళీలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)... 27 కాంట్రాక్టు ఇంజనీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** కాంట్రాక్టు ఇంజనీర్.
- **వేతనం:** రూ.23,000.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్: 9; మెకానికల్-ప్రొడక్ట్ డిజైన్: 6; మెకానికల్-మెటీరియల్ మేనేజ్‌మెంట్: 2; కంప్యూటర్ సైన్స్-5; ఆప్టిక్స్-3; లేజర్-2.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంటెక్ ప్రథమశ్రేణి (ఎస్సీ/ఎస్టీలకు పాస్ క్లాస్) ఉత్తీర్ణత.
- **వయసు:** 2017, డిసెంబర్ 1 నాటికి 25 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** జనవరి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.bel-india.com

జేఎన్‌యూ

90

ఖాళీలు

న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ).. వివిధ విభాగాల్లోని 90 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-24; అసోసియేట్ ప్రొఫెసర్-27; అసిస్టెంట్ ప్రొఫెసర్-39. **వేతనశ్రేణి:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100. **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ/మాస్టర్స్‌డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం, నెట్/స్లెట్/సెట్ తదితర అర్హతలుండాలి. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** జనవరి 29, 2018.
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in



ఎంవీఆర్‌సీ

18

ఖాళీలు

ముంబై రైల్వే వికాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంవీఆర్‌సీ).. 18 ప్రాజెక్టు ఇంజనీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంవీఆర్‌సీ.. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన పీఎస్‌యూ.

- **పోస్టు:** ప్రాజెక్టు ఇంజనీర్ (పీఈ).
- **విభాగాల వారీ ఖాళీలు:** సివిల్-8; ఎలక్ట్రికల్-6; ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్-4.
- **వేతనం:** రూ.40,000+ఇతర అలవెన్సులు.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్ ఇంజనీరింగ్ డిగ్రీ. దీంతోపాటు గేట్-2017 క్వాలిఫై స్కోర్ కార్డ్.
- **వయసు:** 2017, డిసెంబర్ 27 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** గేట్-2017 స్కోర్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్, ఈ-మెయిల్.
- **దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ:** జనవరి 27, 2018.
- **వెబ్‌సైట్:** www.mrvc.indianrailways.gov.in

సాక్షి బిజినెస్
బుధవారం 3-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1 ▼	7 ▲
33,812	10,442

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తాజా రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	6,985	▲	82
డోజోన్స్	24,753	▲	34
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,648	▼	40
డాక్స్	12,871	▼	46
షాంఘై	3,349	▲	42
నికాయ్ (శుక్రవారం ముగింపు)	22,765	▼	19

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.40	64.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.42	87.60
€	యూరో	ఎస్‌బీఐ	77.76	77.92
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.40	57.51
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.72	50.82
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.42	48.52
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.37	18.25
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.75	18.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.93	11.23

రూపాయి రయ్..!

రెండున్నరేళ్ల గరిష్టానికి
- మారకం విలువ రూ.63.48
- డాలర్ ఇండెక్స్ బలహీనతే కారణం



ముంబై: అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ బలహీనత... దేశీయంగా ఆర్థిక అంశాల బులిష్‌గా ఉండటం వంటి అంశాలు రూపాయికి బలాన్నిస్తున్నాయి. మంగళవారం వరుసగా నాల్గవ ట్రేడింగ్ సెషన్‌లోనూ రూపాయి బలపడింది. ఐదు గంటలతో ట్రేడింగ్ ముగిసే దేశీయ ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ మంగళవారం 20 పైసలు లాభపడింది. అంటే సోమవారం 63.68 వద్ద ముగిసిన రూపాయి మంగళవారం 63.48 వద్దకు చేరింది. ఉదాహరణకు ఒక డాలర్‌కు సోమవారం రూ.63.68 ఇవ్వాల్సి ఉంటే, మంగళవారం రూ.63.48 ఇస్తే సరిపోతుందన్నమాట. రూపాయి గడచిన రెండున్నరరేళ్లలో ఈ స్థాయిలో బలపడటం ఇదే తొలిసారి. 2015 జూలై 17న రూపాయి విలువ 63.47.

ఎందుకిలా పెరిగిందంటే...
కేంద్రంలో సుస్థిరమైన ప్రభుత్వం నెలకొనటంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ఫలిస్తాయన్న విశ్వాసమూ ఎక్కువే ఉంది. దీంతో దేశానికి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఇవన్నీ కలిసి రూపాయి బలోపేతానికి కారణమయ్యాయి. 52 వారాల క్రితం అంటే ఏడాది కిందట... ఏకంగా 68.80 కనిష్ట స్థాయికి చేరిన రూపాయి అందరి అంచనాలకూ భిన్నంగా ప్రస్తుతం 63.48 స్థాయికి బలోపేతం అయ్యింది. అంటే అప్పట్లో రూపాయి బలహీనంగా ఉంది కనక ఒక డాలర్‌కు రూ.68.80 ఖర్చుచేయాల్సి వచ్చేంది. ఇపుడైతే రూ.63.48 చాలు. అంతర్జాతీయ మార్కెట్‌లో 103.50 స్థాయికి చేరిన డాలర్ ఇండెక్స్ కూడా దాదాపు సంవత్సన్నర కాలంలో భారీస్థాయిలో పతనం కావడం రూపాయి పటిష్ఠానికి ప్రధాన కారణాల్లో ఒకటి. గడచిన నాలుగు రోజుల్లోనే రూపాయి 67 పైసలు లాభపడింది. అంతర్జాతీయంగా రెండు నెలల క్రితం డాలర్ ఇండెక్స్ 90.99 స్థాయికి చేరినప్పుడు దాదాపు 63.60 స్థాయికి చేరిన రూపాయి, మళ్లీ డాలర్ ఇండెక్స్ 95 స్థాయికి చేరడంతో తిరిగి దాదాపు 65 స్థాయికి పడింది. ఇప్పుడు మళ్లీ డాలర్ ఇండెక్స్ బలహీనం (ఈ వార్త రసే సమయం రాత్రి 9గంటలకు 91.69 స్థాయిలో ట్రేడవుతోంది. ఇదే సమయంలో రూపాయి 63.46 వద్ద ట్రేడవుతోంది) రూపాయి బలోపేతానికి ప్రధాన కారణాల్లో ఒకటయ్యింది.

క్యూ4లో అదరగొడతాం..

వైజాగ్ స్టీల్ సీఎండీ వెల్లడి



న్యూఢిల్లీ: వైజాగ్ స్టీల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్–ఆర్ఐఎన్ఎల్) గత ఏడాది ఏప్రిల్– డిసెంబర్ కాలానికి టర్నోవర్‌తో సహా పలు అంశాల్లో మంచి వృద్ధిని సాధించింది. ఈ కాలంలో రూ.11,405 కోట్ల టర్నోవర్ సాధించామని, అంతకు ముందటేడాది ఇదే కాలంలో సాధించిన టర్నోవర్‌తో పోలిస్తే ఇది 30 శాతం అధికమని ఆర్ఐఎన్ఎల్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్లో (ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికం) రికార్డ్ స్థాయి పనితీరు సాధించనున్నామని ఆర్ఐఎన్ఎల్ సీఎండీ పి.మధుసూదన్ చెప్పారు.

16 శాతం పెరిగిన శ్రామిక ఉత్పాదకత...: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలంలో హాట్ మెటల్ ఉత్పత్తి 13 శాతం వృద్ధితో 3.65 మిలియన్ టన్నులకు, లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 15 శాతం వృద్ధితో 3.54 మిలియన్ టన్నులకు పెరిగాయని మధుసూదన్ తెలియజేశారు. విక్రయించదగ్గ ఉక్కు ఉత్పత్తి 15 శాతం వృద్ధితో 3.19 మిలియన్ టన్నులకు పెరిగిందని, శ్రామిక ఉత్పాదకత 16 శాతం వృద్ధి చెందిందని వివరించారు. గత ఏడాదిలో విస్తరణ, ఆధునికీకరణ పూర్తయ్యాయని, ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 7.3 మిలియన్ టన్నులకు పెంచామని పేర్కొన్నారు. ఆదాయం మెరుగుపరచుకోవడానికి అమ్మకాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారాయన.

మరింత మార్కెట్ కోసం ప్రత్యేక వ్యూహాలు...: స్థూల మార్జిన్‌ను సాధించామని, గత రెండు నెలల్లో ఎలాంటి రుణాలు చేయలేదని, ఫలితంగా ఈ క్యూ4లో మంచి పనితీరు కనబరచనున్నామన్న ధీమాను మధుసూదన్ వ్యక్తం చేశారు. విలువ జోడించే ఉక్కు ఉత్పత్తులకు భారత్‌లో డిమాండ్ పెరుగుతోందని, ఉత్పత్తిలో కొత్త టెక్నాలజీలను వినియోగిస్తున్నామని వివరించారు. ప్రత్యేక ఉక్కు ఉత్పత్తుల సెగ్మెంట్లో మార్కెట్ వాటా పెంచుకోవడానికి వ్యూహాలను సిద్ధం చేశామని తెలిపారు.

ఈ ఏడాదీ ఐపీఓల హల్‌చల్!

ఐపీఓ నిధుల సమీకరణలో 2017 రికార్డు
- ఈ ఏడాది రికార్డ్ బ్రేక్ అవుతుందనే అంచనాలు
- ఎన్‌ఎస్‌ఈ, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ ఇష్యూ త్వరలో
- పీఎస్‌యూల నుంచి సైతం మరిన్ని ఇష్యూలు



సాక్షి, బిజినెస్ విభాగం

పబ్లిక్ ఇష్యూల జోరు ఈ ఏడాదీ కొనసాగనుంది. గతేడాది పలు కంపెనీలు ఐపీఓల ద్వారా రికార్డ్ స్థాయిలో నిధులు సమీకరించాయి. మొత్తంగా 36 ప్రధాన కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.67,147 కోట్లు సమీకరించాయి. ఇది ఇప్పటివరకూ రికార్డ్. గత ఏడాది లిస్టయిన 36 కంపెనీల్లో 27 ఇన్వెస్టర్లకు మంచి రాబడులే ఇచ్చాయి. ఈ ఏడాది ఆ రికార్డు బద్దలయ్యే అవకాశాలున్నాయని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే పదికి పైగా కంపెనీలు ఐపీఓ ద్వారా రూ.12,000 కోట్ల మేర నిధులు సమీకరించడానికి సెబీ నుంచి ఆమోదం పొందాయి. రూ.19,000 కోట్ల సమీకరణ కోసం మరో 10 కంపెనీలు సెబీకి దరఖాస్తులు చేస్తున్నాయి.

ప్రభుత్వ రంగ సంస్థలను చూసుకున్నా... వాటిలో సెబీ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ వాటాను 75 శాతానికి పరిమితం చేసుకోవాల్సి ఉంది. దీంతో 18 సంస్థల్లో వాటాను ప్రభుత్వం తగ్గించుకోవాల్సి ఉంది. దీని కోసం ఈ ప్రభుత్వ రంగ సంస్థలు ఐపీఓల ద్వారా రూ.27,520 కోట్లు సమీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కాని, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కూడా స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఐపీఓకు రానున్న ప్రధాన కంపెనీలు, వాటి వివరాలు చూస్తే...

ఈ ఏడాది ప్రధాన ఐపీఓలు

కంపెనీ	ఇష్యూ (రూ.కోట్లలో)
ఎన్‌ఎస్‌ఈ	10,000
ఐసీఐసీఐ సెక్యూరిటీస్	5,000
హెచ్‌డీఎఫ్‌సీ 000	4,000
గో ఎయిర్	2,500
బంధన్ బ్యాంక్	2,500
రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్	1,600
యూటీఐ మ్యూచువల్ ఫండ్	2,500
వొడాఫోన్ ఇండియా	18,000
లోధా డెవలపర్స్	6,500
భారత్ సీరమ్ అండ్ వ్యాక్సిన్స్	2,000
పాలసీబజార్‌డాట్‌కామ్	650
కిమ్స్ హాస్పిటల్స్	600
కళ్యాణ్ జ్యూయలర్స్	3,000
ఇండియామార్ట్‌డాట్‌కామ్	500
హిందుజా లేలాండ్ ఫైనాన్స్	700
వీడియోకాన్ డీ2హెచ్	700

ప్రభుత్వ కంపెనీలు

కంపెనీ	ఇష్యూ (రూ.కోట్లలో)
హిందుస్తాన్ ఏరోనాటిక్స్	2,500
ఐఆర్‌సీటీసీ, రైల్‌వికాశ్, ఇర్కాన్	3,000
ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్	200
నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ	3,000
ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ	900

❑ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ

ఈ ఏడాది మార్చిలోగానే ఈ కంపెనీని లిస్ట్ చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ యోచిస్తోంది. గత ఏడాది సెప్టెంబర్లో ఈ కంపెనీ నిర్వహణ ఆస్తులు రూ.2.69 లక్షల కోట్లు. ఈ ఐపీఓ ద్వారా 10% వాటాకు సమానమైన షేర్ల జారీ చేసి రూ.4,000 కోట్ల వరకూ సమీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టాక్ మార్కెట్లో లిస్టవుతున్న రెండో మ్యూచువల్ ఫండ్ కంపెనీ ఇది. ఇప్పటికే అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ నిప్పన్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ 2017లో స్టాక్ మార్కెట్లో లిస్టయింది.

ఈ నెలలో వచ్చే ఐపీఓలు

కంపెనీ	ఇష్యూ (రూ.కోట్లలో)
అపోలో మైక్రో సిస్టమ్స్	156
ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్	1,200
కాంటినెంటల్ వేర్‌హౌసింగ్	400
సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్	1,200
గంధార్ ఆయిల్ రిఫైనరీ	--

❑ ఎట్టకేలకు ఎన్‌ఎస్‌ఈ!

గత ఏడాది బొంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్‌ఈ) ఇష్యూకి మంచి స్పందన రావడంతో ఇప్పుడు అందరి కళ్లూ ఎన్‌ఎస్‌ఈపై పడ్డాయి.ఎన్‌ఎస్‌ఈ ఐపీఓ కూడా ఈ ఏడాదే వచ్చే అవకాశాలున్నాయి. దీని ద్వారా రూ.10,000 కోట్లు సమీకరిస్తుందని అంచనా. ఎన్‌ఎస్‌ఈలో వాటాదారులైన ఎస్‌బీఐ, ఎల్ఐసీ, ఐఎఫ్‌సీఐ, ఐడీబీఐ బ్యాంక్, గోల్డ్‌మన్ శాక్స్, స్టాక్ హోల్డింగ్ కార్ప్, టైగర్ గ్లోబల్, సిటీ గ్రూప్ తదితర కంపెనీలు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా తమ వాటాను కానీ, తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి.

❑ నేషనల్ ఇన్సూరెన్స్ వస్తోంది..

గత ఏడాది జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూ ఇండియా ఎష్యూరెన్స్‌లు లిస్టయ్యాయి. ఈ ఏడాది మరో నేషనల్ ఇన్సూరెన్స్ ఐపీఓకు రానుంది. ఐపీఓ ద్వారా 10–15% వాటా విక్రయించే అవకాశాలున్నాయి. ఐపీఓ పరిమాణం రూ.2,000–రూ.3,000 కోట్లు ఉండొచ్చు.

❑ ఐసీఐసీఐ సెక్యూరిటీస్..

ఐసీఐసీఐ బ్యాంక్ పూర్తి అనుబంధ కంపెనీ ఇది. ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ఈ బ్యాంక్ 6,44,28,280 షేర్లను జారీ చేయనుంది. ఐసీఐసీఐ బ్యాంక్ లిస్ట్ చేస్తున్న నాలుగో గ్రూప్ కంపెనీ ఇది. భారత్‌లో అతి పెద్ద బ్రోకరేజ్ సంస్థ ఇదే. రూ.5,000 కోట్లు సమీకరించొచ్చని అంచనా.

❑ ఐదు రైల్వే ఐపీఓలు కూడా!

రైల్వేకు చెందిన ఐఆర్‌సీటీసీ, ఇర్కాన్, ఐఆర్ఎఫ్‌సీ, రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), ఆర్ఐటీఈఎస్ కంపెనీలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయనున్నట్లు గతేడాది ప్రారంభంలోనే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. కానీ వివిధ రైల్వే సంస్థల మధ్య ఆర్థికాంశాలు పరిష్కారం కావలసి ఉండటంతో ఈ ఐపీఓ ప్రణాళికలు అటకెక్కాయి. ఐఆర్‌సీటీసీ సర్వీస్ చార్జీ అంశంపైన, ఐఆర్ఎఫ్‌సీ పన్ను బాధ్యతపైన స్పష్టత రావాల్సి ఉంది. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించి ఐపీఓకు రావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ ఐదు రైల్వే ఐపీఓల ద్వారా సుమారుగా రూ.8,000 కోట్లు సమీకరించవచ్చు.

❑ హిందుస్తాన్ ఏరోనాటిక్స్..

రక్షణ రంగ పరికరాలు తయారు చేస్తున్న ప్రభుత్వ రంగ నవరత్న కంపెనీ ఇది. పది శాతం వాటాకు సమానమైన 3,61, 50,000 షేర్లను ఆఫర్ ఫర్‌సేల్ విధానంలో కేంద్రం విక్రయించనుంది. ఈ వాటా విక్రయం ద్వారా రూ.2,000– 2,500 కోట్లు సమీకరించే అవకాశాలున్నాయి. ఈ కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.19,597 కోట్ల ఆదాయంపై రూ.2,625 కోట్ల నికర లాభం సాధించింది. లాభదాయకత విషయంలో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఈ కంపెనీ సొంతం. 40 ఏళ్లుగా ఏటా డివిడెండ్‌లు చెల్లిస్తోంది. దీర్ఘకాలంలో పవన్ హాన్స్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఐపీఓలనూ తెచ్చే అవకాశాలున్నాయి.

ఇన్ఫీ సీఈవోగా పరేఖ్ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ/బెంగళూరు: దేశీ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ 'ఇన్ఫోసిస్' మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా సలీల్ పరేఖ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. టెక్నాలజీలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్న సమయంలో కంపెనీ పగ్గాలు చేపట్టడం సంతోషంగా ఉందని పరేఖ్ తెలిపారు. 'నిరంతరం మార్పు చెందుతున్న టెక్నాలజీ ప్రపంచంలో ప్రతి ఒక్క ఉద్యోగికీ కీలక పాత్ర ఉంటుంది. అవసరమైన నైపుణ్యాలు అలవరచుకోండి. భవిష్యత్ కోసం సిద్ధంగా ఉండండి' అని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కంపెనీ ఆదాయ వృద్ధి, వ్యాపార వ్యూహాలపై పరేఖ్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇన్ఫోసిస్ జనవరి 12న క్యూ3 ఆర్థిక ఫలితాలను ప్రకటించనుంది.

బెయిల్–ఇన్‌పై భయాలొద్దు

డిపాజిటర్ల ప్రయోజనాలకు పూర్తి రక్షణ
- ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై ఆర్థిక శాఖ వివరణ



న్యూఢిల్లీ: ప్రతిపాదిత ఎఫ్ఆర్‌డీఐ బిల్లులో వివాదాస్పదంగా ఉన్న బెయిల్–ఇన్ అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ వివరణ ఇచ్చింది. దీనిపై ఆందోళన చెందరాదని, సోషల్ మీడియా సహా మీడియాలో వస్తున్న వార్తలన్నీ అపోహలతో కూడుకున్నవేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం డిపాజిటర్ల ప్రయోజనాలకి ఉన్న రక్షణకు భంగం కలిగించే అంశాలేవీ ఈ బిల్లులో లేవని పేర్కొంది. పైగా మరింత పారదర్శకమైన విధానంలో ఖాతాదారుల డిపాజిట్లకు అదనపు భద్రత కల్పించేదిగా ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు ఉంటుందని ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. బ్యాంకులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పక్షంలో గట్టెక్కేందుకు... డిపాజిటర్ల సొమ్మును కూడా ఉపయోగించుకునేలా ఎఫ్ఆర్‌డీఐ బిల్లులో నిబంధనలు ఉన్నాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

బెయిల్–ఇన్ అనేది ఒకానొక పరిష్కార మార్గం మాత్రమేనని, ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయంలో దీన్ని ప్రయోగించాల్సిన పరిస్థితి దాదాపు ఉండనే ఉండదని ఆర్థిక శాఖ పేర్కొనటం గమనార్హం. బెయిల్–ఇన్ నిబంధనను ఉపయోగించుకున్న సందర్భాల్లో బీమా రక్షణ ఉన్న డిపాజిట్లను బ్యాంకులు తాకటానికి వీల్లేదని పేర్కొంది. ఇటు బీమా రక్షణ ఉన్న డిపాజిటర్లు, లేని డిపాజిటర్ల ప్రయోజనాలనూ పరిరక్షించేదిగానే ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ఉంటుందని వివరించింది. దీనిపై పార్లమెంటు సంయుక్త కమిటీ సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్నామని, వాటి సూచనలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రస్తుతం రూ.లక్ష దాకా డిపాజిట్లకు ఉన్న బీమా ప్రయోజనం ఇకపై కూడా కొనసాగుతూనే ఉంటుందని, అవసరమైతే దీన్ని మరింత పెంచే అంశాన్నీ పరిశీలిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అటు రాజ్యసభకి తెలిపారు.

పొదుపు బాండ్లపై తగ్గిన వడ్డీ!

8%కి బదులు ఇక 7.75%



న్యూఢిల్లీ: ఎనిమిది శాతంవడ్డీ లభించే ప్రభుత్వ (పన్ను పరిధిలోకి వచ్చే) పొదుపు బాండ్లు పొందేందుకు కాలపరిమితి ఈ నెల 2వ తేదీతో ముగిసిపోయిందని విచారపడే వారికిది కాస్తంత ఉపశమనం కలిగించే వార్తే. ఈ పొదుపు బాండ్లను కేంద్రం మరోసారి ఆవిష్కరిస్తోంది. అయితే ఈ బాండ్లపై వడ్డీ రేటును మాత్రం ఈ సారి 8 శాతం నుంచి 7.75 శాతానికి తగ్గిస్తోంది. ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర ఈ మేరకు ఒక ట్వీట్ చేశారు. పోస్టాఫీసు పొదుపు పథకాల్లో ఇటీవల కేంద్రం వడ్డీ రేట్లు తగ్గించిన నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది. అయితే 7.75 శాతంతో కూడిన పొదుపు బాండ్లు కూడా ఇతర స్థిర ఆదాయ ప్రొడక్టులతో పోల్చితే అధిక రాబడులనే అందిస్తాయి. ఆర్‌బీఐ బాండ్ల స్కీమ్ అని కూడా పేరున్న ఈ 8 శాతం సేవింగ్స్ బాండ్స్ స్కీమ్‌ను కేంద్రం 2003లో తీసుకువచ్చింది. ఆ ఏడాది ఏప్రిల్ 21న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. బాండ్ కాలపరిమితి ఆరేళ్లు. పెట్టుబడికి గరిష్ట పరిమితి లేదు. రిటైల్ ఇన్వెస్టర్లు ప్రత్యేకించి ప్రవాస భారతీయుల నుంచి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకువచ్చారు. అయితే ఇవి పన్ను రహిత బాండ్లు కాదు. వీటిపై వచ్చే వడ్డీకి ఆయా వర్గాల ఆదాయపు పన్ను శ్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ఎస్‌బీఐ 'కనీస' వడ్డింపు 1,772 కోట్లు

క్యూ2 నికర లాభం కంటే ఈ వసూళ్లే అధికం



న్యూఢిల్లీ: బ్యాంక్ ఖాతాల్లో నెలవారీ కనీస మొత్తం నిల్వ నిబంధనను పాటించని ఖాతాదారుల నుంచి జరిమానాల రూపంలో ఎస్‌బీఐ భారీగానే సొమ్ములు రాబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో ఈ జరిమానాలు రూ.1,772 కోట్లకు పెరిగాయి. ఈ బ్యాంక్ సాధించిన రెండో క్వార్టర్ నికర లాభం(రూ.1,582 కోట్లు) కన్నా ఈ మొత్తం అధికం కావడం విశేషం. కాగా ఈ 8 నెలల కాలం పూర్తయిన తర్వాత మొత్తం 40.5 కోట్ల సేవింగ్స్ ఖాతాలను ఎస్‌బీఐ మూసేసింది. కనీస నిల్వ పాటించని ఖాతాదారుల నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.97 కోట్లు వసూళ్లు చేసింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లు రూ.50 కోట్లకు పైగా వసూలు చేశాయి. కాగా ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, చిన్న ఖాతాలు, బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలు, పెన్షనర్ల, మైనర్ల, సామాజిక ప్రయోజనకర ఖాతాలకు ఈ కనీస నిల్వ నిబంధనను వర్తింపజేయడం లేదని, ఈ ఖాతాల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయలేదని ఎస్‌బీఐ స్పష్టం చేసింది.

ఆసియాలో మన మార్కెట్లే కాస్ట్‌లీ!

దేశీ సూచీలపై జిరోధా విశ్లేషణ
2018లో ఆచితూచి పెట్టుబడులు పెట్టాలని సూచన



బెంగళూరు: భారత స్టాక్ మార్కెట్లు 2017లో అద్భుతమైన పనితీరు కనబరిచాయి. దేశీయంగా మ్యూచువల్ ఫండ్లలోకి నిధుల ప్రవాహం నిరంతరంగా కొనసాగడం, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు.. సూచీలకు తోడ్పాటునిచ్చాయి. దీనికితోడు వెరవకుండా తెచ్చిన సంస్కరణలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. ఇవన్నీ కలిసిరావటంతో పగ్గాలు సడలి సూచీలు పరుగులంకించుకున్నాయి. దీంతో చాలామంది విశ్లేషకులు కొత్త ఏడాది కూడా ఇదే జోరు ఉంటుందని భావిస్తూ సూచీలకు కొత్త టార్గెట్లిస్తున్నారు. అయితే డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థ 'జిరోధా'కు చెందిన నిఖిల్ కామత్ మాత్రం భిన్నంగా స్పందించారు. తర్వాత నిమిషం ఏమి జరుగుతుందో చెప్పలేమని అలాంటప్పుడు ఏడాది తర్వాత సూచీల టార్గెట్‌ను అంచనా వేయడం సబబు కాదని చెప్పారాయన. ప్రస్తుతం కనిపిస్తున్న హుషారు, జోరు మొత్తం... సునామీకి ముందు కనిపించే హడావుడిలాంటిదేనని, ఈ స్థాయి అత్యాశలన్నీ అనర్థాలకే దారి తీస్తాయని తన అనుభవం చెబుతోందని హెచ్చరించారు. ''మూలాలను అధ్యయనం చేసి అంచనాకు రావాలి కానీ అప్పుడలా జరిగింది కాబట్టి ఇప్పుడూ అలాగే జరుగుతుందని భావించడం సరికాదు'' అని చెప్పారాయన.

పీఈ లెక్క చూద్దాం..

ఒక షేరు ధరతో దాని రాబడిని భాగించినపుడు వచ్చే నిష్పత్తిని పీఈ నిష్పత్తిగా చెబుతుంటారు. ఉదాహరణకు ఒక కంపెనీ ఏడాదికి వంద రూపాయలు ఆర్జిస్తుందనుకుందాం.. దాని షేర్లన్నిటినీ కలిపితే వచ్చే మార్కెట్ విలువ వెయ్యి రూపాయలనుకుందాం.. దాని పీఈ నిష్పత్తి 10 అవుతుంది. ఈ స్థాయి పీఈ వద్ద ఒక షేరు ఆకర్షణీయంగానే ఉంటుంది. కానీ మన సూచీలు సరాసరిన 19 రెట్ల పీఈ నిష్పత్తి వద్ద గత కొన్నేళ్లుగా ట్రేడయ్యాయి. 2017లోనైతే పీఈ ఏకంగా 26కు చేరింది.

అంటే దీని అర్థం.. సూచీల విలువకు, వాటి ఎర్నింగ్స్‌కు మధ్య చాలా అంతరం ఉందని. ఈ కంపెనీలు ఏకంగా 26 సంవత్సరాల పాటు ఆర్జించబోయే మొత్తానికి సమానంగా వాటి ప్రస్తుత మార్కెట్ విలువ ఉందని. నిజానికిది అంతర్జాతీయంగా చూసినా చాలా ఎక్కువ. అంక గణిత లెక్కల్లో సరాసరి కన్నా ప్రస్తుత విలువ రెండు స్టాండర్డ్ డీవియేషన్లు ఎక్కువ. ఆసియాలో మిగతా మార్కెట్లతో పోలిస్తే భారత సూచీలు అత్యంత ఖరీదైన వాల్యూయేషన్ల వద్ద ఉన్నట్లు నిఖిల్ కామత్ వెల్లడించారు. ''దీంతో ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సాధారణంగా మనకన్నా తక్కువ పీఈ విలువ ఉన్న మార్కెట్లను ఎంచుకుంటారు. ఇదే నిజమైతే మన మార్కెట్ల నుంచి విదేశీ నిధులు బయటకు పోయే అవకాశాలున్నాయి. కాబట్టి 2018ని అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిన సంవత్సరంగా భావించాలి'' అని నిఖిల్ వివరించారు. ఈ సందర్భంలో ఆచితూచి వ్యవహరించాలని, సరైన అధ్యయనంతో పెట్టుబడులు పెట్టాలని చెప్పారాయన.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,650 (కనిష్టం) రూ.5,030 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.5,000 (కనిష్టం) రూ.8,400 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,228 (కనిష్టం) రూ.6,722 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,000 (కనిష్టం) రూ.3,650 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,700
బియ్యం (కరీంనగర్)	-- (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,100
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--











రూ.15,900 కోట్లకు డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ!!

అసోచామ్ అంచనా

న్యూఢిల్లీ: దేశీ డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ 2021 నాటికి రూ.15,930 కోట్లకు చేరుతుందని అంచనా. అయితే ఈ రంగంలో స్థిరమైన అభివృద్ధికి పలు సంస్కరణలు అవసరమని పరిశ్రమ సమాఖ్య అసోచామ్ పేర్కొంది. 2011 నుంచి చూస్తే ఈ పరిశ్రమ దాదాపు రెట్టింపయ్యి 2016లో రూ.12,620 కోట్లకు చేరిందని తెలిపింది. డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ మరింత వృద్ధికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పాలసీ కింద నిబంధనలు సడలించడం, కన్స్యూమర్ ప్రొటెక్షన్ బిల్లు అమలు, ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ (బ్యానింగ్) చట్టాన్ని సవరించడం వంటి పలు చర్యలు అవసరమని అభిప్రాయపడింది.

ఏపీజీవీబీల్లో డెస్క్‌టాప్ ఏటీఎంలు



హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ డెస్క్‌టాప్ ఏటీఎంలను ఏర్పాటు చేసింది. తొలి దశలో వరంగల్ జిల్లాలోని కాశిబుగ్గ బ్రాంచీల్లో ఈ తరహా సేవలను ప్రారంభించామని ఏపీజీవీబీ చైర్మన్ వి.నరసి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగదును తీసుకునేందుకు ఇక లైన్లలో క్యూ అవసరముండదని, ఇతర బ్యాంకు ఖాతాదారులు కూడా ఇందులో నుంచి నగదును ఉపసంహరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే మరో 100 డెస్క్‌టాప్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకొస్తామని, ఇందులో 60 తెలంగాణలో, 40 ఏపీలో ఉంటాయని వివరించారు.

నేటి బోర్డ్ మీటింగ్స్...

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రమ్ క్యాపిటల్, టైటాన్ బయోటెక్, ఇండియాహోమ్ లోన్స్, సన్వారియా కన్స్యూమర్, మారథాన్ నెక్స్‌ట్‌జెన్ రియల్టీ

మార్కెట్ అక్కడక్కడే

మార్కెట్‌కు ముడి చమురు సెగ

- క్యూ3 ఫలితాలు రానున్నందున అప్రమత్తత
- 260 పాయింట్ల శ్రేణిలో కదిలి ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్
- 7 పాయింట్ల లాభంతో 10,442కు నిఫ్టీ



ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించడంతో మంగళవారం స్టాక్ మార్కెట్ అక్కడక్కడే ముగిసింది. కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ మొదలవుతుండటంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగుతుండడం ప్రతికూల ప్రభావం చూపించడంతో స్టాక్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి.

తీవ్రస్థాయి హెచ్చుతగ్గులు...: సెన్సెక్స్ 33,913 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కొనుగోళ్ల జోరుతో ఇంట్రాడేలో 151 పాయింట్ల లాభంతో 33,964 పాయింట్ల గరిష్ట స్థాయికి ఎగసింది. ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 109 పాయింట్లు నష్టపోయి 33,703 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద 260 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. చివరకు 0.49 పాయింట్ నష్టంతో 33,812 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 7 పాయింట్ల లాభంతో 10,442 పాయింట్ల వద్ద ముగిసింది.

అమ్మకాల వెల్లువ..: ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిసినా, మార్కెట్ స్తబ్దుగా ట్రేడయిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధించే అవకాశాలున్నాయన్న ఆందోళనలు ప్రతికూల ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. బడ్జెట్ సమీపించడం, క్యూ3 ఫలితాలు ఈ వారం నుంచే ఆరంభం కావడం తదితర కారణాల వల్ల ఇన్వెస్టర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపారని వివరించారు. కీలక పరిశ్రమల గణాంకాలు, నికాయ్ ఇండియా పర్చేజింగ్ మేనేజర్స్(పీఎంఐ) గణాంకాలు సానుకూలంగా ఉన్న ఆ ప్రభావం కనిపించలేదని నిపుణులు పేర్కొన్నారు.


'చమురు' షేర్లకు నష్టాలు : ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలు జరుగుతుండడం, ఒపెక్, రష్యా దేశాల ఉత్పత్తి కోత తదితర అంశాల కారణంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 67 డాలర్లకు ఎగియడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లు–బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీల నష్టాలు కొనసాగాయి. ఈ షేర్లు 1–2 శాతం రేంజ్‌లో తగ్గాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,009
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	31,952
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,25,119
ఎఫ్ఐఐ	523
డీఐఐ	65

ఇంటర్‌కనెక్టివిటీ నిబంధనలు కఠినం

ఉల్లంఘిస్తే రోజుకు లక్ష దాకా జరిమానా – ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: టెల్కోల నెట్‌వర్క్ కనెక్టివిటీ నిబంధనలను టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠినతరం చేసింది. ఇంటర్ కనెక్షన్ ఒప్పందాలను కుదుర్చుకునేందుకు ఉండే వ్యవధిని 90 రోజుల నుంచి 30 రోజులకు కుదించింది. నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో ప్రతి సర్వీస్ ఏరియాకు రోజుకు రూ.లక్ష దాకా జరిమానా విధించాలని నిర్ణయించింది. ట్రాయ్ నిర్దేశించిన 'టెలికం ఇంటర్‌కనెక్షన్ నిబంధనలు 2018' ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. కొత్త ఆపరేటరయిన రిలయన్స్ జియోకు, పాత ఆపరేటర్లకు మధ్య నెట్‌వర్క్ కనెక్టివిటీ, పోర్టుల విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో తాజా మార్గదర్శకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్ వంటి పాత ఆపరేటర్లు తమకు తగినన్ని ఇంటర్‌కనెక్ట్ పాయింట్లు (పీవోఐ) ఇవ్వకపోతుండటం వల్ల భారీగా కాల్ ఫెయిల్యూర్స్‌కి దారి తీస్తోందంటూ 2016లో సర్వీసులు ప్రారంభించినప్పుడు రిలయన్స్ జియో ఆరోపించింది. అయితే, జియో ఉచిత కాల్స్ తమ నెట్‌వర్క్‌ను సునామీలా ముంచెత్తుతున్నాయని మిగతా టెల్కోలు ప్రత్యారోపణలు చేశాయి. వీటి దరిమిలా ట్రాయ్ తాజాగా ఇంటర్‌కనెక్షన్ నిబంధనలను రూపొందించింది.

సిర్పూర్ పేపర్ పునరుద్ధరణకు దిగ్గజాల పోటీ

హైదరాబాద్: పేపర్ తయారీలో ఉన్న సిర్పూర్ పేపర్ మిల్స్ పునరుద్ధరణకు పలు దిగ్గజ కంపెనీలు పోటీపడుతున్నట్టు తెలుస్తోంది. వీటిలో ఐటీసీ గ్రూప్, జేకే పేపర్, వెస్ట్ కోస్ట్ పేపర్ మిల్స్, కోహినూర్ గ్రూప్ ఉన్నట్టు సమాచారం. 1938లో ప్రారంభమైన సిర్పూర్ పేపర్ మిల్స్ నష్టాల కారణంగా 2014 సెప్టెంబరు నుంచి కార్యకలాపాల్ని నిలిపేసింది. రుణదాతల తరఫున రూ.422 కోట్ల బాకీ రికవరీకిగాను 2016లో ఐడీబీఐ బ్యాంకు ఈ మిల్లును తన అధీనంలోకి తీసుకుని అమ్మకానికి పెట్టింది. మిల్లు నిర్వహణకు పెట్టుబడి పెట్టిన రుణదాతల్లో ఒకరు చేసిన దరఖాస్తును నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ స్వీకరించి, దివాలా ప్రక్రియను 2017 అక్టోబరులో మొదలు పెట్టింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు భాగస్వామి కోసం పలు కంపెనీలతో చర్చించింది. కొత్త కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాలను సిర్పూర్ పేపర్‌కు సైతం అందిస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు ఇదివరకే ప్రకటించారు.

రిలయన్స్ ఎథిలీన్ సామర్థ్యం రెట్టింపు

అతి పెద్ద ఆర్‌వోజీసీ ప్లాంటు ఏర్పాటు

ముంబై: పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా ప్రపంచంలోనే అతి పెద్ద ఆఫ్–గ్యాస్ క్రాకర్ ప్లాంటును తమ జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసింది. మిగతా ఉత్పత్తి ప్లాంట్లు మొదలైన వాటన్నింటితో కలిపి దీని సామర్థ్యం వార్షికంగా 1.5 మిలియన్ టన్నుల మేర ఉంటుందని రిలయన్స్ తెలిపింది. 'ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి, అతి పెద్ద రిఫైనరీ ఆఫ్–గ్యాస్ క్రాకర్ (ఆర్‌వోజీసీ) కాంప్లెక్స్' అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఆర్ఐఎల్ పెట్రోకెమికల్స్ వ్యాపార లాభదాయకతకు, నిలకడగా రాణించేందుకు ఇది తోడ్పడగలదని చెప్పారు. రిలయన్స్‌కి జామ్‌నగర్‌లో ఉన్న రెండు రిఫైనరీల నుంచి వచ్చే వాయువులను ప్రాసెస్ చేసి.. పెట్రోకెమికల్స్ ఉత్పత్తుల తయారీకి అనువైన ఎథిలీన్, ప్రొపిలీన్ తదితర ముడి రసాయనాలను అందించేందుకు ఇది తోడ్పడనుంది. ఆర్‌వోజీసీ నుంచి వచ్చే ఎథిలీన్‌ను.. మిగతా ప్లాంట్లలోకి మళ్లించి మోనో ఎథిలీన్ గ్లైకాల్, పాలీ ఎథిలీన్ ఉత్పత్తిలో ఉపయోగిస్తారు. ఆర్‌వోజీసీ అందుబాటులోకి రావడంతో మొత్తం అయిదు సైట్లలో ఎథిలీన్ సామర్థ్యం దాదాపు ఏటా 4 మిలియన్ టన్నులకు చేరిందని కంపెనీ పేర్కొంది. దీంతో 2014లో దాదాపు 16 బిలియన్ డాలర్లతో చేపట్టిన భారీ విస్తరణ పనులు పూర్తయినట్లు తెలిపింది.

టాప్ స్పీడ్‌లో టూవీలర్లు

డిసెంబర్‌లో ద్విచక్ర వాహన విక్రయాల జోష్

- టాటా మోటార్స్ అమ్మకాలు అప్; తగ్గిన ఫోర్డ్ దేశీ విక్రయాలు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన తయారీ కంపెనీలు డిసెంబర్ నెలలో జోరు చూపించాయి. హీరో మోటొకార్ప్, బజాజ్ ఆటో, సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి కంపెనీలన్నీ వాటి వాహన విక్రయాల్లో వార్షిక ప్రాతిపదికన రెండంకెల వృద్ధిని నమోదుచేశాయి. సుజుకీ మోటార్‌సైకిల్ దేశీ విక్రయాలు 53 శాతం వృద్ధితో 21,362 యూనిట్ల నుంచి 32,786 యూనిట్లకు ఎగశాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ దేశీ విక్రయాలు 16 శాతం వృద్ధితో 56,316 యూనిట్ల నుంచి 65,367 యూనిట్లకు పెరిగాయి. మరోకవైపు టాటా మోటార్స్ దేశీ ప్యాసింజర్ వాహన విక్రయాలు 30.96 శాతం వృద్ధితో 14,180 యూనిట్లకు పెరిగాయి. ఇక మొత్తం వాహన విక్రయాలు 52.48 శాతం వృద్ధితో 35,825 యూనిట్ల నుంచి 54,627 యూనిట్లకు ఎగశాయి. ఫోర్డ్ ఇండియా దేశీ విక్రయాలు మాత్రం 8.6 శాతం క్షీణతతో 5,566 యూనిట్ల నుంచి 5,087 యూనిట్లకు తగ్గాయి. దీని మొత్తం వాహన అమ్మకాలు 27 శాతంమేర పెరిగాయి. ఇవి 23,470 యూనిట్ల నుంచి 29,795 యూనిట్లకు ఎగశాయి. కాగా 'లో బేస్ ఎఫెక్ట్' వల్లే తాజా వృద్ధి కనిపించినట్లు వారు చెప్పారు.

ద్విచక్ర వాహన కంపెనీల డిసెంబర్ విక్రయాలు

కంపెనీ	2017	2016	వృ/క్షీ
హీరో మోటొకార్ప్	4,72,731	3,30,202	43
బజాజ్ ఆటో	2,92,547	2,25,529	30
రాయల్ ఎన్‌ఫీల్డ్	66,968	57,398	17
సుజుకీ మోటార్‌సైకిల్	39,786	26,495	50
కంపెనీ	దేశీ కార్ల విక్రయాలు		వృ/క్షీ
టాటా మోటార్స్	14,180	10,827	31
ఫోర్డ్ ఇండియా	5,087	5,566	-8.6

డిసెంబర్‌లో 'తయారీ' సూపర్: నికాయ్

ఐదేళ్లలో ఎప్పుడూలేనంత పనితీరు...



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం డిసెంబర్‌లో గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత చక్కటి పనితనాన్ని చూపింది. కొత్త ఆర్డర్లు రావడం దీనికి ప్రధాన కారణం. నికాయ్ భారత్ మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ ఇండెక్స్ (పీఎంఐ) డిసెంబర్‌లో 54.7 పాయింట్లుగా నమోదయ్యింది. నవంబర్‌లో ఈ పాయింట్లు 52.6. మూడు విభాగాలు... కన్స్యూమర్, ఇంటర్‌మీడియట్, ఇన్వెస్ట్‌మెంట్‌ల్లో మంచి ఫలితాలు వెలువడ్డాయి. ఇండెక్స్ 50 పాయింట్లపైనే కొనసాగడం ఇది వరుసగా ఐదవనెల. నికాయ్ ఇండెక్స్ ప్రకారం– ఈ పాయింట్లు 50 శాతం లోపునకు పడిపోతే క్షీణ దశగా, ఆపైన వృద్ధి ధోరణిగా భావించడం జరుగుతుంది.

భవిష్యత్ బాగుంటుంది: హెచ్ఎస్‌బీసీ: భారత్ వృద్ధి రేటు 2018–19 ఆర్థిక సంవత్సరంలో మెరుగుపడుతుందని ఆర్థిక సేవల సంస్థ– హెచ్ఎస్‌బీసీ పేర్కొంది. 2018–19లో 7 శాతంగా నమోదయ్యే వృద్ధి రేటు 2019–20 నాటికి 7.6 శాతానికి చేరుతుందని అంచనావేసింది. డీమోనిటైజేషన్, జీఎస్‌టీ బాలారిష్టాలు తొలగిపోయే అవకాశాలు ఉండడమే తన అంచనాలకు కారణంగా హెచ్ఎస్‌బీసీ పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,540	▲	15
బంగారం (99.5, 10గ్రా)	29,390	▲	15
వెండి (కిలో)	38,675	▼	45
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,160	▲	90
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,090	▲	40
బంగారం (22 క్యారెట్లు)	28,120	▲	20
వెండి(కిలో)	38,925	▼	185
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,400		0
బంగారం (22 క్యారెట్లు)	28,180	▼	20
వెండి(కిలో)	39,900	▼	200
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	30,220	▼	430
బంగారం (22 క్యారెట్లు)	28,100		0
వెండి(కిలో)	39,900	▼	1,600
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,450	▲	50
బంగారం (22 క్యారెట్లు)	28,250	▲	50
వెండి(కిలో)	40,000	▲	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,450	▲	60
బంగారం (22 క్యారెట్లు)	28,160	▲	90
వెండి(కిలో)	39,800	▲	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	8.85 – 9.45
డిపాజిట్ రేట్ రేంజ్	6.00 – 6.75
డాలర్ లిబార్(6 నెలలు)	1.83

అంకెలు శాతాల్లో

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	సోమవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.23	$60.42
బ్రెంట్	66.39	$66.87

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 3-1-2018

విశాఖ	380–00
చిత్తూరు	388–00
వరంగల్	374–00
ముంబై	415–00
చెన్నై	395–00
విజయవాడ	375–00
గోదావరి	375–00
నమక్కల్	375–00
2–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	372–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.30
బెంగళూరు	375–00
ఢిల్లీ	418–00
కోల్‌కతా	416–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	397.4	399.65
AMBUJA C	268.15	268.05
ASIAN PA	1142.75	1143.65
AXIS BAN	559.5	565.5
BAJAJ AU	3294.75	3289.25
BAJAJ FI	1724.65	1725.65
BHARTI A	516.55	527.9
BOSCH LI	19721.75	19791.9
BHARAT P	499.8	508.6
CIPLA LT	607.8	611.5
COAL IND	270.05	266.65
EICHER M	28670.15	29893.15
GAIL (IN	494.35	498.65
HCL TECH	892.8	878.7
HDFC LTD	1703.25	1683.75
HDFC BAN	1872.35	1854.5
HERO MOT	3743.85	3749.1
HINDALCO	271.9	271.15
HIND.petrol	406.4	413.75
HIND.unilever	1338.6	1344.5
INDIABUL	1183.55	1218.15
ICICI BA	309.7	310.3
INDUSIND	1643.95	1623.85
BHARTI I	378.8	369.95
INFOSYS	1029.7	1033.55
INDIAN O	386.4	389.95
ITC LTD	260.75	262.3
KOTAK MA	1003.2	999.95
LARSEN &	1249.75	1260.7
LUPIN LI	875.15	883.25
MAHINDRA	752.9	744.65
MARUTI S	9554.05	9651.9
NTPC LTD	178.9	176.55
OIL AND	196.85	192.35
POWER GR	200.75	200.2
RELIANCE	911.15	909.75
STATE BA	303.25	307.1
SUN PHAR	572.15	574.05
TATA MOT	439.3	424.45
TATA STE	729.3	722.2
TATA CON	2631.2	2645.6
TECH MAH	513.95	503.1
ULTRATEC	4252.3	4256.05
UPL LIMI	773.45	755.75
VEDANTA	327.75	325.45
WIPRO LT	318.7	316.55
YES BANK	311.65	312.6
ZEE ENTE	578.15	579.2

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDI	1400.2	1399.65
ACC LIMI	1743.2	1731.35
ASHOK LE	123.35	118.65
BAJAJ FI	5101.1	5171.85
BANK OF	157.95	161.5
BHARAT E	181.65	181.45
BHEL	98.2	95.15
BRITANNI	4656.05	4738.25
CADILA H	428.3	432.55
COLGATE	1100.75	1102.6
CONTAINE	1352.7	1370.75
CUMMINS	922.3	913.05
DABUR IN	349.05	349
DLF LIMI	253.9	256.7
AVENUE S	1160	1170.5
EMAMI LI	1310.25	1335.8
GLAXOSMI	2466	2463
GLENMARK	592.8	596.1
GODREJ C	981.55	986.25
GLAXOSMI	6464.5	6477.15
HAVELLS	549.25	554.45
HIND.zinc	309.4	308.95
ICICI PR	375.2	382.3
IDEA CEL	100.7	104.6
INTERGLO	1201.4	1203
JSW STEE	264.55	265.8
LIC HOUS	562.75	565.7
MARICO L	325.7	320.7
UNITED S	3592	3643.8
MOTHERSO	378.8	379.1
MRF LTD	71246.1	72402.85
NHPC LTD	31.85	32.2
NMDC LTD	148.6	141.05
ORACLE F	4000.25	4066.75
OIL INDI	374.25	372.95
PIRAMAL	2848.45	2844.5
PETRONET	252.75	255.9
POWER FI	123.65	123.8
P&G HYGI	9388.75	9475
PIDILITE	889.2	900
PUNJAB N	166.4	169.75
RURAL EL	157.65	158.4
STEEL AU	91.85	92.7
SHREE CE	18000.35	17929.05
SIEMENS	1258.9	1238.2
SHRIRAM	1463.35	1473.45
SUN TV N	995.2	998
TATA POW	99.7	97.15
TITAN CO	845.15	852.45
TORRENT	1395.1	1390.45

A B C D

20 MICRO	58.05	58.75
3M INDIA	18904.05	19264.55
5PAISA C	339.6	357.45
63 MOONS	117.75	119.4
8K MILES	891.2	901.95
AARTI DR	636.35	634.15
AARTI IN	1132.9	1141
AARVEE D	49.4	50.2
AARVI EN	105	107
ABAN OFF	205.45	201.3
ABBOTT I	5443.55	5497.75
ACCEL FR	60.15	54.7
ACCELYA	1431.85	1433.65
ACCORD S	56	57
ACTION C	140.15	141.6
ADANI EN	163.9	166.05
ADANI TR	210.5	219.7
ADF FOOD	307.55	312.85
ADITYA B	94.6	96.95
ADITYA B	171.2	170
ADITYA B	185.25	186.4
ADOR WEL	514.4	495.5
ADVANCED	309.15	278.45
ADVANI H	77.4	79.25
AEGIS LO	282.5	289.45
AGRI-TEC	116.1	118.85
AGRO TEC	703.3	710.4
AHLUWALI	378.7	383.5
AIA ENGI	1525.4	1536.65
AIRAN LI	228.8	218
AIRO LAM	57.1	55.75
AJANTA P	1472.5	1493.75
AJMERA R	321.45	326.2
AKASH IN	70	72.5
AKSHARCH	770.65	766.15
AKZO NOB	1846.45	1860.05
ALANKIT	76.75	73.1
ALBERT D	385.2	347.2
ALEMBIC	60.15	57.85
ALEMBIC	526.45	531.2
ALICON C	687.1	701.95
ALKALI M	80.25	80.8
ALKEM LA	2200.1	2225.95
ALKYL AM	640.2	658.8
ALLAHABA	72.15	73.75
ALLCARGO	205.3	209.15
ALLSEC T	436.35	441.65
ALPHAGEO	906.75	919.7
AMBIKA C	1379.65	1359.75
AMRUTAJA	640.1	641.45
ANANT RA	70.85	72.2
ANI INTE	164.85	170.35
ANJANI P	235	238.25
APAR IND	795.6	806.25
APCOTEX	487.75	496.45
APEX FRO	812.45	830.05
APL APOL	1980.15	1980.6
APOLLO H	1191.95	1202.55
APOLLO S	1435.05	1304.6
APOLLO T	267.55	268.85
APTECH L	362.25	365.35
ARCHIDPL	113.8	116.65
ARCOTECH	56.15	55.9
ARIHANT	172.6	172.1
ARO GRAN	79.8	82
ARROW GR	482.25	480.85
ARSHIYA	105.6	107.2
ARTEM GL	117	116.4
ARVIND L	440.55	445.95
ARVIND S	193.25	199.75
ASAHI IN	367.9	370.9
ASAHI SO	359.85	362.65
ASHAPURA	95.35	95.5
ASHAPURA	454.25	453.2
ASHIANA	182.1	186.6
ASHOKA B	243.35	245.95
ASIAN GR	567.8	570.15
ASIAN HO	176.3	176.4
ASIAN HO	272.7	274.1
ASPINWAL	511.55	535.35
ASTEC LI	554.95	549.2
ASTRA MI	118.65	118.75
ASTRAL P	829.65	835.55
ASTRAZEN	1187.75	1174.25
ATLANTA	115.8	115.4
ATUL AUT	454.05	456.35
ATUL LTD	2716.5	2752.1
AU SMALL	661.4	662.85
AURIONPR	246.6	245.1
AUSOM EN	73.25	74.25
AUTOLITE	69	70.1
AUTOMOTI	98.25	101.3
AUTOMOTI	1540.55	1441
AVADH SU	799.75	808.6
AVANTI F	2591.25	2585.25
AVT NATU	56.1	57.3
AXISCADE	201.55	204.5
AYM SYNT	66	66
B.L.KASH	62.25	64.3
BAJAJ CO	488.85	487.75
BAJAJ EL	489.8	489.25
BAJAJ HO	2839.8	2864.45
BAL PHAR	116.6	122.5
BALAJI T	152.65	153.4
BALKRISH	101.7	109.7
BALKRISH	1173.25	1195.45
BALMER L	267.8	272.4
BALRAMPU	135.55	135.3
BANARAS	99.9	102.75
BANCO PR	255.6	258.1
BANK OF	167.3	169.9
BANNARI	325.6	331
BANNARI	2100.95	2129.6
BANSAL M	117	116.55
BANSWARA	141.95	144.05

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.81	9.1
Alphageo	911	916.75
Alu Flouride	136	133.75
Amar Raja Bat	832	833.6
And Bank	57.45	58.35
And Cemen	13.7	13.9
And Paper	317.95	317.4
And Petro	60.95	64.15
Anjani Portl	233.3	240
Aries Agro Ltd	241.65	244.7
Aurobindo Ph	671.85	685.15
Avantel Soft	468	466.55
Avanti Feeds	2587.5	2586.1
AvonOrg	15.7	14.96
BN Rathi Sec	54	54.15
Balaji Amin	622.55	631.55
Bambino Agro	325	326.75
Bartronics	15.15	15.17
Bhagira Chem	320	299.05
Bhagya Nag	51.05	52.1
Bhagya Wood	29.45	28.05
Brilliant Sec	11.63	11.08
CIL Securi	36.5	37.9
Color Chip	45.45	47.6
Cont Coffee	298.5	298.95
CoroFert	542	559.8
Cosboard Ind	43.95	44.65
Country Club	19.75	20.25
Cubex Tub	28.1	28.9
Cybermate	3.45	3.62
DR Reddy	2405	2411.5
Danlaw Tec	73.5	75.5
DecCement	560	556.5
Divi's Lab	1075	1098.85
Divya Granit	104.9	101.2
Dolphin Medi	1.91	1.82
Dredgin Corp	821.3	848.1
Empee Sugars	5.29	4.95
Everest Org	137	138.85
Fortune Info	107.4	118.05
Four Soft	93.8	91.6
GMR Ferro	3.6	3.64
GMR Infra	21.65	22.3
GVK Power	18.6	19.4
Galada Tele	5.42	5.7
Gati Corpn	133.25	134.95
Gayatri Proj	227.25	226.85
Gayatri Sugrs	11.19	10.66
Gennex Lab	6.29	6.25
GodavDru	42.55	41.85
Goldstn Tele	201.85	206.85
Goldstone Tech	16.15	17
Granules (I)	134.3	137.1
HBL Nife Pow	73.05	73.6
HYDIndus	1518.75	1524.2
Heritage Food	803.1	821.55
ICSA Ltd	4.3	3.92
IDL Industrs	594.95	571.3
IQMS Soft	15.95	15.15
IVRCL Infras	7.33	7.02

భయం ఉంటేనే వ్యవస్థ బాగుంటుంది

- మాస్ కాపీయింగ్‌పై హైకోర్టు ఆందోళన
- మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏం చేస్తున్నారో చెప్పండి
- ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుండటంపై ఉమ్మడి హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మాస్ కాపీయింగ్ నేపథ్యంలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని కాపీయింగ్‌కు సహకరించే టీచర్లు విద్యార్థులకు దేవుళ్లుగా, సహకరించనివారు దెయ్యాల్లా కనిపిస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది 10వ తరగతి పరీక్షల సందర్భంగా మాస్ కాపీయింగ్‌కు సంబంధించి తెలంగాణలో 4 కేసులు, ఏపీలో ఓ కేసు మాత్రమే నమోదవడంపై విస్మయం వెలిబుచ్చింది. పబ్లిక్ పరీక్షల చట్టం-1997 కింద కేసులు నమోదు చేయడంతోపాటు ప్రాసిక్యూషన్ చేస్తేనే పరిస్థితులు దార్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ''భయం ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుంది. ఫెయిలైతే ఏమవుతుంది.. ఓ సంవత్సరం లేటవుతుంది.. అడ్డదార్లు తొక్కాల్సిన అవసర మేముంది?'' అని వ్యాఖ్యానించింది. మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏం చర్యలు తీసుకుం టున్నారో తెలపాలని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ విచారణను ఈనెల 23కు వాయిదా వేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ శ్యాం ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వు లిచ్చింది. ఉభయ రాష్ట్రాల్లోని మాస్ కాపీయింగ్‌ను అడ్డుకునేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించేలా ఆదేశాలివ్వాలంటూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ శ్రీనివాస్ గుంటుపల్లి పిల్ దాఖలు చేశారు. దీన్ని ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఏపీ న్యాయవాది పేర్కొంటూ విచారణను సంక్రాంతి సెలవుల తర్వాత చేపట్టాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. చట్టాన్ని ఎందుకు సక్రమంగా అమలు చేయట్లేదని ప్రశ్నించింది. మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏం చేస్తే బాగుంటుందో సలహాలివ్వాలని కోరింది.

'మహనీయుడు బళ్లారి రాఘవ'


మాట్లాడుతున్న రాచపాలెం

అనంతపురం కల్చరల్: విలువల కోసం పరితపించిన మహనీయుడు బళ్లారి రాఘవ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ప్రజా నాట్యమండలి నేతృత్వంలో బళ్లారి రాఘవ సాంస్కృతిక స్మారక ఉత్సవాలు అనంతపురం లలితకళాపరిషత్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. నేడు కళ కాసుల కోసమే అనే విధంగా మారిపోయిందని వక్తలంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ బళ్లారి రాఘవను గౌరవిస్తున్నారంటే ఆయన మహోన్నత వ్యక్తిత్వమే కారణమన్నారు. నాటకానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు జరుగుతున్న ఈ ఉత్సవాలు అందరికీ స్ఫూర్తిని రగిలించాలని ఆకాంక్షించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య


సాంబశివుడు, నాగమ్మ (ఫైల్)

తొండూరు/రాప్తాడు: పంటలు పండక, సాగుకు చేసిన అప్పులు భారంగా మారి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం బూచుపల్లెకు చెందిన కోడూరు సాంబశివుడు (39) తనకు ఉన్న పొలంలో పత్తి, చీనీ సాగు చేశాడు. ఏటా ఒకట్రెండు బోర్లు వేసి చీనీచెట్లను కాపాడుకుంటూ వచ్చేవాడు. 3 నెలల క్రితం రెండు బోర్లు వేసినా నీరు పడలేదు. ఇలా పంట పెట్టుబడులకు, బోర్లకు కలిపి మొత్తం రూ.8 లక్షల అప్పులు చేశాడు. 2014లో బ్యాంకులో ఒకేసారి రూ.45 వేలు రుణమాఫీ అయ్యింది. తాజాగా బ్యాంకులో రూ.లక్ష వరకు వ్యవసాయ రుణంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.7 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పులిచ్చినవారి ఒత్తిడి పెరగడంతో మంగళవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అప్పు తీర్చేందుకు భూమి అమ్మలేక: అనంతపురం జిల్లా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన మహిళా రైతు వెన్నపూస నాగమ్మ (61) ఆత్మహత్య చేసుకున్న విషయం మంగళవారం వెలుగుచూసింది. నాగమ్మ తన ఐదు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. నాలుగైదేళ్లుగా వేరుశనగ పంటను సాగుచేయగా.. పంట చేతికందక రూ.2 లక్షలు మిగిలాయి. ఐదు బోరుబావులు తవ్వించడానికి, పంట పెట్టుబడి కోసం.. ఇలా మొత్తం అప్పుల భారం రు.8 లక్షలకు చేరుకుంది. రుణదాతల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో భూమి అమ్మాలని నాగమ్మ భావించింది. అయితే అందుకు కుమారులు ఒప్పుకోకపోవడంతో గతనెల 25న ఇంట్లోంచి వెళ్లిపోయింది. సోమవారం ఆర్డీటీ చెక్‌డ్యాంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. నాగమ్మ కుమారులు వెళ్లి చూసి ఆ మృతదేహం తమ తల్లిదేనని గుర్తించి బోరున విలపించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్, జి.యన్.యస్.యస్., కడప వారి కార్యాలయం
ఫారం (నమూనా) నెం. 6ఎ

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టములో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 రూలు 19 సబ్ రూల్ (1) ననుసరించి).

ప్రాథమిక ప్రకటన

రెఫ్. నెం. బి/03/2017 **తేది: 09-11-2017**

ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములకు కడప జిల్లా సంబేపల్లి మండలము మోటకట్ల గ్రామం నందు ప్రజాప్రయోజనముకై హంద్రీనీవా సుజల స్రవంతి శ్రీనివాసపురం రిజర్వాయరు ద్వారా కుడి ప్రధాన కాలువ మీద బ్రాంచి కాలువ క్రింద యల్‌మైనర్ కి.మీ. 0.00 నుండి కి.మీ. 1.100 2L కొరకు 7.90 ఎకరముల భూమి కావలెనని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013 సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టములోని సెక్షన్ 11(1) నిబంధనలనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించి పర్యావరణ ప్రభావము మదింపు (ఈ.ఐ.ఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ శాఖ వారి లేఖ నెంబరు జే/12011/32/2001/ఎ-1, తేది: 20-12-2005 ప్రకారం జారీ చెయ్యబడినది. భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

ప్రస్తుత భూసేకరణ ప్రజాహిత పనులు అంటే అనగా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ క్రింద 0.000 నుండి 1.100 2L పనులకు గాను సమకూర్చు నిమిత్తం 7.90 ఎకరముల సహేతుక పరిహారము పారదర్శక భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన చట్టం 2013 సెక్షన్ 6 (2) (సామాజిక ప్రభావిత మదింపు) మరియు సెక్షన్ 10(4) (జాతీయ ఆహార భద్రత)లోని అంశములు ఈ భూసేకరణకు మినహాయించబడినది.

ఇదే చట్టములో సెక్షన్ 43(1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహా పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 1 రెవిన్యూ (భూసేకరణ) తేది 20-01-2015 నందు సంయుక్త కలెక్టరు, కడప వారిని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడినది.

ఇదే చట్టములోని సెక్షన్ 12 మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ నియమావళి 2014 2డి క్రింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) తెలుగుగంగ ప్రాజెక్ట్, యూనిట్-2 కడప వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఈ భూముల భూసేకరణకై అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడప /ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) తెలుగు గంగ ప్రాజెక్టు యూనిట్ -2, కడప వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు ఈ భూములపై జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టములోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైన అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) గాలేరు నగరి సుజల స్రవంతి, కడప / ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్ -2 కడప వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోవచ్చును.

షెడ్యూలు

మండలము : సంబేపల్లి గ్రామం : మోటకట్ల

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణము (ఎకరములలో)	అక్విజేషన్ క్రింద తీసుకున్న విస్తీర్ణము (ఎకరములలో)	ఆసక్తి గల వారి పేరు మరియు అడ్రస్సు	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడాలు వగైరా వివరములు
1	2	3	4	5	6	7	8	9	10
				పట్టా భూములు					
1.	437/1A2	5.85	1.73	మహాదేవపల్లి తులసమ్మ భర్త పుల్లారెడ్డి	437/1A1	437/1A3	437/1B	438	
			0.01	మహాదేవపల్లి విష్ణు ప్రసాద రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి					
		మొత్తం	1.74						
				డి.కె.టి. భూములు					
1.	432/1B	5.00	0.19	మహాదేవపల్లి సహదేవ రెడ్డి తండ్రి చిన్న వెంకట రెడ్డి	432/1A	439/2A	432/1A	424	
2.	439/2	6.69	0.16	గుర్రం లక్ష్మిదేవి భర్త దామోదర్ రెడ్డి	432	439/1	438	439/1	
3.	924/1B	4.88	0.31	వసంతు వెంకట్రామిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	924/1A	924/1C	924/1A & 2A	నారాయణ రెడ్డిపల్లె గ్రామము	
			0.50	గంగారపు విజయలక్ష్మి భర్త శ్రీనివాసులు					
			0.19	గంగారపు వెంకట రమణ తండ్రి రామజోగి					
4.	924/2B	2.80	0.11	గంగారపు వెంకట రమణ తండ్రి రామజోగి	924/2A	926 & 927	924/2A	924/1B	
5.	926/1B	2.57	0.08	గంగారపు వెంకట రమణ తండ్రి రామజోగి	924	926/4B	927	926/1A	
6.	926/4B	5.36	0.30	షేక్ నజీర్ బాష తండ్రి అబ్దుల్ అజీజ్	926/1B	926/4A	927	926/4A	
7.	927/2B	1.43	1.03	షేక్ ఖాదర్ బాష (Died)	927/1B	927/3B	927/1A & 2C	926 927/2A	
8.	933/1B	3.53	0.41	మహాదేవపల్లి పద్మావతమ్మ భర్త కృష్ణారెడ్డి	927	933/3B	933/1A	934	
9.	933/1D		0.68	మహాదేవపల్లి పద్మావతమ్మ భర్త కృష్ణారెడ్డి	927/3B	933/8B	933/1E & 8A	933/1C	
10.	933/8B	0.86	0.34	ఉదయగిరి రామాంజనేయులు తండ్రి వెంకటయ్య	933/1D	941	933/8A	933/1C	
11.	934/2B	0.74	0.07	మహాదేవపల్లి అశోక్‌కుమార్ రెడ్డి తండ్రి నరసింహారెడ్డి	927	934/2A	933	934/2A	
12.	941/4B	1.66	0.43	ఉదయగిరి రామాంజులు తండ్రి వెంకటయ్య	933	941/5B	941/4A & 5A	941/4C	
13.	941/5B	1.51	0.57	మాదిరెడ్డి దీప భర్త దిలీప్ రెడ్డి	941/5A	941/5C	9415A & B	941/4B & 4C	
14.	941/6B	1.48	0.42	మహాదేవపల్లి సౌదామిని తండ్రి కృష్ణారెడ్డి	941/6A	941/6C	942	941/5B & 5C	
15.	942/1B	2.56	0.03	మహాదేవపల్లి సౌదామిని తండ్రి కృష్ణారెడ్డి	942/1A	941/4B	941/4B	941	
16.	942/4B	1.15	0.16	మహాదేవపల్లి రాజ రెడ్డి తండ్రి పెద్ద వెంకట రెడ్డి	941/1A & 4A	943	941/4A	941/1B & 941	
17.	943/9A	0.45	0.18	మహాదేవపల్లి తులసమ్మ భర్త పుల్లారెడ్డి	942	943/10B & 10C	943/9B	943/8	
		మొత్తం	6.16						
		మొత్తం	7.90						

సం/-
ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ),
తెలుగు గంగ ప్రాజెక్ట్ యూనిట్ -2
కడప.

సం/- యస్.వి. నాగేశ్వర రావు, M.Com
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ)
గాలేరు నగరి సుజల స్రవంతి
కడప.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం

కర్నూలు జిల్లాలో నలుగురు.. చిత్తూరు జిల్లాలో ముగ్గురు మృతి


టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టి గుంతలోకి దూసుకెళ్లిన కంటైనర్ లారీ

ఎమ్మిగనూరు రూరల్/గంగవరం: కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా.. 17 మందికి తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ సమీపంలోని కొండల మలుపు వద్ద మంగళవారం కంటైనర్ లారీ ఆటోను ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని ధార్వాడ నుంచి కంటైనర్ లారీ పొక్లెయిన్‌ను వేసుకొని గుంటూరుకు వెళ్తోంది. ఎమ్మిగనూరు నుంచి టాటా ఏస్ వాహనం ప్రయాణికులతో ఆదోనికి వస్తుండగా.. కోటేకల్ మలుపు వద్ద వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న ఆటోను లారీ ఢీ కొట్టి పక్కనే ఉన్న గుంతలోకి పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న కోటేకల్‌కు చెందిన హరిజన కర్రెమ్మ (58),బోయ అంజినమ్మ (50), బనవాసి ఫారానికి చెందిన ఖాదర్‌బాషా(45), ఆటో డ్రైవర్ భీమలింగారెడ్డి (37) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని కల్లుపల్లె సమీపంలో ఆటోను లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందారు. మండలంలోని కల్లుపల్లె నుంచి పలమనేరుకు వెళుతున్న ఆటోను కల్లుపల్లె క్రాస్‌వద్ద లారీ ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం (35), మున్నాబీ (33), అలెక్స్ (54) మృతి చెందారు. సాముదాజుపల్లె, కల్లుపల్లెకు చెందిన షర్మిళ (25), పార్థన(24) సబ్‌నా (26), గజేంద్ర(30) మేనక (30) మల్లిక (25)లకు తీవ్రగాయాలయ్యాయి. షర్మిళ, పార్థన, సబ్‌నాల పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని తమిళనాడులోని వేలూరు సీఎంసీకి తరలించారు. గజేంద్ర, మేనకలు తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నారు.



నంది వాహనంపై ఊరేగిన మల్లన్న



శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీమల్లికార్జున స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్రనాడు సందర్భంగా మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లు నంది వాహనంపై ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. ప్రతి మాసంలో వచ్చే మల్లికార్జునస్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున విశేషపూజలు నిర్వహించడం సంప్రదాయం. ఆరుద్ర నక్షత్రం రోజున వార్షిక జన్మనక్షత్ర ఆరుద్రోత్సవ పూజలను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి స్వామిఅమ్మవార్లకు మహాన్యాస పూర్వక లింగోద్భవకాల అభిషేకాన్ని నిర్వహించారు. మంగళవారం వేకువజామున ప్రాతఃకాల పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను అంతరాలయంలో ఉత్తర ముఖంగా వేంచేయింపజేసి అక్కడి నుంచి ప్రత్యేక పూజలతో నంది వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం గుండా తూర్పు మాడవీధిలోని రథశాల వద్దకు చేర్చారు. అక్కడి నుంచి గ్రామోత్సవం ప్రధాన మాడ వీధుల్లో అత్యంత వైభవంగా కొనసాగింది. ముక్కోటి ఏకాదశి, వార్షిక ఆరుద్రోత్సవాల సమయంలో మాత్రమే స్వామి అమ్మవార్లు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారు.

ప్రజల్ని మభ్యపెట్టడానికే 'జన్మభూమి'

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్‌కే రోజా విమర్శ
- టీడీపీకి ఓటేసినందుకు జనం తలదించుకుంటున్నారు



నగరి: ప్రజల్ని మభ్యపెట్టడానికే టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, నగరి ఎమ్మెల్యే ఆర్‌కే రోజా ఆరోపించారు. మంగళవారం ఆమె నగరిలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రచారానికే జన్మభూమి కార్యక్రమాన్ని వాడుకుంటున్నారన్నారు. అధికార పార్టీ నేతలు చెప్పే అభివృద్ధి కాగితాల్లోనే తప్ప.. కార్యాచరణలో ఎక్కడా లేదన్నారు. జన్మభూమి కమిటీ అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దొంగల కమిటీ చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఎలాంటి మేలు చేయని జన్మభూమి కార్యక్రమాలను తాము బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు తనకు ఓటేయకుంటే ప్రజలు సిగ్గుతో తలదించుకోవాలని అంటున్నారని.. వినడానికే ఇది విడ్డూరంగా ఉందని ఆర్‌కే రోజా విమర్శించారు. టీడీపీకి ఓటేసినందుకు ఇప్పటికే ప్రజలు తలలు దించుకుంటున్నారని ఆమె ఎద్దేవా చేశారు.

కోరిక తీర్చలేదని కన్నతల్లిని కడతేర్చాడు

- చిత్తూరు జిల్లా వి.కోటలో దారుణం
- గతంలో చెల్లెలిపైనా అత్యాచారయత్నం!


కన్నతల్లిని కడదేర్చిన కసాయికొడుకు, హత్యకు గురైన తల్లి

వి.కోట: కోరిక తీర్చలేదని కన్నతల్లిని కడతేర్చాడో మానవ మృగం. సభ్యసమాజం తలదించుకునే ఘటన చిత్తూరు జిల్లా వి.కోటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వి.కోట పరిధిలోని కొంగాటం పంచాయతీ శివునికుప్పానికి చెందిన బేల్లమ్మ (45)కు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కొడుకైన సుబ్రహ్మణ్యం (28) కూలి పనులు చేసుకుంటూ తాగుడుకు బానిసయ్యాడు. రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులు, స్థానికులపై దాడి చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తప్పతాగి ఇంటికెళ్లాడు. మద్యం మత్తులో తల్లి బేలమ్మతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో గొంతునులిమి హత్య చేశాడు. దీంతో గ్రామస్తులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు గతంలో తన చెల్లెలిపై కూడా అత్యాచారయత్నం చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మానవ మృగాన్ని అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్, జి.యన్.యస్.యస్., కడప వారి కార్యాలయం, కడప
ఫారం నెం. 7

రెఫ్. నెం. సి/49/2016 **తేది: 23-10-2017**

(సెక్షన్ 19 (1) ఎల్.ఎ.ఆర్ మరియు ఆర్.చట్టం 2013 మరియు రూలు 25(1) మేరకు)

ఇందువలన పై చట్టంలోని సెక్షన్ 19(1) ప్రకారం సంక్రమించిన అధికారములను అనుసరించి ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడపవారు ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను కడప జిల్లా పెండ్లిమర్రి మండలము, నందిమండలం రీచ్-1 గ్రామములో ప్రజా ప్రయోజనమునకై ఫేజ్-2, ప్యాకేజ్-1లో గల అనగా గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ క్రింద 62.890 Km నుండి కి.మీ. 63.810 కి.లో త్రవ్వకమునకు గాను సమకూర్చు నిమిత్తం 32.53 ఎకరముల భూమి పనులను గాను సమకూర్చు నిమిత్తం భూసేకరణ అవసరమైయున్నదని ప్రకటించుచూ, ఇదే చట్టంలోని విభాగము 15 మేరకు ఆసక్తి గల వ్యక్తులను విచారించి ఎటువంటి అభ్యంతరములు లేవనియు మరియు రిక్వయరింగ్ బాడి, అనగా కార్యనిర్వాహక ఇంజనీర్, జి.యన్.ఎస్.ఎస్.డివిజన్, కడప వారు సదరు భూసేకరణకు కావలసిన నిధులు బి.యం.యస్‌లో డిపాజిట్ చేసినందు వలన ఈ క్రింది కనపరచిన షెడ్యూల్ దాఖలా భూములకు డిక్లరేషన్ ఇవ్వడమైనది.

డిక్లరేషన్

2013వ సంవత్సరం చట్టము 30లోని సెక్షన్ 19 (1) (కేంద్ర చట్టము 30/2013) క్రింద ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), గాలేరు నగరి సుజల స్రవంతి, కడపవారు క్రింది షెడ్యూల్‌లో చూపబడిన **32.53** ఎకరముల విస్తీర్ణము గల భూమి ప్రజాప్రయోజనాలకు అనగా గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ క్రింద 62.890 నుండి Km 63.820 కి.లో వరకు పనులకు గాను సమకూర్చు నిమిత్తము అవసరమని ఇందుమూలముగా డిక్లరేషన్ ఇవ్వడమైనది.

షెడ్యూలు

మండలము : పెండ్లిమర్రి గ్రామం : నందిమండలం (రీచ్-1)

క్ర. సం.	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణము (ఎకరములలో)	సర్వే నెంబరు	అక్విజేషన్ క్రింద తీసుకొన్న విస్తీర్ణము ఎకరములలో	వర్గీకరణ	ఆసక్తి గల వారి పేరు మరియు చిరునామా	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు కట్టడాలు వగైరా వివరములు
1.	1983/A1	0.89	1983/A1	0.89	స.పు	గడ్డం గురుమల్లయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) మోపూరి రాఘవరెడ్డి తండ్రి రామిరెడ్డి (అనుభవదారు)	1985 1988 1998 1999 2000	2166 1982 1980 1981 1959	2001	2066	సాగు భూమి
2.	1981/1	0.70	1981/1	0.70	స.పు	కోడూరు వెంకట సుబ్బయ్య (అగ్రహారం)	1983/A	1980 1960	1959	1982/A	సాగు భూమి
3.	1981/3	1.08	1981/3A	0.73	స.పు	పెద్దిరెడ్డి నరసింహా రెడ్డి తండ్రి గంగి రెడ్డి (అగ్రహారం)	1983/A	1980 1960	1959	1982/A	సాగు భూమి
4.	1959	2.69	1959/1	2.47	ఇ.పు	కైప వెంకట శివయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం)	2001 2025 1983/A	1961	1958	1981 1960	సాగు భూమి
5.	1961	5.69	1961/1	0.08	ఇ.పు	పెమ్మరాజు వెంకట సుబ్బయ్య మరియు శివయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) పెద్దిరెడ్డి నాగ లక్షుమ్మ భర్త ఓబుల్ రెడ్డి (తంగేడుపల్లి)	1959	1962	1958	1960	సాగు భూమి
6.	1957	3.82	1957/1	2.67	ఇ.పు	కైప గురుమూర్తి గారి దత్తయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) ముక్కర రామకృష్ణ తండ్రి బాలయ్య (తంగేడుపల్లి)	2025	1958	1946	1960	సాగు భూమి
7.	1998	8.33	1998/1	5.37	స.పు	కొమ్మద్దీ బాల ఓబుల్ రెడ్డి తండ్రి ఓబుల్ రెడ్డి (తంగేడుపల్లి)	1987	1999	2001	1988	వేప-4 ట్రాన్స్ ఫార్మర్-1 బోరు-1
						ఎర్రగొండు సుబ్బారాయుడు తండ్రి ఓబులపతి (అగ్రహారం)	1997	1999	2001	1988	బోరు ద్వారా నీటి పారకం
						ఎర్రగొండు లక్షుమ్మ భర్త ఓబుల కొండు (అగ్రహారం)	1997	1999	2001	1988	వేప-1 బోరు ద్వారా నీటి పారకం
8.	1999	6.14	1999/1	4.57	స.పు	ఎర్రంరెడ్డి వెంకటయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) కొమ్మడ్డి బాల ఓబుల్ రెడ్డి (తంగేడుపల్లి) ఎర్రసాని నరసయ్య భర్త చిన్న వెంకట సుబ్బయ్య(అగ్రహారం)	1998 2076	2000	2001	1983/A	సాగు భూమి
9.	2000	7.47	2000/1	7.24	ఇ.పు	కైప గురుమూర్తి శాస్త్రులగారి దత్తయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) సిరిగిరెడ్డి వీరభద్రరెడ్డి తండ్రి శివరెడ్డి (తంగేడుపల్లి)	1999	1983/A	2001	1983/A	సాగు భూమి
						ఎర్రసాని ఓబులేసు తండ్రి చిన్న వెంటక సుబ్బయ్య(అగ్రహారం)	1999	1983/A	2001	1983/A	బోరు-1
10.	1960	11.36	1960/1	0.62	స.పు	మూల నాగప్ప (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) అంబరపు ఓబుల్‌రెడ్డి తండ్రి ఓబుల్ రెడ్డి (అగ్రహారం)	1981	1963	1959 1961	1980	సాగు భూమి
11.	2021/6	9.25	2021/6B	6.86	స.పు	బైరెడ్డి ఉత్తమ రెడ్డి తండ్రి వెంకట రెడ్డి (వేంపల్లి)	2000	2025	2023	2001	ఆర్.సి.సి. రూం.1 బోరు-2 ట్రాన్స్ పార్మర్-2
						బైరెడ్డి కృష్ణార్జునరెడ్డి తండ్రి ఉత్తమ రెడ్డి (వేంపల్లి)					
						బైరెడ్డి పెద్ద మల్లేస్వరమ్మ భర్త ఉత్తమరెడ్డి(వేంపల్లి)					
12.	2023	4.04	2023	0.38	ఇ.పు	పెమ్మరాజు వెంకట సుబ్బయ్య మురియు సూరయ్య (ఆర్.ఎస్.ఆర్.ప్రకారం) పుంగనూరు పార్వతమ్మ భర్త చిన్న కొండన్న (అగ్రహారం)	2022	2024 2021	2024	2021	సాగు భూమి
				మొత్తం	32.53						

సదరు భూములకు సంబంధించిన ప్లానును ప్రత్యేక ఉప కలెక్టర్ భూ సేకరణ గాలేరు నగరి సుజల స్రవంతి విభాగము-2 కడప వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని కార్యాలయ పనివేళలలో పనిదినములలో తనిఖీ చేసుకొనవచ్చును. ఈ భూ సేకరణలో ఏ కుటుంబాలకైతే పునరావాసం కొరకు విస్తీర్ణమును గుర్తించడమైనదో ఆ కుటుంబాల సంఖ్య-నదారతు-పునరావాస విస్తీర్ణము క్రింది విధముగా ఉన్నవి.

వరుస సంఖ్య	గ్రామము పేరు	మండలం పేరు	జిల్లా పేరు	విస్తీర్ణము (ఎకరములలో)
1	2	3	4	5
		నదారతు		

సదరు పై తెలిపిన భూసేకరణకు సంబంధించిన భూములు యందు లభ్యమగు బొగ్గు గనులు, ఇనుప ఖనిజం, పలక లేక ఇతర ఖనిజములు ఏవేని సదరు భూమి యందు జరుపు త్రవ్వకం సమయములో బయల్పడిన పక్షంలో సదరు భూమిని తీసుకున్న ఉద్దేశ్యము నెరవేరుటకు ఉపయోగయుక్తమైనంత మేరకు మాత్రమే సదరు ఖనిజములను ఉపయోగించుకొనబడును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.),
జి.ఎన్.ఎస్.ఎస్., విభాగము-2, కడప

సం/- యస్.వి. నాగేశ్వర రావు, M.Com
ప్రత్యేక కలెక్టరు (భూ.సే.) జి.ఎన్.ఎస్.ఎస్., కడప.



తొలి టెస్టులో స్టెయిన్‌కు నో చాన్స్!

గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేసిన దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ డేల్ స్టెయిన్ బరిలోకి దిగడం మరింత ఆలస్యం కానుంది. భారత్‌తో శుక్రవారం నుంచి కేప్‌టౌన్‌లో జరిగే తొలి టెస్టు తుది జట్టులో అతనికి అవకాశం లభించకపోవచ్చని స్వయంగా కోచ్ ఒటిస్ గిబ్సన్ వెల్లడించారు. స్టెయిన్ ఫిట్‌గానే ఉన్నా ముగ్గురు పేసర్లతో కూడిన తమ జట్టు కూర్పులో అతనికి స్థానం కష్టమని ఆయన చెప్పారు. దాదాపు ఏడాది తర్వాత వస్తున్న స్టెయిన్ తొలి టెస్టులో ఏదైనా జరిగి మధ్యలోనే తప్పుకునే ప్రమాదం కూడా ఉందన్న గిబ్సన్... పేస్‌కు అనుకూలించే తర్వాతి రెండు టెస్టు వేదికలపై మాత్రం స్టెయిన్ ఉంటాడని సంకేతమిచ్చారు.

‘మా వాళ్లంతా కనీసం రెండో స్పెల్ లేదా మూడో స్పెల్ వేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెబితే విని సంతోషిస్తా’... భారత టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన కొత్తలో పేసర్ల ఫిట్‌నెస్ గురించి విరాట్ కోహ్లి వ్యాఖ్యలివి. ఆ సమయంలో మన బౌలర్లు ఒక స్పెల్‌లో నాలుగో ఓవర్ వేసే సమయానికే చెమటలు కక్కుతూ ఆపసోపాలు పడుతున్న పరిస్థితి. ఒక రకంగా మన బలహీనత గురించి చురక అంటిస్తూనే పేసర్లు ఫిట్‌గా లేకపోవడమే పెద్ద సమస్యగా కోహ్లి గుర్తించాడు. ఇప్పుడు పరిస్థితి మారింది. అత్యుత్తమ ట్రైనర్లు, శిక్షణా సౌకర్యాలతో మనవాళ్లు కూడా ఫిట్‌నెస్‌లో ఎక్కడా తగ్గని విధంగా తయారయ్యారు. గత కొన్నేళ్ళతో పోలిస్తే తొలిసారి ఇప్పుడు పేసర్లపై అదనపు భారం పడనుంది. దక్షిణాఫ్రికా గడ్డపై ఆటతో పాటు అటు గాయాలబారిన కూడా పడకుండా వీరు ఎంత బాగా బౌలింగ్ చేస్తారనేదే భారత్‌కు కీలకం.

పేస్ ‘పవర్’ సరిపోతుందా!


షమీ


ఇషాంత్


ఉమేశ్ యాదవ్


బుమ్రా


భువనేశ్వర్

భారత ఫాస్ట్ బౌలర్లకు పెద్ద సవాల్

గతంతో పోలిస్తే అత్యుత్తమ ఫిట్‌నెస్

పేసర్లపై అదనపు బాధ్యత

సాక్షి క్రీడా విభాగం

కోహ్లి పూర్తి స్థాయి కెప్టెన్‌గా మారాక భారత జట్టు ఉపఖండంలో లేదంటే వెస్టిండీస్ గడ్డపైనే టెస్టు మ్యాచ్‌లు ఆడింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో విండీస్ వేదికలు కూడా పేస్‌కు అనుకూలించకుండా నిర్జీవంగా మారాయి. కాబట్టి భారత్‌లోని మైదానాలకు, అక్కడి పిచ్‌లకు పెద్ద తేడా లేకుండా పోయింది. ఇలాంటి చోట మన పేస్ బౌలర్లకు ఎప్పుడూ పరీక్ష ఎదురు కాలేదు. వికెట్లు తీయాలంటూ వారిపై పెద్దగా అంచనాలు లేకపోవడంతో పాటు ఒక క్రతువు నిర్వహించినట్లే కొన్ని ఓవర్లు వేసి తప్పుకోవడం రొటీన్‌గా మారిపోయింది. ఆ తర్వాత అశ్విన్, జడేజాలు మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తీసుకొని విజయంవైపు సాగిపోవడం మనకు దాదాపు అన్ని సిరీస్‌లలో కనిపించిన ఒకే తరహా దృశ్యం. తాము విఫలమైనా స్పిన్నర్లు ఆదుకోగలరనే ధీమాతో పేస్ బౌలర్లపై ఒత్తిడి కూడా పెరగలేదు. విదేశాల్లో స్పిన్నర్ల వల్ల సాధ్యం కాని చోట ప్రధాన బాధ్యతను మోయలేక మన ఫాస్ట్ బౌలర్లు గతి తప్పారు. ఫిట్‌నెస్ సమస్యలు, చివరి సెషన్‌కు వచ్చే సరికి ఓపిక లేక డస్సిపోయి కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయారు. విదేశాల్లో గత కొన్ని టెస్టులు చూస్తే ఇది అర్థమవుతుంది. జొహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై 136 ఓవర్లు... వెలింగ్టన్‌లో న్యూజిలాండ్‌పై 210 ఓవర్లు వేసినా ఆలౌట్ చేయలేకపోవడం... నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్ ఆఖరి వికెట్‌కు ఏకంగా 198 పరుగులు జోడించడం... బ్రిస్బేన్‌లో చివరి నలుగురు ఆసీస్ బ్యాట్స్‌మెన్ కలిసి 195 పరుగులు జత చేసి టీమ్ స్కోరును రెట్టింపు చేయడం దానికి ఉదాహరణలు. ఈ అన్ని సందర్భాల్లోనూ భారత్ గెలిచే అవకాశమున్నా... దానిని కోల్పోయింది.

కోహ్లి భిన్నంగా...

ధోని కెప్టెన్సీలో భారత్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలలో కలిపి 2 టెస్టులు గెలిచి 13 ఓడింది. ఇందులో ఒక్క 2010 డర్బన్ టెస్టులో మాత్రం భారత్ పూర్తిగా పేస్ బౌలింగ్ సత్తాతో గెలిచింది. 2014 లార్డ్స్ టెస్టులో ఇషాంత్ బాగా బౌలింగ్ చేసినా... అదంతా ధోని చలవే! సరిగ్గా చెప్పాలంటే ఆ ఇన్నింగ్స్‌లో ఇషాంత్‌ను చిన్న పిల్లాడిలా మార్గనిర్దేశనం చేస్తూ బంతి బంతికీ ఒక్కో వ్యూహంతో ధోని ఇంగ్లండ్ ఆట కట్టించాడు. వీటిని మినహాయిస్తే మిగతా సందర్భాల్లో పేస్ బౌలింగ్ పరంగా అద్భుతాన్ని ఆశిస్తూ ధోని ప్రేక్షక పాత్రకే ఎక్కువగా పరిమితమయ్యాడు. బౌలర్లు ప్రభావం చూపించాల్సిన చోట కూడా బ్యాటింగ్‌నే నమ్ముకోగా... మన పేసర్లు అతి సులువుగా, ధారాళంగా పరుగులు ఇచ్చేవారు. అందరూ కలిసి సుదీర్ఘ ఓవర్లు వేసే ప్రయత్నం చేసినా ప్రతీ సిరీస్‌లో ఎవరో ఒకరు గాయపడ్డారు. 2011–12 ఆస్ట్రేలియా సిరీస్‌లో జహీర్ చివరి వరకు కొనసాగినా అతి పేలవ ప్రదర్శన కనబర్చాడు. కానీ ఇప్పుడు కోహ్లి అలా వేచి చూసే వ్యక్తి కాదు. సరిగ్గా చెప్పాలంటే ధోని తన ఆటగాళ్లు తమంతట తాముగా కొంత బాధ్యత తీసుకోవాలని, సొంతంగా ఆలోచించాలని భావించేవాడు. కానీ విరాట్ మాత్రం దానిని డిమాండ్ చేస్తున్నాడు. తనకు ఎలా కావాలో గట్టిగా చెప్పి చేయించుకునే రకం అతను. కాబట్టి ఎంతటి కఠినమైన పరిస్థితుల్లోనైనా బౌలింగ్ చేసేందుకు, సుదీర్ఘ స్పెల్స్‌కు బౌలర్లు సిద్ధంగా ఉండాల్సిందే.

ఆట మార్చుకోవాల్సిందే...

ఐదేళ్ల క్రితం 2012 సీజన్‌లో సొంతగడ్డపై భారత్ మ్యాచ్‌లు ఆడిన సమయంలో ఫాస్ట్ బౌలర్ల ఉనికే దాదాపుగా కనిపించలేదు. టీమ్ ఆడిన సగం మ్యాచుల్లో కూడా ఏ ఒక్క పేసర్ బరిలోకి దిగలేదు. అశ్విన్ వేసిన ఓవర్లలో నాలుగో వంతు కూడా ఒక పేసర్ వేయలేదు. ఆ తర్వాతి విదేశీ పర్యటనల్లో ఇదే జట్టును దెబ్బ తీసింది. ఇప్పుడు సుదీర్ఘంగా సొంత గడ్డపై ఆడిన తర్వాత వరుసగా విదేశీ టూర్లకు భారత్ సిద్ధమవుతోంది. అయితే గతంతో పోలిస్తే ఇటీవల మన పేసర్లు కూడా ఎక్కువగా బౌలింగ్ చేయడం కొంత మెరుగైన విషయం. ఇప్పుడు మన పేసర్లలో అనుభవం పెరగడమే కాదు ఫిట్‌నెస్ కూడా చాలా బాగుంది. రనప్ సమస్య చక్కదిద్దుకున్న తర్వాత షమీలో సత్తా పెరిగింది. దక్షిణాఫ్రికా గడ్డపై షమీ నుంచి కోహ్లి ఎంతో ఆశిస్తున్నాడు. అయితే అతను తన ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమే కీలకం. బౌలింగ్ చేసే తీరులో చిన్న మార్పు మన పేసర్లకు మరింత అనుకూలంగా మార్చవచ్చు. భారత్‌లో సాధారణంగా నేరుగా స్టంప్స్‌పైకి బంతులు విసిరి మనోళ్లు ఎక్కువగా వికెట్లు రాబట్టారు. మన పేసర్లు పడగొట్టిన వికెట్లలో 45.5 శాతం బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూ కావడం దీనికి నిదర్శనం. ఇక్కడి నెమ్మదైన పిచ్‌లపై అది పని చేసింది. అదే దక్షిణాఫ్రికాలో పరిస్థితి భిన్నం. గత పదేళ్లలో దక్షిణాఫ్రికాలో అలాంటి బౌలింగ్‌కు 28 శాతం మాత్రమే వికెట్లు లభించాయి. అక్కడ ఎక్కువగా ఆఫ్ స్టంప్‌పై దాడి చేయాల్సి ఉంటుంది. బయటికి వెళుతూ బ్యాట్ ఎడ్జ్ తీసుకునేలా బంతులు సంధించాలి. దాని కోసం బౌలర్లు లెంగ్త్‌ను మార్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే మనకు తగిన ఫలితాలు లభిస్తాయి. తుది జట్టులో షమీ, ఇషాంత్ ఖాయం కాగా... మూడో స్థానం కోసం భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్‌ల మధ్య పోటీ ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా జట్టులోకి ఎంపికైనా ఆడే అవకాశాలు తక్కువే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది అన్ని విధాలా మెరుగైన పేస్ బౌలింగ్ దళమే. అయితే తమపై ఉన్న ఒత్తిడిని అధిగమిస్తే సఫారీ సిరీస్ మనకు చిరస్మరణీయం కాగలదు.


కశ్యప్

శ్రీకాంత్, సైనా ఓడినా...

అహ్మదాబాద్‌పై గెలిచిన అవధ్ వారియర్స్

లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో అవధ్ వారియర్స్ జట్టు వరుసగా రెండు పరాజయాల తర్వాత తమ ఖాతాలో మరో విజయాన్ని జమ చేసుకుంది. అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అవధ్ 4–3తో గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి మ్యాచ్‌లో క్రిస్టినా–తాంగ్ చున్ మాన్ 14–15, 15–12, 15–14తో కామిల్లా–లా చుక్ హిమ్ జంటపై గెలిచి అవధ్‌కు 1–0 ఆధిక్యం అందించారు. పురుషుల సింగిల్స్ ‘ట్రంప్’ మ్యాచ్‌లో కశ్యప్ 11–15, 15–13, 15–14తో సౌరభ్ వర్మను ఓడించడంతో అవధ్ ఆధిక్యం 3–0కు పెరిగింది. మూడో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్ మరో మ్యాచ్‌లో ప్రణయ్ 15–8, 15–11తో శ్రీకాంత్‌ను ఓడించడంతో అహ్మదాబాద్ ఖాతా లో తొలి పాయింట్ చేరింది. మహిళల సింగిల్స్ తమ ‘ట్రంప్’ మ్యాచ్‌లో తై జు యింగ్ 15–5, 15–14తో సైనాపై నెగ్గడంతో అహ్మదాబాద్ స్కోరును 3–3తో సమం చేసింది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో సెతియవాన్–తాంగ్ చున్ మాన్ ద్వయం 15–14, 15–10తో నందగోపాల్–రెగినాల్డ్ (అహ్మదాబాద్) జంటను ఓడించి అవధ్‌కు 4–3తో విజయాన్ని ఖాయం చేసింది.

పేస్ జంటకు నిరాశ


తొలి రౌండ్‌లోనే నిష్క్రమణ • క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

పుణే: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ కొత్త ఏడాదిని ఓటమితో ప్రారంభించాడు. స్వదేశంలో జరిగే ఏకైక ఏటీపీ–250 టోర్నమెంట్ టాటా ఓపెన్‌లో తన భాగస్వామి పురవ్ రాజాతో కలిసి బరిలోకి దిగిన పేస్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. భారత్‌కే చెందిన రోహన్ బోపన్న–జీవన్ నెదున్‌చెజియాన్ జంట 6–3, 6–2తో పేస్–పురవ్ జోడీని అలవోకగా ఓడించింది. 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి జంట సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసింది. ఈ గెలుపుతో బోపన్న జంట క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. యూకీ బాంబ్రీ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా... సుమీత్ నాగల్ వెనుదిరిగాడు. తొలి రౌండ్‌లో యూకీ 6–3, 6–4తో అర్జున్ ఖడేపై గెలుపొందగా... క్వాలిఫయర్ సుమీత్ 3–6, 3–6తో ఇల్యా ఇవష్కా (బెలారస్) చేతిలో ఓడిపోయాడు.


పేస్

కిర్‌స్టెన్... ఇక ఆర్‌సీబీ కోచ్

బౌలింగ్ కోచ్‌గా నెహ్రా


కిర్‌స్టెన్


నెహ్రా

బెంగళూరు: భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ ఇప్పుడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) బ్యాటింగ్ కోచ్‌గా నియమితులయ్యారు. ఇటీవల రిటైరైన పేసర్ ఆశిష్ నెహ్రాకు బౌలింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏప్రిల్‌లో మొదలయ్యే ఐపీఎల్ 11వ సీజన్‌లో వీళ్లిద్దరు జట్టు మెంటార్లుగానూ వ్యవహరిస్తారని ఆర్‌సీబీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉన్న వెటోరీ జట్టు ప్రధాన కోచ్‌గా కొనసాగుతారు. గ్యారీకి ఐపీఎల్ కోచింగ్ కొత్తకాదు. 2015లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ కోచ్‌గా పనిచేశారు. కొత్త నియామకాలపై చీఫ్ కోచ్ వెటోరీ మాట్లాడుతూ ‘గ్యారీ, నెహ్రాలతో పనిచేయడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. వాళ్లిద్దరు అపార అనుభవజ్ఞులు. జట్టును సరైన దిశలో నడిపించగల సమర్థులు’ అని అన్నారు. భారత వన్డే జట్టుకు విజయవంతమైన కోచ్ (2011 ప్రపంచకప్ విజేత)గా నిష్క్రమించిన కిర్‌స్టెన్‌కు టి20 కోచింగ్‌లో పేలవమైన రికార్డు ఉంది. భారత్, దక్షిణాఫ్రికాలకు కోచ్‌గా వ్యవహరించినప్పటికీ మెరుగైన ఫలితాలతో మెప్పించలేకపోయారు.

భారత నంబర్‌వన్ సత్యన్

అంతర్జాతీయ టీటీ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా భారత నంబర్ వన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్‌గా కొనసాగుతున్న ఆచంట శరత్ కమల్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని జి.సత్యన్ భర్తీ చేశాడు. కొంతకాలంగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న సత్యన్... మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 49వ స్థానానికి చేరుకున్నాడు. శరత్ కమల్ 51వ స్థానంలో నిలిచాడు. గతేడాది సత్యన్ బెల్జియం ఓపెన్, స్పానిష్ ఓపెన్ టైటిల్స్‌ను సాధించాడు. అండర్–18 బాలుర సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో మానవ్ ఠక్కర్ 18వ, మానుష్ షా 47వ, హైదరాబాద్ ప్లేయర్ స్నేహిత్ 64వ ర్యాంక్‌ల్లో ఉన్నారు.

ఏ బంతులు ఆడాలో తేల్చుకోవాలి!

కేప్‌టౌన్: ‘దక్షిణాఫ్రికా పిచ్‌లంటేనే బౌన్స్ ఉంటుంది. అది ఎప్పటికీ సవాలే. కానీ ఈసారి మేం మంచి సన్నద్ధతతో ఉన్నాం. నెల, నెలన్నరగా ఏం చేశామో దానినే కొనసాగించాలనుకుంటున్నాం’ అని టీమిండియా ప్రధాన బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా అన్నాడు. ప్రస్తుత జట్టులోని చాలామందికి దక్షిణాఫ్రికాలో ఆడిన అనుభవం ఉండటం ఉపయోగపడుతుందని మంగళవారం ప్రాక్టీస్ అనంతరం అతను పేర్కొన్నాడు. ‘ఏ బంతులను ఆడాలి? వేటిని వదిలేయాలి? అనేది విదేశీ పర్యటనల్లో కీలకం. ఉపఖండం బయట బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లే ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో మంచి బంతులను వదిలేయడం అలవర్చుకోవాలి’ అని వివరించాడు.

అనుభవాన్ని మించింది లేదు...



రెండుసార్లు ఇక్కడ పర్యటించిన అనుభవమున్న పుజారా... పరిస్థితులను అంచనా వేసుకుంటూ తగిన విధంగా ఆటను మలుచుకోవాలని సూచించాడు. ‘శ్రీలంకతో స్వదేశంలో ఆడుతున్నప్పుడే దక్షిణాఫ్రికా సిరీస్ గురించి ఆలోచనలు చేశాం. కొన్ని అంశాలపై సన్నద్ధమయ్యాం. మేమేం ఇబ్బందిగా భావించడం లేదు. సన్నాహాలకు చాలా సమయం కూడా దొరికింది’ అని పేర్కొన్నాడు. ‘ఇలాంటి చోట పరుగులు చేయడంలో అనుభవానికి మించి ఏదీ సాటిరాదు. పిచ్, ప్రత్యర్థితో పాటు, ఆటగాడిగా, జట్టుగా ఏం చేయాలో తెలుసుకోవాలి’ అని విశ్లేషించాడు. తొలి టెస్టుకు సన్నాహాలు బాగా సాగుతున్నాయని పేర్కొన్న పుజారా... విజయావకాశాలపై ఆశాభావం వ్యక్తం చేశాడు. ‘పచ్చిక ఉన్నా, ఫ్లాట్ వికెట్ అయినా కేప్‌టౌన్‌లో పిచ్ గురించి ఆందోళన చెందడం లేదు. మాకో వ్యూహం ఉంది’ అని స్పష్టం చేశాడు. ప్రత్యర్థి బలాబలాలపై మాట్లాడేందుకు నిరాకరించిన ఈ వన్‌డౌన్ బ్యాట్స్‌మన్... తమ పేస్ బలగం సామర్థ్యంపై గట్టి నమ్మకముంచాడు. ప్రస్తుత పర్యటనతో పాటు వచ్చే 18 నెలల్లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లోనూ విజయాలు సాధిస్తే ‘ఆల్‌టైం గ్రేట్ భారత జట్టు’గా నిలుస్తామనే అభిప్రాయం వ్యక్తం చేశాడు.



మెల్‌బోర్న్ పిచ్ నాసిరకం: ఐసీసీ

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టుకు ఆతిథ్య మిచ్చిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) పిచ్ నాసిరకంగా ఉందని ఐసీసీ ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుగా వివరణ కోరుతూ క్రికెట్ ఆస్ట్రేలియాకు రెండు వారాల గడువిచ్చింది. జీవం లేని పిచ్‌పై బాక్సింగ్ డే టెస్టు ఆడించారంటూ ఆటగాళ్లు, వ్యాఖ్యాతల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతోపాటు ‘ఎంసీజీ పిచ్‌పై బౌన్స్ మధ్యస్థంగా ఉంది. పేస్‌లో వేగం లేదు. మ్యాచ్ సాగేకొద్దీ పేస్ మరింత తగ్గింది. ఇదే పరిస్థితి అయిదు రోజులూ కొనసాగింది. క్రమ క్షీణత కూడా లేదు. బంతికి, బ్యాట్‌కు పోటీ సాగలేదు’ అని మ్యాచ్ రిఫరీ రంజన్ మధుగలే ఐసీసీకి అధికారిక నివేదిక పంపారు. దీనిప్రకారం ‘పూర్’ రేటింగ్ ఇచ్చారు. ఈ రేటింగ్ వచ్చిన తొలి ఆస్ట్రేలియా పిచ్ ఇదే కావడం గమనార్హం. గతేడాది భారత్–ఆస్ట్రేలియా తలపడిన పుణే పిచ్ కూడా నాసిరకంగా ఉందని ఐసీసీ ప్రకటించింది. ప్రమాణాలకు తగినట్లు లేని పిచ్‌ల విషయంలో ప్రస్తుతం ఐసీసీ హెచ్చరికలు జారీచేయడం లేదా జరిమానా విధించడం చేస్తోంది. గురువారం నుంచి అమల్లోకి రానున్న నిబంధనల ప్రకారం... పూర్ లేదా అన్‌ఫిట్‌గా తేలితే నిర్దేశిత డీ మెరిట్ పాయింట్లు ఇస్తారు. పాయింట్లు పెరిగినకొద్దీ ఆ మైదానం సస్పెన్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

దుర్గమ్మ సన్నిధిలో తాంత్రిక పూజలు!

- గత నెల 26న అర్ధరాత్రి ప్రత్యేక అర్చనలు
- ప్రభుత్వంలోని కీలక వ్యక్తికి మేలు చేసేందుకంటూ ప్రచారం
- అమ్మవారికి మహిషాసురమర్దని అలంకరణ
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే పూజలు
- ఆలయం ప్రధాన అర్చకుడిపై వేటు
- విచారణకు ఆదేశించామన్న మంత్రి, ఈవో


అంతరాలయం నుంచి గర్భగుడిలోకి వెళ్తున్న బయటి అర్చకుడు


తాంత్రిక పూజ చేసినట్లు భావిసున్న అర్చకుడు

సాక్షి, విజయవాడ/తాడేపల్లిగూడెం: బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో తాంత్రిక పూజలు జరగడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక వ్యక్తికి మేలు జరిగేందుకు ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు గతనెల 26న దుర్గగుడిలో ఆ పూజలు చేశారని ఇంద్రకీలాద్రిపై ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రివేళ అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి మరీ పూజలు నిర్వహించారని సమాచారం. నిబంధనల ప్రకారం గర్భగుడిలోకి దేవస్థానం అర్చకులు తప్ప బయట వ్యక్తులు ప్రవేశించడానికి వీలులేదు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే దానికి ఉన్నతాధికారులు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా పూజలు జరిగిన రోజు రాత్రి 11 గంటల వేళ ఆలయానికి సంబంధం లేని వ్యక్తి ఎర్రని దుస్తులు ధరించి అంతరాలయంలో తిరుగుతున్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా బయట పడటం సంచలనం సృష్టిస్తోంది.

అరగంటసేపు పూజలు..

దేవస్థానంలో రాత్రి 9.30 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఆ తరువాత ఆలయాన్ని శుభ్రం చేసి 10 గంటలకు మూసివేస్తారు. తిరిగి తెల్లవారుజామున 2.45 గంటలకు అమ్మవారికి అర్చన చేసిన తరువాత 4 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి ఆలయాన్ని మూసివేసేవరకు ఆలయ ఇన్‌స్పెక్టర్, సూపరింటెండెంట్, ఎస్‌పీఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. అయితే తాంత్రిక పూజలు జరిగిన రోజు రాత్రి 10 నుంచి 10.30 గంటల మధ్య దేవస్థానం ప్రధాన అర్చకుడు బదరీనాథ్‌బాబు అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించగా, బయట నుంచి వచ్చిన ఓ అర్చకుడు సుమారు అరగంట సేపు తాంత్రిక పూజలు నిర్వహించాడని తెలుస్తోంది. ఈ పూజలు అనంతరం తిరిగి అమ్మవారిని సాధారణ అలంకారంలోకి మార్చి 11.30 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. అదే రోజు మహిషాసురమర్దని దేవికి నివేదన పెట్టేందుకు ప్రత్యేకంగా కదంబం తయారు చేయించారని సమాచారం.

ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే!

రాష్ట్ర ప్రభుత్వంలో ఒక కీలక వ్యక్తికి మేలు జరిగేలా పూజలు చేయాలంటూ ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన ఆదేశం మేరకే బయట అర్చకుడితో తాంత్రిక పూజలు చేయించారని ఇంద్రకీలాద్రిపై ప్రచారం సాగుతోంది. లిఖితపూర్వకమైన ఉత్తర్వులు లేకపోయినా.. తప్పని పరిస్థితుల్లో అర్చకుడు అమ్మవారి అలంకారం మార్చారని సమాచారం. అయితే పూజా వ్యవహారం సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదు కాకుండా జాగ్రత్తలు పడ్డా.. హడావుడిలో అంతరాలయం విషయం మర్చిపోయారని తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకపోతే బయటి అర్చకుడు అర్ధరాత్రి వేళ అమ్మవారి గర్భగుడిలోకి వెళ్తుంటే అక్కడి ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఆలయ అధికారులు చూస్తూ ఊరుకుంటారా? అని ఇంద్రకీలాద్రి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. అయితే తాంత్రిక పూజల విషయంపై గతనెల 30న జరిగిన పాలకమండలి సమావేశంలో సభ్యులు చర్చించినా.. తరువాత అంతా మౌనందాల్చారని తెలిసింది.

శుభ్రం చేసేందుకే..: ఈవో

డిసెంబర్ 26వ తేదీ రాత్రి 10 గంటలకు దర్శనాలు పూర్తయిన తరువాత ఆలయాన్ని శుద్ధి చేసేందుకే 11.30 గంటల వరకు తెరిచి ఉంచామని, తాంత్రిక పూజలు ఏమీ జరగలేదని ఈఓ సూర్యకుమారి మంగళవారం చెప్పారు. ప్రధాన అర్చకుడు సహాయకుడిగా బంధువు ఘంటసాల పార్థసారథిని తీసుకొచ్చారని తెలిపారు. కృష్ణాజిల్లా విశ్వనాథపల్లి శివాలయంలో పనిచేసే పార్థసారథి కూడా గుర్తింపుపొందిన అర్చకుడేనన్నారు. అయితే పూజల సమాచారం తెలిసిన వెంటనే బదరీనాథ్‌బాబును కొండదిగువన ఉన్న కామధేను అమ్మవారి ఆలయానికి మార్చామని తెలిపారు.

దర్యాప్తు అనంతరం చర్యలు: మాణిక్యాలరావు

విజయవాడ కనకదుర్గ ఆలయంలో తాంత్రిక పూజల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయిస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో ఎలాంటి తాంత్రిక పూజలు జరగలేదన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గతం కంటే భిన్నంగా జన్మభూమి
- 1.42 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు
- జనవరి నుంచి బియ్యంతోపాటు మిగిలిన నిత్యావసర సరుకులు
- దర్శిలో 'జన్మభూమి–మా ఊరు' సభలో సీఎం చంద్రబాబు


దర్శిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు సొంత నియోజకవర్గమైన దర్శిలో మంగళవారం జరిగిన ఐదవ విడత 'జన్మభూమి–మా ఊరు' ప్రారంభ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. జన్మభూమి కార్యక్రమాన్ని గతంలోకంటే భిన్నంగా రోజుకో అంశం చొప్పున 9 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర జనాభాలోని 80 శాతం మందికి ప్రభుత్వ పథకాలు తృప్తినివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. తన పాలనలో రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేవన్నారు. రైతులకు రూ.24 వేల కోట్ల రుణ విముక్తి చేపట్టి ఇచ్చిన మాట నిలుపుకున్నానన్నారు. ప్రాజెక్టుల నుంచి ఒక పంటకు నీరివ్వాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వమే రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.10 వేలు ఇస్తున్నామన్నారు. రూ.680 కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చామన్నారు. ఆహార భద్రత కింద రాష్ట్రంలో 1.42 లక్షల రేషన్‌కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్రం చక్కెరను నిలిపివేస్తే జనవరి నుంచి అరకేజీ చక్కెరతోపాటు మిగిలిన నిత్యావసర సరుకులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. 46,19,000 ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.5,609 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దేశంలో 50 లక్షల పింఛన్లు ఇచ్చే రాష్ట్రం మనదేనన్నారు. చంద్రన్న బీమా కింద చనిపోయిన వారికి రూ.5 లక్షలు, 50 ఏళ్లలోపు సహజ మరణమైతే రూ.2 లక్షలు, వికలాంగులకు రూ.3.60 లక్షలు చొప్పున ఇస్తున్నామని చెప్పారు. ఉగాది నుంచి పెళ్లి కానుక కింద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు డబ్బులిస్తున్నామన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.లక్ష చొప్పున ఇస్తామన్నారు. జగ్జీవన్‌రామ్ పేరుతో ఎస్సీలకు 75 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా ఇస్తామన్నారు. 57 లక్షలమంది పిల్లలకు గడిచిన మూడేళ్లలో స్కాలర్‌షిప్‌లిచ్చినట్లు చెప్పారు. విదేశీ విద్యకు రూ.10 లక్షల ఆర్థికసాయం చేస్తామన్నారు. విద్యోన్నతి కింద ఐఏఎస్, ఐపీఎస్ స్పెషల్ కోచింగ్ ఇస్తామన్నారు.

ఆరు జిల్లాల్లో నూరు శాతం మరుగుదొడ్లు..

రాష్ట్రంలో 6 జిల్లాల్లో నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించామని సీఎం చెప్పారు. ప్రకాశం జిల్లాలో నూరుశాతం మరుగుదొడ్లు పూర్తి చేసినట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 19 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ''బీసీలకు, కాపులకు కార్పొరేషన్ పెట్టి నిధులిస్తున్నాం. మసీదు, చర్చిలకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అగ్రవర్ణ పేదలకు సహాయం చేసేందుకు రూ.750 కోట్లు కేటాయిస్తున్నాం'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, శిద్దా రాఘవరావు, ఎమ్మెల్సీ కరణం బలరాం, కలెక్టర్ వినయ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ కోసమే తాంత్రిక పూజలు

- వైఎస్సార్ సీపీ నేత అంబటి రాంబాబు విమర్శ
- తాంత్రిక పూజల వెనుక ముఖ్యమంత్రి హస్తం



విజయవాడ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి తనయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను సీఎంగా చేసేందుకు దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. తాంత్రిక పూజల వెనుక ముఖ్యమంత్రి ఉన్నారని అన్నారు. తాంత్రిక పూజ చేస్తూ దొరికిపోయిన తరువాత ఆ తప్పును అధికారులపై నెట్టేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి ఒకటో తేదీన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయవద్దని ఆదేశాలిచ్చిన సీఎం చంద్రబాబు తానెందుకు తిరుమల, దుర్గగుడి అర్చకుల నుంచి ప్రత్యేక ఆశీర్వచనాలు పొందారని ప్రశ్నించారు. సామాన్యులకు ఒక న్యాయం... చంద్రబాబుకు ఒక న్యాయమా అంటూ ప్రశ్నించారు. అలాగే అర్ధరాత్రి ఒంటి గంట వరకు బార్లు తెరిపించి ప్రజల చేత ఒక్కపూటలోనే ఏకంగా రూ. 230 కోట్ల మద్యాన్ని తాగించారని మండిపడ్డారు.

ఏమి చేశారని టీడీపీకి ఓట్లేయాలి?

వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అన్ని స్థానాల్లో గెలుస్తుందని, ఏదో ఒకటి రెండుచోట్ల ఓడిపోతే ప్రజలు సిగ్గుపడాలని చంద్రబాబు మాట్లాడడం విచిత్రంగా ఉందని అంబటి అన్నారు. ఈ వ్యాఖ్యలు చూశాక చంద్రబాబుకు మతిస్థిమితం ఉందో లేదో అర్థం కావడం లేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఏమి చేశారని ప్రజలు ఓట్లు వేయాలని చంద్రబాబును ప్రశ్నించారు. తమిళనాడు నుంచి పూజారిని రప్పించి తాంత్రిక పూజలు చేసినందుకు చంద్రబాబుకు ఓట్లు వేయాలా అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్ని విదేశీ యాత్రలు చేశారు, ఎన్ని పెట్టుబడులు తెచ్చారు అనే అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని అంబటి డిమాండ్ చేశారు.

నాసా అంతరిక్ష గోధుమ పంట స్ఫూర్తితో..

మెల్‌బోర్న్: అంతరిక్షంలో గోధుమలు పండించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ చేపట్టిన ప్రయత్నాన్ని ఆదర్శంగా తీసుకుని ఆస్ట్రేలియన్ శాస్త్రవేత్తలు నూతన పద్ధతిని అభివృద్ధి చేశారు. 'స్పీడ్ బ్రీడింగ్' అనే ఈ పద్ధతి ద్వారా భూమిపై పంట దిగుబడిని సాధారణం కంటే మూడు రెట్లు పెంచడంతోపాటు పంట కోతకు వచ్చే సమయాన్ని కూడా 6 రెట్లు తగ్గించవచ్చని ప్రయోగ పూర్వకంగా నిరూపించారు. నాసా అంతరిక్షంలో గోధుమ పంట త్వరగా కోతకు వచ్చేందుకు పంటపై లైట్ ద్వారా నిరంతరాయంగా వెలుగును ప్రసరింపజేసింది. దీంతో పంట సాధారణం కంటే ముందుగానే కోతకు రావడంతోపాటు మరో పంటను వేసేందుకు వీలు కలుగుతుంది. ఈ పద్ధతిని స్ఫూర్తిగా తీసుకుని భూమిపై ప్రత్యేకంగా రూపొందించిన గ్లాస్ హౌస్‌ల్లో గోధుమ, బార్లీ, ఆవాలు, శెనగ వంటి పంటలపై నిరంతరాయంగా వెలుగును ప్రసరింపజేశామని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ రీసెర్చ్ ఫెలో లీ హిక్కీ తెలిపారు. చాలా ఆశ్చర్యకరంగా ఈ పద్ధతిలో ఏడాదిలో ఆరు సార్లు గోధుమ, శెనగ, బార్లీ, నాలుగు సార్లు ఆవాల పంటలను ఉత్పత్తి చేశామని లీ అన్నారు. ఇదే సాధారణ గ్లాస్ హౌస్‌ల్లో అయితే రెండు సార్లు, పొలాల్లో అయితే ఏడాదికి ఒకసారి మాత్రమే పంట ఉత్పత్తి జరిగేదని వెల్లడించారు.

నిలదీతలతో ఆరంభం

- తొలిరోజు జన్మభూమి – మా ఊరుకు నిరసనల సెగ
- ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కరించటం లేదని జనాగ్రహం
- కాపులుప్పాడలో మంత్రి గంటాను నిలదీసిన ప్రజలు
- ఏజెన్సీలో ఈశ్వరి, కిడారికి నిరసన సెగ
- సమస్యలు విననంటూ పెందుర్తి ఎమ్మెల్యే బండారు అసహనం


భీమిలి రూరల్ మండలం కాపులుప్పాడ పంచాయతీలో మంత్రి గంటా శ్రీనివాస్‌ను నిలదీస్తున్న వృద్ధుడు


అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం నాగినాయనచెరువులో 'జన్మభూమి' సభను బహిష్కరించి రోడ్డుపై బైఠాయించిన ప్రజలు


శ్రీకాకుళం జిల్లా పాతనౌపడలో ఇల్లు రాలేదని నిలదీసిన చిన్నారావును తోసేస్తున్న కానిస్టేబుల్

సాక్షి, నెట్‌వర్క్ / అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి ఐదో విడత కార్యక్రమం తొలిరోజు నిరసనలు, నిలదీతలతో హోరెత్తింది. పాత సమస్యలపై పదేపదే వినతిపత్రాలు ఇవ్వాల్సి రావటంతో మంగళవారం పలుచోట్ల అధికార పార్టీ నేతలను ప్రజలు నిలదీశారు. అర్హులను పట్టించుకోకుండా అనర్హులకు ప్రయోజనాలు చేకూరుస్తున్నారని మండిపడ్డారు. దీంతో పోలీసు బందోబస్తుతో గ్రామసభలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు గ్రామ సభలో బైరబోగు రావమ్మ అనే వృద్ధురాలు గత మూడేళ్లలో 29 సార్లు ఫించను కోసం దరఖాస్తు ఇచ్చినా మంజూరు కాకపోవడంపై కన్నీటి పర్యంతమైంది.
- శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం పాతనౌపడలో తమకు ఇల్లు మంజూరు చేయకుండా రెండేసి ఇళ్లు ఉన్న వారికి ఇస్తున్నారంటూ పలువురు గ్రామస్థులు అధికారులను నిలదీశారు.
- తూర్పు గోదావరి జిల్లాలో రుణమాఫీ విషయంలో ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌ను రైతులు నిలదీశారు.
- బంగారు తల్లి పథకాన్ని పునరుద్ధరించాలని కొత్తపేట మండల పరిధిలోని కండ్రిగ గ్రామ సభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు.
- పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం జన్మభూమి గ్రామసభను అడ్డుకున్న ఎత్తిపోతల పథకం రైతులు తమ భూములకు పరిహారం పెంచాలని ధర్నా చేశారు.
- బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో గ్రామ సభలను ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- పెరవలిలో నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు చేదు అనుభవం ఎదురైంది. రేషన్‌కార్డులు ఉన్నా రేషన్ ఇవ్వక పోవడంపై మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.
- కర్నూలు జిల్లా ఆదోని మండలం బసరకోడు, ఆలూరు మండలం హత్తిబెలగల్, కల్లూరు మండలాల్లో గ్రామసభలను వివిధ సమస్యలపై స్థానికులు అడ్డుకున్నారు.
- అనంతపురం జిల్లాలో తాగునీటి సౌకర్యం కల్పించటం లేదని రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామంలో సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులును సిద్దనగౌడ ప్రజలు నిలదీశారు.
- విశాఖపట్నం జిల్లాలో పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కిడారి సర్వేశ్వరరావు, గిడ్డి ఈశ్వరిలకు జన్మభూమి సభలో గిరిజనుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని గిరిజన ఎమ్మెల్యేగా ఎలా సమర్థిస్తావంటూ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని నిలదీశారు. చినలబుడులో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుపై గిరిజనులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.
- భీమిలి రూరల్ మండలం కాపులుప్పాడలో జన్మభూమిలో మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రసంగిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. 'ప్రతి జన్మభూమిలో దరఖాస్తు ఇస్తూనే ఉన్నా.. గత నాలుగు విడతల్లో ఇచ్చా.. మళ్లీ ఈ సభలో కూడా మీకే ఇస్తున్నా...'అని గ్రామానికి చెందిన కొండపు నరసింహ (70) మంత్రి గంటాను నిలదీశారు. పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వేపగుంట వద్ద ప్రజలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'మీరు ఎన్నైనా చెప్పండి...మీ సమస్యలు విననంటే వినను. ఇది సంక్షేమం.. సంతృప్తి సభ మాత్రమే. మీ సమస్యలు వినడానికి ఇది వేదిక కాదు' అంటూ ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లి మండలంలో విద్యార్థులతో తెలుగుదేశం పార్టీ జెండాలు పట్టించి ర్యాలీ నిర్వహించారు. నూజివీడులో స్థానిక ఎమ్మెల్యే మేకా ప్రతాప్ రేషన్‌కార్డులు, డ్వాక్రా రుణమాఫీ అంశాలపై అధికారులను నిలదీయడంతో జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అర్ధాంతరంగా సభ నుంచి నిష్క్రమించారు. జగ్గయ్యపేటలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత ఉదయభాను నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు.
- గుంటూరులో ఎమ్మెల్యే ముస్తఫా సభా వేదికపై లేకుండానే టీడీపీ ఇన్‌చార్జి మద్దాలి గిరి, టీడీపీ నేతలు షౌకత్ వంటి వారు వేదికపై కూర్చొని జన్మభూమి సభలో హల్‌చల్ చేశారు. అయితే ఎమ్మెల్యే ముస్తఫా ప్రజల్లో కూర్చొని వారి పక్షాన సమస్యల గురించి అధికారులు, నేతలను ప్రశ్నించారు.
- అమరావతిలో రాజధాని గ్రామాలకు సీడ్‌యాక్సిస్ రోడ్డు భూసేకరణ నోటిఫికేషన్‌కు సంబంధించి జన్మభూమి కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అధికారులను నిలదీశారు.

ఏపీఆర్‌డీసీకి రూ. 1,000 కోట్ల రుణం

సాక్షి, అమరావతి: రాష్ట్ర రహదారుల అభివృద్ధికి హడ్కో నుంచి రుణం పొందేందుకు ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే ఏపీఆర్‌డీసీ రూ.3 వేల కోట్ల రుణానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి 7.90 శాతం వడ్డీతో రూ.1,000 కోట్లు రుణం పొందేందుకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేతా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు సమస్యలపై మార్చిలో మహా ఉద్యమం: అన్నాహజారే

ధారవాడ (సాక్షి, బెంగళూరు): స్వామినాథన్ నివేదిక అమలు, రైతు సమస్యల పరిష్కారం, పంటలకు మద్దతు ధర తదితరాల పరిష్కారాలకు కోసం మార్చి 23 నుంచి మహా ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే వెల్లడించారు. కర్ణాటకలోని ధార్వాడలో వ్యవసాయ యూనివర్సిటీ సంస్థాపన దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిపే ఈ పోరాటంలో యువత, విద్యార్థులు కూడా పాల్గొనాలని అన్నా పిలుపునిచ్చారు. అలాగే దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే గ్రామాలు వ్యవసాయం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మొదట గ్రామాలు బాగుపడాలని మహాత్మా గాంధీజీ చెప్పేవారని గుర్తు చేశారు. వ్యవసాయ డిగ్రీల పట్టభద్రులు గ్రామాలకు సేవ చేయడం ద్వారా దేశాభివృద్ధికి సహకరించాలన్నారు.

గవర్నర్‌కి చేరిన కాగ్ నివేదిక

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖలపై జరిపిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికను గవర్నర్‌కు అందజేసినట్లు అకౌంటెంట్ జనరల్ (ఏజీ) కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాజ్యాంగంలోని 151వ ఆర్టికల్ ప్రకారం 2016–17కు సంబంధించిన కాగ్ నివేదికను గవర్నర్‌కు కాగ్ అధికారులు అందజేశారు.

ప్రశ్నిస్తే పోలీసుస్టేషన్‌కే!

'జన్మభూమి'లో సమస్యలపై నిలదీసిన దంపతులను స్టేషన్‌కు పిలిపించిన వైనం • టీడీపీ నేతల సమక్షంలో ఎస్‌ఐ విచారణ


టీడీపీ పట్టణఅధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ భర్తను కూర్చోబెట్టుకుని విచారిస్తున్న ఎస్‌ఐ

రాయదుర్గం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో అధికార టీడీపీ నేతల అవినీతి గురించి ప్రశ్నించిన సామాన్యుడిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీ బాలగంగాధర్ తిలక్ పాఠశాలలో మంగళవారం 'జన్మభూమి – మా ఊరు' నిర్వహించారు. ఇల్లు, పింఛన్, రేషన్‌కార్డు ప్రతి దానికీ డబ్బు ఇవ్వనిదే పని చేయడం లేదని 30వ వార్డు కౌన్సిలర్‌బళే నాగమణి భర్త, టీడీపీ నేత బళే శంకర్‌పై శాంతినగర్‌కు చెందిన పత్తికొండ రాము తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఆఖరుకు తనకు మంజూరైన చంద్రన్న బీమా కార్డు ఇవ్వడానికి మధ్యవర్తి ద్వారా రూ.100 లంచం అడిగారని, ఇవ్వనందుకు బీమా కార్డు వెనక్కు తీసుకెళ్లారని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో అధికారులు హెడ్‌కానిస్టేబుల్ ద్వారా రామును సభ నుంచి బయటకు గెంటేశారు. తమను దూషించాడంటూ కౌన్సిలర్ దంపతులు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ శాంతినగర్‌కు చెందిన పత్తికొండ రామును రాత్రి 8గంటల సమయంలో పిలిపించారు. రాము వెంట భార్య సువర్ణ కూడా వచ్చారు. చంద్రన్న బీమా బాండుకు రూ.100 అడగడాన్ని తన భర్త ప్రశ్నించాడని సువర్ణ తెలిపింది. కౌన్సిలర్‌తో పాటు ఆమె భర్త తమను వేధిస్తున్నాడని, తాను మునిసిపాలిటీలోని పొదుపు సంఘాల్లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తుండగా అకారణంగా విధుల నుంచి తొలగించారని వాపోయింది. కౌన్సిలర్ భర్త అవినీతిని ప్రశ్నిస్తే.. దూషించాడంటూ తన భర్తపై ఫిర్యాదు చేశారని తెలిపింది. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుతో పాటు స్టేషన్‌కు చేరుకున్న కౌన్సిలర్ భర్త శంకర్‌ను కూర్చోబెట్టి వారి ఎదుట ఎస్‌ఐ మరోసారి రాము, సువర్ణ దంపతులను ప్రశ్నించారు. ఈ విషయం మీడియాకు తెలియడంతో చివరికి ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సభల్లో దూషించడం తగదని ఎస్‌ఐ హెచ్చరించి పంపారు.

చంద్రన్న విలేజ్ మాల్స్ ఒక కుంభకోణం

- కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఫిర్యాదు
- ఫ్యూచర్ గ్రూప్‌నకు లబ్ధి చేకూర్చడమే దీని వెనకున్న ఉద్దేశం
- ఇందులో సీఎంకు, ఆయన కుటుంబసభ్యులకు వాటాలుండడమే కారణం
- ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోండి
- కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌కు వైవీ వినతి


కేంద్రమంత్రి పాశ్వాన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రన్న విలేజ్ మాల్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఒక కుంభకోణానికి తెరలేపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ''నిరుపేదలకు నిత్యావసర వస్తువులను రాయితీతో అందించడం ద్వారా వారికి పోషకాహారాన్ని సమకూర్చడం, ధరల పెరుగుదల ప్రభావం వారిపై పడకుండా చూడడమన్నది పౌర సరఫరా వ్యవస్థ మౌలిక లక్ష్యం. నిత్యావసర వస్తువులను అందిస్తున్న రేషన్ షాపులను మరింత విస్తృత పరచాల్సిందిపోయి ఇప్పుడు బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 28 వేల రేషన్ షాపుల్లో 6,500 షాపులను చంద్రన్న విలేజ్‌మాల్స్‌గా మార్చింది. డిసెంబర్ 12న గుంటూరు, విజయవాడలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించింది. సీఎం, ఆయన కుటుంబ సభ్యులకు వాటాలున్న రిలయన్స్ రిటైల్, ఫ్యూచర్ గ్రూప్ సంస్థలకు దాదాపు రూ.9,600 కోట్ల వ్యాపారాన్ని అప్పగించేందుకు పథకం సిద్ధం చేశారు. ఈ సంస్థలతో ఇప్పటికే ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. బ్రాండెడ్ ఉత్పత్తులను గరిష్ట చిల్లర ధరకంటే 35 శాతం తక్కువకే అందించేందుకు ఈ విలేజ్ మాల్స్ పెట్టామని సీఎం చంద్రబాబు చెప్పినప్పటికీ వాస్తవం వేరేవిధంగా ఉంది. మార్కెట్ ధరలకంటే కొన్ని వస్తువుల ధరలు రెట్టింపుగా ఉన్నాయి. డిసెంబర్ 13న ప్రజలు ఈ మాల్స్‌లో కొనేందుకు వెళ్లగా ధరలు చూసి బహిరంగ మార్కెట్‌కంటే ఎక్కువగా ఉన్నాయని గుర్తించి నిరసన తెలిపారు. దీంతో అదేరోజు సాయంత్రం నుంచి అధికారులు ఆ మాల్స్‌లో వస్తువులను అమ్మడం నిలిపేశారు. రేషన్ షాపులను ఫ్యూచర్స్ గ్రూపునకు కట్టబెట్టడమంటే ఇదొక క్విడ్ ప్రో కో అని చెప్పకతప్పదు. ఎందుకంటే సీఎంకు, ఆయన కుటుంబసభ్యులకు ఈ సంస్థలో వాటాలున్నాయి. అందువల్ల ఇది స్కీమ్ కాదు. ఇదొక స్కామ్. మీరు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని బియ్యం, గోధుమలు, చక్కెర, కిరోసిన్, వంటి నిత్యావసరాలను రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేయాల్సిన అవసరముంది'' అని వైవీ విజ్ఞప్తి చేశారు.

రాజకీయంగా అణగదొక్కేందుకే బెదిరింపులు

త్వరలో అమ్మ ఆశించిన పాలన తథ్యం: దినకరన్

సాక్షి, చెన్నై/సాక్షి ప్రతినిధి, చెన్నై: తనను రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వాన్ని ఉపయోగించుకుని ఐటీ, సీబీఐ దాడుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోందని అన్నాడీఎంకే అమ్మ శిబిరం నేత, ఎమ్మెల్యే దినకరన్ ఆరోపించారు. ఈ బెదిరింపులకు తాను భయ పడనని, త్వరలో అమ్మ జయలలిత ఆశించిన పాలన తమిళనాట రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కుంభకోణంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో ఓటర్లు తనకు అఖండ మెజారిటీ ఇవ్వడాన్ని రాష్ట్రంలోని పాలకులు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. తనకు మద్దతుగా ప్రజానీకం, అన్నాడీఎంకే కేడర్, నేతలు కదులుతున్నారని తెలిపారు.

దినకరన్ వర్గీయులపై మరో వేటు

ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో దినకరన్ గెలుపునకు కృషి చేసి పార్టీ ద్రోహానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ వేలూరు, విరుదునగర్, తూత్తుకుడి జిల్లాలకు చెందిన 9 మంది నేతలను పార్టీ కన్వీనర్ పన్నీర్‌సెల్వం, కో కన్వీనర్ ఎడపాడి పళనిస్వామి మంగళవారం బహిష్కరించారు.

వైద్య ఆరోగ్యశాఖలో డీఎస్, స్టెనోల సరెండర్

సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డిప్యూటీ సెక్రటరీ, స్టెనోలను సాధారణ పరిపాలనాశాఖకు సరెండర్ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ సెక్రటరీ పనితీరు సరిగా లేదని, ఆయనను జీఏడీకి సరెండర్ చేసినట్టు తెలిసింది. పూనం మాలకొండయ్య వద్ద స్టెనోగా పనిచేస్తున్న మరో ఉద్యోగినీ పంపించేశారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.